ం ఓ ం

రాజయోగి విజయం

అను

శ్రీ సద్గురు చారిత్రము

గ్రంథకర్త:

యిలపకుర్తి వీరవెంకటరామచంద్రరావు

బి. యే., బి. యల్.,

★

1961.

ం ౕ ం

రాజయోగి విజయం

అను

శ్రీసద్గురు చారిత్రము

గ్రంధకర్త:

యిలపకుర్తి వీరవెంకటరామచంద్రరావు

బి. యే., బి. యల్.,

★

1961.

ఏ భక్తుడైనను, తన గౌరవాదర, అభిమాన, మన్ననలకు పాత్రుడైన, తన గురుమూర్తియొక్క జీవిత విశేషములను సంపూర్ణముగా తెలుసుకొనగోరుచుండును. అట్టి విశేషములు, తన్నాకర్షించినచో అంతటితో నాగక, యితరులకు వానిని వినిపింపగోరును. లేదా తన భావములను గ్రంథస్తముచేసి ప్రకటించును. "ఏకస్వాము నభుంజీత" అను ఆర్యోక్తి ననుసరించి తన సంతోషమును తప్పక యితరులతో పంచుకొనును. ఈ రాజయోగి విజయముగూడ నట్లే రచింపబడినది.

దేశకాల పాత్రల ననుసరించి, సనాతనమగు వైదిక సిద్ధాంతము అనేక ముఖములుగ చీలి, ఉపవాహినీరూపంగా ఆర్యావర్తమున ప్రవహిస్తూ వచ్చినది. యివియే నానావిధ మత వాదములు. సాంఘికవ్యవస్థను బట్టి ఆయా కాలములయందు యేదో యొక మతము ఆదరింపబడి, ఆ మతమే వైదికసిద్ధాంత మని ప్రచారితమగుచూ వచ్చింది. కాని సర్వదేశాలయందు సకల కాలాలయందు మార్పునెరుగని "శాశ్వతస్యచ ధర్మస్య" అని చెప్పబడింది ఏదో అదియే నిజమగు వైదికసిద్ధాంతము. మతము అనునది కేవలం మతి లేక బుద్ధిచే నిర్ణయింపబడేది. "ఏకంసత్ విప్రా బహుధా వదంతి" కనుకనే మతములనేకములు. యిందేది సత్యం? ఏది అసత్యం? అన్నీ సత్యములా? అన్నీ అసత్యములా? అంటే ఒక్కటే సమాధానం. ఆరుగురు గ్రుడ్డి వాళ్లూ ఏనుగును తడవిచూచి ఎవరి స్పర్శనుబట్టి, వారు ఏనుగు స్వరూప నిర్వచనంచేశారు. అందులో ఏది సత్యం, ఏది అసత్యం అంటే, అన్నీ సత్యాలే, అన్నీ అసత్యాలే, కాని అన్నీ అర్ధ సత్యాలూ, పాతిక సత్యాలూ మాత్రమేగాని, పూర్ణసత్యాలు

మాత్రింకావు. అట్లే యీ మతాలున్నూ. దేశకాలానుగుణ్యముగ సమాజక్షేమమునకై ఆయా మతకారులచే సిద్ధాంతీకరింపబడుచూ వచ్చినవనుట సత్యవిదూరం కానేరదు.

న్యాయమగు కేవల సిద్ధాంతం యీ నానావిధ మతకల్లోలములలో మరుగుపడిపోయెను. అథవా, ఏ కొద్దిమందికైననూ తెలిసియున్ననూ "శిష్యస్తేహం శాధిమాంత్వాం ప్రపన్నం" అని తమ్ము శరణువేడినవారికే బోధించడం, అట్టి శిష్యులకు కూడా "నాపృచ్ఛః కస్యచిత్ బ్రూయాత్" అనే నార్యోక్తి ననుసరించి కొంతమాత్రమే అనగా అడిగి తెలుసుకొన్నంతవరకే బోధ లభిస్తూ వుండడం జరుగుతూవుండేది. ఏ కాలముననైననూ ఏ ఒకరిద్దరకు మాత్రమే బోధ సర్వస్వము అవగతమై యుండెను. తొలుదొల్త మహాభోగియై, మధ్యకాలమున యోగియై, పిదప సంపూర్ణ విరాగియై, ఆ తదుపరి అచల పరిపూర్ణ రాజయోగ మవలంబించిన వేమనయోగి నిర్భయంగా, "మతములందు ముక్తివెదకిన లేదయా" అని యధార్థమును చాటిచెప్పుచూ పోయెను. అతనిని కేవలమొక పిచ్చివానిగా భావించిన లోకము అతని ప్రబోధమును పెడచెవి బెట్టెను. పిమ్మట కొంతకాలమునకు ఆంధ్రమున తెలంగాణమున అవతరించిన శ్రీ శివరామ దీక్షితులవారిచే యీ సిద్ధాంత భాగ మున్నదున్నట్లుగా లోకమునకు తేటతెలుగు భాషలో వెదచల్లబడెను. ఉత్తర హిందూస్థానమున నాస్తికవాదములుగా చెప్పబడే బౌద్ధ, జైన, లోకాయతిక మతములు ప్రచారితములు కాగా దక్షిణదేశమున ఆస్తికమతములగు ద్వైతా అద్వైత విశిష్టాద్వైత మతకర్తలగు మధ్వ, శంకర, రామానుజు లుద్భవించి

ఆయా మతవాదములను పరిచారముచేసిరి. అస్తి నాస్తులు కానిది, అస్తి నాస్తులు లేనిది, మనోవాగ్ గోచరము అగు పరిపూర్ణ బ్రహ్మమును ప్రతిపాదించుచు, పరిపూర్ణ రాజయోగము ఆర్యావర్త మధ్యభాగ మనదగిన తెలంగాణా రాజ్యమున విస్తరిల్లుట గమనార్హము. దీని ప్రవర్తకులగు శ్రీ శివరామ దీక్షితులవారి పరంపరా గురుమండలియందొకరై, మహా మేధానిధియై, సర్వమత సమీకరణగావించి, దేనిస్థానము దానికిడి, లోకమునకు దీక్షితీయ ప్రబోధ మున్నదున్నట్లుగా ప్రసాదించి, "అచలఋషి శ్రీ దయానంద" యను సార్థకబిరుదము వహించి లోకమునకు మహోపకార మొనర్చుచున్న శ్రీ పొన్నాల రాజ యోగీంద్రులవారి యొక్క, యింతవరకు జరిగిన జీవితకథా సంగ్రహమే యీ గ్రంథ వస్తువు.

చారిత్రకుడు ఎవరిజీవితమైనను చిత్రింపబూనుకొన్నపుడు నిష్పాక్షికముగా ఉన్నదున్నట్లుగా వ్రాయగలిగినను, తనకు తెలియని ఆయన జీవితరహస్యములు, మానసిక ప్రవృత్తులు, జీవిత సంఘటనలతాకిడికి ఆయన అంతఃకరణ పొందిన వికాస సంకోచములు యిత్యాదులు వ్రాయగల్గుట దుస్తరము. యివి స్వీయచరిత్రా రచనయందే సాధ్యమగును. కాని శిష్టాచార సాంప్రదాయానుసారం హైందవులు తమ పేరే తాము చెప్పుకొనుటకుకూడ వెనుదీయుచు అహంకార కర్తృత్వాదులు వహించుట కెవరున్నూ అంగీకరించరు. అహంపదార్థ నాశన మత్యంత మపేక్షించు అశరీర సాంప్రదాయకులు స్వోత్కర్షగా దోచబడు విషయములు గ్రంథస్థం గావించుకొనుటకు పూనుకొందురా? అసంభవము. పోతే, యిక అన్యులే అట్టివారి చరిత్ర

మును చేతనైనంతలో, వ్రాయవలసినదే. యీ గ్రంథరచన యందుకూడా నట్లే అయినది.

శ్రీవారితో నాకు పరిచయభాగ్యం ప్రప్రథమంలో 1942 సంవత్సరమున భీమవరం (పశ్చిమగోదావరిజిల్లా) లో కల్గినది. నాటినుండి శ్రీవారి జీవిత విశేషములు కొంచ మించు మించుగా నాకు స్వయంగా తెలియును. తెలియనివానిని తెలిసుకొంటూ యుంటిని. పతత్పూర్వ చరిత్ర శ్రీవారిని పలు సార్లు ప్రాధేయపడి వారినోటనే వింటిని. కనుక ఈ గ్రంథమున అతిశయోక్తులుగాని, అభూతకల్పనలుగాని, లేవని ఘట్టిగా చెప్పగలను. ఐతే చారిత్రక రచనయందు యెంత నిష్పాక్షిక బుద్ధి పూనినా, రచయితయొక్క వ్యక్తిగత గుణదోషములు ఆశలు, అభినివేశములు, ఆశయములు అందందు దొరలక తప్పదు. ఐననూ, సాధ్యమైనంతవరకు వానికి తావివ్వకుండానే యీ గ్రంథరచన సాగించితిని.

కొన్ని యెడల శ్రీవారి చరిత్రతో నాయొక్కయు, యితర భక్తులయొక్కయు చరిత్రలు పెనగొని యున్నవి కనుక ఆయా చరిత్రలు కొంతవరకు వివరించక తప్పినదికాదు. వాని వలనకూడా పాఠకుల కేకించిత్తైనా ప్రయోజనమున్నా వుండ వచ్చును. లేదా, లేకుండానూ పోవచ్చును. కాని అది కేవలం నిష్ప్రయోజనం కాదనే యుద్దేశముతోనే ఆయా భక్తుల విషయం వివరించినాను. స్వవిషయంలో వ్రాసుకొన్న విషయ ములు స్తోత్కర్షారూపముగ నుంటే పాఠకులు నన్ను మన్నింతురు గాక!

ఈ గ్రంథమునకు "రాజయోగి విజయము" అను పేరెంతయు తగియుండునను వుద్దేశ్యముతో ఆ పేరు పెట్టఁబడినది. ప్రతిపక్ష సంఘము లోకవంక, అన్యమత సాంప్రదాయకు లొకవంక, శివరామ దీక్షిత సిద్ధాంతం పేరిట లోకంలో జరుగుచున్న అత్యాచార, అనాచార పద్ధతులవల్ల ప్రజాసామాన్యములో దృఢముగ పాతుకొనియున్న వ్యతిరేక భావ మొకవంక, తమ్మెదుర్కొనుచుండగా శ్రీవారెట్టి పట్టుదలతోనూ, కార్య దీక్షతోనూ, ఏకమాత్రముగ యీ వ్యతిరేకశక్తులతో పోరాడి జయించిరో యీ గ్రంథమునందు గాననగును. కనుక దీనికి "రాజయోగి విజయ" మను పేరుంచితిని. సద్గురు చారిత్రమని నామాంతరమునుగూడా యుంచితిని. ఏలనన, చరిత్ర అనగా, చరణము + త్ర=చరిత్ర అయినది. 'చరణ' మనగా ఆచరణము, ప్రవర్తన లేక నడక. 'త్ర' యనగా రక్షించునది. కనుక ఆచరించిన వ్యక్తినీ, ఆ యాచరణచూచి, విని, లేక చదివి, తాముగూడ ఆచరణలో పెట్టుకొనే వ్యక్తినీ, ఉభయులనూ గూడ రక్షింప సమర్థతగల, శీలసంపత్తి, ఆచరణ గల్గియున్న ఎవరి కథయైననూ చరిత్ర అనఁజెల్లును. మా గురుదేవుల శీలసంపత్తి, ఆచరణ, జీవిత కథ కూడ నట్టివే. కనుక యీ గ్రంథమునకు చరిత్ర యను పేరును సార్థకమగుచున్నది.

కం॥ చిత్రంబులు, త్రైలోక్య ప
విత్రంబులు, భవలతాలవిత్రంబులు, స
న్మిత్రంబులు, మునిజన వన
చైత్రంబులు, విష్ణుదేవు చారిత్రంబుల్. (ఆంధ్ర భాగవతం)

"శ్లో॥ గురుర్బ్రహ్మా, గురుర్విష్ణు, గురుర్దేవో, మహేశ్వరః"
అన్నారు గనుక "విష్ణుదేవు చారిత్రంబుల్" అనుటకు బదులు
"సద్గురేంద్రు చారిత్రంబుల్" అని చదువుకొంటే సరిపోతుంది.

ఏది యెట్లున్ననూ యీ గ్రంథరచనకు స్వార్ధరూప
పరమప్రయోజనమొకటి గలదు. ఎట్లనగా:-

శ్లో॥ స్వదేశికస్యైవ వచనామకీర్తనం,
భవేదనంతస్య శివస్య కీర్తనం,
స్వదేశికస్యైవ వచనామచింతనం,
భవేదనంతస్య శివస్యచింతనం॥ అనిన్ని,

శ్లో॥ (శ్రీ) మత్పరం బ్రహ్మ గురుం స్మరామి
(శ్రీ) మత్పరం బ్రహ్మ గురుం భజామి
(శ్రీ) మత్పరం బ్రహ్మ గురుం వదామి
(శ్రీ) మత్పరం బ్రహ్మ గురుం నమామి॥

అనిన్ని గురుగీత చాటుచున్నది. కనుక ఆ గురుదేవుల విషయం
చెప్పుకొంటూ, ఆయన వాక్యములను కీర్తించుకొంటూ, ఆయ
నను చింతించుకొంటూ వుంటే అనంత ఫలప్రాప్తి చెప్పబడింది.
ఈ గ్రంథమందు (శ్రీ) గురుకథా శ్రవణ, కీర్తన, స్మరణాదులు
పదే పదే జరిపించుటలో యొక మహాత్మ్యమున్నదిగదా! ఆ
మహాత్మ్యమేమి అనగా "గురుకృపా ప్రసాదసిద్ధి". అది కల్గితే
యింక లోటేమి? "ముక్తిమూలం గురోః కృపా" అన్నారు
గదా! యీ స్వార్ధరూప పరమప్రయోజనమే నన్నీ గ్రంథ
రచనా కార్యమునకు ప్రోత్సహించినది.

ఈ గ్రంథ మాద్యంతము చక్కగా చదివిన పాఠకులు, అందు ముఖ్యముగా శ్రీవారి శిష్యపరంపరలో చేరిన భక్తాదులు, శ్రీవారి సుగుణసంపత్తిని అలవరచుకొని, తద్వారా అంతఃకరణ శుద్ధిని పొంది, రాజయోగి రీతితో, భుక్తి, ముక్తి, క్రియల యందు పూర్ణయోగము బూని వర్తింపగలరను ఆశయముతో యీ గ్రంథము తమ కరకమలములకు చేర్చు శ్రీవారి పాద సేవకుడు,

గ్రంథకర్త,

యిలపకుర్తి వీర వెంకట రామచంద్రరావు

నరసాపురం

ప్లవనామ సంవత్సర, శ్రావణ శుద్ధ పూర్ణిమ

స్థిరవారం, 26-8-1961

ఓం శ్రీ సద్గురుభ్యోన్నమః.
రాజయోగి విజయంబను శ్రీ సద్గురు చారిత్రము.

కృ తి స మ ర్ప ణ ము

ప ద్య కు సు మాం జ లి

మంజరి. భగవంతుడవు నీవు భక్తుండ నేను
నీవులేకుండగా నేనుండగలనె?
నేనులేకుంటేను నీకున్కి యేది?
ఓతప్రోతంబుగా నున్నాము స్వామి!
నాయందు నీవునూ నీయందు నేను
నిమిసంబువీడక నిలచియున్నాము
ద్వైత విశిష్టాది వాదంబులందు
యిది యెందు చేరినా యేరికివలయు?
నీవు నావాడవు నేను నీవాడ
ఈగ్రంథ మింకేటికీయగా గలను!
రాముని కొమరులు రామచరిత్ర
తండ్రికే వినిపించి ధన్యులైనటుల.
నీపుణ్య చరితంబు యీ పుస్తకంబు
నారీతి వినిపించి యర్పింతునీకె
నీపాదపూజార్థ మీ పూలమాల
భక్తితో రచియిస్తి ప్రభురాయ గొనుము.
దీక్షిత సిద్ధాంత దేశికస్వామి!
కరుణాంతరంగ సద్గురు సార్వభౌమ!
పొన్నాల వంశాబ్ధి పూర్ణశశాంక!
శ్రీ రాజయోగీంద్ర సూరావతంస!

గ్రంథకర్తః- యిలపకుర్తి వీరవెంకట రామచంద్రరావు.

శ్రీ మదచలఋషి రామడుగు శివరామ దీక్షిత గురుపీఠాధిపతులు



శ్రీ మదచలఋషి శ్రీ దయానంద పొన్నాల రాజయోగీంద్రులవారు
వీరి సతీమణి, మాతృదేవి శ్రీమతి అనసూయాంబగారు

శ్రీమతి కొల్లేపర రత్నమాంబగారికి-

ప్రశంసా పద్య రత్నములు

సీ॥ శ్రీ కృపాపాత్రమై చెలువొందు
కామయ్య శ్రేష్ఠి నీకన్న తండ్రి
సద్గుణాలకు పేటి సౌందర్యమున మేటి
మహాలక్ష్మితల్లి నీ మాతృదేవి
కొల్లేపర కులాబ్ధి కుముదబాంధవుడైన
పాపయ్యశ్రేష్ఠి నీభర్తగారు
దత్తుడయ్యును కన్నతల్లిగా ప్రేమించు
రామకృష్ణుండు గారాబుకొడుకు

ఆ॥ వె॥ పూర్వజన్మ సుకృత పుణ్య విశేషాన
దానశీలమబ్బె ధనము నబ్బె
పట్టుబడియె పూర్ణ భావంబు గురుకృప
రత్నమాంబ! ధన్యురాలివీవు,

ఆ॥ వె॥ పేదలకును బెట్టి - విద్యార్థులకు బెట్టి,
సేవజేసిపెట్టి - జీవతతికి,
భక్తులకును బెట్టి - బ్రహ్మవిద్యకు బెట్టి,
పెట్టుటకును బుట్టి - పెట్టిబుట్టి,

ఆ॥ వె॥ రాజయోగివిజయ గ్రంథంబు వినినంత
మెచ్చి మూడువందలిచ్చినావు,
రాజయోగి కృపచె రత్నమాంబానీకు
శాంతిరహితస్థితియు ప్రబలుగాత.

నర్సాపురం
శ్రీ ప్లవనామ సం॥ర
ఆషాఢశుద్ధ పూర్ణిమ

ఇట్లు గ్రంథకర్త,
యిలపకుర్తి వీరవెంకటరామచంద్రరావు.

ఓం

రాజయోగి విజయం

అను

శ్రీ సద్గురు చారిత్రము

★

: గ్రంథకర్త :

యిలపకుర్తి వీరవెంకట రామచంద్రరావు, బి. ఏ., బి. యల్.

★

1961

మూల్యం 6-00 ~~8-0-0~~

శ్రీ మహచలఋషి రామకృష్ణ శివరామ దీక్షిత గురుపీఠ సాంప్రదాయకులు



శ్రీవారి ప్రియశిష్యులు, గ్రంథకర్త శ్రీ యిలపకుర్తి వీర వెంకట
రామచంద్రరావుగారు, వీరి సతీమణి శీతాసుహాలక్ష్మమ్మగారు

కృతజ్ఞత

ఈ గ్రంథ ముద్రణా కార్యక్రమమునకు ధనసహాయము చేసిన భక్తజనుల పుణ్యానామము లీక్రింద పొందుపఱుపబడినవి. అందు పెద్దలకు కృతజ్ఞతాపూర్వకమగు నా నమోవాకములు. చిన్నలకు నా ఆశీస్సులు. ముద్రణాకార్యము ధనలోప కారణముగా నిలచిపోరాదనీ, తక్కువైన మొత్తమంతయు తానిచ్చెదననియు, తొలుతనే వాగ్దానంచేసిన నా సహధర్మచారిణి చి॥ సౌ॥ శీతామహాలక్ష్మిని అభినందించుచున్నాను. ఆదిలో యీ గ్రంథరచనా కార్యమునకు నన్ను ప్రోత్సహించినదిగూడ నీమెయే. సాధ్యమైనంతవరకు ముద్రణాస్ఖాలిత్యములు దొరలకుండ జాగ్రత్తగా యీ గ్రంథమును ముద్రించి యిచ్చిన నర్సాపురం శీతారామా ప్రెస్ వారికి నేను కృతజ్ఞుడను. వీరందరికి సద్గురుదేవుల కరుణాకటాక్షములచే ఆయురారోగ్య సుఖశ్రీలు జెంపొందుగాక!

యిలపకుర్తి వీరవెంకట రామచంద్రరావు,
గ్రంథకర్త.

ధ న స హా య ము చే సి న వా రు.

1.	శ్రీమతి అ. ప.	కొల్లేపర రత్నమ్మగారు, పిప్పర	300-0-0
2.	,, ,,	అయ్యగారి కాంతమ్మగారు, వడలి	50-0-0
3.	,, ,,	క్రొవ్విడి మహాలక్ష్మమ్మగారు, సరిపల్లి	35-0-0
4.	,, ,,	రాచకొండ కమలమ్మగారు, నర్సాపురం	25-0-0
5.	,, ,,	యేలేశ్వరపు లక్ష్మీదేవమ్మగారు, నర్సాపురం	25-0-0
6.	,, ,,	చెన్నాప్రగడ విజయలక్ష్మి, నర్సాపురం	25-0-0
7.	శ్రీయుత ,,	చింతా మంగయ్యనాయుడుగారు, రాజమండ్రి	25-0-0
8.	,, ,,	సమతం వీరసుబ్బారావు, నర్సాపురం	20-0-0
9.	శ్రీమతి ,,	ముసునూరి సుబ్బమ్మగారు, పాలకొల్లు	20-0-0
10.	,, ,,	మలపాక లక్ష్మీనర్సమ్మగారు, మారుటేరు	15-0-0
11.	శ్రీయుత ,,	భైరాజు సత్తిరాజుగారు, మంచిలి	10-0-0

12. „ „ కొండమడుగుల వెంకటరెడ్డిగారు,
వెనిగండ్ల 10-0-0

13. శ్రీమతి „ తాళ్ళూరి బాపనమ్మగారు
తణుకు 10-0-0

14. „ „ కొవ్వలి సుబ్బమ్మగారు,
పిప్పర 5-0-0

15. „ „ ప్రభల మహాలక్ష్మమ్మగారు,
అమలాపురం 5-0-0

16. „ „ గరిమెళ్ళ కామాక్షమ్మగారు,
పెదనింద్రకొలను 5-0-0

17. „ „ పసుమర్తి వరలక్ష్మమ్మగారు,
భీమవరం 5-0-0

18. „ „ కందుకూరి సుందరమ్మగారు,
నర్సాపురం 5-0-0

19. „ „ యిలపకుర్తి శీతామహాలక్ష్మి
నర్సాపురం,
అవసరమగు లోతక్కువ
యావత్తు మొత్తమున్నూ

ప్రథమ ముద్రణము
1000 ప్రతులు.

:: :: ::

ముద్రణ
సీతారామా ప్రెస్, నర్సాపురం.

రాజయోగి విజయంబను శ్రీసద్గురుచారిత్రము

గురు స్తోత్రము

(ఇష్టదేవతా ప్రార్థనము)

శ్లో॥ గురుర్బ్రహ్మ, గురుర్విష్ణు, ర్గురుర్దేవో, మహేశ్వరః,
గురుస్సాక్షాత్పరంబ్రహ్మ తస్మై శ్రీ గురువేనమః ॥

శ్లో॥ మన్నాథ శ్రీ జగన్నాధో మద్గురు శ్రీ జగద్గురుః
స్వాత్మైవ సర్వభూతాత్మా తస్మై శ్రీ గురువేనమః ॥

శ్లో॥ అజ్ఞాన తిమిరాంధస్య విషయాక్రాంత చేతసః
జ్ఞానప్రభా ప్రదానేన ప్రసాదం కురుమేప్రభో॥

శ్లో॥ యస్య ప్రసాదా దహమేవ సర్వం
మయ్యేవసర్వం పరికల్పితంచ
ఇద్ధం విజానామి సదాత్మరూపం
తస్యాంఘ్రి పద్మం ప్రణతోస్మి నిత్యం॥

శ్లో॥ వేదశాస్త్ర విధిఖ్యాతం, పూర్ణబోధోపదేశికం
సుగుణాకరం దయానందం రాజయార్య గురుంభజే॥

శ్లో॥ పౌన్నాలవంశ కలశాంబుధి కైరవాప్తం
పూర్ణం దయానిధి మనంత గుణైకధిష్ణ్యం
రాజాధిరాజ మకుటాంచిత రత్న సేవ్యం
శ్రీ రాజయోగి గురుమంతరతో నమామి॥

శ్లో॥ శ్రీదేశికేంద్రో మమముఖ్య దేవః
ఇత్యేవమే హ్యాత్కమలాంతరాశే
స్తుత్వాప్యఖండోజ్వల యత్నపూర్వం
సంపూజ యిష్యామి, భవాబ్ధిగ్రస్త్యా॥

శ్లో॥ వందే సద్గురునాయకం, సురనుతం, వందే దయావార్నిధిం
వందే శుభ్రమనోజ్ఞహాసవదనం, వందే త్రిమూర్త్యాత్మకం
వందే సర్వదిగంత విశ్రుత యశోవర్ధిష్ణు శాంతిప్రదం
వందే నిశ్చల పూర్ణబోధ ఫలదం, వందే ప్రమోదోజ్వలం

శ్లో॥ సంసార ఘోరామయ భేషజం భజే,
కృపారసార్ద్రీకృత మానసం భజే,
బ్రహ్మాండ భాండోదర సంస్థితం భజే,
సర్వాగమార్థ ప్రతిపాదకం భజే॥

తొలిమాటలు

శ్లో॥ గురుర్బ్రహ్మా గురుర్విష్ణు ర్గురుర్దేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరంబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః॥

శ్లో॥ అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురువేనమః॥

శ్లో॥ మన్నాథ శ్రీ జగన్నాథో మద్గురు శ్రీ జగద్గురుః
స్వాత్మైవ సర్వ భూతాత్మా తస్మై శ్రీ గురువేనమః॥

మహాపురుషుల జీవిత విశేషముల శ్రవణముచేసినచో గల్గు మహత్ఫలమును ప్రపంచజాతు లేనాడో గుర్తించినవి. హిందూదేశమున భారత, రామాయణాది యితిహాసములును, పాశ్చ్యాత్య దేశములలో "యిల్లియడ్", "ఒడిస్సీ" మొదలగు నవియును ఆవిర్భవించుటయే యిందుకు నిదర్శనము. ఆయా గ్రంథములయందలి వీరులును, వీరవనితలును దైవసంపత్తిగల్గి ఒక్కొక్కయెడ అలౌకిక శక్తి సామర్థ్యములు, ప్రతిభా విశేషములు ప్రదర్శించి యుంటచే, తరువాతవారు వారికి దైవత్వమారోపించుటయు కద్దు.

పాశ్చాత్యదేశములలో జీవిత చరిత్రలు, వీరగాధలు లెక్కకు మిక్కిలిగా నున్నవి. మహాకవులు, మంత్రిసత్తములు మొదలు, సామాన్య సిపాయిలు, నావికులు మొదలగువారి చరిత్రలుగూడ గ్రంథస్తములైనవి. చివరకు ఆయా దేశముల సాహితీరంగములలో జీవిత చరిత్రలుగూడ యొక విశిష్టస్థానము సంపాదింపగల్గెను. కొందరు తమ తమ స్వీయచరిత్రలను

గ్రంధస్థంచేసి ప్రకటింపసాగిరి. హిందూదేశమునమాత్రం జీవిత చరిత్రలు బహు తక్కువ. స్వీయచరిత్రలు 20 వ శతాబ్దాదివరకు అసలే లేవు. యిందుక్కు కారణము స్పష్టమే. లౌకిక సంపదలతో పాటు, పేరు కీర్తులుకూడ అశాశ్వతములు, కనుక వాంఛింప దగినవికావు అను మన సత్వమే కారణమనవెల్లును. దైవము, మతము అనువానితో సంబంధముండినగాని, హైందవులకు ఏదియూ గమనార్హమేకాదు. సాధారణ వీరపూజ (Hero worship) వీరెరుంగరనే చెప్పవలెను. బుద్ధ, మహావీర, శంకర, రామానుజ, మధ్వాది మతకారుల చరిత్రలు ఆయా మతావలంబకులచే కొంతవరకు వ్రాయబడినవికాని, అందు కేవల స్తోత్ర పాఠములు, అతిశయోక్తులు హెచ్చు. అలౌకిక ప్రజ్ఞా మహత్తులు, ఆయా మతకర్తలకు ఆరోపించి, వారిని దైవాంశ సంభూతులుగా ఆరాధించుట పరిపాటి. గురుభావముచే ఆరాధించినసూ తప్పుగాదు. ఉన్నదున్నట్లుగా గాక, అసత్యకల్పనలకు ఆయా చరిత్రగ్రంధములు పాల్పడెనని మాత్రమే నా మనవి. పాశ్చాత్యచరిత్రి గ్రంధములు అట్లుకాక, జరగినదానిని జరగినట్లు చిత్రించుట ప్రధాన లక్షణముగా గుర్తించి, రచింపబడినవి. యదార్ధ కథనమేలేనిచో అది కల్పనాత్మకమగు నొక కావ్యమే అవుతుందిగాని, చరిత్ర అనే పేరునకే అది తగదు.

ఇటీవలమాత్రము, దేశచరిత్ర లేకపోవుటయే కొంతవరకు దేశ దౌర్భాగ్యమునకు కారణమని హైందవులు గుర్తింపగల్గిరి. తత్కారణముగా మతకర్తలు, ప్రచారకులు, వీరశిఖామణులు, మహాకవులు, సంఘసంస్కర్తలు, దేశనాయకులు మొదలగు వారి చరిత్రలేగాక, స్వీయచరిత్రలుగూడ ప్రకటింపబడుతూ వుండుట ముదావహము.

జీవితచరిత్రలను పఠించుటవల్ల హృదయమున కుత్తేజము కల్గి, ఆయా మహాపురుషుల నాదర్శముగాగొని, వారి అడుగు జాడలలో పయనించి కృతార్థుడగుటకు పాఠకుల కవకాశము కలదు. వారి జీవిత విధానములను సరిదిద్దుకొని శ్రేయోమార్గమునసే కృషిచేయగలరు. అబ్రహాం లింకను, టాల్‌స్టాయి వంటి వుత్తముల జీవితచరిత్రలు గాంధీగార్కి మార్గదర్శకములైనవి. ఆ మహాపురుషులను ఒరవడిగా పెట్టుకొని గదా! యీాయన మహాత్ముడయ్యెను. చరిత్రయందలి నాయకుడు, తొలుత ఎంత సామాన్యుడో, చివరకెట్టి మహత్తరకార్యములను సాధింపగలెనో గమనించిన, పాఠకుడు అంతకంతా ఉత్తేజము పొందితీరును. ఫలననగా: కేవలము విష్ణ్వాంశ సంభూతులనీ, అవతార పురుషులనీ చెప్పబడుతూవున్న రామ కృష్ణాదులున్నూ, దైవకృపాసంపత్తి విశేషముగా గల్గిన ధర్మరాజాదులున్ను యెట్టి నిర్దుష్ట జీవితములను గడపినను, యెట్టి మహత్తర విజయములు సాధించిననూ, వారు దైవదత్తమగు శక్తిగలవారగుటచే వార్కి సాధ్యము కావచ్చును, కాని తనకట్టి దైవకృపలేదు, కనుక తానసమర్థుడననే తలంపుతో పాఠకుడు తొలుతనే నిరుత్సాహపడి వారి నాదర్శముగా గైకొని, ముందంజవేయుటకు తగిన ఉత్తేజము, ఉత్సాహ ప్రోత్సాహములు, వారి చరిత్రలనుండి పొందజాలడు. కాని కేవలము తనవంటి యొక సామాన్య మానవుడు, తనకంటె హీనమగు పరిస్థితులలో నుండినప్పట్కి యెట్లు మహత్తర కార్యములు సాధించెనో గమనించినచో పాఠకునకు తప్పక ఉత్సాహము, కార్యదీక్ష మున్నగునవి చేకూరగలవు. ఉదాహరణకు శ్రీ మద్రామాయణ గాథను తీసుకొందము. శ్రీరామచంద్రుడు అవతారపురుషుడు, కేవలం

శ్రీ మహావిష్ణువే అని నమ్మినంతమాత్రాన ప్రయోజనములేదు. తగిన ఫలితమును పొందవలెనన్న, తగిన యాచరణ, సత్శీలము గల్గియుండవలెను.

శ్రీరాము డవతారపురుషుడు కాడు. రఘువంశమున బుట్టిన ఆదర్శ రాజన్యుడుమాత్రమే అని అనుకొన్న వారలకు కూడ, వారి వారి ఆచరణనుబట్టి, రామాయణ పఠనమువలన మహోపలబ్ది చేకూరగలదు. తనవంటి సామాన్య మానవుడు సాధించగలదానిని, తానుమాత్రి మేల సాధించలేడు? శ్రీరాముని వంటి శీలమును సంపాదించినచో చాలు. కనుక "శ్రీరాముని వలె, నా జీవితమును ధర్మపథమున నడిపింతును" అని శ్రీరాముని యాదర్శముగా గ్రహించి, తన జీవితమును సరి దిద్దుకొన్న వ్యక్తి, శ్రీరాముడు మహావిష్ణువని నమ్మి యూర కున్నవానికంటె, యుత్తమఫలమునే పొందగలడు. కనుక శ్రీరామచంద్రుడు పరుడనుకొనుటకంటె, శ్రీరాముడు నరుడే, గాని నాకు గురుడు, అని అనుకొనుటవల్ల ప్రయోజనముమెండు.

మత ప్రవక్తలు, ప్రచారకులు మొదలగువారి చరిత్రలు అనేకము కన్పట్టుచున్నవి. క్రీస్తు, మహ్మద్, బుద్ధభగవానులు, ఆచార్య త్రయము, ఆళ్వారులు, భక్తశిఖామణులు మొదలగు వారి జీవితచరిత్రలు, ఎంతో పూజనీయ గ్రంథములుగ ఆయా మతానుయాయులవల్ల భావింపబడుచున్నవి. యిటీవల ప్రపంచ విఖ్యాతి చెందిన శ్రీరామకృష్ణ, వివేకానంద, రామతీర్థ, రమణ మహర్ష్యాదుల జీవిత చరిత్రలు పఠింపబడి, ఆయా భక్తులకు మార్గదర్శకములై, వారి అంతఃకరణశుద్ధికి, ఆచరణ విధానము నకు, ఆధ్యాత్మికాభ్యున్నతికి మిక్కిలిగా తోడ్పడుచున్నవి.

శ్రీ సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

ప్రథమ ప్రకరణము.

శ్లో॥ గురుర్బ్రహ్మా, గురుర్విష్ణు, గ్గురుర్దేవో, మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ, తస్మై శ్రీ గురవేనమః ॥

శ్రీల కాలవాలమై యెప్పుడి శికింద్రాబాద్ పట్టణమున, మున్నూరు కాపుకులము ప్రసిద్ధికెక్కియున్నది. సీతా స్వయంవర కాలమున, శివధనస్సును స్వయంవర ప్రాంగణమునకు మున్నూరుమంది వీరులు మోసి తెచ్చినట్లు, ఆంధ్ర భాగవత నవమస్కంధంలో, బమ్మెర పోతనామాత్యులొక పద్యము వ్రాసి పెట్టినారు.

మ॥ ఒక మున్నూరు గదల్చి తెచ్చిన లలాటోగ్రాక్షుచాపంబు, బా
ల కరీంద్రంబు సులీలమైజెఱకు గోలంద్రుంచు చందంబునన్
సకలోర్వీశులు సూడగా విఱిచె దోశ్శక్తిన్ విదేహాత్మమా
పక గేహంబున, సీతకై, గుణమణి ప్రస్ఫీతకై, లీలతోఁ॥

ఆ మున్నూరు వీరవరులే నేటి మున్నూరు కాపుకులమునకు మూలపురుషులను యొకగాథ ప్రచారంలోనున్నది. ఆమున్నూరు కాపుకులమున పసుపునల గోత్రమునందు పొన్నాలవారను యింటిపేరుగల కుటుంబము వాసికెక్కెను. అందు బాలయ్యగారు, అను యుత్తమునికి, ఆయన సతీమణియగు గంగమాంబ యందు, గల్గిన ముప్వురు పుత్రరత్నములు (1) భవాని,

(2) వెంకన్న (3) లక్ష్మయ్య అనువారిలో వెంకన్నగారు మధ్యవాడు. యీయిన పోతనివారింటి ఆడబడుచగు మల్లమాంబ యను కన్యారత్నమును పెండ్లియాడెను. వీరిద్వారి గర్భవాసము పండి, బాలయ్య, నర్సయ్య, సత్తెయ్య, రాజయ్య, రామయ్య అను ఐదుగురు కొమాళ్లున్ను, రంగమ్మ, రామక్క, లక్ష్మమ్మ, గంగమ్మ వెంకటమ్మ, నర్సమ్మ అను ఆర్గురు కొమార్తెలున్ను ఉదయించిరి. ఈ సంతానములో పదియవవాడున్ను, కొమాళ్ళలో నాల్గవవాడున్ను, అగు రాజయ్యగారు, శైశవమాదిగా అఖండప్రజ్ఞానిధియై నేడు శ్రీమద్రామడుగు శివరామదీక్షితాచల గురుపీఠమునకు అధ్యక్షస్వామియై, అలరారుచున్నారు. వీరి పుణ్యచారిత్రమే యీ గ్రంథస్థ విషయం. వీరు చిన్ననాటి నుంచి నేటివరకు సాధించిన విజయపరంపర లిందుల్లేఖితమైనవి.

ఈ మహనీయులు, 10–3–1899 వ సంవత్సరం తేదీని విళంబినామ సంవత్సర మాఘబహుళ త్రయోదశీ (అనగా మహాశివరాత్రి) నాడు సాయంత్రము 5 గంటలకు ఆదిగురువగు మహాశివుని అపరావతారమో అనునట్లు జన్మించిరి. యథాక్రమముగ 5 వ ఏట వీరిని బడిలో వేసిరి. కాంతయ్యగారను బ్రాహ్మణ పంతులు వీరికి అక్షరాభ్యాసముగావించి తానా గ్రామంలో నడుపుచుండిన వీధిబడికి తోడ్కొనిపోయి. అక్షరమాల, గుణింతములు చెప్పి పెద్దబాలశిక్ష పూర్తి చేయించి, పిదప సుమతీశతకము కృష్ణశతకము, నారసింహశతకము, బాలరామాయణము, భారతమందలి సావిత్రోపాఖ్యానమును చదివించెను. లెక్కలయందు నిపుణిని గావించెను. వీరి విద్యాభ్యాసమంతటితో పరిసమాప్తియాయెను. విద్యాభ్యాసము అయిన కొలది మాసములకే వీరి

తండ్రి స్వర్గస్థులైరి. తల్లియగు మల్లమాంబయే వీరిని దిద్దితీర్చినది. బహుళ సంతానవతియయ్యును, భూదేవివంటి యోర్పుగల్గి బిడ్డ లందరికి విద్యాబుద్ధులు చెప్పించి యిటువంటి మహనీయుని లోకమునకు ప్రసాదించిన యీ అమ్మ వేనోళ్ళ కీర్తింపదగినది. లేబ్రాయమున తండ్రి గతించిన బిడ్డలు సాధారణముగా వెంకి తన మలవరచుకొని చెడుమార్గములబట్టి చదువుసంధ్యలలో చాల వెనుకబడుదురు. కాని యీ బిడ్డడట్లుగాక అన్నగారియొక్కయు అమ్మగారియొక్కయు అదుపాజ్ఞలలోనుండి విద్యాభ్యాసము గావించెను.

వీరని, పెద్దన్నగారగు నర్సయ్యగారు చదువు మానిపించి తన బట్టలదుకాణములో లెక్కలువ్రాయు పనికి నియోగించెను. అప్పటికీయనకు 8 వ సంవత్సరము. ఈ లేబ్రాయపు తమ్మునిచే పనిగొనుట లోకులకు కూరిరముగా తోచవచ్చును. కాని ఆ కాలములో సాధారణముగా అంతకంటె పెద్దచదువులు చదువువారు అరుదు. యిక చదువుమానిపించిన కుర్రవానిని వూరక యింట గూర్చుండనిచ్చుట, కుర్రవానికి సోమరితనము నేర్పుటయే యగును. చిన్నతనంలో పోమరిగానుండువారు పెద్దవారైన తర్వాతకూడ జీవితంలో యిక చురుకుతనము సంపాదించుట బహు అరుదు.

ఈ యుద్యోగనియామక మొకవిధంగా ఈ మహామహుని భావిజీవిత పరిణామమునకు నాందియాయెను. గత జన్మార్జిత పుణ్యవిశేషమే, యుత్తరజన్మాయు దభ్యుదయకారకమగు పరిస్థితులు జీవునికి కల్గించునను సత్యమును శ్రీవారి జీవితము ఋజువు చేయుచున్నది. ఎట్లనగా, ప శివరామ దీక్షితీయ పితమున కీయన

భావిజీవితమంతయు కైంకర్యమాయెనో, ఆ దీక్షితీయ పీఠము నకు పరంపరా పీఠాధికారులగు శ్రీ పిల్లాని లక్ష్మణరావుగారి శిష్యులలో నొకరగు, మొగడంపల్లి మల్లయ్యగారు శ్రీవారి అన్నగారి బట్టలకొట్టులోనే ఒక గుమాస్తా అయివుండెను. శ్రీవారి కోమలహృదయ కేదారము, దీక్షితీయ సిద్ధాంత బీజములకు దివ్యక్షేత్రమై తేజరిల్లుటకు యీ మల్లయ్యగారి సాంగత్యమే ప్రథమ కారణమాయెను.

ఆ బట్టలకొట్టులోనే, కొండే వేమాజీ అను మంత్రశాస్త్ర నిపుణుడొకాయన, మరొక గుమాస్తా అయివుండెను. ఆయన భూతవైద్యము చేయుచుండువాడు. అపుడపుడు కొన్ని మంత్ర మహిమలు ప్రదర్శించెడివాడు శ్రీవారి లేహృదయము యీ మహిమలచే సహజంగా నాకర్షింపబడెను. తీరికసమయములలో శ్రీవారు వేమాజీగారివెంట తిరుగుచుండిరి. వేమాజీ, రక్షరేకులు, యంత్రములు కట్టి యిచ్చుచుండెడివాడు. భూతవైద్యము నందున్ను, సంతానప్రాప్తికిన్ని కట్టియిచ్చు రక్షరేకులలో తూర్పునకుబారిన గచ్చవేరు అవసరమైయుండెను. అశ్వనీనక్షత్ర యుక్తమగు ఆదివారంనాడు ఆ వేరును త్రవ్వి, మునిపండ్లతో కొరికితీయవలెను. అట్లు కొరికి తీయువాడు, ఏ శాపప్రభావమో, ఏ అవ్యక్తశక్తి ప్రభావమోగాని, మాటిమాటికి స్పృహతప్పి పడిపోవునేగాని సులభంగా తీయలేడట. అట్లు స్పృహతప్పిన వానికి, స్పృహ తెప్పించుటకై వానిపై మంత్రించిన మినుములు చల్లితే తిరిగి స్పృహవచ్చునట. ఆ వేరు తీయుటకై వేమాజీ ఒక అశ్వనీనక్షత్రయుక్త ఆదివారమునాడు మంత్రించిన మినుములను తీసుకొని, తోడుగా శ్రీవారిని తీసుకొనిపోయెను. వేరు త్రవ్విన

ప్రార్థనకూడా మన్నించలేదు. కారణమేమని నేను అడుగగా శ్రీవారిట్లు సమాధానమిడిరి. "నాయనా! యీ పిలచినవారు మన సాంప్రదాయక భక్తులుకారు. నేనువెళ్ళి వారింట్లో భుజించుటవల్ల వారికేదో పుణ్యమో, శుభమో కలుగగలదని వారాసించి పిలచియుండుట సహజమే, కాని పారమార్థిక జీవనము జరుపుకొనుచున్న మనము యితరుల సొత్తు తినరాదు. గురువు శిష్యులసొత్తు తినవచ్చును, శిష్యులు గురుసొత్తున్ను తినవచ్చును. గురుపుత్రు డెన్నడున్ను కష్టపడి సంపాదించిన స్వార్జిత విత్తమునే భోగించవలెను. మరియును ప్రాపంచికులు అనేక మార్గములుగా ధనమార్జింతురు. అన్యాయార్జితమగు విత్తమును ఏ రూపంగా అనుభవించిననూ అది కీడే గల్గించును." అని బోధించిరి.

ఈ సూత్రమునే శ్రీవారు సర్వత్రా ఎప్పుడున్నూ పాటిస్తూవచ్చినారు. పీఠమునకు ఎట్టి ఆస్తిపాస్తులు లేకున్ననూ పీఠమునకు భక్తాదులర్పించు ద్రవ్యముతప్ప ఎన్నడూ శ్రీవారు యితరులవల్ల తృణమైన స్వీకరించుట కియ్యకొనరు. శ్రీవారు ప్రతిష్ఠగావించిన, ఏ యొక పీఠమునందలి వార్షికోత్సవములు, సమారాధనలు, ఉత్సవములకైనను భక్తాదులిచ్చు ద్రవ్యమును స్వీకరించుటయే జరుగుచుండెను. ఉపపీఠములు, ఆశ్రమములు వగైరాల నిర్మాణమునకు వలయు ధనమునుగూడ భక్తాదులే యీయవలెను. గాని యితరులవల్ల చందాలరూపంగా గాని దానరూపంగా గాని గ్రహింపనొల్లరు. శ్రీవారి భక్తకోటి అంతయూ శ్రీవారి యీ నియమమును సాధ్యమైనంతవరకు పాటించుచునే యున్నారు.

బోధ పరమగు తత్వముల నెన్నింటినో నేర్చి గానముచేయుచు సమావేశమయిన భక్తాదుల హృదయములను ద్రవీభూత మొనర్చుచుండిరి.

శ్రీవారి యింటి సమీపమునందేయున్న యొక భజన మందిరములో ప్రతి గురువారం భజనకాలక్షేపములు జరుగుచుండెడివి. తారకయోగి, పిద్ది లింగయ్యగారి శిష్యులు అంజయ్య, వెంటయ్య, దుర్గయ్య అనువారలు అటచేరి అద్వైతపరమగు వేదాంత తత్వములు పాడుచుండిరి. శ్రీవారునూ తరుచు యీ భజన చూచుటకై వెళ్ళుచూనుండిరి. శ్రీవారున్నూ శ్రోతల కోరికపై యీ భజనమందిరమునగూడ తత్వములు పాడుతూ యుండిరి. వీరి గానామృతమునకు కరగిపోతూ యుండినను, వీరు పాడెడు తత్వములలో నిమిడియున్న అద్వైత నిరసనకు వారందరు భయాందోళనలు చెందుచుండిరి. చిత్రము! ప్రహ్లాద కుమారునికి మాతృగర్భం వెలువడినదాది శ్రీవారి సంకీర్తనమే అబ్బినవిధంగా, శ్రీవారు శైశవమాదిగా పరిపూర్ణ బోధ శ్రేష్ఠ త్వమునే గానము చేయుచుండిరి.

ఆరోజుల్లో శికింద్రాబాదు పట్టణమున హఠయోగము నందు ఆరితేరిన సూర్యనారాయణశాస్త్రిగారను యోగశాస్త్ర విశారదులొకరుండేవారు. నర్సింహ్వారావను వైద్యవృత్తి పూనిన వ్యక్తి యీయనవద్ద షణ్ముఖముద్రాభ్యాసము చేయుచుండెడి వాడు. కొండే వేమాజీయున్ను, శ్రీవారున్నూకూడ యోగ శాస్త్రము నేర్చుకొనుటకై ఆ సూర్యనారాయణశాస్త్రిగారివద్ద కేగి వారినాశ్రయించి పతంజలియోగ సూత్రవ్యాఖ్యానములు వినుటతో ప్రారంభించినవారు క్రమశః షణ్ముఖముద్ర నభ్యా

సము చేయసాగిరి. అభ్యాసకాలమున వచ్చు ప్రమాదములను వాని నివారణోపాయములనుగూడ శ్రీవారు శాస్త్రిగారివద్ద శ్రవణముచేసియుండిరి. ఒక పర్యాయము అభ్యాసకాలమున శ్రీ నర్సింహ్వారావుగార్కి ఒక ప్రమాదము తటస్థించెను. కన్నుల తెల్లగుడ్లు పైకివచ్చి నల్లగుడ్లు లోనికిపోయి అట్లే నిలబడి పోయెను. యిట్టి ప్రమాదము తటస్థించినచో యేక్రియ ఎట్లు చేయవలెనో శ్రీవారంతకుముందె తెలిసికొనియున్నవారగుటచే అన్నము మెత్తగా వండించి దానిని అంబలివలె తయారుచేసి ప్రమాదంలోవున్న వైద్యపుంగవునికి ఆపాదమస్తకము పూసి ఒక గోయి తీయించి, అందు నాసికమువరకు ఆయనను పూడ్చిపెట్టి శిరస్సుపై నీళ్లు చల్లుచూరాగా కొంతసేపటికి ఆయన కన్నులు యధాప్రకారం సక్రమంగా తిరిగివచ్చెను. అప్పటికి వీరి వయస్సు 12 సం॥లు మాత్రమే. అట్టి ధైర్యసాహసములా లేతవయసు లోనే శ్రీవారియందు కార్యరూపంలో ప్రదర్శితమాయెను.

శికింద్రాబాద్ పట్టణమున సుప్రసిద్ధ కుటుంబమునకు చెందిన భోతని వెంకటస్వామిగారు శ్రీవార్కి మేనమామగారు. వీరు కుమార్తెఅయిన చెన్నమాంబను మేనల్లుడైన శ్రీవారికిచ్చి కృతార్థుడాయెను. శ్రీవార్కి వయస్సు 12 సం॥. వధువునకు 10 సం॥లు. క్షేత్రమెరిగి విత్తనము, పాత్రమెరిగి దానము అన్నారు పెద్దలు. ఈ కన్యాదానమునకు శ్రీవారికంటె యోగ్యులెవరు? నాడు శ్రీరామచంద్రునికి సీతనిచ్చి జనక మహారాజు ఎంత కృతార్థుడాయెనో శ్రీవార్కి పుత్రికారత్న మును సాలంకృత కన్యాదానముచేసి వెంకటస్వామిగారునూ అంత ధన్యజీవులైరి. ఇట్టి శ్రేష్ఠాయమునసే గృహస్థాశ్రమ

స్వీకారం గావించుట నేటివార్కి విడ్డూరముగా దోచవచ్చును. కాని నేటి రజస్వలానంతర యువతీ వివాహ ఫలితములను పరిశీలించినచో బాల్యవివాహములు చేయునాటి పూర్వాచారము ఎంత యుక్తమైనదో గ్రహింపవచ్చును. హైందవ సంస్కృతికి బాల్యవివాహములెంతయో దోహదములు. ప్రేమించి పెండ్లి యాడు సంస్కృతి పూర్తిగా వైదేశికమనియే చెప్పనొప్పును. అచ్చటచ్చట కొద్ది సంఖ్యలో గాంధర్వాది వివాహములు జరిగినను అవి పరిగణింపదగినవిగా లేవు. వివాహమొక ముఖ్య సంస్కారము. సత్సంతానప్రాప్తియే ఆశించదగిన ఫలము. ధర్మకర్మాచరణకున్ను పరమ పురుషార్థమగు మోక్షమునకును అర్హతకల్గించు వ్యవస్థగా మాత్రమే వివాహము పరిగణింపబడుచుండెను. భర్తకు చేదోడు వాదోడుగానుండి ఆయన ధార్మికజీవనమున సహధర్మచారిణి యనియు పతివ్రతయనియు ఆమె సార్థక గౌరవనామములు చెందెడిది. ఇట్టి సహజీవనమునకు బాల్యవివాహములు మిక్కిలిగా తోడ్పడేవి. బాలబాలికల కోమలహృదయముల పరస్పర ప్రేమబీజములు చిన్ననాటనే మొలకెత్తి వయసుతోపాటు పరిణతిచెంది వివాహబంధము దృఢతరమై దాంపత్యసుఖము పరాకాష్ఠ చెందేది. హఠాత్సంజనిత ప్రేమ యెంతత్వరగా మొలకెత్తునో అంతత్వరలోనే అంతమై పోవుట నేడు ప్రపంచమున పరిపాటి అయిపోయినది. బాల్య వివాహముయొక్క శ్రేష్ఠత్వమును శ్రీవారి యీ వివాహమే చక్కగా ఋజువుచేసినది. అదియెట్లో ముందు గ్రంథమున తెలియగలరు.

శ్రీ సద్గురుభ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

ద్వితీయ ప్రకరణము.

పూర్వజన్మ సుకృతవిశేషముననగాని మానవుడు తగిన వారింట తగిన పరిసరములమధ్య జన్మింపడు. ఆ సుకృత విశేషముననే సద్బుద్ధి, శుభేచ్ఛ యిత్యాదులు మానవునికి కలుగుచుండును. "బుద్ధిః కర్మానుసారిణీ" అనగా పూర్వకర్మ ఫలానుసారమే సంకల్పములున్ను కల్గుచుండును. శ్రీవారికి శైశవమాదిగా సత్పురుష సహవాసము, సజ్జనగోష్ఠి, యోగులతోనూ భక్తులతోనూ సాహచర్యము గలుగుటకును, యీ పూర్వజన్మ సుకృతమే కారణము. లేనిచో అంత చిన్నతనముననే మంత్రోపాసకులతో, భజనపరులతో, యోగాభ్యాసకులతో మాత్రమే గాక పరిపూర్ణ భావజ్ఞులతో, పతత్పీఠాధిపతులతో పరిచయ భాగ్యము గలుగుటయేగాక వారి వారి మార్గములయందాసక్తి అభినివేశము కలుగుట మరియొక విధముగా సమన్వయించజాలము.

ఆ॥ వె॥ పూర్ణబోధ కొరకు పురుషుండు
బహుజన్మ పుణ్యవశముచేత బుట్టవలయు
అట్లు బుట్టకున్న అది కష్టసాధ్యంబు
అఖిల జీవసంగ ఆత్మలింగ.

అని పెద్దల వాక్యముకూడా యున్నది. పూవు బుట్టినతోడనే పరిమళము అనేమాట సర్వత్రా అక్షరాలా నిజం అని నేననను

గాని శ్రీవారు కారణజన్ములనే విషయంమాత్రం శ్రీవారి బాల్యముననే ఋజువయ్యెను.

ఆ సుకృతవిశేషమున్న కారణంచేతనే శ్రీవార్కి ఆధ్యాత్మిక పురోభివృద్ధికి అవసరమగు పరిస్థితులు, సదవకాశములుగూడ అట్లే లభించుచుండెను. శ్రీవారికి 13 సంవత్సరములైనను మించకపూర్వమే శ్రీ సచ్చిదానంద వెంకటేశ్వరావధూత స్వాములవారి సందర్శనభాగ్యము చేకూరెను. ఈ అవధూత స్వాములవారు శ్రీవారి భావిజీవితములో ఎట్టి ప్రధానపాత్ర వహించినదీ ముందు యీ గ్రంథంలో స్పష్టపడగలదు. ఆ దినములలో సికింద్రాబాద్ పట్టణముననున్న వేణుగోపాలస్వామి వారి ఆలయంలో వీరు వేదాంత ప్రబోధము కావించుచూ ప్రతి నిత్యమూ పాఠక్రమముగా సాంఖ్య తారకామనస్కములగూర్చి ఉపన్యసించుచుండిరి. కొంచె మించుమించుగా అవధూతస్వాముల వారు అప్పట్లో అదియొక వేదాంత ప్రాథమిక పాఠశాలగా ప్రారంభించి నడపుట శ్రీవారివంటి యే యొకరిద్దరు పుణ్యపురుషుల అదృష్టమో పండినదనవలెను. శ్రీవారు ఒక్క దినమైననూ విడువక యీ వేదాంత పాఠములను శ్రవణముచేసి జీర్ణించుకొనుచుండిరి. సుమారొక సంవత్సరము యీ పాఠశాల నడచెను. అనగా 1914 సంవత్సరమున అవధూతస్వాములవారి గురుదేవులైన శ్రీ పీల్లాన లక్ష్మణరావుగారు బ్రహ్మైక్యము చెందినపిదప యీ వేదాంత ప్రబోధమును విరమించి అవధూత స్వాములవారు బెజవాడ వెళ్ళిపోయిరి. అప్పటికి శ్రీవారి వయస్సు 16 సం॥లు. ఐననూ అప్పటికే ఆధ్యాత్మిక విషయములపై, గడ్డములు మీసములు సెరసినవారు కూడ శ్రీవారితో

చర్చింపజాలకుండిరి. శ్రీవారికి ప్రాథమిక పరిజ్ఞానము కల్గించి దృఢతమమగు పునాదులు ఏర్పడుటకు శ్రీ అవధూతస్వాముల వారే ముఖ్యకారకులని చెప్పదగును.

ఆ పిమ్మట కొద్ది సంవత్సరములలోనే వీరి స్వంత బట్టల వ్యాపారం చెడిపోయెను. ఇందుకు వీరి అన్నగారగు నర్సయ్యగారి దుష్పరిపాలనమే చాలవరకు కారణమాయెను. శ్రీవారింక జీవితమార్గమొకదానిని వెదకుకొనవలసినవారైరి. కాని శ్రీవారి విషయంలో ఉద్యోగాన్వేషణ వెనువెంటనే ఫలప్రదమాయెను. వీరికి గల వ్యాపారానుభవము, లెక్కలు వ్రాయుటలోగల చాకచక్యము వీరికి సులువుగా ఉద్యోగమును సంపాదించి పెట్టెను. ఏలననగా ఆ కాలములో అట్టి అర్హతలు కలవారును బహు అల్పసంఖ్యాకులే. అందుచే శ్రీవారికి రు 100/- లు వేతనముపైన చదరా కాంతయ్య, ఉడతా యెల్లయ్యగార్ల కొట్టులో గుమాస్తా యుద్యోగము లభించెను. గ్రామాంతరములు కూడా పోయి రావలసిన బాకీలు వసూలుచేయుటకూడా వీరి ఉద్యోగవిధులలో నొకటియై యుండెను. కాలచక్రములో నాలుగు వసంతములు గిర్రున తిరిగిపోయెను. బాకీలు వసూలు చేయు పనిమీద శ్రీవారొక పర్యాయము వరంగల్లు వెళ్లుట తటస్థించెను. ఆ రాత్రి ఆ గ్రామంలో ప్రదర్శింపబడిన సావిత్రోపాఖ్యాన నాటకము చూచుటకై శ్రీవారు పోయియుండిరి. అది 1920 వ సంవత్సరము.

మరల శ్రీవారి జీవితములో శుభోదయ సమయ మరుదెంచెను. కాలగర్భమున యిమిడియున్న పుణ్యసంస్కారము ఫలప్రదమగు దివ్యముహూర్త మాసన్నమాయెను. ఆ రాత్రి శ్రీ

సచ్చిదానంద వెంకటేశ్వరావధూత స్వాములవారి ముఖ్యశిష్యు లిర్వురి సందర్శనభాగ్యము శ్రీవారికి చేకూరెను. అందు అంకెనపల్లి స్వామి శ్రీవార్కి పూర్వపరిచితులే. కాని ఆరెండవ వ్యక్తి ఎవరు? ఆజానుబాహుయుక్తమగు శరీరము, గంభీర మయిననూ సుప్రసన్నమగు ముఖవిలాసము, శాంభవీ ముద్రలో నిశ్చలత్వమలవడిపోయిన నయనములు, రాజఠీవిని దలపించు గమనవిశేషము, సూచీముఖమును అయస్కాంతమువలె శ్రీవారి హృదయమును చూపుమాత్రముచే నాకర్షించు యీదివ్యపురుషు డెవరు? వారే శ్రీ సచ్చిదానంద వెంకటేశ్వరావధూత స్వాముల వారి ప్రియశిష్యులు శ్రీ మద్రామడుగు శివరామ దీక్షితాచల గురుపీఠాధిపతులు, శ్రీ ఘనానంద బిరుదాంకితులగు మంచిప్పల హనుమంతరాయ రాజయోగీంద్రులవారు, అని అంకెనపల్లి స్వామి శ్రీవారికా దివ్యపురుష పరిచయము గావించిరి. అయి వున్న పీఠాధిపతితో అవనున్న పీఠాధిపతి కలయిక. కానున్న గురువర్యునితో కాబోవు శిష్యవతంసుని సమాగమము. పుత్రి వాత్సల్య మొకవంక, పితృభక్తి మరియొకవంక - యిర్వురి హృదయకేదారములలో నొక్కసారిగా మొలకెత్తెను.

ఆ మరునాటిరాత్రే శ్రీవారు హనుమంత రాజయోగి గారింటికి పోయిరి. వేదాంతచర్చలతో ప్రశ్నోత్తరములతో ఆ రాత్రి యిర్వురికి జాగరణమాయెను. శ్రీ హనుమంత రాజ యోగీంద్రుల ప్రజ్ఞావిశేషములు శ్రీవారి నెంతయో ఆకర్షించెను. హనుమంతుని ఎదుటనే కుప్పిగంతులా అని భావించుచూ శ్రీవారు యింటికేగిరి. కాని తనువొకచోట - తమకమొక చోట. సరి, యిక ప్రతి 3, 4 దినముల కొకపర్యాయము శ్రీవారు

వరంగల్లుపోవుచు శ్రీ హనుమంత రాజయోగిగారి వాగమృతము గ్రోలుచూ శంకానివృత్తి గావించుకొనుచుండిరి. అప్పటికి కొంత కాలముగా శ్రీ హనుమంతరాయ రాజయోగీంద్రులు వరంగల్లులో వెండి, బంగారు వ్యాపారము చేయుచుండిరి. వారితో శ్రీవారికి సమావేశ పరంపరలు, చర్చలు, సిద్ధాంత రాద్ధాంతములు ఈవిధంగా ఒక సంవత్సరమిట్లే తిరిగిపోయెను. కానున్న గురు శిష్యు లిద్దరు నొకరినొకరు చక్కగా పరీక్షించుకొనిరి. చివరకు శ్రీవారు, భూమా పదార్థమే (ఆయన దీక్షా నామము 'భూమానంద') గురుతత్వమని గుర్తెరిగి శ్రీ హనుమంత రాజయోగీంద్రులకు శరణాగతులై ధర్మోపదేశము చేయుడని ప్రార్థించిరి. అంతఃకరణ పరిశుద్ధి, అఖండ మేధాసంపత్తి, తీవ్ర మోక్షేచ్ఛ, కార్యదీక్ష, గలవానిగా శ్రీవారిని హనుమంత రాజయోగీంద్రు లంతకుపూర్వ మేనాడో గుర్తించిరి. కనుక శ్రీవారి కోరికను మన్నించి, పరిపూర్ణబోధపొందుట కుత్తమోత్తమాధికారియని తృప్తిపడి 1921 సం॥ మే నెల 21 వ తేదీని (దుర్మతినామ సంవత్సర వైశాఖ పూర్ణిమ నాడు) శ్రీవారికి, శ్రీ హనుమంత రాజయోగిగారు ధర్మోపదేశము గావించి దీక్షనొసంగిరి. ఈ వైశాఖ పూర్ణిమనాడే బుద్ధభగవానునికి జ్ఞానోదయమయ్యెను. అట్లే శ్రీవారికిగూడ ఈ పర్వదినమందే జన్మ కర్మ వినాశకారియగు పరిపూర్ణబోధ ప్రసాదింపబడుట గమనించదగిన ముఖ్యవిషయములలో నొకటి.

శ్రీ సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

తృతీయ ప్రకరణము.

గురువియోగము సహింపజాలక శ్రీవారు సద్గురు సన్నిధానమున అంతేవాసిగానుండు దృఢనిశ్చయముతో తమ యుద్యోగమునకు రాజీనామా నిచ్చిరి. శిష్యుని పురోభివృద్ధికి గురుకులవాసమెంతేని అవసరము. గురుసేవ చేయుచూ గురువు గారింటనే యుండుట, గురువు పేదవాడై స్వకుటుంబమును గాని, పుత్రసములైన శిష్యులనుగాని పోషింపజాలనివాడైనచో, శిష్యులు మధూకరవృత్తిచే అన్నము సంపాదించి గురువుగారి కుటుంబమును, తమ్మునుగూడ పోషించుకొనుట పూర్వపద్ధతి అయివుండెను. ఇంకనూ అప్పటికి సకృత్తుగా అట్టి పద్ధతులు ఎక్కడో వుంటూనేవుండెను. గురువుగారింటనుండి వారికి సమస్తోపచారములు చేస్తూ, వారివెంట తిరుగుచూ విద్యనార్జించుట ఉత్తమోత్తమ పద్ధతి. అదియే స్థానశ్రీశుూషయొక్క నిజాభిప్రాయము. ముఖ్యముగా బ్రహ్మవిద్యా విషయంలో శిష్యుల విద్యా సముపార్జనకు మాత్రమేగాక వారి అహంకార నివృత్తికిన్ని యిది కడుంగడు అవసరము. శ్రీవారు యీ వుత్తమ మార్గముననే పురోగమించుటకు కృతనిశ్చయులైరి.

తాముచేయు వెండి బంగారు వ్యాపారములో తగు గిట్టుబాటు లేనందున శ్రీ హనుమంత రాజయోగీంద్రులు తమ వ్యాపారమును విరమించిరి. ఇక నీ గురుశిష్యు లిర్వురు

ఘుక్తికై యన్యమార్గ మన్వేషించవలసివచ్చెను. ఆ వృత్తి విధానము, యిర్వురూ నొకచోనుండి నడుపదగినదిగా నుండ వలెను. ఇర్వురు ఆలోచించుకొని తునికాకు (బీడీ ఆకు) కంట్రాక్టు వ్యాపారముచేయుటకు నిశ్చయించుకొనిరి. వెంటనే సింగరేణిలో 1921 నుండి 23 వరకు అనగా 2 సం॥లు ఆకుకోయుటకు కంట్రాక్టు తీసుకొనిరి. ఈ కంట్రాక్టులో అన్ని ఖర్చులు పోను వీరికి రు 1000/- లు లాభించెను. పిమ్మట భద్రాచలంవెళ్లి అక్కడ పాలవంచ సంస్థానమునకు చెందిన చింతగూడెంవద్ద 10 సంవత్సరములకు అప్పర్ గోదావరీ ఫారెస్టులో తునికాకు కోసుకొనుటకు కంట్రాక్టును వేలంలో పాడివేసిరి. కలిమిలేములు కావడికుండలు. కాంట్రాక్టు ప్రథమ సంవత్సరంలోనే అనగా 1923 సంవత్సరంలోనే వీరు కోయించిన ఆకంతయు గోదావరి వరదల కారణంగా గంగపాలై బంగాళాఖాతం చేరెను. వీరు పెట్టిన పెట్టుబడి మొత్తం 8000 రూపాయిలు నష్టమైపోయెను. పైగా, సేట్ బీడీ కంపెనీవార్కి (Sait Beedi Co.) వీరు రు 50000 లు బాకీపడిపోయిరి. ఇది యిట్లుండగా గోరుచుట్టుపై రోకలిపోటన్న రీతిగా పాలవంచ జమీందారువద్ద జరిగిన వేలంలో పాటపాడుకొన్న ముల్లా నూరు మహ్మద్ అనే ఆసామీ, వీరు కంట్రాక్టుచేసిన భాగంలోని చెట్ల ఆకు (రమారమి 15, 20 వేల రూపాయిల కిమ్మతుగల ఆకు)ను తన మనుష్యులచే అక్రమంగా కోయించివేసెను. తన స్వంత ఆకుతో కలిపివేసికొని మొత్తం రు 40000/- లు కిమ్మతుగల ఆకును అతడు ఒకచో నిల్వచేసెను. ఇందుకు తగిన ప్రాయశ్చిత్తం ప్రభుత్వమువారిచేతనే జరిపింతునని శ్రీవారు శపథము చేసిరి, మదరాసుపోయి ప్లీడర్ల సలహాను పొంది తగుచర్య జరుపవలసియుండెను. శ్రీవారివద్ద ప్రయాణపు

ఖర్చులకైన సొమ్ము లేకుండెను. ఉన్న సొమ్ము బెజవాడవరకు వెళ్లుటకు సరిపోయెను. బెజవాడలో శ్రీవారి చెవులకున్న కమలములు తీసి 15 రూ॥లకు తాకట్టుపెట్టి అటనుండి మదరాసు పోయిరి. అచ్చట సేట్ బీడీ కంపెనీలోనే మరి రు 2000/- లు అప్పు తీసుకొని కార్యరంగమున ప్రవేశించిరి. ముల్లా నూరు మహమ్మద్‌పై టెలిగ్రాము నోటీసులు జారీచేయించి తగుచర్యలు తీసుకొనిరి. చివరకు నూరుమహమ్మద్ తాలూకు ఆకు అంతయూ ప్రభుత్వంవారిచే వేలం వేయించిరి. రు 40000/- ల కిమ్మతు ఆకు రు 2000/- లకు తామే పాటలోపాడి ఆకు అంతయూ స్వాధీనంచేసుకొని 70 వేగన్ల ఆకు ఎగుమతిచేసి సేట్ బీడీ కంపెనీవారి ఋణమంతయూ తీర్చివేసిరి. అంతేకాకుండా నూరు మహమ్మద్‌నుండి నష్టపరిహారముక్రింద రు 1500/- లు వసూలు చేసిరి. తలపెట్టిన కార్యము పరిసమాప్తి చెందువరకు ఎట్టి కష్ట నష్టములకోర్చియైనను కార్యమును సాధించవలెనను సంకల్పము, అందుకు తగిన ఆత్మవిశ్వాసము, కార్యదీక్ష మున్నగు శ్రీవారి సద్గుణములు శ్రీవారి జీవితములో పలుసార్లు బుజువైనవి. అట్టి వానిలో నూర్ మహమ్మద్‌ను సాధించిన ఘట్టమొకటి. ఈ పరిస్థితు లలో యితరులెవరైననైనచో దివాళాపత్రము దాఖలుచేసుకొని అవమానముపాలై యుండెడివారే.

శా॥ ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాస సంత్రస్తులై
ఆరంభించి పరిత్యజింతు రురువిఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్ననిహన్యమానులగుచున్ ధృత్యున్నతో
త్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగించరుసుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్॥

స్ఫురించెను. పై వుత్తరీయములో బియ్యము మూటగట్టి, కొండ వాగులో బాగా తడిపి, వాగు ప్రక్కనే చెమ్మయిసుకలో చిన్న గోయి త్రవ్వి అందామూటను యిసుకతో పూడ్చి, పైన కొంత యిసుక పోగుపెట్టి, ఆపైన యిన్ని యెండు ఆకులు అలములు కుప్పపోసి ఆ కుప్పకు నిప్పంటించిరి. కొంత తడవగుసరికి పైనున్న వేడిమివల్లనూ, వాగు చెమర్చిన నీటివల్లనూ ఆ బియ్యము పచనముకాగా దానిని తీసుకొని ఉప్పు కలుపుకొని "తదన్నం తద్రసం" భుజించి, తృప్తిపడి, సాయంత్రమునకెట్లో గమ్యస్థానము చేరుకోగల్గిరి.

ఒకనాటిరాత్రి బంగారుచెలక అను ఘోరారణ్య మధ్య మందలి గ్రామంలో, యీ గురుశిష్యులిద్దరూ చెరియొక నులక మంచంపైన మేనువాల్చి, అలవాటు ప్రకారం సుషుప్తిలో నిమగ్నులగుటకు పూర్వం వేదాంత విచారణలో నిమగ్నులై యుండగా అర్ధరాత్రి దాటిపోయెను. కాని విచారణయున్నూ, చర్చలున్నూ జరుగుచునేయుండెను. ఆ సమయమున పెద్దపులుల జంట (ఆడది, మొగది) యొకటి వీరి మంచములప్రక్కనుండియే వచ్చి, కొలదిదూరములో వీరు నిల్వయుంచుకొన్న కుండలలోని నీరుత్రాగి, తిరిగి వచ్చినదారినే వెడలిపోయెను. సమష్టి ప్రేమ తత్వ స్వరూపులగు మహా ఋష్యాదుల ఆశ్రమములలో క్రూర జంతువులు సహితం సాధుమార్గం అవలంబిస్తాయన్న విషయం యీ అచల ఋషి పుంగవుల చరిత్రలో యీ విధంగా ఋజువయ్యెను.

ఆ పిమ్మట కొంతకాలమునకు (శ్రీ) హనుమంత రాజ యోగీంద్రులు, సింగరేణి కాలియరీస్ వెళ్లవలసివచ్చి వెడలి

పోయిరి. శ్రీవారొక్కరే కొంతకాలముండవలసివచ్చెను. ఈ కాలంలో శ్రీవారొక పర్యాయము దుమ్ముగూడెంనుంచి బంగారుచెలకగ్రామం బండిమీద ప్రయాణము చేయుచుండిరి. కటికచీకట్లు నలుదెసల నలముకొనెను. శ్రీవారి బండి కొండ నుకువు తిర్గీతిర్గుటలో పెద్దపులి గాండ్రుమంటూ కట్టెదుట ప్రత్యక్షమాయెను. బుడెద్దు బెదరుటచే బండి బోల్తాకొట్టెను. ఎద్దు కట్లుతెంచుకొని యెటో పారిపోయెను. క్రిందపడుటలో శ్రీవార్కి మెడమీద బలమైన దెబ్బతగులుటచే స్మృహతప్పి పోయెను. బండివాడేమిచేయుటకు తోచక ప్రక్కనే నిలబడి చూచుచుండెను. శ్రీవార్కి కొంతతడవైనపిదపగాని స్మృహ తిర్గి రాలేదు. బండివాడు ఎడ్లను వెదకి తీసుకొనివచ్చెను. కాని ప్రయాణము సాగించుటకు ముందుగా బండిని లేవదీయు సమస్య యెదురయ్యెను. విజనారణ్యము, గాఢాంధకారము, యితర సాహాయ్యము తెల్లవారువరకు లభ్యంకాదు. శ్రీవారొక యుపాయమాలోచించి, బండివానితో కలసి పెద్ద రాళ్ళను మోసితెచ్చి, బండిచక్రముక్రింద ఒకదానిపై నొకటి పేర్చుచు యెట్లో కష్టపడి బండిని లేవదీసిరి. అప్పటికప్పుడే రాత్రి 9 గంట లాయెను. బంగారుచెలకగ్రామం చేరుసరికి రాత్రి 2 గంట లాయెను. ఆ కటికచీకటిలో వీరెట్లు రాగల్గిరోయని గ్రామస్తు లాశ్చర్యపడిరి. వన్యమృగములతో, పాములతో శ్రీవారికి తటస్థిం చిన భయంకర సంఘటనలెన్నియో గలవు. ప్రతి సంఘటన యందునూ, శ్రీవారి ధైర్య సాహసములు, సద్గురు కృపా విశేషము శ్రీవారి కంగరక్షగా నుండుటవల్లనే యీ ఘోరా రణ్య సీమలలో శ్రీవారట్టి విజయపరంపరల సాధించగల్గిరి.

వన్యమృగ, వృశ్చిక సర్పాదికమగు, అది భౌతిక రూప మగు సంతాపములు కలుగకుండా శ్రీవారు యెట్లో జాగ్రత పడుచూ వచ్చిరి. కాని పరోక్షముగా బాధలు గల్గించు మరొక అపాయమునుండి వీరు రక్షించుకొనవలసియుండెను. అది ఏదనగా కోయజాతులవారి సుప్రసిద్ధ మంత్రౌషధీ ప్రయోగ చాతుర్యము. ఏ స్వల్ప కారణముండిననూ, మంత్రము లనో, విషమూలికలనో ప్రయోగించి తోడి మానవులకు ఈ కోయవాండ్లు భయో త్పాతము కల్గింతురు.

వరరామచంద్రపురం సమీపమున గోదావరీనది కుపనది యగు శబరీ నదీతీరమున చెప్పెల్లి అనే గ్రామమొకటుండెను. అందు శ్రీవారు వ్యాపారముచేయు కళ్ళమొకటి యుండెను. ఆ ప్రాంతములో, పెరికీలు అను కులమునకు చెందినవారెక్కు వగా నుండిరి. వారిలో దుర్మార్గుడగు మంత్రగాడొకడుండెను. వాడేవో క్షుద్రమంత్రముల నేర్చి ఆ ప్రాంతపు ప్రజలకెల్ల భయోత్పాతము కల్గించుచూ రావణాసురునివలె లోకకంటకుడై యుండెను. నరమాంసమంటే వానికి ప్రీతి, శిశువులను చంపి తినేవాడట. ఆ ప్రాంతపు ప్రజలకు వేసవి కాలములో తిండి దొరకక కేవలం మాంసం మాత్రమే తిని, కల్లుత్రావి కాలక్షేపం చేసేవారు. వారందరు పూర్తిగా యీ మంత్రిగాని చెప్పు చేత లలో నుండేవారు. శ్రీవార్కి బీడీ ఆకు కోయించుటకు కూలీలు అవసరం. అందుకై ఆ మంత్రగానికి కొన్ని జొన్నలు బహు మతిగా నిచ్చి కూలీలను కుదిర్చిపెట్టుమనిరి. వాడందు కంగీక రించి కూలీలను ఏర్పాటుచేసి తన భార్యనుకూడా కూలిచేయు టకు పంపెను. కాని ఆమె అందరితోపాటు పనిచేయక సోమరి

తనంగా కూర్చొని కూలిమాత్రం పూర్తిగా యిమ్మనమని తగూలాడెను. శ్రీవారు పనిచేయనిదానికి కూలి యివ్వను అని కూలి యిచ్చుటకు నిరాకరించిరి. ఆమెపోయి భర్త అయిన మంత్రిగానితో ఫిర్యాదుచేయగా ఎవ్వరినీ పనిలోనికి పోవద్దని వాడు శాసించి సమ్మె కట్టించెను. ఆదిలో జరిగిన ఏర్పాటు ప్రకారం కూలీలను పంపుటకై బాధ్యతవహించియూ యిప్పుడిట్టి కట్టడి చేయకూడదని శ్రీవారు తగూపెట్టిరి. ఆ తగూ ముదిరి పోయెను. ఆ దుష్టునికి బుద్ధిచెప్పక తప్పదని శ్రీవారు తమ కాలిచెప్పు తీసుకొని వాని చెంపలు వాయించిరి. కాని వాడెట్టి క్షుద్ర మంత్రములు ప్రయోగించునోయని, వాడి పళ్లూడి పోయినచో వాని మంత్రములు పట్టివ్వవుగదాయని, అదివరకే యిట్టి సందర్భంలో అవసరపడునని సిద్ధపరచిన పోకచెక్కలు చూర్ణంచేసి నీటిలో కలిపి వాని నోటిలో బలవంతంగా పోసిరి. ఆ పోకలు కొండొక మూలికారసములో నానవేసి పిమ్మట యెండబెట్టి యుంచినవి. దానితో వాని నోటిలోని అన్ని దంతములు సమూలంగా నూడిపోయెను. శ్రీవారిచే చెప్పుదెబ్బలు తిని పళ్లూడిపోయి, పదిమందిలో అవమానముపొంది యింటికేగిన ఆ మంత్రగానికి తీవ్రజ్వర మంకురించి పడిపోయెను. దానితో వాని భార్యాబిడ్డలు గోలుగోలున ఏడ్చుచూ శ్రీవారి పాదాలపైబడి రక్షింపవలసినదిగ ప్రార్థించిరి. శ్రీవారు దయానంద సార్థకబిరుదాంకితులు కనుక కొంత విభూతిని తెప్పించి మంత్రించి యిచ్చి, వాని శరీరమంతటా చల్లించగా కొద్దిసేపటిలో జ్వరము దిగిపోయెను. నాటినుండియూ శ్రీవారు గొప్ప మంత్రవేత్తలనీ, తన మంత్ర మహిమలచే పెరికీల మంత్రగాడి నోడించి జయించెననియూ, ఆ ప్రాంతం అంతటా దుమ్ముగూడెంవరకూ పెద్ద పేరు వచ్చెను.

పరిపూర్ణబోధ సిద్ధాంతంకూడా తెలుసుకొని విశేషకృషి చేయుచున్న శ్రీవారివంటి మహనీయులు యిట్టి ప్రతీకార దూషమైన వ్యవహారములు చేయుట వారి ఆచరణ విధానము నకు, సంపాదించిన అరూఢస్థితికి భంగముకాదా? ఇట్టి ప్రతీకార వాంఛ యుండతగునా? అని సందేహం కలుగవచ్చును. ఈ సందర్భంలో శ్రీ శివరామ దీక్షితులవారి యీ క్రింది వచనములు గమనార్హములు. "కొట్టితే కొట్టక, తిట్టితే తిట్టక యుండునట్టి పెద్దలు యుక్తిలేనివారు. దుర్మార్గులవలన అతి బాధలు పొందుదురు. ఒకటి కొట్టితే, పది కొట్టేవారు; ఒకటి తిట్టితే పది తిట్టేవారు ... యుక్తికలవారు, దుర్మార్గులచే బాధపడనివారు." మరియు, అంతఃకరణమందు రాగ ద్వేష ములు లేకనే అవసరానుసారం బాహ్యమునందు ప్రాపంచి కులవలె వర్తించుటయు, ఏతత్సూభా శుభ సంస్కారములకు అంతః కరణయందు తావివ్వకపోవుటయు, రాజయోగపద్ధతి నెరింగిన వారికి బహు సులభమని పాఠకులు గుర్తించుకొన్న చాలు.

ఆ ప్రాంతములలో తిరువెంగళయ్య అను మరొక మంత్రి గాడుండెను. శ్రీవారివలన తనకెట్టి పరాభవము, అవమానము జరుగునోయని అతడు పూరక భయపడసాగెను. శ్రీవారి స్నేహ లాభము ఏ విధముగానైనా సంపాదింపవలెనని యాతడు యత్నించుచుండెను. వ్యాపార సందర్భంలో శ్రీవారికి సొమ్ము అవసరమై యుండెనని గ్రహించి, అతడు భూమిలో పాతి జాగ్రత్తపెట్టుకొని యుండిన సంపాదనబాపతు ద్రవ్యము రు 600/- లు శ్రీవారి కప్పుగా సమర్పించి యిక శ్రీవారి వలన తనకెట్టి భయమును వుండజాలదని శాంతిపొందెను. ఆ సొమ్ముతో శ్రీవారు తమ ఋణశేషము నిశ్శేషముగా తీర్చివైచిరి.

ఈ విధంగా తిరువెంగళయ్యతో ఏర్పడిన స్నేహము శ్రీవారికి చాల లాభదాయకమయ్యెను. వానివద్ద ధనుర్విద్య, ఓషధీ విశేషములనున్ను కొన్ని మంత్రములనున్ను శ్రీవారు తెలుసుకొనుటకు సావకాశమేర్పడెను. ఒకానొక వేరును త్రవ్వి దానితో 108 పూసలు తయారుచేయించి, అవి జపమాలగా గ్రుచ్చి జపమొనర్చిన యెడల ఎవరెట్టి ప్రయోగములు చేసినా అది నిర్వీర్యమైపోవుటయేగాక ప్రయోగం చేసినవాన్కి కీడు వాటిల్లునట. ప్రయోగం నిజంగా జరిగియుంటే యీ 108 పూసలలో ఒక పూస పగులును. ఆ పగిలిన పూస కాల్చి నుసి చేసినచో ఆ ప్రయోగం చేసినవాడు మరణించునట. ఇట్టి మంత్రశాస్త్ర రహస్యము లెన్నియో తిరువెంగళయ్యగారివద్ద నుండి శ్రీవారు నేర్చిరి. అదృష్టవశాత్తు ఆ మంత్రము లుపయోగించు నవసరం యెన్నడూ శ్రీవార్కి గలుగలేదు.

శ్రీవారి జీవితమున మరల నొక పుణ్యావిశేషము ఫల ప్రాప్తి నొందు దివ్యతరుణము వచ్చెను శ్రీవారి గురుభక్తి, సేవానిరతి, అఖండ మేధాసంపత్తి, పరిపూర్ణబోధ యందలి ఆరూఢతా, గమనించి శ్రీహనుమంత రాజయోగీంద్రులు శ్రీవారికి ది 20-10-1931 వ తేదీని శుభముహూర్తమున దయానందయను దీక్షానామమిడి బోధాధికారిగా నియమించి బోధాధికారపత్రిక వ్రాసియిచ్చిరి. 'స్వయంతీర్ణః పరాంతారయతి' అనే న్యాయంగా బోధయందారూఢత గాంచినవారగుటచే బోధాధికారము స్వీకరించుటకు సంపూర్ణార్హత గల్గియుండిరి.

చైత్ర వైశాఖమాసములలో మాత్రమే వీర్కి బీడీ ఆకు వ్యాపార సంబంధమగు పనులుండేవి. మిగతా 10 నెలలు

విశ్రాంతియే. భద్రాచలంలోనే 1932 సం॥ వరకు గురు శిష్యు లుభయులు కాపురముండేవారు. హనుమంత రాజయోగిగారికి యిర్వురు భార్యలు, యిద్దరు పిల్లలు. శ్రీవారున్నూ వారి సతీమణియున్నూ గురువుగారి కుటుంబంతో కలసి పొడుగునా ఏకకుటుంబంగానే యుంటూయుండిరి. 1932 నాటికి ఋణము లన్నియు తీరిపోగా 2, 3 వేల రూపాయిల రొఖనిల్వ తేలెను. శ్రీ హనుమంత రాజయోగీంద్రులవారి గురువులగు శ్రీ సచ్చిదానంద వెంకటేశ్వరావధూతగారు ప్రతి సంవత్సరం వచ్చి 4, 5 మాసములు వీరితో నుంటూవుండిరి. అహో ఏమి వైభవము!! బ్రహ్మ విష్ణు మహేశ్వరు లొకచో చేరినట్లుండెడిదట. ఇక వేదాంతచర్చలతో అహర్నిశలు మారుమ్రోగిపోవుచుండుటలో ఆశ్చర్యమేమి. శ్రీవారి మేధాశక్తికి ముగ్ధులై శ్రీ వెంకటేశ్వరావధూత స్వాములవారాదినుండియు శ్రీవారియందెంత యో వాత్సల్యముగల్గి జటిలములగు వేదాంత విషయములగూర్చి వీరితో వినోదముగ చర్చలు గావించుచుండిరి. పితృసములగు అవధూతస్వాములవారితో హనుమంత రాజయోగిగారికి సహజముగ భయభక్తులుండెడివి. కాని శ్రీవారికట్టి భయమేలేదు. పైగా తాతగారితో తాతా మనుమలవరుస కనుక నిర్భీతిగా ఎదుర్కొని వాదించుచుండిరి. యీ విధముగా శ్రీవారికి అమోఘమగు తర్కనైపుణి అలవడెను.

1932 సం॥ తో తునికాకు కంట్రాక్టుకాలము పరిసమాప్తి చెందెను. హనుమంత రాజయోగిగారు కుటుంబసహితముగా ఖమ్మంమెట్టు వెడలిపోయిరి. శ్రీవారు సతీసమేతంగా సికింద్రాబాదునకు చేరిరి.

శ్రీ సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

చతుర్థ ప్రకరణము.

శ్రీవారు 1927 సంవత్సరము డిశెంబరునెలలో మద్రాసు పోయివుండిరి. ఒక వీధి వెంబడి శ్రీవారు పోవుచుండగా శ్రీ భాగవతుల కృష్ణదాసుగారి కందార్ధమొకటి యిర్వురుగూడ విచారించుచుండిరి. వీరెవరో దీక్షితీయ సాంప్రదాయకులవలె నున్నారు తెలిసికొందామని శ్రీవార్కి కుతూహలము జనించెను. అందుపై శ్రీవారు కలుగజేసుకొని ఆ కందార్థముయొక్క నిజాభిప్రాయం సాంప్రదాయకానుసారము వివరించి బోధించిరి. దానిపై ఆ నూతనవ్యక్తు లిర్వురూ చాలా ఆనందపడి శ్రీవారి నామధేయము యెడ్రసు తెలసికొని వారి గుర్వులగు పోకల నర్సింహ్వారావుగారి వద్దకు తీసుకొనిపోయిరి. యీ పోకల నర్సింహ్వారావుగారి తండ్రి శ్రీ పోకల శేషాచలంగారు. యీ పోకలవారి సాంప్రదాయమునకు ఈ శేషాచలంగారే ప్రవర్తకుడు. ఈ శేషాచలంగారు యీ పరిపూర్ణబోధ సిద్ధాంతమును గురుసేవచేసి గురుముఖతః సాంప్రదాయక రహస్యములను తెలసికొన్నట్లు తోచదు. శ్రీ శేషాచలంగారు యోగసాధనలయందు కృషిచేసినవారై యుండిరి. జన్మరాహిత్యమునకు యోగమార్గము సాధనముగాదని వారికేతోచి జ్ఞానమార్గమున కృషి చేయుచూ దీక్షితీయసాంప్రదాయక ప్రబోధ ముత్తమముగా తోచుటచే లభ్యమగు గ్రంధపఠనమువల్ల యీ పరిపూర్ణబోధను

గ్రహించి యుండవలెను, వీరి కుమారులున్ను ప్రథమశిష్యులును అగు వెంకటనర్సింహ్వారావుగారు కవులు. ఆశుకవి బిరుదాంకితులు. పోకల శేషాచలంగారు భాగవతుల కృష్ణదేశికేంద్రులు రచించిన శక్తిద్వయ నిరాసకంబైన శుద్ధనిర్గుణతత్వ కందార్ధదరువులున్ను శరాశరోపాధిద్వయ దోషరహిత పరమతత్వ కంద పద్యములను చదివి, అందలి సాంప్రదాయకార్ధము తెలియనివారగుటచే, తమ యిచ్చవచ్చినట్లు మూలమునుమార్చి ఆ మార్పులతో చేర్పులతో గ్రంథ మచ్చువేయించిరి. ఇది నిజముగా ఎంతసాహసము! మూలం తన కర్ధంకాకపోతే అర్ధమయినవారి నడిగి తెలిసికొనవలెనుగాని, తన యూహకు సరిపడు నర్ధమిచ్చు నట్లుగా సవరించుట అన్యాయముగదా! తాను కట్టుకొన్న టోపీ తనతలకు సరిపడకపోతే యీ దోషము టోపీదా? లేక తన తలదా? తలదే యీ దోషమనుకొని టోపీకి సరిపడునట్లుగా తన తలను మార్చుకొనుటవంటిది కాదా? వారుచేసిన రెండు సవరణలు మాత్రమిట నుదహరింతును. ఎంత సమంజసములో పాఠకులే గుర్తింతురుగాక.

(1) కందార్ధము :-

పుట్టుట గిట్టుటలేకను, పుట్టే గిట్టేటిరొంబుక పోడిమెరుగన్,
చట్టువలె కదలకుండును, బట్టబయలిట్టి దెఱిగిభావింపదగునూ॥
ఎరుకలేక సేవింపదగునూ॥.

"ఎరుకలేక సేవింపదగును." అన్న దానిని ఎరుకచేత సేవింపదగును అని మార్చిరి. ఎరుకేలేకుంటే సేవించేదెట్లాగు? అని వారి సమర్ధన. కాని "ఎరుకా యెరిగిన వస్తువెరుకాని యెరుగుము" అన్న కందార్ధవచనమున్ను "ఎరుకేలేదు తోచేదెంకేమి"?

అన్న మాటలున్ను "లేదనకు మున్నదదిగో, నే దెలిసితిననకు దాన్ని నీ వెఱిగేవా? కాదది నీచే తెలియను..." అన్న వాక్యమును పరిశీలించినచో, వీరుచేసిన మార్పు ఎంత సాంప్రదాయ విరుద్ధమో తేటతెల్లము కాగలదు. ఎరుక లేక సేవింపదగును అన్న విషయం అర్థం కావాలంటే ఎరుక రాహిత్యస్థితిని ఆరూఢపరచుకొన్న వారికే గోచరమగును. లేనిచో యెన్నటికీ అర్థమే కాదు.

(2) కందపద్యము :- నాబోతు రుచికి రుచినికు......అన్న కందపద్యంలో "నాబోతు" అనుమాట వారికర్థం కాలేదు కాబోలు ఆమాటస్థానే నాబోధ అని మార్పుచేసారు. "నాబోతు" అనే అచ్చతెనుగుమాట తెలంగాణాయందు ప్రచారంలోయున్నదనీ, కలకండ లేక పటిక బెల్లం అని దానికర్థమనీ, వార్కి పాపం తెలియదు. అందుచే యీమార్పు చేసారు. యీ మార్పు ఎంత సమంజసమో పాఠకులు గుర్తించగలరు.

పోకలవార్కి యీ పరిపూర్ణబోధ శివరామదీక్షితులవారి నుండి పరంపరగా ప్రాప్తించకపోవుట కారణంగా సాంప్రదాయ కార్థమెరుగక తమ యిచ్చవచ్చినరీతిగా పీఠగ్రంథములు సవరించుట జరిగెనని శ్రీవారు సూచించుచూ పోకలవారిని విమర్శించుట జరిగెను. శ్రీవారితో నర్సింహారావుగారు చర్చలు సాగించిరి. అ పిదప "ఎరుకలేక సేవింపదగునని కొందరు చెప్తారు. అది కూడ సమంజసమే" అని పాఠాంతరముచేర్చి నర్సింహ్వారావుగారు తదుపరి గ్రంథము సవరించి అచ్చువేయించిరి. శ్రీవారి వాదమును విన్న పెక్కుమంది పోకలవారి సాంప్రదాయభక్తులు శ్రీవారిని బహువిధములుగా శ్లాఘించుటయేగాక నిజసాంప్రదా

యక ప్రబోధము గావించి తమ్ము ధన్యులను గావించుడని శ్రీవారిని నాశ్రయించిరి. వారిలో సావల పెదముత్తుస్వామిశెట్టి, సావల చినముత్తుసామిశెట్టి అనువారలు ముఖ్యులు. తమకు బోధాధికారమే అప్పటికి లేదనిన్ని తాను గురువును కాననిన్ని శ్రీవారు తప్పించుకొనజూచిరి గాని బోధాధికారమును గ్రహింపబడిన పిదపనే ధర్మోపదేశము గావించవచ్చునని, అంతవరకు మద్రాసువచ్చి దర్శనమిస్తూ బోధను అనుగ్రహిస్తూ వుండవలసిందనిన్ని శ్రీవారిని వారు పట్టుబట్టిరి. అప్పటికి శ్రీవారికి 29 సంవత్సరములు మాత్రమే. శ్రీవారు సాధించిన ఆధ్యాత్మిక విజయపరంపరలో యిదియె ప్రప్రథమ విజయమనజెల్లును. 1931 సం॥లో శ్రీవారికి బోదాధికారము అనుగ్రహింపబడిన పిదప శ్రీవారు మదరాసువెళ్ళిన సందర్భంలో శ్రీవారు సావల ముత్తుసామిశెట్టి సోదరులకున్ను, మునియమ్మ అనేవారికిన్ని యథావిధిగా ధర్మోపదేశము చేసిరి. వీరే శ్రీవారికి ప్రథమ శిష్యులు.

ఇటీవల శ్రీ పోకల వెంకటనర్సింహేశ్వరావుగారి శిష్యులగు శ్రీ కంచి వేంకటరామనగారు "అతీత మహామంత్రత్రయ భాష్యమంటూ" ఒక గ్రంథము వ్రాసిరి. ఈ వెంకటరామనగారు, అచల బోధాచార్య అను బిరుదు ధరించినవారు. కాని సాంప్రదాయకార్థ మెరుగకనే పరిపూర్ణబోధ సిద్ధాంతవాక్యములకు వ్యాఖ్యానమొనర్పబూనుకొనుటచే వారి గ్రంథము పెద్దలయాదరణను పొందలేదు సరిగదా, యిదే నిజ సాంప్రదాయక ప్రబోధయేమోనని లోకులనుకొనుటవల్ల నిజసాంప్రదాయక ప్రబోధమునకు కీడు వాటిల్లెను.

శ్రీ సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

పంచమ ప్రకరణము.

శ్రీవారు సికింద్రాబాద్ చేరినపిమ్మట జీవనోపాధి నిమిత్తం ఏ వ్యాపారం ప్రారంభించవలయునా అని యోచించుచుండిరి. వీరేనిర్ణయమును చేయుటకుపూర్వమే ఆ గ్రామస్థులు వీరికొక వృత్తిని అనుకోకుండానే కల్పించిరి. ఎట్లనగా:- వీరి వ్యాపారానుభవము, ముల్లానూరు మహమ్మద్‌ను కోర్టుద్వారా సాధించి తగు ప్రాయశ్చిత్తము చేయించుట కర్ణాకర్ణిగావిన్న శికింద్రాపురవాస్తవ్యులు అగు వ్యాపారస్థులు వారి వ్యాపార విషయములలోనూ, వారిలోవార్కి తటస్థించిన తగవులలోనూ శ్రీవారి సలహా సంప్రతింపులు తీసికొనుచుండుటయు శ్రీవారు సూచించిన మధ్యవర్తి పరిష్కారము నంగీకరించి తగవులను పరిష్కరించుకొనుటయు ప్రారంభించిరి. తెలంగాణా ఆంధ్రులు బహుసౌమ్యులు. నాట్కి విశేషవిద్యావంతులునూకారు. న్యాయ బుద్ధి ఋజువర్తనము గలవారు. కోర్టుకెక్కుటయన్న యెక్కువ భయపడువారు. కోర్టువ్యాపారం తటస్థిస్తే శ్రీవారి సలహాను పాటించి యుభయకక్షిదార్లు రాజీచేసుకొనెడివారు. రాజీ కుదరనిపట్ల ఎవరోవకరు వీరిని ఆశ్రయించి వీరిద్వారా కోర్టువ్యవహారము చేయించుకొనెడివారు. ప్రతిఫలంగా వారిచ్చిన సొమ్ముతో తృప్తిపడి శ్రీవారు వారి కార్యములు జరిపించుచున్నప్పట్కి 2, 8 సంవత్సరములలోనే శ్రీవారు 25000/- లు ఆర్జించగల్గిరి.

ఖమ్మంమెట్టుచేరిన 6 మాసములకే హనుమంతరావు రాజయోగీంద్రులకు శరీరములో వ్యాధి అంకురించెను. గుండెలలో నొప్పిచే బాధపడుచుండిరి. కన్న కుమారునికంటె ప్రేమాస్పదుడై యున్న శ్రీవారి యింట సపర్యలు పొందుతూ శేషజీవితం గడపివేయు తలంపుతో హనుమంత రాజయోగిగారు కుటుంబ సహితంగా ఖమ్మంమెట్టు వదలి శికింద్రాబాదులోని శ్రీవారింటికి వచ్చివేసిరి, శ్రీవారు గురుదేవులకు తగు చికిత్సచేయిస్తూ, సమస్తోపచారములు చేస్తూ వుండుటయేగాక, గురువుగారి కుటుంబమునకు ఏవిధమైనలోపమున్నూ గలుగకుండా పోషించుచుండిరి. కన్నతండ్రిని చిన్ననాటనే గోల్పోయిన శ్రీవారు గురువుగారిని పితృభక్తితో సేవించుచూ పితౄణము తీర్చుకొనుచున్నట్లు భావించిరి. హనుమంత రాజయోగిగారు శ్రీవారిని ఔరసపుత్రునివలెనే ఆదినుండియు ప్రేమించుచుండిరి. యీ గురుశిష్యుల ప్రేమ హనుమంతరాజయోగిగారు మంచమెక్కిన దాదిగా పరాకాష్ఠచెందిపోయెను. సాందీపుడే గురువు, శ్రీకృష్ణుడే శిష్యుడు, అని ఆదర్శ గురుశిష్యులను పేర్కొనునట్లు నుదహరింతురు. వారిసంగతి ఏమోగాని యీ గురుశిష్యులవంటి ఆదర్శ పురుషులను ఈ యుగమున ఎక్కువమందిని గానలేము.

1933 సంవత్సరంలో శ్రీ హనుమంతరాజయోగిగారు తమ గురువర్యులైన శ్రీ అవధూతస్వాములవారి ఆదేశానుసారం శ్రీవారియింటనే శ్రీ శివరామదీక్షిత అచల గురుపీఠమును స్థాపించి, గురుయంత్రప్రతిష్ఠ గావించిరి. నాటినుండియు మందిరములో నిత్యధూపదీపనైవేద్యాదికములు, భజన కాలక్షేపములు వేదాంత విచారణయు జరుగుచున్నవి.

1934 సం॥లో శ్రీ హనుమంతరాజయోగీంద్రులు బ్రహ్మైక్యము జెందిరి. ఆయన ద్వితీయకళత్రమైన నాగమ్మగారి కేవిధమగు జీవనోపాధియు లేకపోయెను. శ్రీవారామెను తమ యింటనే వుంచుకొని తల్లి అయిన మల్లమాంబగారితోపాటే పూజించుచూ ఆమె బ్రహ్మైక్యము చెందువరకు ఆమె జీవన భారమును తామే వహించిరి.

హనుమంతరాజయోగీంద్రులవారి నిర్యాణముతో పీఠ ధర్మము యథావిధిగా జరిపించుటకును, పీఠగ్రంథములు ముద్రింపించుట వగైరా కార్యనిర్వహణకును స్థానికముగ పీఠాధికారిలేకపోయెను. శ్రీ సచ్చిదానంద వెంకటేశ్వరావధూత గారు, నిత్య సంచారములోనుంటూ కార్యనిర్వహణ జరిపించజాలక పోవుటచే, ది 17–5–35 తేదీని శ్రీవారికి పట్టాభిషేకముగావించి పీఠాధికారమొసంగి పీఠాధికారశాసనము రాగిరేకుపై వ్రాయించి యిచ్చిరి. సాంప్రదాయక ముద్రితాముద్రిత గ్రంథములు శ్రీవారికిచ్చివేసి వాని ముద్రణ పునర్ముద్రణాదికములు జరిగిస్తూ ప్రచారములోనికి తెమ్మని నాదేశించిరి. నాటినుండియు శ్రీవారు శ్రీమద్రామదుగు శివరామ దీక్షితాచల గురుపీఠమునకు అధ్యక్షస్వామియై పీఠమును పాలించుచున్నారు.

శ్రీ హనుమంతరాజయోగిగారి ఆరాధనా కార్యక్రమము వరుసగా ప్రతి సంవత్సరము శ్రీవారు జరిపించుచుండిరి. ఆరాధనా మహోత్సవమునకు శికింద్రాబాద్ వాస్తవ్యులు మాత్రమేగాక, ఆంధ్రావని నలుమూలలనుంచికూడ శిష్యప్రశిష్యులువచ్చి కార్యక్రమమునందు పాల్గొని తీర్థప్రసాదముల స్వీక

రించుచుండిరి. గురుపూజ, పూర్వాపరములయందు భజనకాలక్షేపము, వేదాంతవిచారణ జరుగుచుండెను. శ్రీ అవధూతస్వాములవారి అధ్యక్షతను బహిరంగసభయందు వేదాంతోపన్యాసములు గూడ గావింపబడుచుండెను. హనుమంతరాజయోగిగారి శిష్యులలో, శికింద్రాబాద్ పురవాస్తవ్యులలో అబ్బుగారి వీరయ్య, అరిగె రామస్వామిగార్లు ముఖ్యులు. వీరేగాక శ్రీ పిల్లానా లక్ష్మణరావుగారి శిష్యపరంపరలోనివారున్నూ, శ్రీ శివరామ దీక్షిత గురుపీఠ సాంప్రదాయకులగు తదితరులున్నూ యీ ఆరాధనా కార్యక్రమమునందు పాల్గొనుచుండిరి. ఈ కార్యక్రమములు మహోత్సాహపూర్వకముగా 1936 సంవత్సరం ఆరాధనానంతరమువరకు జరిగెను.

1937 సంవత్సరములో యావద్భారత సంపూర్ణయాత్ర గావించు స్పెషల్ ట్రెయిను బయలుదేరునని విని శ్రీవారు దేశాటనముచేయుటకిది తగిన ఆదనని కు టుం బ స హి త ం గా ప్రయాణమైరి. శ్రీకృష్ణా పూర్ణయాత్రా స్పెషల్ అను పేరుతో యీ బండి ది 22-8-37 వ తేదిని శ్రీవారినీ కుటుంబమును యెక్కించుకొని బైలుదేరెను. ఉత్తర దక్షిణదేశములయందలి అన్ని క్షేత్రములు, పుణ్యతీర్థములు, సుందర నదీపర్వతారణ్య పట్టణములు దర్శించుటకై తగు ప్రోగ్రాము ఏర్పాటుచేయబడెను. ఆసేతు హిమాచలపర్యంతముగల ఆయా దేశములయందలి ప్రజలు, వారి ఆచార విచారంబులు, అందందుగల మహాపురుషుల దర్శనములు, అన్నియు గమనించి అందువలన మానసిక వికాసము ఆత్మానందము పొందుటకు తీర్థయాత్రలు ముఖ్యము. ఏ దివ్యక్షేత్రమున ఏ పుణ్యపురుషుని అనుభవవాక్యములచే జ్ఞానో

దయము అగునోయని మన పూర్వీకులు తీర్థయాత్రాగమనము విధించిరి. శ్రీహరి కంతకుపూర్వ మెప్పుడో సర్వసంశయ రహిత మగు పరిపూర్ణ బోధ సమగ్రముగ సాంగోపాంగముగ లభించెను. ఐననూ అచల ఋషులుగూడ తీర్థయాత్రలను నిరసింపలేదు. పైగా కొంత ప్రయోజనముండగలదని యే భావించిరి. అందుకే శ్రీకృష్ణదేశికేంద్రులవారు, "దేశాటనంబు చేసితి, వ్రాసితి గ్రంథములు కొన్ని వరగురు శిష్యుల్ చేసేటి చర్య వింటిని రోసితి మోక్షాద్యపేక్ష" అని కందార్థములలో వ్రాసియున్నారు.

"రోసితి మోక్షాద్యపేక్ష" అన్నారే మిటి? మోక్షపేక్షకూడా నశ్వర పదార్థముల యందలి భ్రాంతితోపాటు, అన్ని అపేక్షలతోపాటు విడువవలసినదేనా? అని యిక్కడ సందేహము కలుగవచ్చును. అవును, విడువదగినదే. ఏలనన "కేవల మోక్షాపేక్ష సంకల్పోబంధః" అని నిరాలంబోపనిషత్తు చాటుచున్నది. బంధమోక్షములు రెండూ మిథ్యేనని అద్వైతాది మతస్థులున్ను అంగీకరించుచున్నారు.

మరిన్ని "ఇచ్చారాహిత్యంబునె స్వచ్ఛంబగు బోధయనుచు సజ్జనులనిరి" అనికూడా శ్రీకృష్ణదేశికేంద్రులవారు తాము రచించిన కందపద్యములలో వ్రాసియున్నారు. పరిపూర్ణబోధ సర్వభ్రాంతి రహితమైనది. బంధమోక్షములు రెండూ భ్రాంతియే. అట్టిభ్రాంతి రహితస్థితిని పొందిన శ్రీవారికీ యీ తీర్థయాత్రలవలన అట్టి భ్రాంతి రహితస్థితి మరింత దృఢతర మెట్లయ్యెనో యీ ప్రకరణములోనే పాఠకులు గుర్తింపగలరు,

ఈ యాత్రాసందర్భంలో శ్రీవారికి కాశీ దివ్యక్షేత్రమున, దిగంబరుడై ఒక మహాపురుషునిగా పరిగణింపబడుచుండు నొకవ్యక్తి గాన్పించెను. శ్రీవారా వ్యక్తితో మానవజన్మ కర్తవ్యమునుగూర్చి కొంతతడవు ముచ్చటించిరి. సన్యాసాశ్రమవిధానము, అందు ముఖ్యముగా దిగంబరుడైయుండుటయు పరమాత్మ సృష్టివిధానమునకు ఎట్లు విరుద్ధముగానున్నదియు, నిరూపించి దిగంబరస్వామిని సంతుష్టిపరచగలిరి. ఆయన తాను పూనిన ఆశ్రమవిధానమువలనే సర్వభ్రాంతి రహితము కాజాలదేతని చాల చింతాక్రాంతుడై తన యాజీవితము అట్లే పోవలెను, అని నిస్పృహచెందెను. శ్రీవారు జరిపించిన యీ గోష్టియందు మొదటినుండి తుదివరకు సమక్షమున శ్రద్ధాళువులై వినుచుండిన విశ్వేశ్వరశాస్త్రి, శివశంకరశాస్త్రి యనువారలిర్వురు శ్రీవారివలన అచల పరిపూర్ణధర్మము తెలసుకొని కృతార్థులైరి.

కాశీక్షేత్రమునకు శిష్యులతో యాత్రార్థమువచ్చియున "కేడ్ గాం" నివాసియగు నారాయణమహారాజ్ అను గురువర్యుడొకడు వచ్చి విడిసియుండెను. అయన యొక మహాపురుషుడని ప్రతీతి. "జన్మరహితపద్ధతి, యే ప్రబోధవలన గలుగగలదు?" అనే విషయముపై శ్రీవారాయనతో చర్చలు సాగించిరి. తుదకు పరిపూర్ణప్రబోధవలన- గాక అన్యబోధలవలన కాజాలదనే శ్రీవారి వాదమును నారాయణమహారాజ్ అంగీకరించి ఆనందపరవశుడై శ్రీవారి మార్గమే జన్మరహితపద్ధతికి చాల సూటిగానున్నదని, శ్రీవారివలన తెలుసుకొన్న విషయములు తన శిష్యులకు ప్రబోధ గావింపదొడగెను.

ఈ యాత్రాసందర్భంలో శ్రీవారు అయోధ్యానగరమునకుగూడ పోయియుండిరి. సరయూనదీతీరమున రామానందాశ్రమమనబడు నొక యాశ్రమమునందు 110 సంవత్సరముల వయస్సుగలవాడని కీర్తిగడించిన యొక వృద్ధసన్యాసిని శ్రీవారు కలుసుకొనుట తటస్థించెను. ఆయన పేరు రామదాసస్వామి. శ్రీవారాయనతో కొంతతడవు సంభాషించిరి. అనేకమంది యోగారూఢులను తాను దర్శించితిననియు, ఆ మహాపురుషుల దర్శనభాగ్యవిశేషంచేత తనకుగూడ యోగారూఢత సంప్రాప్తించెననియు తనకు అప్పటికి 110 సంవత్సరముల వయస్సనియు, తనకు దంతపంక్తి యంతయూ నూడిపోయెననియు, పూర్తిగా బోసినోరు అయిపోయెనన్నిన్ని, కాని యిటీవల నూవు గింజలవలె తిరిగి పలుపరుస మొలచుచున్నదనియు చెప్పి క్రొత్తగా మొలచుచుండిన పలువరుసను శ్రీవారికి చూపెను. మరిన్ని తన కనుబొమలు ఒదులై పైచర్మము క్రిందికి వ్రేళ్ళాడుచు దృష్టికి సంపూర్ణావరోధము కల్గించుచున్నదనియు, అట్లు జరుగుట తన అంతర్దృష్టికి సాహాయ్యభూతముగానుండి భ్రాంతిజనకములైన దృశ్యజగద్విషయములనుండి మనస్సు మరలించుకొని ఆత్మదృష్టిలో నిరంతరము ఆనందమనుభవించుచుంధుననియు, శ్రీవారితో ఆయన సాహంకారముగ చెప్పెను. బోసినోటిలో పళ్ళువచ్చుట, కొంతకాలమునకు వూడిపోయి తిరిగి వచ్చుట యీ శరీరమునకు సహజపద్ధతేగదా! అందు వింత యేమున్నదో? అని శ్రీవారడుగగా యిది సహజపద్ధతేయని ఆయన వప్పుకొనెను. బాల్యాది దశలలో క్రమవికాసరూపముగ పరిణతిచెంది యౌవనమున సంపూర్ణతచెంది బిగువుగానుండిన చర్మము, కండరములు యిత్యాదులు వృద్ధాప్యమున బిగువు

నడలి, వనులై పోయి చర్మము అస్థులుమాత్రము శేషించుటయు ఈ శరీరమునకు సహజమేగదా యని శ్రీవారు అనగా రామదాస స్వామి అందుకును వప్పుకొనెను. పోతే, ఇక కన్నులుకప్పబడుటచే బ్రహ్మేవలోకనము లోచూపుగా చూచుచుండునని చెప్పెదవు? యీ శరీరములో బ్రహ్మ మేస్థానమున నున్నదని శ్రీవారు పృచ్ఛించగా దేహమంతటా నున్నదని ఆయన జవాబుచెప్పెను. శ్రీవారిప్రశ్న:- అంతటానున్న (బ్రహ్మమును) నీవెటు తెలియ గలుగుచున్నావు? జవాబు:- కొండ అద్దమందు కొంచమై తోచినట్లుగా నా అంతఃకరుణమందు అఖండ బ్రహ్మదర్శనము చేస్తూవుంటాను.

శ్రీవారి ప్రశ్న :- అద్దము ఖండరూపము. కొండ ఎంత పెద్దదైననూ అదియునూ ఖండరూపమే. కనుక చిన్న అద్ద మందు పెద్దకొండ కానవగును. మరి నీవు ఖండరూపుడవు. నీ అంతఃకరుణమున్నూ ఖండరూపమే. అఖండస్వరూపమగు బ్రహ్మము నీ అంతఃకరణ కెట్లు గోచరించగలదు? జవాబు:- అది విచారించవలసిన విషయమేనని రామదాసస్వామి నిరుత్తరుడా యెను. శ్రీవారు:- పోనీ, ఆ అఖండ బ్రహ్మదర్శనము యెట్లో నేను వివరించెదను వినెదువా? జవాబు :- తెలసికొనుటకు నాకు మనస్థిమితములేదు. నా శిష్యులను తెలసికొమ్మని చెప్తాను, అని ఆయన మిన్నకుండెను. ఇది యోగరూఢత చిక్కిందని పొంగిపోయిన ఆ రామదాసస్వామిగారి స్థితి. ఇట్లే, తమ శరీర మునో, పాండిత్యమునో, యోగమహిమలనో, ప్రదర్శించి, అనుభవహీనులయ్యును అనుభవపరులమని చాటుచూ నందందు గల వారలెందరున్నారో గదా!

యాత్ర సంపూర్తి చేసుకొని శ్రీవారు 1937 సం॥రం శ్రీ హనుమంతరాజయోగిగారి ఆరాధనకు ముందుగనే, సకాలములో క్షేమంగా శికింద్రాబాదు చేరుకొనిరి.

1937 సం॥లో జరిగిన ఆరాధనా సందర్భంలో, భక్తాదులందరూ పంక్తులుదీరి కూర్చుండిరి. వడ్డన జరుగుచుండెను. సాంప్రదాయక సిద్ధాంతానుసారం సర్వమానవ సౌభ్రాతృత్వము ఆదర్శము, వైశ్యకులమునకు చెందినవారందరూ పంక్తిలో ఒకచోట ఒకరితర్వాతనొకరు కూర్చొనియుండిరి. అరిగె రామస్వామిగారు యెక్కడనుండియోవచ్చి వీరిమధ్య ఖాళీచేసుకొని కూర్చుండెను. తమ్ము న్యూనతపరచుటకే ఆయన అట్లుచేసినాడను అనుమానంతో, ఆ వైశ్య శ్రేష్ఠులెల్లరు పంక్తినుండి లేచిపోయి, జరిగిన వృత్తాంతము శ్రీవారితో చెప్పి, తమకు వేరే ఒకచోట భోజనము పెట్టెదరా, లేక యిండ్లకు పొమ్మందురా? అని తగవుపెట్టిరి. పంక్తిలో కూర్చొనికూడా భోజనం చేయకనే లేచిపోవుట భావ్యముకాదు, మర్యాదయుకాదు, అను దృష్టితో శ్రీవారు వారికి యింటిలో వేరేగదిలో భోజనము పెట్టించిరి. యిది తెలసి అరిగె రామస్వామిగారువచ్చి పెద్ద తగవుపెంచిరి. రామస్వామిగారు హరిజనులు. సర్వమానవులొకటే అను సిద్ధాంతం పేరుకేనా లేక ఆచరణలో చూపవలెనా? అట్టి మహావాదము నాచరణలో వుంచని భక్తాదులను వెళ్ళగొట్టవలెనేగాని, వారికి వేరే పంక్తివేసి భోజనపుయేర్పాటు లెందుకు-చేయాలి, అని శ్రీవారిపై అగ్రిహావేశపరుడై శ్రీవారెంత నచ్చచెప్పబూనినను వినక తానిక ఆరాధనాకార్యక్రమములకే రానని, అందు పాల్గొనని శపథంచేసి వెడలిపోయెను. ఆ మరు

నటి సంవత్సరమునుండి శ్రీ హనుమంతరాజయోగిగారి ఆరాధన రామస్వామిగారు వేరేజరుపుట ప్రారంభించిరి. అంతటితో నాగక శ్రీ హనుమంతరాజయోగీంద్రులవారి భక్తమండలివారిని చీల దీసి శ్రీవారిపై పార్టీగట్టెను. యిందుకు అబ్బుగారి వీరయ్యగారు రామస్వామికి కుడిభుజమాయెను. శ్రీవారి బోధనానైపుణ్యము, సాంప్రదాయక సర్వరహస్యవేతృత్వము, పీఠాధికారము మొదలగువానిని చూచి అసూయాగ్రస్తులగువారెల్లరు శ్రీవారికి ప్రతిపక్షులైరి. వీరందరూ నొక సంఘముగా వేర్పడి శ్రీవారి యాధిపత్యమును తృణీకరించి స్వతంత్రులై, సాంప్రదాయక మర్మధర్మములు గురుముఖతః పూర్తిగా యెరుగనివారయ్యును, మీరు పెద్దలంటే మీరే పెద్దలనుకొనుచూ, పరస్పర స్తోత్రపాఠములు చేసుకొంటూ సర్వజ్ఞత్వ మాపాదించుకొని యథేచ్ఛగా తమయూహ కందినరీతిని పూర్ణబోధ గ్రంథములను వ్యాఖ్యానం చేసుకొంటూ, అమాయికులను నమ్మించి శిష్యులుగా స్వీకరించుచూ స్వార్థపుటెల్లలకు పయనింపసాగిరి.

శ్రీ హనుమంతరాజయోగీంద్రులవారి ఆరాధన అరిగె రామస్వామిగారు వగైరాలు వేరే జర్పుచున్నారని శ్రీవారి కేమియు కష్టము తోచనేలేదు. కాగా సంతోషమునే వెలి బుచ్చుచుండిరి. పలననగా తను స్వగురుమూర్తి యొక్క ఆరాధన, ఎంతమంది, ఎన్నిచోట్ల జరిపితే అంతకంతా సంతోషించ వలసిన దేకదా!

ఐతే వారి ఆచార, విచార, ప్రచారములు మాత్రము కర్ణాకర్ణిగా వింటూ అవి సాంప్రదాయక పద్ధతులకు విరుద్ధంగానూ, లోకమునకు అసహ్యాకరములుగానూ యుంటూ

యున్నందుకుమాత్రము శ్రీవారు ఎంతేని వగచుచుండిరి. ఏబోధ విషయంలోనైనా యీ సంఘమువారు పెడదారులు ద్రొక్కినపుడు సాంప్రదాయక నిజాభిప్రాయమును శ్రీవారు వెల్లడిస్తే అది మరింత విద్వేషమును వారిలో రేకెత్తించుచుండెను. అవధూతస్వాములవారు మందలించిననూ అరిగె రామస్వామి ప్రభృతులు పెడచెవి బెట్టుచూవచ్చిరి. దానితో శ్రీవారు అవధూత స్వాములవారి ఆజ్ఞానుసారం ప్రతిపక్ష సంఘమునెడల వుదాసీనులై యుపేక్షించి యూరకుండిరి.

1938 సంవత్సరములో గంగాపుష్కరము వచ్చెను. ఈ సందర్భమున హరిద్వారమునందు కుంభమేళా జరిగినది. దానికి వివిధ సన్యాససంఘములు రాగలవనీ అందలి మహాపురుషులను కలసికొని మాట్లాడవలెననీ కుతూహలముతో శ్రీవారున్నూ ఈ కుంభమేళాకు పోయిరి. కుంభమేళాకు అరుదెంచిన సన్యాససంఘములకు అఖాడాలని పేరు. జూనా అఖాడా, ఆనంద అఖాడా, భైరవ అఖాడా, వైరాగ్ అఖాడా, నాగా అఖాడా, అఘోరి అఖాడా, మొదలగు వివిధసంఘము లరుదెంచెను. ఈ సంఘాధిపతులకు మండలేశ్వరులని పేరు. నాగా అఖాడాయందు స్త్రీ పురుషాదులందరూ దిగంబరులుగానేయుండి బాకులు బల్లెములు ధరించియుందురు. మండలేశ్వరులు యేనుగులపై అంబారీలు కట్టించి అందుపవిష్టులై శిష్యజనంబులు పరివేష్ఠించి నడువ గంగాతీరమునకు స్నానార్ధ మరుదెంచిరి. జూనా అఖాడావారికిని, ఆనంద అఖాడావారికిని యే అఖాడా మండలేశ్వర్లు ముందు బ్రహ్మకుండములో స్నానాది విధులు జరిగించవలెను? అనే విషయంపై పేచీవచ్చి అది ముదిరి ఒకరినొకరు బల్లెములతో, బాకు

లతో పొడుచుకొను పర్యంతము వచ్చి వకరిద్దరు మరణించుట కూడ జరిగెను. మెషీన్‌గన్స్ (మరతుపాకులు) తో మిలిటరీ వచ్చికాని శాంతిభద్రతలు కాపాడజాలకపోయెను. చివరకు దీనికి పరిష్కారము సాయంత్రమగుసర్కిగాని కాలేదు. జూనా అఖాడావారు, సనాతన సాంప్రదాయకులు గాన వారే ముందు స్నానమాచరింపవలెను. ఆనంద అఖాడావారు మత్స్యమాంసాదులు భక్షించువారును, మద్యపానాదులు జరిగించువారును అగుటచే వారు తర్వాత స్నానమాచరింపవలెను అను తీర్పునకు వుభయ మండలేశ్వరులు అంగీకరించిరి. అందరి స్నానాదులగుసరికి రాత్రి 10 గం॥ లాయెను. తమతమ కుటీరములలో రాత్రి విశ్రమించి వేకువనే లేచిపోవుచు వారి గుడిసెలు వీరు, వీరి గుడిసెలు వారు తగులపెట్టి వెళ్ళిపోయిరి. ఆ మంటలు తీర్థమునకు ప్రాకి బారులలో బజారులు పర్చరుచుకొని పెట్టుకొన్న దుకాణములకు వ్యాపించి కొన్నిలక్షల రూపాయిల నష్టమువాటిల్లెను. ఓహో! వీరా సర్వసంగపరిత్యాగులు! కామక్రోధాదులను భస్మీపటలము చేసుకొనవలసిన మహామహులు. యితరుల ఆస్తిపాస్తులను భస్మీపటలముగావించిరే. వీరి పద్ధతి యింత విపరీతముగా యున్నదేమాయని శ్రీవారు విచారించగా యీ సన్యాసులలో ముఖ్యముగా రెండు విభేదములు. (1) దేవస్వీకార్ = జలపాత్ర, కాషాయము, దండము ధరింతురు. దండి, మహాదండి, హంస, పరమహంస యను అంతర్భేదములు యిందు గలవు. (2) రాజస్వీకార్ = బల్లెము లేక శూలము ధరించి దిగంబరులై పురుష, మహాపురుష అను ద్వివిధపద్ధతులుగా నుందురు. ఏ పద్ధతులైనా, చివరకు బాహ్యచిహ్నములు మాత్రమే మిగిలి ఆదర్శమంతకంత కడుగంటిపోవుట శోచనీయము. "అలక్ జోలి, భలక్

ఖజాన, ఖూక్ లగీతో మాంగ్ కేఖాన అనునది ఆదర్శము. అనగా (1) అలక్ ఝోలి=నీ జోలి బహు తేలికగా నుండవలెను. అనగా నీకు ఒకపూటకు సరిపడునంతకంటె యెక్కువ నీ జోలెలో చేర్చరాదు. (2) పలక్ ఖజాన=నీవద్ద రెప్పపాటులో ఖర్చు కాగల కానీ లేక అర్ధణామాత్రమే యుండవలెను. (3) ఖూక్ లగీతో మాంగ్ కేఖాన=నీకాకలి అయితే అడుక్కొని తినవలెనే గాని, దొంగతనం చేయరాదు. ఆశాపాశములుడిగి నిత్యసంతుష్టి గలిగిన యిట్టి వానిని గూర్చియే ఆదిశంకరులు "కౌపీనవంతః ఖలుభాగ్యవంతః" అని అన్నారు. అట్టివారు నిష్కాములు గను కనే సమష్టి శ్రేయస్సుకొరకు స్వార్థరహితముగ లోకసేవ చేయ గలరు. ఇట్టి ఆదర్శము లేకపోవుటచే నేటి సన్యాసులు కామ క్రోధాదులకు వశీకృతులై లోకకళ్యాణమునకు తోడ్పడలేక నిరర్థకజీవులై పోవుచున్నారు. మరియు సోమరులై తమ జీవన ముకొరకు సంఘముపై నాధారపడి వారి కష్టమును కాజేసి అంతకంతకు సంఘమునకు బరువై పోవుచున్నారు.

కనుక లోకసౌభాగ్యముకొరకు కర్మయోగులే కృషి చేయగలరనియు, గృహస్థాశ్రమమందున్న రాజయోగులే యెక్కువ తోడ్పడగలరనియు, శ్రీవారి కనుభవములోకూడ ఋజువయ్యెను. సంఘములోనేయుండి, వారి కష్టసుఖములను స్వయంగా గుర్తించుచూ తన్నివారణోపాయముల నన్వేషించి కృషిచేయుచు "స్వయంతీర్ణః పరాంతారయతి" అనే న్యాయ మున కృషిచేయు రాజయోగమే ప్రశంసనీయము.

శ్రీ సచ్చిదానందావధూత స్వాములవారు 1938 లగా యితు 1940 సంగలో బ్రహ్మైక్యము చెందుటకు కొద్దిరోజుల

పూర్వంవరకు సికింద్రాబాద్‌లోనే కాలక్షేపం చేస్తూయుండిరి. వారు తమశిష్యులెందరున్నా వారి ఇండ్లకుపోక యాకాలములో శ్రీవారి యింటనే మకాముబెట్టియుండిరి. పగలంతయు యథేచ్ఛగా యెక్కడెక్కడనో తిరుగుచూ తింటూ కాలక్షేపము చేసెడివారు. రాత్రి 7, 8 గం॥లు అగుసరికి శ్రీవారి యింటికి వచ్చుచుండువారు. వచ్చుటతోనే వారికి శ్రీవారు యుష్ణోదక స్నానము చేయించి పరిశుభ్రవస్త్రములిచ్చి, భోజనముపెట్టి మందిరములో శయనింపచేయుచు, వారి మంచముప్రక్కనే నేలపై శ్రీవారు పక్కపరచుకొని పరుండెడివారు. స్వాముల వారు రాత్రి 8 గం॥ సరికే నిద్రించి రాత్రి 2 గం॥ అగుసరికి మెలకువరాగా యిక తిర్గి పరుండక బీడీముట్టించి వేదాంతవిచారణ ప్రారంభించెడువారు, శివరామదీక్షితీయ వాక్యములపైననో, కందార్థ కందపద్యములపైననో శ్రీవారితో చర్చ పెట్టుకుంటూనే శ్రీవారికి నిజాభిప్రాయం సాంగముగ వెల్లడించెడివారు. యిట్లు కాకులు కూయువరకు కాలక్షేపముచేసి, పిదప చేతికఱ్ఱ కొట్టుకుంటూ, ఎందో పోయెడివారు. పిదప రాత్రి మాత్రమే యింటికి చేరెడివారు. ప్రతినిత్యమూ యీవిధంగా శ్రీ అవధూతస్వాములవారితో శ్రీవారికి వేదాంతగోష్ఠి జరుగుచుండెను. ఈ సద్గోష్ఠియందు సాంప్రదాయక రహస్యములన్నియు శ్రీవారు గ్రహించి తమ పాండితీ ప్రతిభకు మెరుగులు దిద్దుకొనిరి.

1940 సం॥ ప్రవేశించుసరికి అవధూతస్వాములవారి ఆరోగ్యము సడలసాగెను, తానిక పోతాను, పోతాను అని అవధూతస్వాములవారంటూవుంటే గ్రామాంతరం పోదలపెట్టుచు

న్నారు కాబోలునని శ్రీవారు అనుకొని ఎప్పటికప్పుడు యిప్పుడేమితొందర అని అంటూవచ్చిరి. నిజార్థం గ్రహించియు తన యందున్న చనువుచే శ్రీవారు వెగటాళిగా "యిప్పుడేమి తొందర" అని అంటున్నారనుకొని స్వాములవారు మందహాసంతో విషయాంతర ప్రస్తావన తెచ్చెడివారు. చివరకు బెజవాడపోవు రైలుబండిలో స్వామివారు యెక్కి కూర్చున్నట్టుగా శ్రీవారికి శిష్యులు ఎవరో వర్తమానముతేగా శ్రీవారు హుటాహుటినిపోయి స్వాములవారిని బ్రతిమాలి వెనుకకు తీసుకొనివచ్చిరి. తాను బెజవాడ తప్పక పోవలసియున్నదని సచ్చిదానందస్వాములవారు ఘట్టి పట్టుపట్టగా యిక తప్పదని గ్రహించి 4 రోజులాపి, ఆ పిదప మొదటితరగతి టికెట్టు, నూతన వస్త్రాదులు, ప్రయాణంలో వుపయోగించుకొనుటకు పండ్లు, యితర ఫలహారములు కొనియిచ్చి, స్వాములవారిని సగౌరవముగా శ్రీవారు బెజవాడ సాగనంపిరి. బెజవాడచేరి భక్తుల యింటిలో బసచేసిన మరుపటి దినమునుంచే శ్రీవారి కతిసార విరోచనములు ప్రారంభమాయెను. బెజవాడచేరి వారము దినములాయెను. 1940 సం॥రం డిశెంబరులో - నాడు మార్గశిర శుద్ధ ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) - శ్రీ సచ్చిదానంద వెంకటేశ్వరావధూతస్వాములవారు భక్తుల హాహాకారముల మధ్య బ్రహ్మైక్యము జెందిరి. తంతిద్వారా యీ వార్త శ్రీవారు తెలుసుకొన్న వెంటనే హుటాహుటిగా బెజవాడ చేరుకొని స్వాములవారి శరీరశేషమును వూరేగింపుటుత్సవములతో పట్టణమంతయు త్రిప్పి, కృష్ణాతీరమునకు మహావైభవముతో తీసుకొనిపోయి అట సమాధి చేయించిరి.

శ్రీ అవధూతస్వాములవారి ఆరాధనోత్సవములు మహా వైభవముతో జరిపింపబడెను. ఆంధ్రదేశం నల్గడలనుంచి సాంప్రదాయక అధికారపురుషులూ, భక్తాదులూ అందరూవచ్చి ఆరాధనయందు పాల్గొనిరి. ఈ సందర్భములో శ్రీవారి పాండిత్య ప్రతిభావిశేషములు, బోధనాచాతుర్యము, శ్రోతల నానందాశ్చర్యముల ముంచెత్తెను. శ్రీ అవధూతస్వాములవారి నిర్యాణము వరకు శ్రీవారు తమ పీఠాధికారమును వినియోగించక శ్రీ అవధూతస్వాములవారి ప్రతినిధిమాత్రమే అనునట్లుగా పీఠాధికారమును చెలాయించుచూ కార్యధర్శి యను పేరుతోనే గ్రంధముద్రణాదులు జరిగించుచుండిరి. యింతవరకు పరంపరా గురుసాంప్రదాయములో శ్రీవారొక ప్రముఖ వ్యక్తిగా మాత్రమే లోకముచే గుర్తించబడుచుండిరి. కాని వీరి ప్రజ్ఞా విశేషము లెవరికిన్ని తెలియబడలేదు. అవధూతస్వాములవారి ఆరాధన సందర్భంలో శ్రీవారి బోధనాచాతుర్యము, పాండిత్య గరిమ, సర్వులను ఆకర్షించెను. జయజయధ్వానములతో శ్రీవారి పీఠాధిపత్యమునకు భక్తాదులెల్లరు తమ ఆమోదముద్రను వైచిరి. పీఠాధిపతిగా శ్రీవారి కీర్తి యీ ఆరాధనానంతరం దశదిశల వ్యాప్తిచెందెను.

శ్రీ హనుమంతరాజయోగీంద్రులవారి నిర్యాణానంతరం, వారి శిష్యులగు గట్ల వెంకటరామయ్య, వజ్జంతి వీరయ్య, తైదల కొమరయ్యగార్లు సోదరులైన శ్రీవారి యెడల సో ద ర భా వ ము మాత్రమేగాక కేవల గురుభావమునే వహించి కృషిచేయుచుండిరి. శ్రీ అవధూతస్వాములవారి నిర్యాణానంతరం, వారి శిష్యులగు బోలుసాని శేషయ్య, శేతా

లక్ష్మయ్య వగైరాలు కొంతమంది శ్రీవారిని కేవలం తమ గురువుగా భావించెడివారు. తొలుత ఆచంట కాపురస్థుడగు సజ్జా రామదాసు అనే ఆయనకూడా శ్రీవారియందు పూజ్యభావముంచి బెజవాడ సభలలో శ్రీవారి వాగమృతమును గ్రోలి ఆనందించెడువాడు. కాని 1941 సం॥లో శ్రీవారి ప్రతిపక్షులలో చేరిపోయెను.

వీరేగాక పిళ్లానా లక్ష్మణరావుగారి బేగంపేట మందిరమునకు చెందిన పెక్కురు పెద్దలు, శ్రీవారినెంతో ప్రేమించుచూ వారి ప్రజ్ఞాపాటవమునకు అచ్చెరువంది వారి బోధామృతము గ్రోలుటకై యువ్విళ్ళూరుచుండిరి శ్రీవారి బాల్యమిత్రులును, పిళ్లానా లక్ష్మణరావుగారి శిష్యులైన, కొండోజు శీతయ్యగారి శిష్యులున్నూయైన, పల్లెల కోటలింగంగారికి శ్రీవారంటేగల గౌరవాదరాభిమానములు వర్ణనాతీతములు.

శ్రీ సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

రెండవ భాగము.

ప్రథమ ప్రకరణము.

శ్రీ సచ్చిదానంద వేంకటేశ్వరావధూత స్వాములవారి నిర్యాణానంతరం బెజవాడ భక్తాదులెందరో శ్రీవారి నాశ్రయించిరి. తమ్మిన గురవమ్మగారి సత్రంమేడమీద నొకగది మందిరముగా మార్చబడెను. అందొక యుపపీఠం స్థాపించబడెను. శ్రీవారి ఛాయాచిత్రము పాదుకలు ప్రతిష్ఠించి నిత్యధూపదీపనైవేద్యాదికములతో అర్చించుచుండిరి. ఇచ్చటి శ్రీవారి భక్తాదులలో శిరం అక్కాయమ్మ అను బుల్లెమ్మగారు ప్రధానులు. అవధూతస్వాములవారి శిష్యప్రశిష్యకోటిలోనివారగు నర్సమ్మ, నారాయణమ్మ యిత్యాదులు శ్రీవారిని గురుసమానముగాచూచుకొని పూజించుచుండిరి. వీరందరూకూడి ప్రతి సంవత్సరమూ శ్రీవారిని రప్పించుకొని మార్గశిర శుద్ధ ఏకాదశినాడు అవధూత స్వాములవారి సమాధిపూజయు, ఆరాధనయూ, వైభవోపేతముగా జర్గించుచుండిరి. శ్రీవారి అధ్యక్షతను రెండురోజుల కార్యక్రమముతో వేదాంత వైజ్ఞానిక సభలు జర్గించెడివారు. దేశము నలుమూలలనుండి శ్రీ శివరామదీక్షితాచల గురుపీఠమునకు చెందిన పెక్కురు పెద్దలరుదెంచి, శ్రీవారియొక్కయూ, వారి బాల్యమిత్రులును ఒకవిధముగా సహపాఠులును అగు

పల్లెల కోటిలింగంగారియొక్కయూ, వుపన్యాసములు విని
ఆనందించెడివారు

వేదాంత విజ్ఞానమునకు పెద్దబాలశిక్ష యనదగిన భద్రా
ద్రి రామశతకమును రచించిన శ్రీ పరశురామ నర్సింహ్వాదాసు
గారియొక్క పరంపరా గురుభక్తమండలి యొకటి పశ్చిమగోదా
వరిజిల్లా భీమవరమునందు గలదు. ఈ మండలియందు శ్రీయుత
పాలూరి రామమూర్తి, పంద్రంగి జగన్నాథం, పెమ్మరాజు
రామబ్రహ్మ బాబూజీగార్లు అధికారపురుషులై వుండిరి. ఈ
సాంప్రదాయమునందు పరిపూర్ణబోధయొక్క విచారప్రచారము
లు తక్కువ. ఈజిల్లాయందే శ్రీ హనుమంతరాజయోగిగారి శిష్యు
లైన బండి రామస్వామిగారి ప్రచారము చాల హెచ్చుస్థాయిలో
నుండెను. కాని శ్రీ పాలూరి రామమూర్తి, పంద్రంగి జగ
న్నాథం వగైరాగార్లు, పూర్వాచారపరాయణులును, సనాత
నులును, అయివుండుటచే వీరికిన్ని, వారికిన్ని సాంఘికరూప
మగు భేదాభిప్రాయములుండుటచే పరస్పరకలయిక లేకపో
యెను. శ్రీ శివరామదీక్షితీయ పూర్ణబోధయందు భీమవరం
వారు తాము వెనుకబడియున్నట్లు గుర్తించకపోలేదు. సాంప్ర
దాయికపద్ధతి సమగ్రంగా తెలియవలెనను జిజ్ఞాసమాత్రం వారికి
బలీయముగా నుంటూవుండెను. వీరు వ్యష్ట్యంతకరణస్వభావ
మునే వీడలేకపోయిరని, యిక పరిపూర్ణబోధ యెట్లు ఆరూఢ
మగునన్ని వీరిని యెగతాళిచేయుటయేగాని, వీరిని కూడకట్టు
గొనుటకు శ్రీ బండి రామస్వామిగారు ప్రయత్నించలేదు. ఈ
పరిస్థితులలోనే శ్రీ అవధూతస్వాములవారు నిర్యాణముచెందు
టయు, వారి ఆరాధనా సందర్భంలో పెక్కురు శ్రీ వారిని

దర్శించి వారి ప్రబోధ వినుటరీత్యా శ్రీవారి కీర్తి ఆంధ్రావని యెల్లెడల పండువెన్నెలవలె వ్యాపించుటయు జరిగెను.

పీఠాధిపతులగు శ్రీవారినే రప్పించుకొని వారిద్వారా సాంప్రదాయక రహస్యములను తెలిసికోవలెననే సద్బుద్ధితో శ్రీ పాలూరి రామమూర్తిగారి శిష్యుని శిష్యులైన కోటమర్తి వెంకటరమణయ్యగారు 1941 సం॥ కార్తీక పౌర్ణమికి ఒక సమావేశ మేర్పాటుచేసి శ్రీవారిని ఆ సమావేశమునకు ఆహ్వానించిరి.

ఉభయగోదావరీ మండలములలో పూర్ణబోధ యెక్కువ వ్యాప్తములోనున్నదన్న సంగతి శ్రీవార్కి తెలుసును. వారి స్థితి గతులను స్వయంగా తెలుసుకోవలెనని కొంత కాలముగా శ్రీవారు కుతూహలురై యున్న కారణమున ఈ అవకాశమును పురస్కరించుకొని తమ శిష్యరత్నమగు నార్సింగుపేట ఈశ్వరయ్యాచారిని వెంటబెట్టుకొని భీమవరం విచ్చేసిరి. ఈ యీశ్వరయ్యగారి ప్రజ్ఞావిశేషములకు ఎల్లరు ఆనందపడిరి, ఎంతో అభివృద్ధిగాంచవలసిన ఈయన 1945 సం॥లో బ్రహ్మైక్యము చెందుట విచారకరము. 1941 సం॥పు యీ సమావేశకాలమందే నా పూర్వపుణ్యమేదో ఫలప్రాప్తిచెందుటచే శ్రీవారి ప్రథమసందర్శన భాగ్యము నాకు గల్గెను. అప్పటిక్కి శ్రీ బండి రామస్వామిగార్కి, శ్రీ ఖైరాజు సత్తిరాజుగారున్ను, వారికి శ్రీ పాలూరి జగన్నాధరావుగారున్ను, వారికి నేనున్ను శిష్యప్రశిష్యులమై యుంటిమి. శ్రీ జగన్నాధరావుగారివద్ద నేను 1937 సం॥లో ధర్మోపదేశము బొంది యీ పూర్ణబోధయందు కృషిచేయుచుంటిని.

ఈ సమావేశమునకు తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల బోధాధికారులగు గురువులు పెక్కురువిచ్చేసిరి. పూర్ణబోధయిందు వీరి కెంతవరకు ప్రవేశమున్నదీ శ్రీవారికి అవగతమగుటకు ఎంతో కాలము పట్టలేదు. సాంఖ్యవిచారణగాని, ఆత్మవస్తునిశ్చయజ్ఞానముగాని, వీరెవరికి తెలియనట్లు శ్రీవారు గ్రహించిరి. మంత్రములని చెప్పబడే సిద్ధాంతవాక్యములను పురస్కరించుకొని తోచినవిధముగా శ్రీ భాగవతుల కృష్ణదాసుగారి కందార్ధముల కర్ధము చెప్పుకొనుచూ కాలక్షేపము చేయుచుండిరేగాని, ఆ సిద్ధాంతవాక్యములకైననూ, వారికి సంపూర్ణార్ధముగాని, సమన్వయార్ధముగాని, తెలియదనిన్ని స్పష్టమయ్యెను. లోకములో మున్న సప్తకోటి మంత్రములలో తమకు తెలిసిన యితర మంత్రములతోపాటు వీరీ సిద్ధాంత వాక్యములనుగూడ పురశ్చరణ గావించుచుండిరి. ఈ శ్రవణాదులవల్లనే ఆరూఢస్థితి చేకూరగలదని కొందరి అపోహ. ఉన్నవాక్యములున్నట్లుగా అర్ధం కాకపోవుటచే భీమవరము వారు ఒక వాక్యములో షష్టివిభక్తి ప్రత్యయమైన "కు" చేర్చి యుపదేశించుచుండిరి. శ్రీవారు అడిగిన సృష్టిక్రమము, ఆకాశనిరూపణము, సురస్వప్న నిశ్చయము యిత్యాదులను గురించి సమావేశమైన పెద్దలెవ్వరూ సరియైన సమాధానములు చెప్పలేకపోయిరి.

అధికారులైన పెద్దలైనా సక్రమంగా సాంప్రదాయక ప్రబోధమును తెలిసికొని తమ శిష్యకోటికి బోధించవలసినదని శ్రీవారు హెచ్చరించిరి. ఆరూఢులమైతిమి, అచలపరిపూర్ణులము, అశరీరులము అని అంతవరకూ అనుకొంటూ తృప్తిపడియున్న పెద్దలందరూ తామెంత తెలిసికొనవలసియున్నదీ,

తామంతవరకు తెలిసికొన్నదెంత అల్పమో, తమలో తాము తెలిసికొనిరి. కాని సక్రమంగా శ్రీవారినడిగి తెలుసుకొనుటకు వారి అహంకారము హిమాలయ పర్వతశ్రేణివలె వారికడ్డుతగిలెను. తాము గురువులుగదా! సర్వజ్ఞులమని యిదివరకు ఒక విధమగు అహంకారముతో నున్నవారుగదా! యిప్పుడు తాము శ్రీవారినాశ్రయించి విషయం తెలుసుకొంటే తమ శిష్యులయెదుట తమకెంత న్యూనత? కనుక మంచిమాటలతో స్నేహభావమున సంభాషణలమధ్య యుక్తిగా వీలైతే విషయ సంగ్రహణ చేసుకోవలెనేగాని, తిరిగి తాము ధర్మపద్ధతిగా శ్రీవారికి శరణాగతులై తెలుసుకొనుటా? అసంభవము. అని ఎవరికివారే లోలోపల ఆలోచించుకొనుచుండిరి. రెండురోజులుండి శ్రీవారు గృహోన్ముఖులైరి. ప్రతి సంవత్సరము కార్తీక పౌర్ణమికి భీమవరములో మహాసభలు జరిపింతుమనిన్నీ, అద్వైతులుగా వచ్చేసి, తొలకరి మేఘములవలె, యెండిపోయి, బీటలువారిన తమ హృదయక్షేత్రములకు బోధామృతము కురియించి, పదునుచేయుచూ వుండవలసిందిగా శ్రీవారిని కోటమర్తి రమణయ్యగారు పరిపరివిధముల ప్రార్థేయపడిరి. శ్రీవారంగీకరించి శికింద్రాబాద్ వెడలిపోయిరి.

1942 లగాయితు 1945 వరకు ప్రతి సంవత్సరమూ కార్తీక పౌర్ణమికి భీమవరములో త్రిరాత్రదీక్షతో పూజాదికములు; మహాసభలు జరుగుచూనుండెను. మార్గశిరశుద్ధ ఏకాదశి నుండి రెండురోజులు బెజవాడలో మహాసభలు జరిపించబడుచుండెను. 1943, 1944 సం॥లలో తాడేపల్లిగూడెం తాలూకా సరిపల్లి గ్రామంలో కూడా సభలు జరిగెను. సరిపల్లె వాస్తవ్యులు

క్రొవ్విడి లక్ష్మీపతిగారి భార్య మహాలక్ష్మమ్మగారు అంతకు పూర్వం 20 సం॥ల పైకాలమునుంచి పరిపూర్ణబోధ మార్గము నరిదు గురువుగానుండి, ప్రత్యేకం స్త్రీలకు ధర్మోపదేశము గావించి, బోధించుచూ స్త్రీలోకమునకు మార్గదర్శినియై మానవసేవ చేయుచుండెను. తాను తెలుసుకొన్న ప్రబోధము నందున్న లోపములను సవరించుకొనుటకై శ్రీవారి నాశ్రయించి వారివల్ల యథావిధిగా ధర్మోపదేశము తాను పొందుటయేగాక, తన భర్తగారిని సహితం యీ బోధయందు ప్రవేశపెట్టి చూడాలవలె కీర్తిగాంచెను, శ్రీవారిని, వారి భక్తమండలిని, ఆహ్వానించి సరిపల్లెలో తమయింట శ్రీవార్కి, భక్తాదులకు ఆతిథ్యమిచ్చి మహాసభలు జరిపించిరి. ఇందుకు వలయు ధనసహాయమామె శిష్యులే చేకూర్చి సభాకార్యక్రమములు నిర్విఘ్నముగా పరిసమాప్తి గావించుచుండిరి.

ఈ సరిపల్లె గ్రామంలో 1949 సం॥లో జరిగిన సభా సందర్భములో ఆ గ్రామ కాపురస్తుడో లేక ఆ గ్రామపువారి బంధువుడో అప్పటికి 60 ఏండ్లవాడు భీమరాజు అను పేరుగల ఒకాయన కంఠార్థములన్ని తప్పులతడకలనీ, అవి అన్నీ సవరించాలనీ, యిదేమి వేదాంతమనీ సమావేశమైన చిన్న పెద్దలందరిదగ్గరా అంటూవచ్చెను. యీసంగతి శ్రీవారివరకు కూడా పోయెను. ఆయనకు సమాధానం చెప్పుటకై తగు సమయముకొరకు శ్రీవారు నిరీక్షించుచుండిరి. ఈలోగా శ్రీ వల్లెల కోటిలింగం గారు భీమరాజుగారిని సంభాషణలోనికి దింపి, భీమరాజుగారు చెప్పు వేదాంతవాక్యములను పూర్వపక్షంగావించి, ఆయనను తల్లక్రిందులుగావించిరి. పాపము! భీమరాజుగారు నోరెత్తలేక

బైటకిపోయి, యిటువంటివారినే పెద్దలు తార్కికశునకము లన్నారు అంటూ యింకా ఏదో గొణుగుకొనసాగెను. ఆప్రక్క వారామాటలు విని "ఏమయ్యా! యింతవయస్సు వచ్చిందినీకు, అట్లా శునకములంటూ నిందిస్తావా" అని ఘట్టిగా భీమరాజు గారిని ఎదుర్కొనిరి. పిల్లివలె అప్పట్లో మెల్లమెల్లగా భీమరాజు గారావలికి జారిపోయెను. గాని తిర్గి మరియొక గంటపోయిన తర్వాత పండిట్లోకి వచ్చెను. శ్రీవారి శిష్యులలో హనుమకొండ కాపురస్తుడు రావూరి రాజయ్యకూడా శ్రీవారితో సరిపల్లి సభలకు వచ్చియుండెను. భీమరాజుగారు ఆ వుదయంనుంచిచేయు హంగామా అంతయూ యీయనకూడా గమనించియుండెను. మెల్లగా భీమరాజుగారివద్దకు చేరి "అయ్యా, మనస్సు అంటే పదార్థమేమిటో చెప్పగలరా" అని మొదట్లో బహునమ్రతగా, సౌమ్యముగా పృచ్ఛించెను. భీమరాజుగారు మనస్సు అంటే సంకల్ప వికల్పాలుచేసేది అంటూ ఏదోచెప్పి తప్పించుకో జూచెను. "పదార్థం ఏమిటి అని నేనడిగాను గాని, ఏంపని చేస్తుంది మనస్సు అని నేనడగలేదు. మనస్సు అంటే అది పదార్థమో కాదోకూడా మీకు తెలియదనుకొంటాను. తెలిస్తే మరి చెప్పండి" అని రాజయ్య భీమరాజుగారిని వదలలేదు. పాపం భీమరాజుగారు యిరుకునపడెను. "ఉండవయ్యా, ఏం ప్రశ్నలివి?" అంటూ తప్పించుకొనిపోజూచెను. "ఆగండి, ఆగండి. మీకు తెలియకపోతే తెలియదని వప్పుకోండి. నేను చెప్తాను తెలుసుకోండి" అని రాజయ్య వెంటాడించెను. "అయితే చెప్పుమరి" అని భీమరాజుగారు, విందాము అనే ఆశతో పాపము లేచినవారు తిర్గి చతికిలపడిరి. "అయితే నీకు తెలియదని వప్పుకొన్నట్టేనా?" అని ముమ్మారు తెలియదని అనిపించి రాజయ్య

"అయ్యా! నాకు తెలుసు - చెప్తాను, గాని ఒక్క షరతు. ధర్మ పద్ధతిగామాత్రమే మేము చెప్పాలిగాని, మరొకవిధంగా చెప్ప రాదు. కనుక నా కాళ్ళకు మ్రొక్కితే చెప్తాను" అని రాజయ్య అనెను. అప్పటికి రాజయ్యకు ౬౦ సంవత్సరాలుకంటె వయస్సు వుండవు. తనకంటె రెట్టింపు వయస్సున్న వయోవృద్ధుడనేనా చూడకుండా కుర్రతనంచే రాజయ్య భీమరాజుగారిని ఈవిధంగా న్యూనత పరచినాడని భీమరాజుగారు, పాపము అవమానంచే క్రుంగిపోయెను. "ఏమిటయ్యా! పాపం ఆయనను అట్లా చేసావు? అని అడిగితే యీయన కోటిలింగం బాబయ్యను తార్కికశునకం అంటాడా? అందుకని తగిన ప్రాయశ్చిత్తం చేసానని రాజయ్య తన్ను సమర్థించుకొనెను.

సరిపల్లిగ్రామంలో శ్రీవారి శిష్యులగు క్రొవ్విడి మహా లక్ష్మమ్మ, శేషమ్మగార్లు చిరకాలంగా పరిపూర్ణబోధయందు కృషిచేస్తూ తాము గురువులై తమ్మాశ్రయించిన స్త్రీలోకము నకు ప్రబోధ గావించుచుండిరి. ఈ భీమరాజుగారా గ్రామం వచ్చినపుడల్లా తనకున్న ఏదో పూర్వబంధుత్వమును పురస్కరిం చుకొని వీరి వేదాంతమును వేళాకోళము పట్టించుచుండెను. భీమరాజుగారుచేసే విమర్శ యంతకంతకు హద్దుమీరుచుండుటచే మహాలక్ష్మమ్మ, శేషమ్మగార్లు ఈయనబాధ ఎట్లు తప్పిపోవునా యని ఆలోచించుచుండిరి. ఉదయమునుండియు యీయనవల్ల జరుగు కల్లోలము శ్రీవార్కి ఎప్పటికప్పుడే వీరు నివేదించుచూ యీయనను తగురీతిని మందలించవలెనని శ్రీవారిని కోరిరి. శ్రీవారు సభాస్థలికేతెంచి, భీమరాజుగారి నుద్దేశించి "ఏమండీ భాగవతుల కృష్ణదేశికులు రచించిన గ్రంథమంతయు తప్పులతడక

యని మీరు నిందిస్తున్నారట. ఆ గ్రంథము మీరు చదివితిరా? అర్థమేమైన అయినదా? లేక అర్థమేమియు కాకుండగనే గ్రంథము తప్పని వాదిస్తున్నారా? చెప్పండి" అని సూటిగా శ్రీవారు భీమరాజుగారిని అడిగిరి. "గ్రంథమంతయు చదివితిని. పూర్తిగా అర్థమైనదికూడ. అర్థంచేసుకొనే తప్పని చెప్పున్నాను," అని భీమ రాజుగారు బీరములు పల్కిరి "ఐతే - కందార్థములు శక్తిద్వయ నిరాసకంబైన శుద్ధ నిర్గుణతత్వకందార్థములు అను శీర్షికతో వ్రాయబడినవి, ఆ శక్తిద్వయమేమో మీకు తెలియునా? అది నిరాసకంబగుచో శేషించునదేమి? నిర్గుణమేది? శుద్ధనిర్గుణమేది? యీ విషయములు తెలుసుకొన్నగదా మీకు కందార్థములు అర్థమగునది! యీ విషయములు మీకు తెలుసునా? తెలిస్తే చెప్పండి చూతాము. తెలియదంటారా, ఆ కందార్థములు దేనిని గురించి చెప్పుచున్నవో తెలియకనే కందార్థములు తప్పుఅని విమర్శచేయుట తగునా? కందార్థముల శీర్షికను చేతనైతే వ్యాఖ్యానంచేసి చెప్పండి. చెప్పినమీదట మీరుచేయు విమర్శ ఏమో పరిశీలిద్దాము" అని శ్రీవారనిరి "శక్తిద్వయమంటే" అని ముమ్మారు ప్రారంభించి ఏమిచెప్పాలో తోచక ఖిన్నుడై భీమ రాజుగారు వెడలిపోయిరి.

యీ విషయం ఎందుకు వ్రాయవలసివచ్చిందంటే యీ భీమరాజుగారివంటివాళ్ళు సాధారణంగా ప్రతిచోట వుంటూనే వుంటారు. వీరు ఏవో రెండు వేదాంతగ్రంథములు చదివి అంత లోనే తమకంటె యిక తెలిసినవారు లేరని విర్రవీగుతూ ఎదిరి తన్ను యెరుగక మాట్లాడి తగినవారి యెదుట అపహాస్యము పాలగుచుందురు. ఈగ, సుగంధాదులను వదలి, చీము, కుళ్ళు

తో దుర్గంధము కక్కు పుండ్లు, వ్రణములు, పైననే వ్రాలు చుండును. యీ మతీక లక్షణమున్న వ్యక్తులు తరుచుగా తాత సిల్లుచునేయుందురు. అట్టివారిని వుపేక్షించినచో వారుచేయు హంగామాకు అంతువుండదు. తగురీతిని వారిని నోరుమూయించి పంపుటయే న్యాయము.

బెజవాడలో శ్రీ అవధూతస్వాములవారి భక్తమండలి వారుగాని, అవధూతస్వాములవారి శిష్యులగు రామసింగుగారి భక్తమండలివారుగాని, శ్రీవారి ఆధిపత్యమును సహించుటకు వారి అహంకారమడ్డుతగిలెను. ఏలననగా అవధూతస్వాముల వారి శిష్యులు శ్రీవారి గురుమూర్తియగు హనుమంతరాయ రాజయోగీంద్రులకు సోదరులుగదా! కనుక శ్రీవారికంటె తాము పెద్దలు, కనుక శ్రీవారికాధిపత్య మేలయివ్వవలెను? అట్లే రామసింగుగారి శిష్యులు శ్రీవార్కి సోదరస్థానములో నున్న సమానులు కనుక శ్రీవారి ఆధిపత్యమేల యంగీకరించి వార్కి లోబడియుండవలెను. పైగా శ్రీవారు యెంతటివేత్తలైనా కావచ్చును. సాంప్రదాయక రహస్యములు తమంత తాముగా ఏల చెప్పకూడదు? మేము వేడుకొనవలెనా? వేడు కొంటేమాత్రం చెపుతారా? ఆత్మస్వరూప వస్తునిశ్చయజ్ఞానం "శిష్యస్తేహం శాధిమాం త్వాంప్రపన్నం" అని శరణాగతిచేసి ధర్మపద్ధతిగా తెలుసుకొంటేగాని చెప్పరాదని సాంప్రదాయమట. యిక శ్రీవారిని పట్టుకొని వ్రేళ్ళాడుటవలనయేమిప్రయోజనము అని అనుకొంటూ అవధూతస్వాములవారి శిష్యులగు నర్సమ్మ వగైరాగార్లున్నూ, రామసింగుగారి భక్తమండలిలో చేరిన నారాయణమ్మ వగైరాగార్లున్నూ, శ్రీవారితో సహకరించరైరి, 1941, 1942, 1943 సం॥లలో మాత్రము అవధూతస్వా

ములవారి ఆరాధనా కార్యక్రమములలో వీరు పాల్గొనిరి, అంత వరకు సభాసమావేశములు ఇంద్రకీలాద్రి పర్వతముపై జరుపబడు చుండెను. ఆపిదప అహంకారపరవశులై, శ్రీవారి శిష్యురాలగు శీరం అక్కాయమ్మఅను బుల్లెమ్మగారితో వైరం పెంచుకొని ఆరాధనా కార్యక్రమములలో పాల్గొనుటయే మానివేసిరి. కాని భక్తమణి శీరం అక్కాయమ్మగారు మాత్రం మొత్తం ఖర్చం తయు తానే భరించి, స్వాములవారి ఆరాధనోత్సవము, భక్తా దుల కాతిథ్యము, మహాసభానిర్వహణము తానొక్కతెయే జరి పించుచుండెను. ఈమె సాహసము, వితరణశీలము యెంతయు ప్రసంసనీయములు.

కృష్ణా, ఉభయగోదావరీ మండలములయందలి భక్తమం డలి వారుగాని, వారి గురుపులుగాని, సాంప్రదాయక ప్రబోధ మున్నదున్నట్టుగా గుర్తించలేదు. కారణము? అందరూ అవ ధూతస్వాములవారి శిష్యప్రశిష్యులే అయినను, ఆయనను తమ ఆచరణ విధానరూపమగు ఆత్మ, అంగ, శుశ్రూషలచేగాని, స్థాన శుశ్రూషచేగాని మెప్పించినవారు కాకపోవుటచే, అవధూతస్వా ములవారిదివ్యప్రబోధము అవగతమొనర్చుకొను అవకాశమెవ్వరి కిని లేకపోయెను, అట్టిఅవకాశము అవధూతస్వాములవారిని చిర కాలము తమయింట నుంచుకొని సేవాశుశ్రూషలు గావించిన శ్రీ హనుమంతరాజయోగీంద్రులవారికిన్ని, శ్రీవారికిన్ని మాత్రమే చిక్కెను. అందునే, అందరూ అవధూతస్వాముల వారి శిష్యప్రశిష్యులేకదా! వారువ్వరికీతెలియని యీ ఆత్మ స్వరూప వస్తునిశ్చయజ్ఞానము, పంచాకాశనిరూపణ యిత్యాది సాంప్రదాయక రహస్యములనబడేవి శ్రీవారికి మాత్రమే ఎట్లు

తెలిసెను? అను సందేహమునకు సావుకాశములేదు. యిక దీక్షితీయము, కంఠార్థములు, యిత్యాది పీఠగ్రంథముల వ్యాఖ్యానంలోగూడ నింతే. అవి, శ్రీ అవధూతస్వాములవారి ముఖతః విను అవకాశమెవరికీ కలుగనేలేదు, శ్రీవారికి వారి గురువర్యులకూ తప్ప. అక్కడక్కడ ఏవో కొన్ని స్వల్పభాగములు దీక్షితీయములోనూ, అక్కడక్కడ కొన్ని కంఠార్థములున్నూ వింటే ఎవరైన వినియుండవచ్చునేమో అంతే. కనుక మిగతా గురువుల ప్రబోధములు గురుముఖతః విన్నదొకవంతు, తాము ఊహాపోహాలచే అర్థము గ్రహించినది 99 వంతులు. అట్టివారి ప్రబోధ సాంప్రదాయ ప్రబోధమునకెంతదూరస్థమైయుండునో పాఠకులే గ్రహింపగలరు. యీ కృష్ణా యుభయగోదావరీ మండలములవారు, అవధూతస్వాములవారి శిష్యులలో కొందరున్ను, నర్సమ్మ వగైరా గార్లున్ను, శ్రీబండి రామస్వామిగారి శిష్యులలో జంపన సూరమ్మ వగైరాగార్లున్నూ, (వీరంతా బోధాధికారం పొందినవారే) కొన్ని కంఠార్థములకు శ్రీవారిని వ్యాఖ్యానించమని గోరుటయు, శ్రీవారు చెప్పినది విని, అయ్యో తమరిట్లు చెప్పినారే! మా గురువు లట్లుగాక ఇట్లు చెప్పినారే, అని తాము తమ గురువుల వల్ల గ్రహించిన యర్థమును శ్రీవార్కి నివేదించుటయు జరుగుటతో యీ యుభయమండలములలో ప్రబోధమెట్టి పెడదారులబట్టెనో శ్రీవారు గుర్తించిరి. అందుచేతనే మహాసభలలో సహితం శ్రీవారు కృష్ణా గోదావరిజిల్లాలవార్కి పూర్ణబోధ తెలియదని ఘంటాపథముగాచెప్ప సాహసించెడివారు.

బెజవాడ వాస్తవ్యులగు అవధూతస్వాములవారి శిష్యులు కొత్తడి నర్సమ్మగారు, శ్రీవారియెడ జుగుప్సవహించి ఆమె

సోదరులగు ఆచంట కాపురస్థులు సజ్జా రామదాసు వగైరా గార్లతోనూ, తదితరులతోనూ శ్రీవారియెడల నేరారోపణలు గావించుట ప్రారంభించిరి. అవధూతస్వాములవారి వ్రాతగ్రంథములు, పీఠమునకు సంబంధించియున్న యితర కాగితములు వగైరాలన్నీ శ్రీవారు అవధూతస్వాములవారి వద్దనుంచి అపహరించి వారిని వెళ్ళగొట్టిరట. అందుచే అవధూతస్వాములవారు బెంగపెట్టుకొని కృశించి దేహము చాలించిరట. ఇది వీరు శ్రీవారిపై వేసిన అభాండము. అవధూతస్వాములవారు నిర్యాణమునకు పూర్వం వారముదినములు వీరి సపర్యలు గైకొనిరి. అందుచే వీరి దుష్ప్రచారవిషయములు సత్యవిషయము లేమోనని కొందరు అనుమానించుటకును తావు పర్చడెను. మరియు సజీవులై యున్న తమ స్వంతశిష్యులే కొందరుండగా తన శిష్యుని శిష్యునికి అవధూతస్వాములవారు పీఠాధిపత్యము నిత్తురా? యిదియును శ్రీవారి కల్పనేఅని మరియొక ఆరోపణ శ్రీవారిపై చేసిరి. మనుమలకన్న సహజంగా కొడుకులే ఎక్కువ ప్రేమపాత్రులు. కాని కొడుకులు దుష్టులు, దుర్వ్యసనపరులు లేదా దుబారా మనుష్యులు ఆయివుండినచో, తండ్రి, తాను ఎంతోకష్టపడి సంపాదించి నిల్వచేసిన సొత్తును సత్శీలుడును, యోగ్యుడును మూలధనమును అభివృద్ధిచేయగల సామర్థ్యము గలవాడును అగు మనుమనికే వప్పచెప్పి తృప్తితో కన్నుమూయుటలో విడ్డూరముండదుగదా! సరిగా శ్రీవారికి పీఠాధిపత్యమిచ్చుటలోనూ అంతేజరిగినది. పై ఆరోపణలు సత్యమేమోననుకొన్నవారు శ్రీవారి వైరివర్గములో చేరిరి. "కోరుట కామంబు, కోరిన యర్థంబు కొనసాగకుండిన క్రోధమగును" అన్నవిధముగా ఈ వైరభావమునకు (తీరనికోరిక, లేక నెరవే

రని ఆశయే)పునాది. శ్రీవార్కి యీపీఠాధిపత్యము లభించియుం డని యెడల తనకే లభించేదేమో, సాంప్రదాయిక మూలగ్రంథ ములు (ముద్రితాముద్రితములు) అన్నీ తనకే లభించెడివేమో? ఈస్వార్థబుద్ధిగలవారే శ్రీవారి యెడల వైరభావమిప్పటికినిసాధిం చుచున్నారనుట నిశ్చయము. అసలు స్వార్థబుద్ధిలేనిచో మరియొ కరితో విరోధమే యుండదు.

వీరేగాక, గురువులమని పేరుపెట్టుకొని వందలాదిగా శిష్యులను చేర్చుకొన్న వారందర్కి యీ జిల్లాలవారికి బోధతెలి యదని శ్రీవారన్నందుకు ఎవరికివారు ఆమాట తమకే వర్తింప చేస్కుని శ్రీవారి యెడల శత్రుభావమును పెంపొందించుకొను చుండిరి, "మనకు తెలసిన రహస్యములకంటె యిక మనము తెలసికొనదగినవి ఏమీలేవు. ఉంటే యున్నివిధాల మనం ప్రాధేయపడుతూంటే సభావేదికనుండిగాని, లేదా వేరే పిలచి గాని పలచెప్పరు? ధర్మపద్ధతిగా తప్ప యింకొకవిధంగా చెప్ప గూడదంటూ ఒక సాకు కల్పించినారేగాని, అంతకంటె ఏమీ లేదు. ఏదోవున్నదని ఆశపెడితే యిక్కడ శిష్యమండలి ఏర్పడు తుంది అను వుద్దేశ్యముతో శ్రీవారు యీ పన్నుగడపన్నినారే గాని మరొకటికాదు. ఒకవేళ విధం చెడినా పొందతగ్గ ఫలమేమీ లేదు." అని గురువులైనవారు పరస్పరం తమలోతాము చెప్పు కొనేవారు. ఒకవేళ తమశిష్యులెవరైనా శ్రీవారి మాటలవల్ల తమ్ము విడచిపోయి శ్రీవారివద్ద ధర్మము తెలసికొందురేమో యని "గురుత్యాగాన్భవే న్మృత్యుః" అనీ "గురువును విడనాడి రెండోగురుని చేరిననూ....... యిటువంటి నరునకు దప్పాదు నరకాము" అనియునూ భయపెట్టుచుండేవారు. విచారించిన

శిష్యులు యీ మాటలను నమ్మక "మధులుబ్ధో యథాభృంగః పుష్పాత్పుష్పాంతరం వ్రజేత్, జ్ఞానలుబ్ధస్తథా శిష్యోగురోర్గుర్వంతరం వ్రజేత్" అనియును "పరిపూర్ణబోధ నెరుగని గుఱిశిష్యులు బోధకొఱకు కోరవనిబడున్ గురువర్యునొకని మఱలను ..." అనియును, "గురువును విడనాడి రెండోగురుని చేరిననూ" అనేమాటల కర్ధము పరిపూర్ణగురువును వదలి యితర గురువులను చేరిననూ అని అర్ధమేకాని పరిపూర్ణ గురువులు అందరూ ఏకగురు స్వరూపులేకాని భిన్నులుకారు కనుక అట్టి పరిపూర్ణ గురువులలో ఒకరు తనకు భ్రాంతిరహితముచేయుట కసమర్థులైనచో వేరొక పరిపూర్ణగురువును ఆశ్రయించుట ధర్మవిరుద్ధము కాదనిన్ని పూర్ణగురువు లభించకపూర్వం జనకునకు 100 గురువులు మారుట చంద్రప్రసిద్ధమునిన్ని వాదించుచుండెడివారు. శ్రీవారు తాము శిష్యులను ప్రోగుచేసుకొనుటకై రాలేదనిన్ని యీ ప్రాంతపువారు సక్రమంగా బోధతెలిసికొని బాగుపడుటే తమ యుద్దేశమనిన్ని అధికారులైన బోధగురువులు సక్రమంగా తెలుసుకొంటే చాలు వారు వారి వారి శిష్యప్రశిష్యులకు బోధ చెప్పుకొనవచ్చుననీ, అరీత్యా వారు తరించి యితరులను తరింప చేయుటకు సావుకాశము కలుగుననిన్నీ, వేనోళ్ళ చెపుచూ, గురువు సజీవుడై యుండగా అట్టి గురుశిష్యులకు తాను ధర్మోపదేశము చేయననిన్ని చెప్పుచూ, అట్టివారెవరైననూ తమ్మాశ్రయించినపుడు వార్కి ధర్మోపదేశముచేయుటకు ఖచ్చితంగా నిరాకరించుచూ వచ్చిరి. యిందుక్కు మా స్వానుభవమే సాక్షి. ఏలననగా శ్రీ పాలూరి జగన్నాథరావుగారి శిష్యులమగు మేము కొంతమంది ధర్మోపదేశముచేయుడని శ్రీవారిని వేధించుచుంటిమి. కాని శ్రీవారందుక్కు ఏమాత్రమూ అంగీకరించలేదు.

మా గురువులగు శ్రీ పాలూరి జగన్నాధరావుగారు తెలిసికొని పిదప మాకు చెప్పవలెనేగాని, తాము నేరుగా మాకు చెప్పబోమని శ్రీవారు సెలవిచ్చుచుండిరి. ఐతే, ఏదో కృషిచేస్తూంటూ కాలక్షేపము చేసేవార్కి వారి గురువులయందు లక్ష్యము చెడ కొట్టుటేల? అని ప్రశ్నించవచ్చును. కాని ఒక్క విషయము జ్ఞప్తియందుంచుకొనవలెను. శ్రీవారు పీఠాధిపతులు. బోధాధికారులగు వారు సక్రమంగా పరిపూర్ణ బోధప్రచారముచేసి పీఠమునకు కీర్తి దెచ్చుచున్నదీలేనిదీ శ్రీవారు చూడవలసిన బాధ్యత వార్కి కలదు. ఈ పీఠసాంప్రదాయకులగు గురువులు "పదుగురు నిను చూచి భళి, శెబాస్ యీ త్రోవకెదురు లేదనేటట్టు ఇదిగో నే చేసెద"నని చేసిన ప్రమాణములు నెరవేర్చుచున్నదీ లేనిదీ చూడవలసినది పీఠాధిపతియేగదా! కనుక ఆ పీఠాధిపతుల అధికారమును పురస్కరించుకొని గురువులగువారిని అవసరమగు పట్ల సరిదిద్దవలసిన బాధ్యత శ్రీవారికుండెను. పీఠాధిపతియనగా గురువులకుగూడ గురుస్థానమున నున్నవారని గుర్తెరుగవలెను. శ్రీవారికేవో స్వార్ధబుద్ధియుండి అందుకొరకే యీ ప్రచారము సాగించుచుండిరి, అనువారు అందుక్క తగిన ఫలమనుభవించక తప్పదు.

శ్రీవారెట కేగిననూ వారితో 10 మందికి తక్కువ గాకుండా ప్రయాణమై వచ్చెడివారు. అందరికగు ఖర్చు శ్రీవారే భరించుచుండిరి. శ్రీ వారివద్ద నిల్వయున్న రొఖ్ఖ నగదు 25000/- రూ.లు. 1940–1945 వరకు శ్రీవారు జరిపిన పర్యటన సందర్భములలో హారతికర్పూరమువలె నిశ్శేషముగ హరించి పోవుటయేగాక యింటనున్న బంగారమున్ను ఖర్చైపోయెను

అదిగాక శ్రీవారు స్తిమితంగా గ్రామంలోయుండి వెనుకటివలె కోర్టువ్యాపారములు చూచుకొని ఆర్జనచేయుటకున్ను సావకాశము లేకపోయెను. ఆర్థికముగ కలిగిన యీ దుష్పరిణామముల కీత్యా శ్రీవారికి స్వార్థబుద్ధియుండెనో లేక వారు నిస్వార్థ బుద్ధితో లోకసేవజేసిరో తెలిసికొనవలసియున్నది.

శ్రీ సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

రెండవ భాగము.

రెండవ ప్రకరణము.

శ్రీవారు సపరివారంగా భీమవరం, బెజవాడ, సరిపల్లి సభలకు వచ్చుచుండిరి. శ్రీవారున్నూ, శ్రీ కోటిలింగంగారున్ను ఉపన్యాసములు గావించుచుండిరి. ఎరుకయొక్క స్థానస్వరూప స్వభావములు వస్తునిశ్చయ పూర్వకముగా గురుముఖతః తెలిసి కొనినగాని ప్రయోజనము లేదని హెచ్చరించుచుండిరి. యీ ప్రాంతములోని వారికి తెలయకపోయిననూ పోవచ్చునుగాని, ఎవరికిన్ని తెలియకుండా వుంటుందా? శ్రీవారు సభలలో ఆ విష యములనుగూర్చి బహిరంగంగా చెప్పకపోయినా, తదితరులవల్ల తెలిసికొనవచ్చునుగదా, అని కోటమర్తి వెంకటరమణయ్యగారు 1948 సం॥ లగాయితు విజయనగరవాస్తవ్యులగు శ్రీ రొంగల సన్యాసయ్యగారినీ వారి శిష్యులగు కూరాకుల దుర్గానందపంచ దశీ స్వాములవారినీ, తుని వాస్తవ్యులు రాపర్తి జగన్నాధంగారి గురువులగు శివానంద సరస్వతీస్వాములవారినీ, అనకాపల్లి వాస్త వ్యులు మద్దుర్తి అప్పలాచార్యులుగారినీ, రాజమండ్రి వాస్తవ్యులు వెంపటి లక్ష్మీనర్సింహ్వాంగారినీ, సభల కాహ్వానించి వారిద్వారా ఎరుక స్థానస్వరూపములు గ్రహించవచ్చునని ఎంచి వారి కాహ్వా నములు పంపుచువచ్చిరి. ఇందు శ్రీ రొంగల సన్యాసయ్య, వెంపటి లక్ష్మీనర్సింహ్వాంగార్లు ఎన్నడూ సభలకేరాలేదు. మిగతావారు

వచ్చుచుండిరిగాని వారివల్ల ఎట్టిప్రయోజనమున్నూ లేకపోయెను పరమహంస పరివ్రాజక జగద్గురు యిత్యాది బిరుదములు వహించి, ఒకప్పుడు పూర్ణబోధయందు కృషికూడా చేసినట్లు చెప్పుకొనుచుండిన బ్రహ్మానందగిరిస్వాములవారికి కోటమర్తి రమణయ్యగారు ఆహ్వానము పంపి రప్పించిరి. ఆయన శ్రీవారితో చర్చించి వారి దివ్యానుభూతియెదుట తన శాస్త్రపాండితి నిరర్థమని శీఘ్రముగా గుర్తించిరి. ఎటులైన పరిపూర్ణబోధరహస్యములను తన సంభాషణా చాతుర్యమున రాబట్టుటకై ఎంతయో యత్నించి విఫలులై ఈయన తుదకు శ్రీవారి వైరివర్గములో చేరిపోయిరి.

అప్పటికే భగద్గీతోపన్యాసకుడుగా పేరుపొందిన శ్రీ దాసరి బ్రాహ్మణయ్యచౌదరిగారిని లోగడ తనకున్న స్నేహమును పురస్కరించుకొని వెంకటరమణయ్యగారు 1944 సంఃలో ఆహ్వానించెను. ఆయనవచ్చి సభలో యుపన్యాసము గావించి, పిదప శ్రీవారితో కలసి కొంచెము సంభాషించుటతోడనే శ్రీవారి ప్రతిభకు ముగ్ధుడై వారి చరణమూలము లాశ్రయించి ధర్మము తెలుసుకొని చరితార్థుడాయెను. 1944 సంవత్సరం భీమవరం సభలకు వెంకటరమణయ్యగారు శ్రీవారిని అధ్యక్షులుగా పిలువక బ్రహ్మానందగిరి స్వాములవారిని సభాధ్యక్షులుగా ఆహ్వానించిరి. ఆ సభలకు శ్రీవారు రాలేదుగాని బ్రాహ్మణయ్యచౌదరిగారిని మాత్రము పంపిరి. బ్రహ్మానందగిరిస్వాములవారు శ్రీవారి యెడల అప్పటికే వైరభావముపూనియుండినవారగుటచే శ్రీవారిని కొంచపరచుచూ ఏవో ప్రగల్భములు పలుకసాగెను. శ్రీవారితో బ్రహ్మానందగిరిస్వాములవారు సంభాషించినపుడు

స్వయింగావుండి వారి చర్చలను, (శ్రీ)వారిని, స్వాములవారు బోధరహస్యములు తనకు చెప్పవలసిందిగా కోరుటయు, శ్రీవారు నిరాకరించుటయు వినియున్న చౌదరిగారు బ్రహ్మానందగిరిస్వాములవారి ప్రగల్భములు విని సహింపజాలక, శ్రీవారిని టెలిగ్రాం ఇచ్చి మరునాటికి రప్పింతుననిన్ని, స్వాములవారి ప్రగల్భములు శ్రీవారి యెదుటనే వినిపించినచో, (శ్రీ)వారు చెప్పునదికూడ, శ్రోతలు విని యదార్థవిషయములను గ్రహింపగలరనిన్ని, సభాముఖమున (శ్రీ) చౌదరిగారు బాహాటముగా చాటిరి. (శ్రీ)వారు వస్తే సభ యేమైపోయినా తాను వెళ్ళిపోయెదనని బ్రహ్మానందగిరి స్వాములవారు బెదిరించిరి. కోటమర్తి వెంకటరమణయ్యగారు అందుపైన తమ మిత్రులగు చౌదరిగారిని బ్రతిమాలి, శ్రీవారిని రప్పించవలదనిన్ని శ్రీవారు వచ్చుటయు, అధ్యక్షులగు స్వాములవారు వెంచేయుటయు జరిగినచో, సభ రసాభాసమై కార్యక్రమము జరిపించుటకు సావకాశముండదనిన్నీ, టెలిగ్రాం యివ్వకుండా (శ్రీ) చౌదరిగారిని వారించిరి. అందుపై శ్రీ చౌదరిగారు శ్రీవార్కి టెలిగ్రాం యివ్వలేదుగాని, బ్రహ్మానందగిరి స్వాములవారి వచనములు ప్రగల్భములుమాత్రమేయని సభవారి కర్థమైపోయెను.

(శ్రీ) బండి రామస్వామిగారు కూడ శ్రీ హనుమంతరాజ యోగీంద్రులవారి శిష్యులే కనుక, శ్రీవార్కి ఆయన గురుభాయీలై వుండిరి. వీరు 1941 సం॥లో జరిగిన సమావేశమునకు మాత్రము హాజరైరి. తూర్పు, పశ్చిమగోదావరీ మండలములలో పరిపూర్ణబోధలో వీరిదే అగ్రతాంబూలం, కాని (శ్రీ)వారితో, గడపిన 1, 2 రోజులలోనే బోధయందు తామెంత వెనుకపడి

యుండిరో వారు గుర్తించగల్గిరి. బోధ రహస్యములన్నియు చెప్పెదను, తెలుసుకొని ప్రచారం చేయవలసినదిగా శ్రీవారెంత చెప్పిననూ, రామస్వామిగారు వృద్ధులమైపోతిమనిన్ని, యిక క్రొత్తగా తెలిసికొని జీర్ణించుకొని ఇతరులకు చెప్పు సామర్థ్యము లేదనిన్ని, మిన్నకుండిరి "సిరిరా మోకాలొడ్డు" విధమయ్యెను.

1941 సం॥లోనే, శ్రీ బండి రామస్వామిగారింట జరిగిన పూజాసమావేశములో ఆయన ప్రధాన శిష్యులగు శ్రీ భై రాజు సత్తిరాజుగారు గురువుగారి ఆదేశానుసారం బోధచెప్పుటకు నిరాకరించిరి. గురువుగారి సమక్షంలో బోధచెప్పుటకు భయముగానున్నదనీ, క్షమించమనీ, ప్రాధేయపడుచూ సత్తిరాజుగారు గురువుగారి పాదములు పట్టుకొని బ్రతిమాలుచుండిరి వీలులేదు తప్పక చెప్పవలెనని రామస్వామిగారు పట్టుబట్టిరి చెప్పనని సత్తిరాజుగారు నిరాకరిస్తూ వచ్చిరి. అందుకు రామస్వామిగారు ఆగ్రహావేశపరులై పాదాక్రాంతులై యున్న శ్రీ సత్తిరాజుగారికి ఘట్టిగా తన చేతికర్రతో దేహశుద్ధి చేసిరి. శ్రీ సత్తిరాజుగారు పరమ శాంతచిత్తులు. నాకు వారితో 23 సంవత్సరములుగా పరిచయమున్నదిగాని, వారికి కోపమువచ్చుట యెన్నడు చూడలేదు. గురుభక్తి విషయంలో వీరిని ఆంజనేయస్వామితో పోల్పవచ్చును. సదిమందిలో జరిగిన ఈ పరాభవముగూడ వీరి శాంత చిత్తమును కల్లోలపరచలేదు. రజోగుణమునకు పేర్పడిన క్షత్రియులై యుండియు, ఈ మహాత్రుంకూడ వీరికి కోపంరాలేదు. హృదయము అభిమానగ్రస్తముకాలేదు. పెద్దలెవరు తటస్త పడినా వారికి సేవచేయుచుండుట సత్తిరాజుగారి స్వభావము. వీరు, శ్రీవారు యీ ప్రాంతంలోనుండిన కాలమంతయు

శ్రీవారిని క్షణమైన వీడక సేవించుచూ, నీడవలె వారిననుసరించి వారి ప్రజ్ఞావిశేషమును పూర్తిగా గుర్తెరిగిరి. తమ గురువులైన రామస్వామిగారు తెలుసుకోదగిన గురుగోప్యవిషయములు యెన్నియో వున్నప్పటికి రామస్వామిగారు తెలుసుకొనుటకు నిరాకరించిన విషయము శ్రీ సత్తిరాజుగారికి స్వయంగా తెలుసును. ముఖ్యాతి ముఖ్యమగు విషయములు మగుగున నుండిపోవు స్థితి ఏర్పడెను. ఈ జన్మతో సరిపుచ్చుకోవాలని ఎట్టి త్యాగమైనను చేయుచూ ఆ మహాదాశయమునకు జీవిత ము కైంకర్యము చేయదలచిన వ్యక్తిగదా! ఏవిధంచేసైనా బోధ రహస్యములు తెలిసికొనియే తీరవలెను. ఈ మానవశరీరము కల్గి నందుకు దానిని సార్థకపరచుకోవలెను. "ఇహాచేదవేదీ బహు సత్యమస్తి యిహాచేనవేదీ మహాతీవినష్టిః" యిప్పుడే యీ క్షణ మందే యిక్కడే తెలియదగినదానిని తెలుసుకొనకపోయినచో మహత్తరమైన నష్టమును పొందుదువు అని శ్రుతి హెచ్చరించు చున్నది. కనుక, శ్రీ సత్తిరాజుగారు శ్రీవారికి శరణాగతులై ధర్మపద్ధతిగా వారివలన బోధపొందుటతప్ప గత్యంతరం లేదని యెంచి, ధర్మోపదేశము చేయుడని కోరుటయు, శ్రీ రామస్వామి గారు తాను తెలిసికొని యితరులకు చెప్పుట అంగీకారపూర్వమే నిరాకరించినందున శ్రీవారు సమ్మతించి ధర్మోపదేశము చేయుటయు, జరిగెను.

జల్లి కాకినాడ గ్రామ కాపురస్థులు శ్రీ పేరిచర్ల వెంకట రాజుగారు అంతకుపూర్వం అనేకమంది గురువుల నాశ్రయించి తృప్తిపొందని హేతువుచే శ్రీవారి నాశ్రయించి ధర్మోపదేశము గొని కృతార్థుడాయెను. అట్టివిధముగానే కొవ్వలి గంగమ్మ,

జాలం రాజుగారు, (శ్రీ)వారివలన ధర్మోపదేశముగొనిరి. యానాలపల్లి గ్రామంలో లక్ష్మీనరసమ్మగారను భక్తురాలు (శ్రీ) బండి రామస్వామిగారికిన్ని, (శ్రీ)వారికిన్ని పూజగావించవలెనని యిర్వురను ఆహ్వానించగా యుభయులు వెళ్ళియుండిరి. ఆమె బండి రామస్వామిగారి భక్తురాలు. అయినను యుభయులను ఎంతోసన్మానించి యుభయులకు పూజగావించెను. కాని యిది రామస్వామిగారికి చాల కష్టము గలిగించెను. రామస్వామి గారు (శ్రీ)వారి వలన విషయములు తెలుసుకొని శిష్యులకు చెప్పు టకు నిరాకరించిన విషయమామెకున్ను తెలిసియేయుండెను. (శ్రీ) సత్తిరాజుగారివలెనే ఆమెయున్ను (శ్రీ)వారివలన ధర్మము తెలసికొనెను. సరిపల్లి కాపురస్తులు క్రొవ్విడి శేషమ్మగారున్ను ఆమె శిష్యురాలు రెబ్బాప్రగడ మహెమ్మగారున్నూకూడ శ్రీవారి వలన ధర్మచెప్పుకొనిరి, భీమవరం సాంప్రదాయమునకుచెందిన (శ్రీ) పెమ్మరాజు రామబ్రహ్మశాబాజీగారు (శ్రీ)వారి వలన ధర్మము తెలిసికొని తమకు చెప్పుటకు నిరాకరించినందున ఆయన శిష్యులగు (శ్రీ) కేశరాజు శేషాచలంగారు, వారి సతీమణి మాణి క్యాంబగారు (శ్రీ)వారి వలన ధర్మోపదేశముబొంది కృతార్థు లైరి. (శ్రీ) సత్తిరాజుగారు శ్రీవారివలన సాంప్రదాయక ప్రబో ధమును చక్కగా గుర్తెరిగి వారి శిష్యమండలివార్కి చెప్పుచుం డుటచేత వారందరును చక్కగా కృషిచేయసాగిరి.

కాని శ్రీ సత్తిరాజుగారి ముఖ్యశిష్యులును, బోధాధికా రులును, అప్పట్లో మాకు గురువులున్ను అయిన శ్రీ పాలూరి జగన్నాధరావుగార్కిమాత్రం అప్పట్లో యీ బోధ దూరస్త ముగానుండిపోయెను. ఆ గురుశిష్యులకిద్దరకు అప్పట్లోగల వైష

మ్యములే అందుకు కారణము. శ్రీ జగన్నాథరావుగారును వారి శిష్యులగు అస్మదాదులున్ను శ్రీ వారి గొప్పదనమున్ను వారు బోధించిన విషయప్రాముఖ్యమున్ను ప్రప్రథమంలోనే గుర్తించి నప్పటికీ, శ్రీ జగన్నాథరావుగారు, (శ్రీ వారి నిర్ణయం ప్రకారం) వారిగురువులగు శ్రీ సత్తిరాజుగారివల్లనే బోధ తెలుసుకొనక తప్పదు. గత్యంతరంలేదు. చివరకు శ్రీ జగన్నాథరావుగారు శ్రీ సత్తిరాజుగారి అనుగ్రహ వాత్సల్యములను తిరుగ సంపాదించుకొని 1946 లో శ్రీ సత్తిరాజుగారివలన నిజప్రబోధమును పొందగల్గిరి.

భీమవరంలోజరిగిన సభాసమావేశములలో 1945 లో జరిగిన సభ కట్టకడపటిది. ఈ సభకు అధ్యక్షులుగా శ్రీ వారే ఆహూతులై విచ్చేసిరి. మూడురోజుల కార్యక్రమము ఆనాటితో ముగియనుండెను. కోటమర్తి వెంకటరమణయ్యగారు పరిపూర్ణబోధ హారికథారూపముగ వ్రాసి హరిదాసుగా సభలో తానే గజ్జెకట్టి హరికథాకాలక్షేపము చేసిరి. పిదప వెంకటరమణయ్యగారిచే శ్రీ వారికాగ్రంథము అంకిత మొసంగబడెను. శ్రీ వారికిన్ని ఆనందము కలిగెను. శ్రీ వారు కందార్థ విచారణచెప్పి పిదప సభాసమాప్తి గావించవలసివుండెను. కందార్థముల యొక్కయు, కందపద్యముల యొక్కయు నిర్మిత విధానమునుగూర్చియు, శక్తిద్వయయుత రాతురోపాధి ద్వయ దోషముల గూర్చియు విపులముగా యుపన్యసించి ఆ ప్రాతిపదికపై కందార్థ విచారణ జరుగవలెననిన్ని చెప్పి, అట్లా ఆసమావేశములో నున్న గురువులు తమశిష్యులకు ప్రబోధించుచున్నారాయనియు, శ్రీ వారు పృచ్ఛ చేసిరి. దుర్గానంద పంచదశీ స్వాములవారి శిష్యుడగు ఆరట్ల రామారావుగారున్ను, తుని వాస్తవ్యులగు

రాపర్తి జగన్నాథంగారున్నూ, తాముచ్చముగ నట్లే ప్రబో ధించుచున్నామని బీరములు పల్కిరి. అది నిజమేఅగుచో తాము చెప్పవలసిన అగత్యమేలేదని శ్రీవారు మౌనము వహించి అంతటితో సభాసమాప్తి గావించిరి. అట్లుగాక సభలోని యితరగురువులతోపాటు యీయిర్వురునుగూడ మౌనము వహించినచో ఆసభలోనే శ్రీవారికనూ కొన్ని ముఖ్యవిషయములు ప్రబోధించియుండెడివారు. వానివల్ల సాంప్రదాయక రహస్యములు కొన్ని బయల్పడి లక్షణయుతులగు పెక్కురు తరించుటకు సావకాశమేర్పడియుండెడిది. పాపము! వారికది ప్రాప్తించు నదృష్టము వారి సంస్కారములో లేదు కాబోలు!

శ్రీ రాపర్తి జగన్నాథంగారి మాటలు కేవలం బీరములేయని, కొలదికాలములోనే రూఢియాయెను. ఆయన కృష్ణదాసుగారి కందార్థములకు తాత్పర్యం వ్రాసి, అచ్చొత్తించి శ్రీవారికిని, నాకును యొక్కొక్క ప్రతిని పంపిస్తూ, అందు తప్పులుంచే సూచించవలసినదిగా కోరిరి. "ఏమి శెలవు?" అని శ్రీవారికి నేను వ్రాసి, వారి యాజ్ఞానుసారం "30 వ కందార్థములోనూ, 284 వ కందార్థములోనూ ప్రశ్నోత్తరము లెవరెవరివో వివరింపుడు. ఆ పిమ్మట తప్పొప్పులు సరిచూడవచ్చును" అని జగన్నాథంగార్కి వ్రాసితిని. "పెద్దలు మీరే శెలవీయండి" అని వ్రాసి ఆయన మిన్నకుండెను. కందార్థ నిర్మిత విధాన మెంతవరకు ఆయన కవగతమయ్యెనో ఆ రెండు కందార్థములకు ఆయన వ్రాసిన తాత్పర్యమే విజ్ఞులకు తేటతెల్లము చేయగలదు.

శ్రీ సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

రెండవ భాగము.

మూడవ ప్రకరణము.

1940 సం॥లో శ్రీవారితల్లి మల్లమాంబగారు కాలధర్మము నొందిరి. శ్రీవారి ప్రథమకళత్రము శ్రీమతి చెన్నమాంబాతల్లి పక్షవాతవ్యాధివచ్చి మంచమెక్కెను. ఆమెవల్ల శ్రీవార్కిగలిగిన సంతానములో హనుమాభాయి, సక్కుభాయి లేతవయస్సులో నుండిరి. ఆమెకుపచారములు గావించుటకు యింట మరెవ్వరూలేరు. శ్రీవారే ఆమెకు సమస్తోపచారములు చేయుచుండిరి. శ్రీవారి అమృతహస్తములతో గావించు యుపచారములలో ఆమె శరీరబాధల కుపశాంతి గల్గుచుండెను. శ్రీవారు చెంతనుంటే, ఆయమ్మ తమబాధలన్నిటిని మరచి ఆనందముగా యుండగల్గెడివారు. అందుచే శ్రీవారు తప్ప యితరులవల్ల ఉపచారములు పొందుటకుగూడా ఆమె నిరాకరించుచుండిరి. స్నానముచేయించుట జడఅల్లుట, బట్టలు మార్పించుట సమస్తము - శ్రీవారు సంతోషముగా ఉపచర్యలు జరుపుచుండెడివారు. ఆహా! పత్నిప్రేమయున నిట్లుండవలెనని లోకము కీర్తించుచుండెను. కాని విధి బలీయము. కన్నులలో బెట్టుకొని కాపాడినా, శ్రీవారికామె దక్కలేదు. పసివాండ్లయిన యిర్వురి కుమార్తెలను వీడి శ్రీవారి చేతులలో ఆమె తృప్తితో 1944 సం॥లో జూన్ నెల 20 వ తేదీని కన్నుమూసెను. పసాధ్వియైన తుది ఘడియలలో యింతకన్న కోరుకొనగలిగిన దేమున్నది!

శ్రీవారికప్పటికి 46 సం॥లు. కాని శ్రీవారి దేహము వ్యాయామముచేతను యోగ సాధనలలోనూ, చూపులకు బహు సుకుమారంగా తోచిననూ, వజ్రసన్నిభమై యుండెను, 35 సం॥లు దాటనివారుగా కన్పట్టెడివారు. ద్వితీయ వివాహము చేసుకొమ్మని బంధుమిత్రులు యెంతవత్తిడి గల్గించిననూ వీరు అందుకియ్యకొనలేదు. ఐన కర్మ ఏమోఅయినది. తిర్గిసంసారబంధను దృఢముచేయనేల? అంతేగాక గతించిన సతీ తిలకం కన్నుల గట్టినట్లుండగా, ఆమె పసిపిల్లలిర్వురు మాటిమాటికి ఆమెను స్మృతిపథమునకు తెస్తూవుండగా ద్వితీయ వివాహ ప్రసక్తి అనూహ్యముకదా! కాని శ్రీవారిపై మరొకవైపు నుంచి అనివార్యమైన వత్తిడి కలుగజొచ్చెను. ఈ వత్తిడి ఈ సాంప్రదాయక పెద్దలవల్ల, సహాధ్యాయులగు పల్లెల కోటిలింగంగారివల్ల, సోదరులగు తైదల కొమరయ్య వగైరా గాఢ్లవల్ల భక్తాదులవల్ల చేయబడెను. "రాజయోగ ధర్మమవలంభించిన వారుగదా శ్రీవారు? శ్రీవారి శిష్యులలో పెక్కుమంది స్త్రీలున్నా కలరు. శ్రీవారు భార్యాసహితులై యుంటేనే గాని వారి రాకపోకలకు అభ్యంతరంగా నుండును. వందలాది శిష్యులకు మాతృవాత్సల్యమే కరవై పోవుమ. నోరార, అమ్మా! అని పిల్చుకొను మహద్భాగ్యము వారికుండజాలదు." ఇదీ వీరి వాదన. చివరకు శ్రీవారంగీకరించక తప్పలేదు. కొలది కాలములోనే అనగా 9–11–1944 వ తేదీని రెబ్బావారింట బుట్టిన అనసూయ అను కన్యారత్నమును శ్రీవారు యథా శాస్త్రీయంగా వివాహమాడిరి.

వందలాది శిష్యులుగల శ్రీదుర్గానంద పంచదశీస్వామి, ఆదినుండియు శ్రీవారి ఔన్నత్యముగుర్తించి వారియెడల

భక్తిభావమునే ప్రకటించుచూవచ్చిరి. ది 8-12-43 తేదిని వీరి సోదరులగు రంగనాథ పంశదళి స్వామిన్ని దుర్గానందగారి శిష్య మండలివారున్ను దుర్గానందగారి ప్రోత్సాహముతో శ్రీవారి కొక సన్మానపత్రమొసంగి గౌరవించిరి. ఆ సన్మానపత్రిక యీ క్రిందివిధముగా నున్నది.

శ్రీ గురువేనమః

ఓం

శ్రీ దయానంద పొన్నాల రాజయార్య దేశికేంద్రులవారికి

సమర్పించిన

సన్మానపత్రము

శా॥ శ్రీనారీమణి పాదపద్మయుగళిన్ సేవింప జెన్నొందుచున్
నానందంబున దుగ్ధసాంద్రదలపై నాగేంద్రుతల్పంబుపై
దీనాలాపన భక్తశ్రేణికి కృపన్ దిక్కైన విష్ణుండె శ్రీ
పొన్నాలాన్వయరాజయాఖ్య ప్రభునిన్పూజింతుసద్భక్తితోన్

ఉ॥ ఆంధ్రవధూటి సద్గురుల యార్యుల బ్రోచెడు కీర్తిసాంద్ర బా
ల్యాంద్రము పూర్ణచంద్ర, పరసద్ఘనసన్నుత ధీరరాజయో
గీంద్ర. సుభక్తకోటి పరకీర్తిని పూజిత దేశికేంద్ర, పూ
ర్ణాంధ్రవరేంద్ర రాజయ పరాత్మ నిరంజన పూర్ణపూరుషున్

చ॥ అతులిత సర్వధర్మముల నన్నిటిజేర్చియు పూర్వగ్రంథముల్
చతురతమీర ముద్రితము, శాయవె, సద్ఘనముద్దరింపగా
యుతమతిసజ్జనాళి కుపయోగ్యుడవౌ ప్రభుని న్నుతింప యం
చితమతి వచ్చిపోపు బుధశేఖరపంక్తి బహూకరింపుచో
రతనపు కీర్తిగన్న ప్రభురాజయగోప్య వినిర్మలాత్మునిన్

ఉ॥ యిందున సందు నెందనక యెందుననున్న పరుండవయ్యు స
ద్బృందము కెల్ల మాయనెడి బిందువుమాపవె సూనృతంబుచే
పొందిక జేసి బ్రోచిన ప్రభోత్తమ, సత్ప్రభులెల్ల నిన్ దయా
నందని పేరుబిల్వ, సుధనామృతధార సువృష్టిచేత యా
నందను దారభావనమునన్ ధరియింపవె మందబుద్ధులన్
సందియముంచకుండ పరశాశ్వత దిగ్విజయాత్మ పుష్కరా

మ॥ స్థిరసీదివ్యయశఃప్రకాశమును, దాక్షిణ్యాదిభామంబు భా
స్కర సుత్రామ విధాత విష్ణుశివులన్ సంతృప్తులన్ జేయగా
దరినాట్యాదితురంగ గద్దియల నానావస్తు సుభ్రాంశము
ష్కరమై సత్యపదోన్నతిన్ వెలసె నీసర్వాత్మ నై పుణ్యతన్
వరకర్పూర సుమంగళారతులు నివ్వన్ రారె జై! జైయనన్

సావేరి — చతురస్ర

1. శ్రీ దయానంద ప్రభుదీనావయాం । శ్రితజనానందాతిశావ
రాళ్లు ॥శ్రీ॥ నాదామోదానంద రహితాషమిత చరిత ।
వాదాభేదములేని మేధానిధివనంత

2. శ్రీ మందిప్పలవంశ సుధారాసి । శ్రీమంతుడు పూర్ణచంద్ర
వరప్రభు । భూమానంద హనుమంత యార్యేశుని । పూజిత
సంపూర్ణ సిద్దిబడసిన॥ మి॥ సామవేదాతీత వమలధార్మిక ।
స్వామిసాక్షిరహితాంతర్యామి । సోమ సూర్యనుత సమత
సద్గుణ । స్తోమ విజయపూర్ణ సార్వభౌమా ॥శ్రీ॥

3. వున్నపరము వుండజూపి । తిరములేకున్న భ్రమను లేకజేసి
నిజముగ । వున్నపరము లేనియెరుక నెరుగక । యున్న
యునికి మన్న నిరంజన శ్రీ॥ మి॥ పౌన్నాలాన్వయపాల సింధు

వర । పూర్ణచంద్ర పురుషోత్తమ ప్రభుమా । బున్నామ నర కమును విలీనమొసగిన । పూర్ణపురుష పుణ్య మూర్తి బుష్కర ॥శ్రీ॥

4. తేజమైన దేహిని పరవర్జిత । దేవవిమల పరదిక్పూర్ణ చరిత । మోజు త్రివిధదీక్షల ప్రసాదిత । బీజరహిత బిందుపూర్ణలక్షణ॥ మి॥ పూజనీయ పుష్కర సుభక్తసుర । భూజ విమలధామ ధరబిరాజా । రాజరాజసఖ్య ఈశ్వరాంశా । రాజయార్య రాజ యోగీంద్రప్రభు ॥శ్రీ॥

5. సకలధర్మ సద్విచారణానిధి । సమరసబుధ సత్కీర్తి మకుట ధర । మకళంక హృదయమమిత పరాత్మా । మనహంకార మతీత పూర్ణనిభు । మి॥ నిఖిలలోక రహిత నిర్వికారా । నిష్కళంక నిరుపమాన । నిశ్చల । నికరనిర్జరుల సన్నుత భూమా । నిత్య నిరామయ పూర్ణ సద్వ్యోమ ॥శ్రీ॥

6. అజడ జడంబుల ఆదితత్వమున । త్యజిత సుఖదుఃఖ విజిత పరిపూర । ద్విజరాజ వినుత దివిజవంద్యుడన । ద్విజవిదళిత ధీర మహా మహుడవు । మి॥ నిజనటనా కవినుత శ్రీమంతుడ సుజనోద్ధారక నిజదేశికేంద్రా । భజియించెద పరమ కేవ లాత్మా । పంచదశీవర రంగస్వామినుత ॥శ్రీ॥

శ్రీ దయానంద హొన్నాల రాజయార్య దేశికేంద్ర
ప్రభుమహారాజకీ జై!

నరసన్నపేట } ఇట్లు
8-12-43 } శ్రీ కూరాకుల దుర్గానంద సరస్వతి
పంచదశి స్వామివారి శిష్యమండలి
నరసన్నపేట, శ్రీకాకుళం తాలూకా, (విశాఖపట్నం జిల్లా).

శ్రీ దుర్గానంద పంచదశీస్వామి, శ్రీ రంగనాథ పంచదశీస్వామితో గలసి 1942 సం॥ లగాయితు భీమవరం, బెజవాడ వగైరా సభలకు వోజరై కార్యక్రమమునందు పాల్గొంటూ శ్రీవారి యుద్బోధనలను వింటూవుండిరి. శ్రీవారివలన బోధయందలి సాంప్రదాయక రహస్యములను ధర్మపద్ధతిగా గ్రహించి తాను తరించి యితరులను తరింపచేయు సద్బుద్ధితో వీరు 1945 సం॥ శికిందాబాద్ వెళ్ళి, శ్రీవారిని యథావిధిగా పూజించి ధర్మోపదేశము గొనిరి. శ్రీవారివలన ఆరాత్రే వీరితో పాటు కొవ్విడి మహాలక్ష్మమ్మగారి తల్లిగారగు నండూరి రామలక్ష్మమ్మగారు (వయస్సు 60 సం॥లు) కూడా ధర్మోపదేశము పొందిరి! సాంప్రదాయ పద్ధతిప్రకారం సమావేశమైన పెద్దలకుమాత్రమే గాక, తనకన్న ముందుగా శ్రీవారివలన ధర్మము తెలిసికొనియుండిన అగ్రజులకు కూడ దుర్గానందస్వామి సాష్టాంగ నమస్కారము లాచరించవలసి వుండెను. అట్లే ఆయన శ్రీవారి అజ్ఞానుసారం స్త్రీ పురుషాదులందరికి సాష్టాంగనమస్కారము లాచరించెను. కాని, వందలాది శిష్య ప్రశిష్యులచే నమస్కారము చేయుటయేగాని యితరులకు సాష్టాంగ నమస్కారముచేయు నలవాటులేని తాను యిప్పుడు శ్రీవారి శిష్యపరమాణువునకు గూడ సాష్టాంగ మాచరింపవలసి వచ్చెగదా! తనయెడల శ్రీవారింత కాఠిన్యము వహించనేల? అని అభిమానము, శ్రీవారిపై కోపము యినుమడింప, శ్రీవారి పాదసన్నిధిని కొంతకాలముండి సాంగోపాంగముగ మర్మధర్మములను తెలుసుకొనుటకు బదులు, పరాభవింపబడిన వానివలె వెడలిపోయెను.

1946 సం॥లో కార్తికపౌర్ణమికి, రాపర్తి జగన్నాథము గారు, భీమవరం కోటమర్తి వెంకటరమణయ్యగారి ప్రోత్సాహ సహకార సహాయములతో తుని గ్రామంలో తానుకట్టించిన ఆశ్రమమందు సభలు, పూజాదులు ఏర్పాటుచేసి కోస్తాజిల్లాల లోని ప్రతిపక్ష సంఘములవారి నందరినీ ఆహ్వానించెను. సభాధ్య క్షులుగ శ్రీవారి విరోధివర్గములోనివాడగు అరిగె రామస్వామి గారినిన్నీ, ఉపాధ్యక్షులుగ బ్రహ్మానందగిరి స్వాములవారినిన్నీ ఆహ్వానించెను. అందరితోపాటు శ్రీవారికిన్నీ ఆహ్వానము పంప బడియుండెను. అరిగె రామస్వామిగారు శ్రీవారి గురుభాయీ లే కదా! వారువచ్చి, శ్రీవారివద్ద తమకందరికి తెలిసిన విషయ ములుగాక తెలియదగిన రహస్యములేమీ లేవనిన్నీ. శ్రీవారు కేవలం శిష్యులను చేకూర్చుకొనుటకై ఏదో యింకనూ వున్న దని తెల్పేవిషయం ఒకప్రచార సాధనం మాత్రమేననిన్నీ, చెపితే శ్రీవారిని పూర్తిగా తిరస్కరించవచ్చుగదా! యని శ్రీ కోట మర్తి వెంకటరమణయ్యగారి యొక్కయు రాపర్తి జగన్నాథం గారియొక్కయు యూహ. ఈ పథకము వేసియుందురని శ్రీ వారు ముందుగానే గ్రహించి అరిగె రామస్వామిగారిని అడగ వలసిన ప్రశ్నలు, అందుకు వుత్తరములు, అడగవలసిన కంఛార్థ ములు, వానికి నిజప్రబోధ విధానమునగల సాంప్రాదాయ కార్థము, యిత్యాదులు తగువిధంగా బోధించి తమ శిష్యులైన దాసరి బ్రాహ్మణయ్య చౌదరిగారినిన్నీ, శ్రీ భైరాజు సత్తి రాజుగారినిన్నీ, తుని సభలకు పంపిరి.

అధ్యక్షులగు అరిగె రామస్వామిగారిని అడుగుటకై ప్రశ్నల వ్రాతతో సిద్ధంగా వచ్చితినని శ్రీ చౌదరిగారు కొం చెం నోరుజారిరి. దానితో అట్టి అవకాశము చౌదరిగారికి కలి

గించరాదని రామస్వామిగారు, బ్రహ్మానందగిరిగారు, వారిజాగ్రత
యందు వారుండి శ్రీవారి విషయం ఏవిధంగానూ ఎత్తుకొనక
వారిని యిసుమంతయైన తూలనాడక రెండురోజులు కాలక్షే
పము చేసిరి. మూడవరోజు సాయంత్ర సభా కార్యక్రమము
జరుగుచుండెను. శ్రీ దుర్గానంద పంచదశి, పొరపాటున శ్రీవారి
విషయమెత్తి, తాను శికింద్రాబాద్ పోతిననిన్ని శ్రీవారు తనకు
క్రొత్తగా బోధించిన విషయమేమిలేదనిన్ని ఉపన్యాసము మధ్య
ప్రసంగవశాత్తు చెప్పెను. దానితో శ్రీ చౌదరిగారు తనకు
మాట్లాడు నవకాశమిమ్మనుమని అధ్యక్షులను కోరిరి. ఎట్టి అవ
కాశ మీయకూడదని తొలుతనేవారు నిర్ణయించుకొన్నందున
అవకాశ మీయ నిరాకరించిరి అందుపై చౌదరిగారు, అధ్యక్షులు
పక్షపాత బుద్ధితో తన కవకాశమిచ్చుటకు నిరాకరించినారు,
దుర్గానంద పంచదశి అసత్యప్రచారము చేసినాడు, తాను సత్య
విషయను చెప్పవలసి వున్నది, కనుక తనకనుజ్ఞనిమ్మనీ, మాట్లా
డుట కవకాశమివ్వమనీ, సభాసదులకే శ్రీ చౌదరిగారు విజ్ఞప్తి
చేయగా సభవారు తమ కరతాళ ధ్వానములతో తమఆమోద
మును ప్రకటించిరి. చౌదరిగారు సభావేదికనెక్కి, దుర్గానంద
పంచదశి శ్రీవారిని ఆశ్రయించి ధర్మోపదేశము గొనుట, శ్రీ
వారు సమావేశమైన గురుపుత్రుల కందరికి సాష్టాంగ నమస్కా
రములు చేయుమని శ్రీవారు దుర్గానందగారిని ఆజ్ఞాపించుట,
దుర్గానంద అట్లుగావించి పరాభవింపబడినవానివలె అభిమాన
గ్రస్తచిత్తముతో ఎవరికీ మొఖముచూపించక మరునాడే వెడలి
పోవుట, యిత్యాది సమస్తము సభలో నివేదించుచుండగా అరిగె
రామస్వామిగారున్నూ, బ్రహ్మానందగిరి స్వామియున్ను, తమ
ఆసనములనుండి లేచి సభావేదిక దిగి వెడలిపోయిరి. శ్రీవారికి

తప్ప సాంప్రదాయక బోధ రహస్యములు మరెవరికీ తెలియ వనిన్ని, తెలిసియున్నవని అధ్యక్షులుగాని, ఉపాధ్యక్షులుగాని సభలో మరెవరుగాని అనగలిగి నిలబడితే, తానడుగు ప్రశ్నలకు సమాధానమీయవలసిందనిన్ని చౌదరి సింహనాదము చేసెను. శ్రీ చౌదరిగారడిగెదమన్న ప్రశ్నలకు సమాధానమిత్తుమని యొక్కరును అనలేకపోయిరి. అవిరంగా సమావేశమైన గురువుల బండారము బైటపడిపోయెను ఇది (శ్రీ)వారు పరోక్షంగా సాధించిన విజయములలో నొకటి.

1946 సం॥లోనే, (శ్రీ) బండి రామస్వామిగారు పరమపదించిరి. వారి ఆరాధనా కార్యక్రమమునకు ఆహూతులై (శ్రీ)వారు విచ్చేసిరి. రామస్వామిగారి ఆరాధన మహోత్సవమునకున్ను ప్రతిసాంవత్సరిక ఆరాధనలకున్ను, కొంత మూలద్రవ్యము చందాగా వసూలుచేయుటకు, రామస్వామిగారి భక్తమండలి వారు దలపెట్టిరి. కాని ఒండొరులయందు నమ్మకములేక (శ్రీ) వారినే చందాలు వేయుంచి వసూలుచేసిపెట్టవలసినదిగా కోరిరి. (శ్రీ)వారు పూనుకొననిచో ఆరాధన జరుగుటయే సందేహాస్పదముగా నుండెను. కనుక (శ్రీ)వారు అభారము తామే వహించి, ఎవరికెంత చందా వేయవలయునో వేసి, వారివద్దనుంచి వెంటనే వసూలుచేసి, సమాధి నిర్మాణము గావించి, శేషించినసొమ్ముతో సమారాధన జరిపించమని యిచ్చివేసిరి. తొలిసంవత్సర ఆరాధనా కార్యక్రమము (శ్రీ)వారి సాన్నిధ్య బలపూత్రిమున నిర్విఘ్నముగా జరిగిపోయెను. 4 రోజులుండి మూలధనసేకరణ నిమిత్తం చందాలిస్టు తయారుచేయించి అపనికూడా చేసి పెట్టి పొమ్మని, (శ్రీ)వారిని రామస్వామిగారి కుటుంబము వారున్ను,

శిష్యులున్ను కోరిరి. కాని ఆవిషయంలో యెట్టి ప్రశక్తి పెట్టు కొనుటకున్నూ, శ్రీవారు అంగీకరించలేదు.

1947 సం॥లో తెలంగాణమున రజాకార్ల అల్లర్లు చెల రేగుచుండెను. పట్టపగలే యిళ్లుదోపిళ్లు, గృహదహనములు, హత్యాదులు, స్త్రీల మానభంగములు, జరుపుచు రజాకార్లు విజృంభించిరి. ప్రజలు తమ తమ ధన, మాన, ప్రాణములను అరచేతిలో పెట్టుకొని ఏక్షణమున తాము ఏ అత్యాచారమునకు పాల్పడుదుమోయని భయ విహ్వలులై యుండిరి. కుటుంబ రక్షణమేగాక పీఠమును రక్షించు బాధ్యతగూడ పీఠాధిపత్యులగు శ్రీవారిపై నుండెను. అమూల్యములగు తాళపత్రగ్రంధములు, వ్రాతగ్రంధములు, ముఖ్యముగా రక్షింపబడవలసి యుండెను. కుటుంబములతో, జంటనగరములగు హైదరాబాద్, సికింద్రాబాద్ వాస్తవ్యులగు హైందవులు, కొద్దో గొప్పో వున్నవారు, సర్కారుజిల్లా గ్రామాలకు పోవుచుండిరి. పీఠగ్రంధములు అన్నీ దేవదారు పెట్టెలలో ప్యాకింగు చేయించి శ్రీవారు వానిని తీసు కొని కుటుంబంతోసహా బెజవాడ గ్రామం తరలివచ్చిరి. బెజవాడ గ్రామంలో, ఆరోజులలో బియ్యము దొరకక పోవుటవలన ప్రభుత్వ రేషనింగు షాపులలో ఒకపూటకు సరిపడు బియ్యముమాత్రమే దొరకుచుండెను. గాని కడుపునిండా తినుటకు దొరకకుండెను. శ్రీవారికి పర్మిటు దొరకుటయే దుర్లభమయ్యెను. రేషనింగు సూత్రములు బహు ఖచ్చితముగా అమలు జరుపబడుచుండెను. శ్రీవారున్నూ, కుటుంబమున్నూ, యీపరిస్థితులలో చిక్కుపడి బెజవాడ గ్రామంలో యిక్కట్లు పడుచున్నారని తెలుసుకొని వారిని తాడేపల్లిగూడెంవచ్చి వుండవలసిందిగా శ్రీవారి భక్త

ముందర వారు పట్టుపట్టుటచే. శ్రీవారు బెజవాడనుండి మరల బయలుదేరి తాడేపల్లిగూడెం విచ్చేసిరి. శ్రీవారి శిష్యులైన కేశరాజు శేషాచలంగారి రెండిండ్లలో ఒకయిల్లు ప్రత్యేకంగా శ్రీవారికి విడిదిగా కేటాయించబడెను. ప్రాంతీయ భక్తాదుల పూర్వపుణ్యము ఫలించినది ఎల్లప్పుడు శ్రీవారిని 30, 40 మంది భక్తులు పరివేష్టించి శ్రీవారి వాగమృతమును గ్రోలుచుండిరి. కుటుంబ సంరక్షణాది వ్యవహారములలో శ్రీవారికెట్టి శ్రమ అవసరంలేకుండా భక్తాదులే బాధ్యత వహించి శ్రీవారి కన్నిసౌకర్యములు గల్గించి యెట్టి యిబ్బంది కలుగకుండా చేయుచుండిరి. క్షై రాకుల వెంటపాడు వాస్తవ్యులు శ్రీవారి శిష్యులగు చోడగిరి సత్యనారాయణగారు ప్రతినిత్యమూవచ్చి శ్రీవారిని సేవించుకొని పోవుచుండిరి.

(శ్రీ) సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

నాల్గవ ప్రకరణము.

ఇక్కడ శ్రీవారి చరిత్రతో పెనుగొని యున్నంతలో కొంతవరకు నాస్వీయచరిత్రి నుల్లేఖించుట అప్రస్తుతం కాదని నాయూహ. బండి రామస్వామిగారి శిష్యుని శిష్యులగు శ్రీ పాలూరి జగన్నాధరావుగారివద్ద నాఅత్తగారగు అయ్యగారి కామేశ్వరమ్మగారున్ను పిదప నేనున్ను, నాభార్య సీతామహాలక్ష్మిన్ని 1937 సం॥లో ధర్మోపదేశముగొని కృషిచేయు చుంటిమి. 1941 సం॥లో భీమవరంలో జరిగిన సమావేశములో ప్రప్రధమంగా శ్రీవారిని సందర్శించుభాగ్యము నాకు చేకూరెను. 1942 నుండి ప్రతిసం॥రం జరుగు భీమవరం, బెజవాడ, సరిపల్లె సభలకు మేము పోవుచుంటిమి. పీఠాధిపతులగు శ్రీవారిప్రతిభా విశేషములాదిలోనే మాకు సువ్యక్తమాయెను. ఎరుకయొక్క స్థాన, స్వరూప, స్వభావములు, మంత్రములయొక్క నిజాభిప్రాయమూ తప్పక తెలియవలసియున్నదని శ్రీవారుచేసిన ప్రబోధ మాహృదయములకు హత్తుకొనిపోయెను. శ్రీవారి పాదములాశ్రయించి బోధ రహస్యములను తెలిసికొననెంచి వారిని పలు విధముల ప్రార్థనాపూర్వకంగాకోరితిమి. భీమవరంలో శ్రీవారి కేర్పరచిన విడిదికిన్ని మేము బసచేస్తూ వుండిన కోటమర్తి వెంకట రమణయ్యగారింటికిన్ని మధ్య, నొకచెరువుండెను. చెరువును చుట్టి గట్టుమీదుగా శ్రీవారు సభాస్థలికిగాని భోజనశాలకు గాని రావలసి వుండెను. ఎపుడు వారు బయలుదేరుదురోయని

వేచియుండి అల్లంత దూరముననుండగనే శ్రీవారి కెదురేగెడి వారము. ఏలనన శ్రీవారి బసలోనికి వారిశిష్యులకే గాని తదన్యులకు ప్రవేశములేదు. బహుశా ఆచెర్వుగట్టుపైన శ్రీవారికి నాభార్య సాష్టాంగముచేసినచోటే లేదేమోననిపిస్తుంది.

శ్రీవారి హృదయము మాయందలి వాత్సల్యముతో పొంగిపొరలుచూ వున్నట్టుగుర్తించితిమి ఐతే గురువులైనవారు తెలిసికొని పిమ్మట వారివారి శిష్యులకు బోధించవలెను. అంతే గాని తాము ప్రతివక్కరికి చెప్పి బోధించుట సాధ్యముకాదు. కనుక ప్రతివారికీ ధర్మోపదేశము చేయుము అని శ్రీవారు అంతకుముందే నిర్ణయించుకొని యుండిరి: మాగురువులగు శ్రీ పాలూరి జగన్నాధరావుగారుకూడా వారిగురువులగు సత్తిరాజు గారివల్లనే బోధపొంది పిదప మాకు చెప్పవలసియుండెను. సత్తిరాజుగారు శ్రీవారి శిష్యులైయుండి కృషి చేయుచుండిరి. కనుక ఎప్పటికైన మీకు బోధలభించక తప్పదు. మీరు వేగిరపడవద్దని శ్రీవారు మమ్మునోదార్చి పంపుచుండిరి. కాని సత్తిరాజు గారికిన్ని, జగన్నాధరావుగారికిన్ని అప్పట్లో వైషమ్యములు పెరిగియుండెను. అవిసద్దణిగినగాని జగన్నాధరావుగారికేబోధ లభించదే! ఎట్లా? జగన్నాధరావుగారిని కోరితే కించపడవద్దని కావడి బరువు తమ భుజస్కంధములపైనే యుండెను, గనుక తామెట్లో బోధ రహస్యములను గ్రహించి మాకు చెప్పెదమని మమ్ము నమ్మిస్తూవుండేవారు. ఈవిధముగా మాఆశాలత చిగిరించదు, వాడదు. మేమున్నూ మా గురువులగు శ్రీ జగన్నాధరావు గారున్ను బ్రాహ్మణులము. శ్రీవారికి బ్రహ్మద్వేషము కనుక మీకు చెప్పరని కొందరు మూర్ఖులు చెప్పుతూవచ్చిరి. కాని కేశ

రాజు శేషాచలం దంపతులు, క్రొవ్విడి మహాలక్ష్మమ్మ, శేషమ్మ గార్లు, రెబ్బాప్రగడ మహెమ్మ, కొవ్వలి గంగమ్మ వగైరాగార్లందరూ బ్రాహ్మణులు కారా! కనుక యీ దుష్ప్రచార మావంతయు మాకు నిరాశ కలిగింపజాలకపోయెను.

ప్రతిసంవత్సరం మార్గశిర శుద్ధ ఏకాదశికి బెజవాడలో జరుగు సభలకు మాదంపతులము తప్పక పోవుచుంటిమి. 1945 సం॥లో జరిగిన సభాసందర్భంలో మేమున్ను శ్రీ పాలూరి జగన్నాధరావుగారున్నూ వారిగురుదేవులు శ్రీ క్షైత్రరాజు సత్తిరాజుగారునూ, అందరము పోయియుంటిమి. రెండవదినం రాత్రి (పూర్ణబోధ) బుర్రకథ పందిరిలో జరుగుచుండెను. పందిరి యెదురుగా సత్రంహాలులో శ్రీవారు వక్కరే ఏకాంతంగా కూర్చొని కథ వినుచుండిరి. మేముభయులము శ్రీవారి సన్నిధికి బోయి మా విషయంలో యింకనూ కరుణరాదా యని మొరబెట్టుకొంటిమి. దయానందయను బిరుదు శ్రీవారియెడల కడుంగడు సార్థకమై యుండెను. వెంటనే నాచేతనే కబురుచేసి శ్రీ సత్తిరాజుగారిని, జగన్నాధరావుగారిని సన్నిధికి పిలిపించుకొని వారిద్దరిమధ్యగల విభేదములగూర్చి ప్రశ్నించగా జగన్నాధరావు తప్పంతయు తమదేనని అంగీకరించి క్షమాభిక్షవేడిరి. శ్రీ సత్తిరాజుగారు మాత్రం మెత్తబడలేదు. శ్రీవారు మావుభయుల సంగతి శ్రీ జగన్నాధరావుగారికి చెప్తూ "నీ గురువుగారితో నీవు ఐకమత్యముగలిగి వారి వాత్సల్యమును తిరిగి సంపాదించనిచో వీరిగతి యుంతేనా?" అని అడిగిరి. అందుపైన శ్రీ జగన్నాధరావుగారు మావుభయుల చేతులను పట్టుకొని శ్రీవారి చేతులలోనుంచి వీరికి మీయిష్టానుసారం బోధచెప్పి కృతార్థులను

చేయండి, అని శ్రీవారికి మమ్ము వప్పగించి, అంతటితోమాయెడల తమభాధ్యతలను వదలుకొంటున్నామని వెల్లడిచేసిరి. కాని శ్రీ వారందుకంగీకరించలేదు. ఒక సంవత్సరంలోగా శ్రీ సత్తిరాజు గారి వాత్సల్యమును తిరుగ సంపాదించుకొని, వారిచే నిజసాం ప్రదాయక ప్రబోధమును ధర్మయుతముగా గ్రహించి, అపిదవ మాకుపదేశింపుమని, శ్రీవారు శ్రీజగన్నాధరావుగారి నాజ్ఞా పించిరి. శ్రీ జగన్నాధరావుగారునూ అందులకంగీకరించిరి. ఈ లోగా మేమేమిచేయవలయునో సెలవిండని మేము కోరితిమి. అందుకు శ్రీవారు భద్రాద్రిరామశతకం పద్యాలు, కంఠస్తము చేయుడని మమ్మాజ్ఞాపించిరి. మేము శ్రీవారి ఆజ్ఞానుసారం అల్లే పద్యములను కంఠస్తము చేసితిమి. సంవత్సరము పూర్తిగానిండక పూర్వమే శ్రీ జగన్నాధరావుగారు, సత్తిరాజుగారి కరుణా కటాక్షములు తిరుగ సంపాదించుకొని సాంప్రదాయక పద్ధతిగా కృషిచేయసాగిరి. ఈసంగతి తెలుసుకొన్న మేము, మాకెపుడు జగన్నాధరావుగారిచే శ్రీవారు ధర్మోపదేశము చేయింతురా అని ఆవేదనపొందుతూ నిరీక్షించుచుంటిమి:

అది వేసవికాలము. మట్టమధ్యాహ్నము. శ్రీ భైరాజు సత్తిరాజుగారు ఆకాశమునుండి యూడిపడినవానివలె యెక్కడ నుండియోవచ్చి తలుపుతట్టిరి. మీకు పంచీకరణము చెప్పవలసింది గా శ్రీవారి ఆజ్ఞ అయినది అని చెప్పుచూ కాగితము, కలమూ తెప్పించి, నా చేత నే గడులుగీయించి పి ద వ అక్షరము గుర్తులొకసారి మాకుచెప్పి, ఎట్లు వచ్చిరో అల్లే వెడలిపోయిరి. అదివరకే, ప్రచారములోనున్న పంచీకరణములన్నియు చదివి. యున్న వారమగుటచే ఒకగంటలోనే అసూక్ష్మ పంచీకరణమును

హృద్గతము చేసుకొని ఒకరికొకరం మాదంపతులము వప్పజెప్పి కొంటిమి. భద్రాద్రి రామశతకపద్యములు సూక్ష్మపంచీకరణము కూడ మాకు కంఠస్తముగా వచ్చెనని ధర్మోపదేశము చేయు ముహూర్తము నిర్ణయించమనీ, శ్రీ వారికి. శ్రీ సత్తిరాజుగారికి, శ్రీ జగన్నాధరావుగారికి, లేఖాపరంపరలను వ్రాయుచుంటిమి. మమ్మింక ఎంతమాత్రము ఆపవలదనీ, వెంటనే యుపదేశమిమ్మని శ్రీ జగన్నాధరావుగారికి శ్రీవారుత్తములు వ్రాయుచుండిరి. కాని ఆ పుణ్యకాలము 1947 సం॥ కార్తీక పౌర్ణమివరకు సమకూడలేదు. అప్పటికి శ్రీవారు తాడేపల్లిగూడెంవచ్చి వారము రోజులాయెను. మాఅత్తగారితోనూ నాభార్యతోనూ బయలుదేరి వారిర్వురను శ్రీ జగన్నాధరావు గారింటికి పోవుటకై రాజమండ్రిరైలెక్కించి నేను తాడేపల్లిగూడెంలో శ్రీవారి సన్నిధినియున్న శ్రీ సత్తిరాజుగారిని తోడితెచ్చుటకై వెళ్ళితిని. నాడు కార్తీక పౌర్ణమి. రాత్రి శ్రీవారి పూజామహోత్సవము జరుగనై యుండెను. పూజాసమాప్తిగానిదే రాజాలనని శ్రీ సత్తిరాజుగారు సెలవిచ్చిరి. నాటిరాత్రి శ్రీవారి పాదపూజా మహోత్సవములో పాల్గొని శ్రీవారి ఆశీర్వచనములను పొంది, సత్తిరాజుగారిని తోడ్కొని తెల్లవారకుండగనే రాజమండ్రిచేరి ఆరాత్రి శ్రీ జగన్నాధరావుగారివలన మేము మువ్వురము యధావిధిగా ధర్మోపదేశముగొంటిమి. శ్రీ సత్తిరాజుగారు, యుపదేశానంతరం మాకు వస్తు నిశ్చయముగురించిచెప్పిరి. కాని మాకేమియుబోధపడలేదు. ఆమరునాడే తిరిగి నర్సాపురం చేరుకొంటిమి.

శ్రీ సత్తిరాజుగారి వలన యీసంగతులన్నియు తెలుసు
కొని రాబోవు శని. ఆదివారములలో సతీసమేతంగా తమ సన్ని
ధికి రావలసిందని శ్రీవారు మాకుత్తరం వ్రాయించిరి. శ్రీ
జగన్నాధరావుగారికిగూడ అట్లే వుత్తరము వ్రాయుటచే మేము
న్ను శ్రీ జగన్నాధరావు దంపతులునుగూడ శనివారమునాటికే
తాడేపల్లిగూడెం చేరుకొంటిమి. అప్పటికి భీమవరం సాంప్రదా
యకులు శ్రీవారియెడల పూర్తిగా విరోధభావము వహించి
శ్రీవారిని అనేకవిధములుగా నిందించుచుండిరి. నేనున్ను శ్రీ
జగన్నాధరావుగారున్నూ కూడి భీమవరం సభల ఖర్చులనిమిత్తం
భక్తాదులవలన సుమారు 200 రూపాయలు ప్రతి సంవత్సరం,
నర్సాపురంలో చందాలు వేయించి కోటమర్తి వెంకట
రమణయ్యగారికి యిప్పించుచుంటిమనిన్ని, కోటమర్తి
వెంకట రమణయ్యగారికి, శ్రీ జగన్నాధరావుగారు బాల్య
మిత్రులై వుండి, సభానిర్వహణలో చేదోడు వాదోడుగా యుం
టున్నారనిన్ని నేను ఉపన్యాసములిచ్చి సభలో పాల్గొనుచుంటి
ననిన్ని, నన్నుగాని శ్రీ జగన్నాధరావుగారిని గాని నమ్మరాద
నిన్ని బోధ రహస్యములు గ్రహించేవరకు మాత్రం శ్రీవారి
ఆజ్ఞానుసారం మెలగి పిదప భీమవరం వారితోచేరి శ్రీవారిపై
దండెత్తగలమనిన్ని యిత్యాదిగా మాపై దోషారోపణలుచేసి
యితరులు శ్రీవారికి నివేదించియుండిరి. మా వుభయులను
(నన్ను, జగన్నాధరావుగారినీ, అందువిషయమై శ్రీవారు
ప్రశ్నించుటయు మేమిచ్చిన సమాధానములతో శ్రీవారు తృప్తి
పడుటయు ఉదయకాలమందే జరిగిపోయెను. ధన సహాయము
చేయనిచో భీమవరం సభలే ఆగిపోవుట, శ్రీవారు యీ ప్రాం
తాలకే రాకుండుట, యిత్యాదులు సంభవించునుగనుక ధనసహా

యముచేస్తూ సభలు జరుపుమని వెంకటరమణయ్యగారిని ప్రోత్స హించుచుంటిమి. తెలిసిన విషయములుగూర్చి శ్రీవారియెదుట ఉపన్యాసరూపంగా నివేదించుచో శ్రీవారు తప్పులను ఎత్తిచూపించగలరనిన్ని ఆవిధంగానైనా పూర్వపుబోధ సవరణ అగున నిన్ని మా ఆశ, ఈవిధంగా మేము చెప్పుకొన్న సంజాయిషీ శ్రీవారిని తృప్తిపరచెను.

ఆరాత్రి శ్రీవారిని యథావిధిగాపూజించి పిప్పర వాస్తవ్యులు కొల్లిపర రత్తమ్మగారు ధర్మము తెలిసికొనిరి. ఆ కార్యక్రమమంతయు ముగిసినపిదప శ్రీ జగన్నాధరావు దంపతులను మా దంపతులను శ్రీ సత్తిరాజుగారిని మాత్రముండనియమించి తదితరుల నందరిని శ్రీవారు బైటకు పంపివేసిరి. శ్రీవారున్ను శ్రీ అమ్మగారున్ను పూజా సింహాసనములపై యింకనూ వుపవిష్టులయ్యే వుండిరి. శ్రీవారు బోధించు సాంప్రదాయక ప్రబోధమును శ్రీవారి ఆజ్ఞలేనిదే యితరులెవ్వరికీ వెల్లడి చేయబోమని మానలుగురిచేతనూ శ్రీవారిపాదములపై చేతులుపెట్టించి ఘోరప్రమాణములు చేయించిరి. ఆదివారం వుదయమే శ్రీ జగన్నాధరావు దంపతులు కార్యాంతరములవత్తిడిచే వెళ్ళిపోయిరి.

ఆ ఆదివార శుభసమయము జీవితములో మరుపురానిది. శ్రీవారు స్నానాదికముల ముగించి 8 గంటలకు ప్రబోధ ప్రారంభించిరి. నన్నునూ నాభార్యనూ యుద్దేశించి జాగ్రితగావినుడనిహెచ్చరించి, సృష్టిక్రమముతో ప్రారంభించి ఆత్మస్వరూప నిర్ణయమువరకు విపులంగా బోధించిరి. మంత్ర మంత్రార్ధములను సాంప్రదాయకార్ధంలో వివరించిరి. సందర్భానుసారంగా కందార్ధములు, కందపద్యములు చదివి వివరిస్తూ వుండిరి. పూర్ణబోధను

గూడ విపులపరుస్తూ మధ్యాహ్నం 12 గంటల వరకు తదేక దీక్షతో యుపన్యసించిరి. చిత్తరువులోని ప్రతిమలవలె ఆనందాశ్చర్య నిమగ్నులమై మేము దేహస్మృతి లేక వింటూ వుండిపోతిమి.

(శ్రీ)వారి యితర శిష్యులెవరూ గూడ ఆనాటి విషయములు ఎన్నడూ (శ్రీ)వారివలన వినియుండలేదు. అయ్యా, యింత కాలంగా కృషి చేస్తున్నా, మాకు యీ విషయము లెన్నడైన చెప్పినారా? అని, వుండబట్టలేక శ్రీవారి నడిగివేసిరి. వాండ్లకుండే ఆకలి మీకున్నదా? 5 సంllలుగా యీ బోధకొరకు ఆరాటపడుచున్నారు. వారికుండే ఆకలి మీకున్నదా? ఐనా సాంప్రదాయక పద్ధతిగా యెట్టి గొప్ప రహస్యములు మరుగు పడియున్నవో వార్కి తెలియుటకుగాను ముందుగా వానిని గుర్తించవేస్తే ఆ సరిహద్దుల ఆవరణయందు కృషిచేస్తూయుంటారని, ఒకసారి బోధయొక్క సమగ్రమగు పూర్ణస్వరూపాన్ని చూపించాను. అని (శ్రీ)వారు సమాధానమిడిరి. అంతవరకూ (శ్రీ)వారు తమ శిష్యులకు పాఠక్రమంగా శిక్షణ యిచ్చుచుండిరి. తొలిపాఠము కంఠస్థమైనపిదప గాని తరువాత పాఠము వినుటకు గూడ (శ్రీ)వారు శిష్యుల కవకాశమియలేదు. అంతవర్కు ఖచ్చితంగా అమలులోనున్న యీ నియమం మా యెడల పూర్తిగా సడలింపబడెనని ఎంతయో పొంగిపోతిమి. (శ్రీ)వారా రాత్రి తెల్లవారుఝామున కొల్లేపర రత్తమ్మగార్కి వస్తునిశ్చయము గావించుచుండగా (శ్రీ)వారి అనుజ్ఞ గైకొని సన్నిధానమందుండి చక్కగా శ్రవణము చేస్తిమి. (శ్రీ)వార్కి మాయందు

గల అపార కృపావాత్సల్యములకు ముగ్ధులమైపోయి మరునాటికి యింటికి చేరుకొంటిమి.

యింటికి చేరుకొన్నపిదప మా దంపతుల ముఖయములము కూర్చొని శ్రీవారు చెప్పిన బోధను జ్ఞప్తికి తెచ్చుకొనుటకు మననము చేయుటకు, ఎంతో ప్రయత్నించితిమి. చిత్రము! ఏమియు జ్ఞాపకమునకు రాకపోయెను. ఎంతో ప్రయాసపడితిమే! యీ మరుపుకు కారణమేమి? దుని ఎంత జ్ఞప్తికి తెచ్చుకోవలె నన్న ప్రయోజనము లేకపోయెను. శ్రీవారికా విషయము తెలియపరుస్తూ, సూత్రప్రాయంగా శ్రీవారు మాకు ప్రబోధించిన విషయములేమియు మనస్సుకు పట్టలేదనియు, ఒక్క విషయమైనను గుర్తునకు వచ్చుటలేదనియు పాఠకరిముగా చెప్పి మమ్ము కృతార్థులను చేయవలెననియు, మనవిచేసుకొంటిమి. దప్పిగొన్నవాడు మధుర శీతల గంగాజలములు గదాయని ఆశతో అందు దుమికినవాడు ఉక్కిరిబిక్కిరియై అసువులనుగూడ గోల్పోవును. అట్లాగాక ఒక చిన్న పాత్రతో ఆ అమృత తోయములను గ్రహించి కొలది కొలదిగా పానముచేసినచో దప్పి వెంటనే ఉపశమించును గదా!

శిష్యపరివేష్టితులై శ్రీవారు తారాగణముమధ్య వెన్నెలకాయు పున్నమచంద్రునివలె వెల్గుచు బోధామృతము గురియించుచుండగా మేము వ్రాసుకొన్న లేఖ శ్రీవారికందెను. శ్రీవారి ఆజ్ఞానుసారం శ్రీ చౌదరిగారా పుత్తరమును బిగ్గరగా చదివిరి. బోధవిషయములు మాకేమియు జ్ఞప్తిలో లేవని మేము వ్రాసిన విషయము విని పలువురు యెగతాళిగా బిగ్గరగా నవ్విరి. శ్రీవారదిచూచి వారిని మందలిస్తూ, వాండ్లకు తెలియనిపి

తెలిసునట్లుగా నిరభిమానంగా వప్పుకొనుట వాండ్ల అంతఃకరణ శుద్ధికి తార్కాణ. మీవలె తెలియనివి తెలిసినట్లు, అర్థంకానివి అర్థమైనట్లు నటించుట వాండ్లకు చేతకాదు పాపము! అని వెంటనే కాస్త చెప్పించి మీ వీలుచెంబడిని వచ్చి పాఠక్రమముగా సర్వము తెలిసికొనుటకు ఏమీ అభ్యంతరములేదు, నిరభ్యంతరంగా వచ్చి వినవచ్చును అని వ్రాసిరి. ఆజాబు చూచుకొని పరమానంద భరితులమై మరుసటి శని ఆదివారముల నాటికే తిరిగి శ్రీవారి సన్నిధికి చేరుకొంటిమి. మేము వెళ్లుసరికే అక్కడ శ్రీ జగన్నాథరావుగారును, శ్రీ సత్తిరాజుగారును గూడ నుండిరి. మాకేమైన పాఠములు చెప్పవలసినదిగా శ్రీ జగన్నాథ రావుగారిని కోరగా, నాకేరావు, మీకేమి చెప్పను? సత్తిరాజు గారిని అడిగి తెలసికొమ్మనిరి. సత్తిరాజుగారిని అడుగగా, అన్నిటికీ మహారాజే (శ్రీవారు) యున్నారు, వారినడిగి తెలుసుకొనుమని సెలవిచ్చిరి. అయ్యా! మాపని ఎవర్కి పుట్టిన బిడ్డరా వెక్కి వెక్కి ఏడుస్తూన్నది? అన్నట్లుగా యున్నదని శ్రీవారితో మొరపెట్టుకొనగా మీకేమీ కొరతరాదు. అన్నిటికీ నేనున్నాను గదా అని శ్రీవారు మా కథయమొసంగిరి.

శ్రీవారు యథాప్రకారంగా ఉదయం 8 గంటలకు ప్రబోధ చెప్పుటకు గూర్చొనిరి. భక్తాదులందరూ పరివేష్ఠించి యుండిరి. బ్రహ్మాండ పాఠము గవ్వలుపెట్టి వాని గుర్తుమీద ఒక భక్తురాలు, (పట్టం రాజగోపాలరావునాయుగారి భార్య రూపావతమ్మగారని జ్ఞాపకం) తాను నేర్చిన పాఠమును శ్రీవార్కి నివేదించుటకు సిద్ధముగానుండెను. ఆ పాఠము నీకు వచ్చునా? అని శ్రీవారు నాభార్య సీతామహాలక్ష్మిని అడిగిరి. ఆ పాఠ

మెన్నడూ ఆమె విని ఎరుగదు. రాదంటే బోధచెప్పుటలో అంతరాయమేమైన వచ్చునేమో, లేక ఆపాఠం నీవు వినరాదు కొంచం తడవు అవలనుండుమని అందురేమో, అని ఆమె భయము. అందుకని వచ్చును, రాదు, అని సూటిగా సమాధానం చెప్పకుండా, ఆ భక్తురాలు పాఠం వప్పచెప్పినపిదప తానున్నూ వప్పజెప్పెదను, అని నాభార్య సమాధానను చెప్పెను. ఆ భక్తురాలు పాఠం వప్పచెప్పుచుండగా, శ్రీవారు తప్పులను సవరించుచుండిరి. పాఠము పూర్తియగుటతోనే? ఏది, నీవు చెప్పుమని నాభార్యను శ్రీవారు శాసించిరి. మనస్సు అంతయు సంపూర్ణంగా కేంద్రీకరించి పాఠమంతయు జాగ్రత్తగా విన్న హేతువుచేత, శీతామహాలక్ష్మి తప్పులు లేకుండా పాఠము యథాక్రమముగా వప్పచెప్పగలిగెను. ఈ పాఠమెప్పుడు నేర్చుకొంటివి? అని శ్రీవారు అడుగగా యిదివరకు రాదు. యిప్పుడే ఆమె చెప్పుచుండగా చూచి, విని, పట్టుకొంటిని. రాదంటే ముందు పాఠం చెప్పరేమోనని, రాదని తొలుత చెప్పలేదు అని, ఆమె జవాబు చెప్పెను. అది విని శ్రీవారు చాలా సంతోషించి బోధ వినుటలో యిట్టి ఏకాగ్రతయే కావలెను, అని ఆమెను, మిగతా భక్తాదులను, హెచ్చరించిరి. యిక దీనితర్వాత పాఠము చెప్పుచున్నాను. యిది శ్రద్ధగావిని సాయంత్రం వప్పచెపితేనే ఆ తర్వాయి పాఠం చెపుతాను, లేకుంటే యీపాఠం వచ్చేవరకూ అంతే. అని, శ్రీవారు క్రొత్తపాఠం బోధించిరి. యీ విధంగా శ్రీవారు మాకు పాఠాలు చెప్పుట ప్రారంభించిరి. ఒంటరిగా మేము శ్రీవారి విడిదియింటిలోనే ఒకచో గూర్చొని మననము చేసుకొని శ్రీవారి ఆజ్ఞప్రకారం వారికి నివేదించుచుంటిమి.

పాఠము వప్పచెప్పుటవంతు ఎప్పుడూ శీతామహాలక్ష్మిదే అమెకు వస్తే నాకు రాకుండా వుంటుందా అని శ్రీవారి నమ్మకం కాబోలు.

ఇట్లు నెలకు 2 సార్లు ఒక్కొక్కప్పుడు మూడుసార్లు చొప్పన పోతూ, శ్రీవారివద్ద 2, 3 రోజులుండి ప్రబోధ విను చుంటిమి. విన్న పాఠములను బోధను మాలో మేము యింటి వద్ద చర్చించుకుంటూ, సమన్వయము చేసుకుంటూ, చేసుకున్న సమన్వయము సరిగా మన్నదో లేదో శ్రీవార్కి నివేదించి తెలిసికుంటూ, శ్రీవారుచేసిన సవరణల దృష్ట్యా ఎప్పటికప్పుడు పునర్విమర్శించుకుంటూ, కృషిచేయుచుంటిమి. ఈ కాలములో శ్రీవార్కి మిక్కిలి శ్రమయిచ్చుచుంటిమి. బోధ చెప్పుచుండగా మధ్యలోనే శీతామహాలక్ష్మి, తనకు తోచిన ప్రశ్నలు వేస్తూ శ్రీవారి ప్రబోధవాహినికి ఆనకట్టలుకట్టి, ఏకప్రవాహ మును అనేక ముఖములుగా తిప్పుతూండేది. బోధ ఆ విధంగా మధ్య మధ్య అన్యపంథాలలోకి పోతూవుందని మిగతా భక్తాదు లకు చాలా కష్టముగా వుంటూవుండెను. నీ ప్రశ్నలు చివర నడుగుచూ యుండరాదా? యని, శ్రీవారు నాభార్యను పలు మారు అడుగుచుండుటయు జరిగెను. అయ్యా! నాకు మధ్యలో తోచిన ప్రశ్నలకు వెంటనే తమరినడిగి సమాధానం పొందకుంటే, ఆ విషయంపైననే మనస్సు పనిచేస్తూ తమరుచెప్పే బోధమీద నిలుచుటలేదు, అని శీతామహాక్ష్మి మనవిచేసుకొనెను. శ్రీవా రున్ను ఆ సమాధానమునకు తృప్తిపడి ఆమె అడిగివ ప్రశ్నకు వెంటనే సమాధానమిచ్చి, ఆ పిదపనే బోధ ఎక్కడ ఆగెనో అక్కడనుంచి తిరుగ ప్రారంభించి శేషప్రబోధమును పూర్తి

గావించుచుండిరి. అంతేగాక శ్రీవారు స్నాన భోజన విశ్రాంతి సమయములలోకూడా వారినిచేరి మాకు కల్గిన సందేహములు, మాచర్చలలో, మాలోమాకు కలిగిన భేదాభిప్రాయములు విన్నవించుకుంటూ శ్రీవారివలన వానికి తగు పరిష్కారమును పొందుచుంటిమి. యిట్లు 4, 5 మాసములు తదేక దీక్షగా శ్రీవారివలన బోధపొందితిమి. ఈ కాలములో మేము శ్రీవారి వసతిగృహముననే ఒక గదిలో బసచేసితిమి. ఎవరింట్కిని ఎవరిని చూచుటకున్ను పోలేదు. శ్రీ జగన్నాధరావుగారినిగాని సత్తిరాజుగారినిగాని తిరిగి బోధ చెప్పుడని అర్థించలేదు. యితర భక్తాదులతో చర్చించుటకూడ మానుకొంటిమి. ఏలనవగా ఒకసారి పంచాకాశ పాఠము సోదరులతో చర్చించుటజరిగి మాకన్న పూర్వమే బోధయందు ప్రవేశించి కృషిచేయు సోదరులు తాము తప్పుగా గ్రహించిన విషయమును మాకు చెప్పిరి. శ్రీవారు చెప్పిన బోధ మేము సరిగా వినలేదేమోనని, ఆ తప్పుడు పాఠమునే శ్రీవారికి పాఠడిగినపుడు నివేదించుటవలన శ్రీవారి మందలింపులకు గురికావలసివచ్చెను. నాటినుండియు యితరుల సహాయము మేమెన్నడూ అర్థించలేదు. ఆ ౯, మాసముల కాలములో మేము సల్పిన మా కృషికలాపము మా జీవితములలో ఒక తపస్సు అని ఉద్ఘాటించుటలో అతిశయోక్తిలేదు.

శ్రీవారు తాడేపల్లిగూడెంలోనున్న కాలములో వారిని తమ యిండ్లకాహ్వానించి వారి కాతిథ్యమిడి, కృతార్థత చెందవలెనను యుద్దేశ్యముతో, పలువురు ప్రాపంచికులు పలుసార్లు శ్రీవారిని భక్తసమేతంగానూ, కుటుంబసమేతంగానూ రావలెనని కోరుచుండిరి. కాని శ్రీవా రొక్కసారియైనను అందొక్కరి

ప్రార్థనకూడా మన్నించలేదు. కారణమేమని నేను అడుగగా శ్రీవారిట్లు సమాధానమిడిరి. "నాయనా! యీ పిలచినవారు మన సాంప్రదాయక భక్తులుకారు. నేనువెళ్ళి వారింట్లో భుజించుట వల్ల వారికేదో పుణ్యమో, శుభమో కలుగగలదని వారాశించి పిలచియుండుట సహజమే, కాని పారమార్థిక జీవనము జరుపుకొనుచున్న మనము యితరుల సొత్తు తినరాదు. గురువు శిష్యులసొత్తు తినవచ్చును, శిష్యులు గురుసొత్తున్ను తినవచ్చును. గురుపుత్రు డెన్నడున్ను కష్టపడి సంపాదించిన స్వార్జిత విత్తమునే భోగించవలెను. మరియును ప్రాపంచికులు అనేక మార్గములుగా ధనమార్జింతురు. అన్యాయార్జితమగు విత్తమును ఏ రూపంగా అనుభవించిననూ అది కీడే గల్గించును." అని బోధించిరి.

ఈ సూత్రమునే శ్రీవారు సర్వత్రా ఎప్పుడున్నూ పాటిస్తూవచ్చినారు. పీఠమునకు ఎట్టి ఆస్తిపాస్తులు లేకున్ననూ పీఠమునకు భక్తాదులర్పించు ద్రవ్యముతప్ప ఎన్నడూ శ్రీవారు యితరులవల్ల తృణమైన స్వీకరించుట కియ్యకొనరు. శ్రీవారు ప్రతిష్ఠగావించిన, ఏ యొక పీఠమునందలి వార్షికోత్సవములు, సమారాధనలు, ఉత్సవములకైనను భక్తాదులిచ్చు ద్రవ్యమును స్వీకరించుటయే జరుగుచుండెను. ఉపపీఠములు, ఆశ్రమములు వగైరాల నిర్మాణమునకు వలయు ధనమునుగూడ భక్తాదులే యీయవలెను. గాని యితరులవల్ల చందాలరూపంగా గాని దానరూపంగా గాని గ్రహింపనొల్లరు. శ్రీవారి భక్తకోటి అంతయూ శ్రీవారి యీ నియమమును సాధ్యమైనంతవరకు పాటించుచునే యున్నారు.

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

రెండవ భాగము.

పంచమ ప్రకరణము.

శ్రీవారు తాడేపల్లిగూడెంలో కాపురమున్నకాలంలో, శ్రీవారిని చూచుటకు, పరీక్షించుటకు, లేదా చర్చించుటకు, పరిసర ప్రాంతములయందలి పండితులు వచ్చుచుండిరి. శ్రీవారు ఒక్క ప్రశ్నతోనే వారిని నిరుత్తరులను గావించుచుండిరి. శాస్త్రపండితులలో అనుభవజ్ఞానమున్నవారు బహు అరుదు. నూటికి ఏ ఒక్కరోవుంటే చాలా గొప్పమాట. శ్రీవారి అనుభవము ముందు ఎవరున్నూ నిలబడలేకుండిరి. అందెవ్వరికిని వస్తు నిశ్చయపూర్వకమగు ఆత్మజ్ఞానము లేకుండెను. వచ్చినవారు శ్రీవారి గొప్పదనమును గుర్తించి తరలిపోవుచుండిరి. చిలకలంపాడు నుంచి వచ్చిన ఒక పండితుడు, (పేరు జ్ఞాపకంలేదు) శ్రీవారితో చర్చించిన సందర్భమున మేము సన్నిధిలోనుండుట తటస్థించెను. మహావాక్యార్థజ్ఞానము విషయమున చర్చజరిగెను. ఆ జ్ఞాన మెవర్కి కల్గుచున్నది? అని శ్రీవారు ప్రశ్నించిరి. 'చిదాభాసునకే' అని ఆ పండితుడు సమాధానమిడెను. అయినచో, ఆ జ్ఞానము నిత్యమా? అనిత్యమా? అని శ్రీవారు తిరిగి అడిగిరి. అనిత్యమని ఒప్పుకొనుటకు పండితునికి నోరాడక మిన్నకుండెను. ఇతర విషయములపై కొంత చర్చించి శ్రీవార్కి గల బహుముఖ ప్రజ్ఞావిశేషమునకచ్చెరువొంది ఆయన వెడలిపోయెను.

మేముండగానే మరొకసారి, పూళ్ల గ్రామమునుండి, అద్వైతసిద్ధాంతమునందు కృషిచేసి కొంత అనుభవముకూడ సంపాదించి, గురువై, ప్రచారముచేయుచుండిన వృద్ధమూర్తి యొకరు, శ్రీవారి కీర్తిప్రతిష్ఠలు విని, చూచుటకై వచ్చిరి. అప్పుడు శ్రీవారి సన్నిధియందు వారి సోదరుడు (గురుభాయీ) యగు శ్రీ పూర్ణానంద గట్ల వెంకట్రామయ్యగారుండుట తటస్థించెను. ఆయన ఒక తత్వమును పాడెను. అందొక చరణములో "శబ్ద నిశ్శబ్దముల మీరినదీ", అని పరిపూర్ణ పరబ్రహ్మమునుగూర్చి చెప్పబడియుండెను. ఏమి ఏమిటి! నిశ్శబ్దస్వరూపమే బ్రహ్మము అయివుండగా దానిని మీరినది మరొకటియున్నదా? "ఆకాశస్య గుణశ్శబ్దో నిశ్శబ్దో బ్రహ్మముచ్యతే" అని యున్నదిగదా! అని ఆయన ఆశ్చర్యనిమగ్నుడయ్యెను ఇంతలో వాహ్యాళికేగు సమయమగుటచే కొంతమంది శిష్యులతోగూడి, శ్రీవారు వాహ్యాళికి వెడలిరి. ఆ వృద్ధగురువు శ్రీవారి బసయందే ఆగి, శ్రీవారి శిష్య ప్రశిష్యులతో కొంత ప్రసంగించి, వారువేయు ప్రశ్నలను వినియు, తానడుగు ప్రశ్నలకు వారు సమాధానములు చెప్పుటయు గమనించి, నిజముగా పరిపూర్ణ పరబ్రహ్మము శబ్ద నిశ్శబ్దములు మీరినదేనని తృప్తిపడెను. యింతలో శ్రీవారున్నూ వాహ్యాళినుండి తిరిగి వచ్చిరి. శ్రీవారు సుఖోపవిష్ఠులగుటతోనే వారి రెండుచేతులను పట్టుకొని, యాయన నృత్యభంగిమలతో ఒక కీర్తనపాడి శ్రీవారి నభినందించి వెడలిపోయెను.

తాడేపల్లిగూడెం ప్రాంతంలో, శ్రీ బండి రామస్వామిగారి శిష్య ప్రశిష్యులెక్కువగా నుండిరి. వారపుడపుడు శ్రీవారి దర్శనార్థము వస్తూవుండిరి. కాని వారున్నపుడుమాత్రం శ్రీవారు

గురుగోప్య విషయములు ముచ్చటించక, వారడగిన వాని విషయమై ఏదో కొంతచెప్పి పంపించివేయుచుండిరి. శ్రీవారి వాక్యములు విన్నమాత్రముననే వారి ప్రతిభావిశేషములు అడుగడుగున వ్యక్తమగుచుండెను. అందుచే శ్రీవారివలన తెలుసుకొదగిన సాంప్రదాయక గురుబోధ రహస్యములు యెన్నియో కలవని ఎల్లరు నమ్ముచునేయుండిరి. కాని వారి వారి గురువులుమాత్రం శ్రీవారివలన క్రొత్తగా తెలియదగిన బోధవిషయములు లేనేలేవని, వారిని ఒప్పించుటకు సహస్ర విధాల ప్రయత్నించుచుండిరి.

ఈకాలంలో శ్రీవారికి సేవచేయుచూ సతీసమేతంగా శ్రీ పేరిచర్ల వెంకట్రాజుగారు తాడేపల్లిగూడెంలో శ్రీవారి యింటనే వుండియుండెను. ఆయన పోవు గ్రామాదులలో శ్రీవారి బోధయొక్క విశిష్టతనుగూర్చి ఆయన ప్రచారము చేయుచుండిరి. శ్రీ బండి రామస్వామిగార్కి, దగ్గుపల్లి వెంకన్న గారొక ముఖ్యశిష్యుడు, ఈ దగ్గుపల్లి వెంకన్నగారి శిష్యులవద్ద గూడ. పేరిచర్ల వెంకట్రాజుగారు శ్రీవారి బోధయొక్క ప్రత్యేకతనుగూర్చి చెప్పుట తటస్థించెను. అంతేగాక యీ ప్రాంతపు పూర్ణగురువులకు పూర్ణబోధ పూర్తిగా తెలియదనీ, వస్తునిశ్చయజ్ఞాన మెరుగరనీ, యిత్యాదిగా ప్రచారము చేసియుండెను. శ్రీ వెంకట్రాజుగా రిట్లనిరని దగ్గుపల్లి వెంకన్నగారి కాయన శిష్యులు చెప్పిరి. అందుపై వెంకన్నగారు కోపోద్రిక్తులై శ్రీవారినీ, వారి శిష్యులనూ పలువిధముల దూషించుచుండెను. శ్రీవారితో మాట్లాడి తనకు తెలియనివంటూ లేనేలేవని, తన శిష్యులకు బుజువిప్పిస్తానని ప్రగల్భములు చెప్పుచుండెను. ఒక

జున తన శిష్యుడైన అనందరావును కూడాతీసుకొని శ్రీవారి సన్నిధికేతెంచెను. వెంకన్నగారికి ఎందువల్లనోగాని గ్రుడ్లెఱ్ఱబడి యుండెను. ఐననూ సాధుపుంగవులైన శ్రీవారిని చూచుటతోనే చల్లబడిపోయెను. భయమంకురించెను, ఒడలు కంపించెను. అయిననూ ధైర్యము తెచ్చుకొని తడబడు మాటలతో "మీ శిష్యుడు పేరిచర్ల వెంకట్రాజుగారు నాకుగాని, మా గురువగు శ్రీ రామస్వామిగార్కిగాని పూర్ణబోధ సరిగా తెలియదని, నా శిష్యుల కడ ప్రచారముచేసి, వారిని తన శిష్యులుగా చేసుకొనవలెనని ప్రయత్నిస్తున్నాడు. మీరూ, బండి రామస్వామిగారూ ఒకే గురుపు శిష్యులుకదా! మీకు తెలిసి, వారికి తెలియకుండుట ఏమి?" అని అర్థమువచ్చే మాటలు ఎటులో వెళ్ళగ్రక్కెను. అభిమానగ్రస్తుడై ఆ స్థితిలోనున్న వెంకన్నగారితో సరాసరి మాట్లాడ నిష్టములేక శ్రీవారు ఆనందరావు నుద్దేశించి, ఏ గురువైనా తన శిష్యులు బాగుపడవలెనని కోరునా? కోరడా? శిష్యుల శంకలు తీర్చుటకు తానసమర్థుడైతే ఆ శిష్యులేమి చేయవలెను? జన్మరాహిత్య మాశించిగదా ఒక మానవుడు వేరొక మానవుని దైవసమునిగా పూజించి, గురువుగా స్వీకరించుట? తన సర్వస్వము త్యాగముచేసి అయిననూ ఆశయసిద్ధి పొందగోరునుగదా? ఆ పరిస్థితులలో ఆ శిష్యులు వేరొక గురువునాశ్రయిస్తే తప్పా? తన శిష్యులు, తమ సంశయములను ఎట్లో రహితపరచుకొని తృప్తిచెంది యున్నారంటే వారి గురువు సంతోషించవలెనా లేక దుఃఖించవలెనా? స్వార్థ గురువైన దుఃఖించునుగాని, సద్గురువైతే దుఃఖించునా? తన శిష్యులు తన్ను విడచిపోయిరి అనిగాని, విడచిపో ప్రయత్నిస్తున్నారని గాని, దుఃఖించు గురుని ఏమనవలెను? అని యిత్యాది ప్రశ్నలు

ఆనందరావునడిగి అతని నోటనే సదుత్తరములు చెప్పించిరి. తన శిష్యుని నోటనే తన అల్పత్వము ఋజువై పోవుటచే వెంకన్న గారు చాలా చిన్నబుచ్చుకొనిరి. ఐననూ ఎట్లో ధైర్యము వుంజుకొని, మాకు పూర్ణబోధయే తెలియదని మీరెట్లా అంటారు? అని శ్రీవారిని వెంకన్నగారు ప్రశ్నించిరి. అందుకు శ్రీవారు "విద్యాంతం, బ్రహ్మవిద్యాంతం, వార్తికాంత మగోచరం పూర్ణ బోధ ప్రవణ్యా మిక్ర్మను శిష్యమహోత్తమం," అని చదివి, యీ శ్లోకము ఎపుడైన వింటివా అని ప్రశ్నించగా, తెలుసును అని వెంకన్నగారనిరి. అట్లా అయితే యీ శ్లోకభావము పూర్తిగా వివరించుము, వివరిస్తే సర్వమూ నీకు తెలిసినట్లు నే నంగీకరిస్తాను, అని శ్రీవారనిరి. వెంకన్న గారిక్కి పచ్చివెలగకాయ గొంతుకకు అడ్డపడినట్లాయెను. శ్లోకమందలి "విద్య, బ్రహ్మ విద్య, వార్తికము, యిత్యాదులకు వివరణ ఏమిచెప్పవలెనో యెరుగడు కాబోలు! నిట్టూర్పులు విడచుటేగాని, ఆలోచన తెగలేదు. ఒక అరగంట మౌనముగా గూర్చొని ఆ పిమ్మట ఏదో పనివుండి అపుడే తిరిగివచ్చువానివలె వీధి అరుగు మీదకు పోయినట్లే పోయి, అక్కడనుంచి పలాయనమంత్రము పఠించి చల్లగా జారిపోయెను. పాపము! శిష్యుడగు ఆనందరావు తన గురువు తిరిగి వచ్చునేమోయని, మరియొక గంట శ్రీవారి సమక్షములో గూర్చొని ఆయన వచ్చుట కలలోనివార్త అని నిర్ధారణ చేసుకొని శ్రీవారికడ శెలవుగైకొని వెడలిపోయెను.

1947 సం॥రం మార్గశిరశుద్ధ ఏకాదశికి శ్రీ సచ్చిదానంద వెంకటేశ్వరావధూత స్వాములవారి ఆరాధన మార్టేరులో జరిపెదమనిన్నీ, సభలు జరిపింతుమనిన్నీ, గురువుల సభయొకటి

కూడా ఏర్పాటుచేసితిమనిన్నీ, సభాధ్యక్షులుగా విచ్చేయవలసిం దనిన్ని, (శ్రీ)వారికి ఆహ్వానము వచ్చెను. ఈ సభా కార్యకర్తల గురించి, వారి గురువునుగురించి, యిట యిసుమంత ప్రస్తావించ వలసియున్నది. ఆచంట గ్రామ కాపురస్థులు సజ్జా రామదాసు అనే ఆయన, (శ్రీ) సచ్చిదానంద వెంకటేశ్వర అవధూతగారివద్ద ఎపుడో ఆయన ఆచంటగ్రామం వచ్చినపుడు ధర్మోపదేశము గొనియుండెను. 1939 సం॥రం ఆ ప్రాంతమందు నేనొకసారి ఆచంట వెళ్ళినపుడు వీరివద్దకేగితిని. అవధూత స్వాములవారి శిష్యుడు అంటే, మా గురువుగారి, గురువుగారి, గురువుగారికి గురుస్థానములోనున్న వాడన్నమాట. అందుచే ఆయనకు బోధ బాగుగా తెలిసియుంటుంది, విందాము అనే దృష్టితో, వారిని బోధచెప్పుడని కోరితిని. వారు వెనుతీయుట చూచి చాలా బలవంతముగూడ చేస్తిని. చివరకాయన "నాయనా! అవధూత గారి దగ్గర ధర్మము తెలసికొంటిసేగాని, ఆయనవల్ల బోధ వినలేదు. బండి రామస్వామిగారో, వారి శిష్యులో, మరొకరో యీ గ్రామం వచ్చినపుడు ఏదో వారివల్ల వింటూంటాను. ఏదైన గ్రంథము చిక్కితే చదువుకుంటూయుంటాను. యీ గ్రామంలో పంచాయతీబోర్డు బిల్లుకలెక్టరుగా యుద్యోగం చేస్తూంటాను. కనుక యితరచోట్లకు అంతగా వెళ్లి, బోధ సమగ్రంగా తెలుసుకొనుటకున్ను సావుకాశము చిక్కుటలేదు." అని యున్నదున్నట్లుగా చెప్పి, మీరు చదువుకొన్నవారు, పెద్దలవల్ల బోధ బాగా వినివుంటారుకూడా; కనుక ఏదైన రెండు కందార్థములు వ్యాఖ్యానం చెపితే సంతోషిస్తాను, అని, ఆయన, నన్నుకోరెను. ఏవో ఒకటి రెండు కందార్థములకు వ్యాఖ్యానముచెప్పి, వెడలివచ్చితిని. తర్వాత మరుసటి సంవత్స

రమే అవధూత స్వాములవారు నిర్యాణము పొందిరి వారు యీ సజ్జా రామదాసుగార్కి బోధాధికారపత్రిక అయిననూ యిచ్చిరో లేదో తెలియదు. ఈయన అవధూతస్వాములవారు గతించుట తోడనే తానొక గురువై, శిష్యులను సేకరించుట ప్రారంభించెను. ఆ శిష్యులకుకూడ వెనువెంటనే అధికారములిచ్చి, వారిని గూడ గురువులను చేసెను. యిక వీరందరూగలసి బెజవాడలో జరుగు అవధూత స్వాములవారి ఆరాధనకు వచ్చుచుండిరి. భీమవరం సభకును వచ్చుచుండిరి. ఈ సజ్జా రామదాసుగారు ఆదిలో శ్రీవారియెడల చాలా భయభక్తులతో నుంటూవుండెడివారు. శ్రీవారివలన సాంప్రదాయిక బోధారహస్యములను అందరివలె తానున్నూ వినుటకు కుతూహలంగానే వుంటూవుండేవారు. కాని శ్రీవారు ధర్మపద్ధతిగా తప్ప, మరొకవిధంగా తెలియపరచుటకు నిరాకరించుచుండిరి. వేంకటేశ్వరావధూతగారి శిష్యులనేకమంది తనతోపాటు సజీవులై వుండగా తమకెవ్వరికీ పీఠాధికారం లభించలేదు. అవధూతగారి ముద్రితాముద్రిత గ్రంథములేమీ చిక్కలేదు అన్నియూ శ్రీవారిపాలై నవి. పోనీ, ఆయన తమకైనా ఆ ప్రబోధరహస్యములు, ఎరుకయొక్క స్థాన, స్వరూప, స్వభావములు చెప్పగూడదా? తాముగూడ శ్రీవారి పాదములు పట్టవలెనా? యిదీ వీరి హృదయ బాధ. నారాయణమ్మ, తొత్తడి నర్సమ్మగార్లు చేయు దుష్ప్రచారం, యీయన యదార్థం అని నమ్మెనో, లేక అది కేవలం దుష్ప్రచారం అని యెరిగుండియూ, ఆ దుష్ప్రచారమునకు వెనుక తాళము వేసెనో, దెలియదుగాని, మొత్తంమీద కృష్ణా గోదావరీ మండలములలో శ్రీవారి కెదురుతిరిగిన సంఘములతో యీయన యున్ను చేరిపోయెను.

యీ సంఘములవారందర్కి శ్రీవారికడ సాంప్రదాయక ప్రబోధ రహస్యములు తెలుసుకొనవలెనని ఆశమాత్రం గలదు. గురువులైనవార్కి, శ్రీవారి పాదముపట్టి తెలుసుకొనుటకు తమ అహంకారము అడ్డుతగులుచుండెను. ఒకప్రక్క తమ శిష్యులు, ఎరుకయొక్క స్థాన స్వరూప స్వభావములగూర్చి బోధింపుడనీ, వస్తునిశ్చయపూర్వకంగా ఆత్మస్వరూపం బోధించుడనీ, మంత్రరహస్య మెరిగింపుడనీ, లేక శ్రీవారిచే చెప్పించుడనీ, వేధించుచుండిరి. శిష్యులబాధ వదల్చుకొనుటకు, వారు తమ్ము వదలిపోకుండా తమనే అంటిపెట్టుకొని యుండగలందులకుగాను, శ్రీవారివలన తెలియదగిన రహస్యములేమీ లేవని, సర్వము తమకు తెలియుననీ, తెలియనివి లేవనీ, గురువును వదలి వేరొక గురువును చేరితే, రౌరవాది నరకప్రాప్తియనీ చెప్పి, శిష్యులను చెదరిపోకుండా కాపాడుకొనుచుండిరి. కాని వారి వారి హృదయాంతరములయందు, శ్రీవారికడ తాము తెలియదగినవి ఎన్నో విషయములున్నవని ఎల్లరూ యెరిగియే యుండిరి. ఏదో యుపాయముచే, లేక యుక్తిచే, తమకు న్యూనతకలుగని పద్ధతిగా, శ్రీవారినుండి ఆ సాంప్రదాయక రహస్యములను రాబట్టవలెనని, కోరుచుండిరి. అందుచేతనే మార్టేరు సభలో గురువుల సభా సమావేశమును ప్రత్యేకం ఏర్పాటుచేసి, శ్రీవారిని అధ్యక్షులుగా ఆహ్వానించిరి. శ్రీవారి బోధమర్మములను రాబట్టుటకు, ఆచంటవారు, భీమవరంవారు, సమాలోచించి ఆఖరు ప్రయత్నంగా చేసిన సన్నాహమిది.

మార్టేరుకు చేరియున్న వెలగలేరుగ్రామంలో యీ సభలు జరుపబడెను. శ్రీవారున్నూ, శిష్యబృందమున్ను, అంద

రితో పాటు నేసున్ను, సభలకేగితిమి. మహాసభలో (శ్రీ)వారి అనుజ్ఞతో, (శ్రీ) దాసరి బ్రాహ్మణయ్యచౌదరిగారు, గురు శిష్య ప్రవర్తనలగూర్చి యుపన్యసించుచుండెను. గురువులమని పేరు పెట్టుకొని, యీ ప్రాంతంలో కొందరు, యధేచ్ఛావిహారము గావించుచు, విలాసప్రవర్తనలయందు మునిగి తేలుచున్నారు. పీఠాధిపతులైన మీరు, వారికేమి శిక్ష విధింతురు? అని (శ్రీ)వారికి సభలో వారివలన రెండుమూడు చీట్లు పంపబడెను. ఏ గురువు నుద్దేశించి ఆచీట్లు వ్రాయబడెనో తెలియదుగాని, మొత్తం ఆ గ్రామంలోని గురువులే అనిమాత్రం కొన్ని చీటీలలో సూచింపబడెను. ఆ చీటీలకు ప్రత్యుత్తరము చెప్పవలసిందిగా (శ్రీ)వారు కొండవీటి వెంకటకవిగారి కాదేశించిరి. అట్టి నీచులు యీ పవిత్ర సాంప్రదాయములో నుండరాదనీ, వుంటే, వారు పారమార్థికులే గారనిన్నీ, గురువులమనిపించుకొనుట కసలే తగరనీ, వారి పేరులు సభవారు బైటపెట్టలేదు కనుకనున్ను, ఆ చీటీలు వ్రాసినవారికా వ్యక్తులు తెలిసేయుందురు కనుకనున్ను, ప్రపంచమందుండే నీచాతి నీచులకంటే హీనముగా వారిని జమ కట్టి, ప్రజలే వారికి తగురీతి బుద్ధిచెప్పి శిక్షింపవచ్చుననీ, వెంకట కవిగారు సభవారి కరతాళములమధ్య గంభీరోపన్యాసము గావించిరి.

సభాకార్యక్రమ మాదినముతో సమాప్తి. ఆ రాత్రి గురువుల సభాసమావేశము. నేనప్పటికి బోధాధికారినిగాను, సభలోనికేగుటకు సందేహించుచుండగా ఫరవాలేదు రమ్మనుమని (శ్రీ)వారు, నా చేయిపట్టుకొని లోనికి గొంపోయిరి. బోధాధికారులు (గురువులు) రమారమి 30, 40 మంది సమావేశమైరి.

శ్రీవార్కి, అంతకుపూర్వము సజ్జా రామదాసుగారు పాదాభి వందనంకూడా చేసెడివారని నా జ్ఞాపకము. అట్టి అభివందనమైన చేయలేదు సరిగదా, ఏదో ఆధిపత్యం తనకున్నట్లుగా, పెద్ద కేకతో, "ఏమిటి రాజయ్యా! మాకెవర్కి పరిపూర్ణబోధ తెలియ దంటున్నారట! మాకు తెలియనిదేమిటో, నీకు తెలిసినదేమిటో మరి చెప్పు" మని, కయ్యమునకు కాలుదువ్వుచు మోటుతన ముగా పలికెను. శ్రీవారు శాంత గంభీరమూర్తులు. మరెవరేనా అయితే, వెంటనే వాగ్యుద్ధంలోనికి దిగేవారే. కాని శ్రీవారు చిరునవ్వుతో "మొత్తం దరహంమీద, కృష్ణా గోదావరి జిల్లాల వారికి పూర్ణబోధ తెలియదని నేనంటూవచ్చినమాట సత్యమే. ఎవరికే విషయములు కొంఅతవుంటే, వారా విషయములు తెలుసుకోవలసివుంటుంది" అని శ్రీవారు శాంతముగానే సమా ధాన మిడిరి. "అట్లా కాదు. మాకన్ని విషయములు తెలుసు, మాకు తెలియదని నీవన్నావు, కనుక మాకు ఏది తెలియదో అది నీవే ముందుగా నిర్ణయం చేయాలి, ఆపైన ఆ విషయం నీకు తెలుసుంటే అది వివరించి చెప్పాలి" అని రామదాసుగారు బిగ్గరగా మాట్లాడిరి. "సాముదాయకంగా చెప్పాలంటే, ఎరుక యొక్క వస్తు నిశ్చయజ్ఞానం, మంత్రిరహస్యం తెలుసుకోవలసి వుంటుంది" అని శ్రీవారనిరి. "పరిపూర్ణబోధ మాకు తెలియదని అన్నారే అట్లా అనుటకు కారణమేమిటి?", అని ఎవరో అడిగిరి. "స్వప్రకాశవస్తువే పరిపూర్ణ బ్రహ్మమని, భీమవరం సాంప్రదాయ కులు పొరబడియున్నారు. అట్లే యితరులున్ను, ఏమేమో పరి పూర్ణ బ్రహ్మమని భ్రాంతిలో నున్నారు" అని శ్రీవారనిరి. "స్వప్రకాశమే పరిపూర్ణమని మా సాంప్రదాయకులెన్నడూ బొరబడలేదు", అని కోటమర్తి వెంకటరమణయ్యగారు పల్కిరి.

"భీమవరం సాంప్రదాయకులలో ప్రముఖ బోధాధికారులగు శ్రీ పండ్రంగి జగన్నాథంగారు కందార్థ గ్రంథంలో చివర చేర్చి, అచ్చువేయించిన దండకంలో, ఏమి వ్రాశినారో చూచుకోండి" అని శ్రీవారు పల్కిరి. అందుపై ఆ కందార్థ గ్రంథ ప్రతి యొకటి తెప్పించబడెను. దండకం పరిశీలించగా అందు మొదటనే పరిపూర్ణబ్రహ్మము స్వప్రకాశవస్తువుగా వర్ణించబడియుండెను. శ్రీవారు అది చదివి వినిపింపగా, కోటముర్తి వెంకటరమణయ్యగారు, తదితర భీమవరం గురువులున్నూ నిరుత్తరులై మౌనము వహించిరి.

సజ్జా రామదాసుగారి శిష్యులై, బోధాధికారము గూడ పొందిన కొందరు, పరిపూర్ణబోధ చెప్పుడని శ్రీవారిని కోరి ప్రాధేయపడసాగిరి. "మీరు గురువులు గదా! మీ శిష్యులకు పరిపూర్ణమును ఎట్లు సూచించుచున్నారో తెలిపినచో, అందేమైన లోటువుంటే సవరిస్తాను, మీరు చెప్పే బోధలో పొరపాట్లున్నదీ, లేనిదీ అపుడే వెటతెల్లమగునని, శ్రీవారు సెలవిచ్చిరి. సజ్జా రామదాసుగారి శిష్యుడైన జోస్యుల వెంకటరామయ్య, తామిట్లా బోధిస్తున్నామని చెప్పుట కుప్రక్రమించినంతలో, తమ ప్రబోధయందలి లోపములు బైటపడునేమోయని, వెంకటరామయ్యగారిని మాట్లాడనియ్యక, తనకేదో తెలుసుననీ, యితరులెవరికీ తెలియదనీ, శ్రీవారు అనేమాట శుద్ధ వ్యర్థప్రలాపమని, మరీ గొంతెత్తి సజ్జా రామదాసుగారు కేకలువేయదొడగిరి. ఒకడెవడో నీచుడు (ఆయనకూడా అవధూతగారి శిష్యుడేనట) తప్పత్రాగి అరుగుమీద కూర్చొని శ్రీవారినీ, వారి శిష్యమండలినీ, నోటికిరాని పచ్చిబూతులతో

తిట్టసాగెను. సభలో గగ్గోలు ప్రారంభమయ్యెను. యిక ప్రయోజనములేదని శ్రీవారితో సహా, మేమంతా మా మా బసలకు వెడలిపోతిమి. సజ్జా రామదాసుగారు అడ్డుతగిలి, తన శిష్యుడు అయిన జోస్యుల వెంకట్రామయ్యగారిని, శ్రీవారి ప్రశ్నకు త్తరువు చెప్పనీయకుండా చేసెనుగాని, లేనిచో వెంకట్రామయ్యగారు చెప్పు పరిపూర్ణ సూచనయందలి లోపములను శ్రీవారు తప్పక సంస్కరించి యుండేవారు. తద్దీత్యా కొన్ని విషయములైననూ, శ్రీవారివలన తెలుసుకో గల్గెడివారు. పాపము! అది వార్కి ప్రాప్తిలేదు.

ఆ విధంగా తుది ప్రయత్నముగూడ విఫలమాయెను. "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" అని భగవద్గీత చెపుతూంటే, ధిక్కరించి, తిట్టి, తెలుసుకోవాలంటే అది సాధ్యమౌతుందా? ఒకవేళ అట్టి మానసిక పరిస్థితిలోనున్న శ్రోతలకు శ్రీవారేమైన చెప్పినను, అది బోడిగుండుపై పోయబడిన గచ్చకాయలవలె నగునేకాని, అంతఃకరణకు పట్టదు. లక్షణయుతులైన వారికే బోధయని పరిపూర్ణబోధ గ్రంథములు వేనోళ్ళ చాటుచున్నవి, వెలగలేరు సభలో వచ్చిన చీటీలు, సజ్జా రామదాసుగారి తీవ్రము, తాగి వీథెక్కి వచ్చిబూతులు తిట్టు మరొకని దుండగము చూచినవార్కి, వీరు యెంత లక్షణయుతులో తేటతెల్లమేగదా!

—

 శ్రీ సద్గురుభ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

రెండవ భాగము.

6వ ప్రకరణము.

శ్రీ కొండవీటి వెంకటకవిగారు పేరుపొందిన కవి. అష్టావధాని. ఏకసంతగ్రాహి. వీరు శ్రీవారి కొసంగిన సన్మాన పత్రిక, యిందు ముద్రించడమైనది ఆ దినముననే శ్రీవారికి సమర్పించబడిన మరిరెండు సన్మానపత్రములుకూడా యిందు ముద్రించడమైనది.

శ్రీ గురుభ్యోనమః

శ్రీ శివరామ దీక్షితులవారి జయంతిసందర్భమున ప్రస్తుత పీఠాధిపతులైన, శ్రీ దయానంద పొన్నాల రాజయాఖ్య రాజయోగీంద్రులవారికి సమర్పించిన

పంచరత్నములు

మ॥ తొలుదొల్తన్ శివరామమూర్తియెట సందున్ లేక బ్రహ్మాండ
పం। క్తులు వేనిండి మహాత్వతత్వమిది మీకుం జన్మరాహిత్య ని
ష్ఠులమార్గమ్మని మానవావళికి సంతోషంబునం బల్కు నిర్
మ్మలుఁడౌ శ్రీ శివరామదీక్షితులు ప్రేమంజూచు రాజార్యునిన్

ఉ॥ ఏసుఁ గవీశ్వరుండను ఋషీశ్వరభావులు మీరు మీకు నె
ట్లైనిట నాశిషంబు లిడు టెంతయు నొప్పదు, త్వత్పదార్చనా
ధ్యానముఁదప్ప వేరుగలదా పరికింపఁగ బుత్రకోటికిన్
శ్రీనిధి రాజయోగి కులశేఖర రాజయనామ సద్గురూ॥

సీ॥ ఏమహామహుపాద తామరంబుల మ్రొక్క
పాపౌఘములు పటాపంచలగును
ఏసిద్ధు నుపదేశ మింపొందఁ బడసిన
బరిపూర్ణతత్వమ్ము పట్టుపడును
ఏసుకృతాత్ము సేవాసక్తిచే బాయు
తరిగిపోనట్టి యావరణమెల్ల
ఏయోగివరు తీర్థ మేవేళఁ గ్రోలిన
భవరోగవార్నిధి బడకనుండు

గీ॥ ఎవఁడు తన జన్మచేత మానవులనెల్ల
ముక్తులం జేయుఁజాలు ముముక్షువతఁడు
రాజఋషి రాజయోగి దీర్ఘాయువగుత
అచలపీఠస్థ శివరాము సేవవలన॥

గీ॥ సృష్టిమర్మం బెఱింగి విస్పష్టముగను
అష్టతనువుల నిరసించి వ్యష్టిలేక
అంతటను నిండియున్న నీ యచలబోధ
నందముగఁ జెప్పు శ్రీ సదానందయోగి
తెనుఁగుయోగీంద్ర రాజయ దేశికేంద్ర॥

ఉ॥ అక్షరమైన పూవుల మహాత్ములఁ బూజయొనర్ప ధర్మమ
ధ్యక్షులరైన మీ పద సమర్పనకై కొనితెచ్చినాఁడ నా
దక్షతకొద్ది భక్తిని ముదంబున స్వీకృతిఁజేయుమయ్య యీ
యక్షరమాలికం గడు దయామతి రాజయనాను సద్గురూ॥

సత్తెనపల్లి హిందూ హైస్కూలు తెలుఁగు పండితులు, 15–6–1946 } ఇట్లు తమదాసుడు, అష్టావధాని కొండవీటి వెంకటకవి ఉభయభాషాప్రవీణ

శ్రీ గురుభ్యోనమః

శ్రీ శివరామ దీక్షితులవారి జయంతి సందర్భమున ప్రస్తుత పీఠాధిపతులైన, శ్రీ దయానంద పొన్నాల రాజయాఖ్య రాజయోగీంద్రుల వారికి సమర్పించిన

పంచరత్నములు

సీ॥ శ్రీ శివరామ దీక్షిత పీఠమునకును
అధ్యక్షత వహించి యలరినావు
అరయమందిప్పల హనుమంతరాయని
ప్రియశిష్యుఁడౌ నన బెరిగినావు
భాగవతుల కృష్ణయోగి కందార్థముల్
విప్పి చెప్పగజాలు వేత్తవీవు
ఆనందుఁడౌను దయానందుఁడౌనన
సార్థక నామంబు చాటినావు

గీ॥ బ్రహ్మతేజస్సు ముఖమున ప్రబలియుండె
అమరసమతత్వ మందరియందు నిండె
నిన్ను వర్ణింప నలవియే నిర్జరులకు
రాజితౌదార్య పొన్నాల రాజయార్య.

క॥ పరిపూర్ణ బోధకుండవు
కరుణామయుడవును నిన్ను గనుగొని నంతన్
పరుసంబుసోకు యినుమటు
విరసుడు సరసుండెయగును విచరింపంగన్.

గీ॥ కపటవర్తనచేతను క్రమమెలర్ప
సేవజేయికే తత్వంబు జిక్కునెడి
తర్కవాదుల కందునే తత్త్వపథము
రమ్యతరభోగి పొన్నాల రాజయోగి.

గీ॥ కొంటెవాండ్రెందరో గుంపుగూడి మిమ్ముఁ
నొక్క పట్టగవలెనన్న చక్కనౌనె
సింగమున్ జూచి ఏనుగుల్ చెదరిపోవె
రమ్యతరధుర్య పొన్నాల రాజయార్య

గీ॥ ఎవరి హృదయమెంత హీనమైయుండునో
అతనికట్టి తత్త్వమందియుండు
ఎవని హృదయమెంత హెచ్చుగావిప్పారు
అతని కట్టితత్త్వ మందియుండు.

గుంటూరు
15-5-1946

ఇట్లు భక్తజన విధేయుడు
అష్టావధాని నిష్కల్లానంద
చెన్నుపల్లి బ్రహ్మయ్యశాస్త్రి

శ్రీ గురుభ్యోనమః
శ్రీ శివరామ దీక్షితులవారి జయంతిసందర్భమున ప్రస్తుత పీఠాధి
పతులైన, శ్రీ దయానంద పొన్నాల రాజయాఖ్య
రాజయోగీంద్రులవారికి సమర్పించిన

పంచరత్నములు

మ॥ ప్రతిభన్ శ్రీ శివరామదీక్షిత ఋషీంద్రార్యుల్ వితర్కించి సం
స్తుతిపాత్రంబగు పూర్ణతత్వమును సంశోధించి శిష్యాళికిన్
ప్రతిపాదించి చిరాయురున్నతుల శ్రీ రాజాఖ్య యోగీంద్రు
లున్ । ధృతి నా వంశపరంపరార్యుల జయంతించేయు
నాచార్యులై.

సీ॥ పరమ దయానంద బిరుదంబుగొన్న శ్రీ
పొన్నాలవంశాబ్ధి పూర్ణ చంద్రి
రాజయాభిఖ్య శ్రీ రాజయోగీంద్రులు
శుద్ధనిర్గుణతత్వ శోభితులును
అచల పయోరాశి యాని గట్టునద్రేపి
భ్రాంతిరహితుడైన శాంతమూర్తి
కరుణారసంబు పుంఖాను పుంఖంబు ల
గురిపి శిష్యులనేలు వరగురుండు

గీ॥ అచల పరిపూర్ణ సాంప్రదాయంపు ఋషుల
ప్రథిత సత్కీర్తి హేమంబు పరిమళింప
జేయ నవతరించిన మహాఋషియటంచు
మిమ్ము శ్లాఘింతు రాంధ్రులు సమ్ముదమున.

సీ॥ భవసాగరంబున పల్లటిల్లెడువాని
దీవించి దరిజేర్చు నావవనగ
భ్రాంతి పర్వతశిఖరాన చేరినవాని
వరమిచ్చి దించు సోపానమనగ
వాంఛాకసంబున పాకులాడెడు వాని
మన్నించిదెచ్చు విమానమనగ
అవివేక తిమిరమం దల్లలాడెడువాని
నెలవు జేర్చెడు దీపకళికవనగ

గీ॥ అవతరించి మహాత్ముల ననుగమించి
మానవాభ్యుదయంబును మదిగ్రహించి
పూర్ణతత్వ మహత్వంబు బోధసేయు
రాజయాభిఖ్య మునిరాజ రాజయోగి.

ఉ॥ రాజసమింతలేని తమ రాణ జెలంగెడు తత్వబోధవత్
పూజితమయ్యె ఆ విమల పుణ్యమునందు జనించునట్టి వి
భ్రాజిత కీర్తిచంద్రికలు పర్వెను సర్వదిగంతరంబు లా
తేజమె ఆంధ్రమౌనుల వితీర్ణియనందగు సద్గురూత్తమా.

సీ॥ సర్వసమత్వంబు జాటియెల్లరతోడ
మంజులప్రీతిబల్కు మహిప్రసక్తి
దర్శించువంత హృద్భావప్రకాండంబు
గ్రహియించు వైదగ్ధ్య కౌశలంబు
కటకట పడువారి కడగండ్ల గన్నంత
తగు సహాయముజేయు దాతృతయును
ఆలోకనంబున కాకర్షణీయమై
వెన్నవలెగరగు విమలబుద్ధి

గీ॥ కవికుమారుల కలముల గంధళించి
దిక్కులకు పద్యరూపాన దీప్తులెసగె
భళిర భవదీయ సహన ప్రభావమెన్న
నగునె ఋషిలోక శ్రీ రాజయాఖ్యమౌళి.

గీ॥ అష్టతను నిర్సనానందులైన దండి
పండితులు కోటిలింగార్య ప్రిముఖవరుల
అమృత వాక్స్రవంతినిరేగు నలలతూగు
టుయ్యేలలనూగు రాజాఖ్య యోగిమౌళి.

చ॥ తరుగని పండితుం డచలతత్వప్రవక్తగు బ్రాహ్మణయ్య చౌ
దరి పచరించు భావముల దర్శనమిచ్చుక డానిమేడలన్
పరచిన రత్నశయ్యలను బండి జగమ్మును విస్మరించు స
ద్గురు వర రాజయాఖ్య మునికుంజర మిమ్ము నుతింప శక్యమే.

ఉ॥ పూపొదరింటిలో సతతమున్ వసియించెడు కప్పముక్కులన్
వ్యాపకమైన బువ్వుల సువాసనయెట్లు గ్రహింపనేరదో
చేప సముద్రమందున వసించి జలంబని యెల్లెరుంగదో
అవగిదిన్ నరుండు పరమాత్ముని లోపలనుండి మాయ దీ
ఖాపరుడై గ్రిహింపక అఘంబుల బొందుచెరింగి ఆత్మ సం
తాపమునొంది యెట్టిడులు ధన్యతనొందగ బ్రాపుజేరుచున్
మీ పరిపూర్ణబోధల నిమీలిత నేత్రుల జేసి బ్రోచు సు
శ్రీపతి రాజయాఖ్య ఋషిశేఖర మిమ్ము నుతింప శక్యమే.

సీ॥ మునులజెండా మల్లెపూల పుప్పొడి తావి
దర్శించె నెవని యాస్థానమందు
కీర్తి వధూటి సంగీత మాధుర్యంబు
చవిజూచె నెవని ప్రశాంతగాథ

ప్రజల నమస్కార విజయ నిక్వాణంబు
వినిమెచ్చె నెవని పవిత్రమనసు
శిష్యుల కోర్కెల చెవియొగ్గి యాలించి
కాచు నెవ్వని కడగంటి చూపు
గీ॥ భక్తుల పురోభివృద్ధుల పాడిపంట
అనుచు దిగ్దిగంతంబు లందలము నీదు
విమల విజ్ఞాన విభవంపు వెలగుణింప
బూను నెవ్వాడు రాజాఖ్య మౌనిచంద్ర.

15—5—1916 } ఇట్లు, తమవిధేయుడు,
వినుకొండ } షేక్ ఫరీద్ కవి.

శ్రీవారివద్ద మన్నవ లింగయ్యగారను సంపన్న గృహస్థు డతఃపూర్వమే ధర్మోపదేశముగొని కృషిచేయుచుండెను, కాని శ్రీవారికడకేగి శుశ్రూషగావించి సక్రమంగా బోధపొందుటకు బహుళదూరములోనున్న సత్తెనపల్లి తాలూకా వాస్తవ్యుడగుట చేతను, తాను బహుళ వ్యాపకుడగుటచేతను, అనువుకాకుండెను. వెంకటకవిగారియనకు మిత్రుడు. కవిగారు, ధర్మోపదేశము పొంది, బోధ విన్నచో, ఏకసంతగ్రాహియగు కవిగారి సహాయంతో, తాను బోధయందు త్రీర్ణత చెందవచ్చుననే ఆశతో కవిగారిని తీసుకొని తాడేపల్లిగూడెం వచ్చియుండెను. ఆ మరునటి దినమే శ్రీవారు, మార్టేరు సభలకు వెళ్లుచుండగా యితరులతోపాటు కవిగారుకూడా శ్రీవారిని అనుసరించి వెళ్ళిరి. శ్రీవారు తిర్గి తాడేపల్లిగూడెం చేరినతదుపరి కవిగారు, శ్రీవారివద్ద యుపదేశము గొనిరి. సాంఖ్య తారకామనస్క మహావాక్యాది పాఠాలు తనకు బోధింపనక్కరలేదనిన్ని, నేరుగా

కందార్ధ విచారణ మొదటినుంచీ తుదివరకు చెప్పుడనిన్ని, సాంప్రదాయకార్ధ మావిధంగా గ్రహించి కందార్ధములకొక చక్కని భాష్యగ్రంధము వ్రాతుననియును, కవిగారు శ్రీవారిని ప్రార్ధించిరి. "నా పృచ్ఛః కస్యచిత్బ్రూయాత్," (అడుగనిదే ఏదీ చెప్పరాదు) అను సూత్రమును అక్షరాలా పాలించు శ్రీవారు పాత్రక్రమ రూపమైన బోధ, నాకక్కరనే లేదన్న వానికెట్లు చెప్పుదురు? నిజముగాచూస్తే ఎక్కాలు, మానాలు రానివానికి లెఖ్ఖలు ఎంత అర్థమగునో, పాఠాలు రానివానికి పరిపూర్ణ బోధయు నంతే యర్ధమగును. కనుక ఈ విధంగా కోరుట అసంభావ్యమే. ఐనా శ్రీవారు దయాసముద్రులు గనుక కవిగారి కోరికను మన్నించి, మొత్తం కందార్ధములన్నీ ఒక వారంరోజులలో చెప్పి ముగించిరి. చాలుననుకొని వెంకట కవిగారు వెడలిపోయిరి. కాని యీ విధంగా బోధ యందునా? ఎంతటి ప్రజ్ఞావంతుడైనా, గురుకృపలేక సాధించగల్గునా? ఆత్మ స్వరూప వస్తునిశ్చయజ్ఞానము వాచాగూడ తెలుసుకొనకనే, విన్న యర్థమును చిరకాలము మననాదులు చేయకనే, గురు కృపా ప్రసాదసిద్ధికై, మంత్రానుష్ఠానము చేయకనే, గురుకృప యెట్లు సిద్ధించును? "అపరోక్షమౌనె మనుజులకు పరోక్షంబైన బయలు గురుకృపలేకన్?" ఎరుకయొక్క వస్తుజ్ఞానమేలేనిచో పరిపూర్ణబోధ యెట్లు చిక్కగలదు? సరిగా కవిగారివిషయంలో అంతేకాకతప్పదు. అట్లే అయినదికూడ. యింట్కి పోవుసర్కి యింత కవిగార్కి విన్న సర్వస్వము, కొండశిఖరమున కుండపోత వర్షము కురిసినా, ఒక్క బొట్టుకూడా నిలవనట్లే, కొండవీటి వెంకటకవిగారు విన్న విషయములుగూడా, జారిపోయెను. పాపము! మన్నవ లింగయ్యగారికిన్ని ఆశాభంగమయ్యెను.

ఆ పిదప కొంత కాలము గతించినపిదప ఈ కవిగారు సత్తెనపల్లిలో జరిగిన సభలలో యుపన్యాసవేదికనెక్కి, ఉపన్యాసము గావించుచూ, యిదిగో, శివరామదీక్షితీయ సాంఖ్యపద్ధతిని వివరిస్తానని చెప్పి, ప్రారంభించి, చక్కగా పప్పులో నడుగు వేయుటయు, ఆ సభాస్థలిలోనే యుండిన శ్రీ దాసరి బ్రాహ్మణయ్య చౌదరిగారు, వారిని సంస్కరించుటయు జరిగెను. దర్మిలాను రెండు సంవత్సరములకు కవిగారు, శ్రీవారిని బెజవాడ సభల సందర్భంలో కలుసుకొని, అయ్యా! శివరామ దీక్షితీయ పరిపూర్ణబోధను క్రమశిక్షణగా ఆదినుండి అంత్యము వరకు వేసవి కాలములో వేసవిపాఠశాల నడపి, ముఖ్యులైన బోధాధికారులకు సాంగముగ బోధ రహస్యములను వెల్లడి చేయుడని శ్రీవారిని కోరవలసినవాడాయెను. ఆ సమయంలో అటనేయుండిన నేను కలుగజేసుకొని "అయ్యా! పరిపూర్ణబోధ అట్లా తెలియదగినదికాదు. దీర్ఘ కాలము, గురు శుశ్రూషలు చేసి, గురుమంత్రసిద్ధి గాంచిన సచ్ఛిష్యులకు గురుమూర్తి అనుగ్రహరూపంగా ప్రసాదింపవలసినదేగాని, అన్యపంథా లేదు. శిష్యుని అధికార, అభినివేశ, ఆశయముల ననుసరించి ఆశయమునకు తగిన బోధ అతనికి అనుగ్రహరూపంగా అతుకునట్లు బోధింపబడుటయే సాంప్రదాయక ధర్మపద్ధతి" అని వివరించితిని. శ్రీవారు, అది అంతే అని సెలవిచ్చిరి.

వెలగలేరు సభలకు మాతోపాటు శ్రీమతి నోరి పార్వతమ్మగారు, వీరి కుమార్తె శ్రీమతి రాచకొండ కమలమ్మగారునూ వచ్చిరి. వీరుభయులూ, చిరకాలంనుండి మాతోపాటే పరిపూర్ణ బోధయందు కృషిచేస్తూ, శ్రీవారి నిజప్రబోధను పొందుటకై

తహతహలాడుచుండిరి. వీరున్నూ మావలెనే శ్రీ పాలూరి జగన్నాధరావుగారి శిష్యులై యుండిరి. మేము నిజ ప్రబోధ విధానమును (శ్రీ)వారి వల్లనుండి విన్నవెంటనే, బోధ యెంత నిగూఢంగా యున్నదో మావల్ల వీరు తెలిసికొని తమకుకూడా దానిని ప్రసాదింపచేయుడని శ్రీవారి నర్ధించుచుండిరి. వెలగలేరు నుండి (శ్రీ)వారితో వీరిద్వరు తాడేపల్లిగూడెం వెళ్ళి, అక్కడ (శ్రీ)వారి ఆజ్ఞానుసారం పాలూరి జగన్నాధరావుగారి ద్వారా నిజ ప్రబోధ పద్ధతిగా తిరిగి ధర్మోపదేశము పొంది, నాటినుండి మాతోపాటు కృషిచేయసాగిరి. (శ్రీ)వారివలన మేము వింటూ వచ్చిన బోధ క్రమముగా మేము, వీరికి అందించుచుంటిమి. కొండవీటి వెంకటకవిగారు కందార్ధమున్న్నీ (శ్రీ)వారిచే విను కాలమునందు వీరుగూడా యుండి, ఆసాంతముగా కందార్ధ బోధను వినియుండిరి.

1948 సం॥రం మేనెలా ప్రాంతములో, (శ్రీ)వారితో ముచ్చటించి పరిపూర్ణ సిద్ధాంత సాంప్రదాయక మెట్టిదో తెలసు కొనుటకున్ను, నచ్చితే ధర్మోపదేశము పొందుటకున్ను, శ్రీ కడివేటి నర్సారెడ్డిగారు తాడేపల్లిగూడెం వచ్చిరి. వారిమిత్రులు కొండమడుగుల వెంకటరెడ్డి, షేక్ మొహిద్దీన్‌గార్లు, (శ్రీ)వారి సంగతి నర్సారెడ్డిగారితో చెప్పగా, ఆయన వారినికూడా తీసు కొని వచ్చెను. వెంకటరెడ్డి, మొహిద్దీన్‌గార్లుభయులూ, పీఠానా లక్ష్మణరావుగారి శిష్యులగు కొండోజు శీతయ్యగారి శిష్యులై పరిపూర్ణబోధయందు కొంత కాలముగా కృషిచేయుచుండిరి. కాని శీతయ్యగారివలన వీరికి భ్రాంతితహితం కాలేదు. శీతయ్య గార్కి సహితం వస్తునిశ్చయజ్ఞానము లేకుండెను. (శ్రీ)వారి

ప్రజ్ఞావిశేషములను, తమ సహోదరుడైన పల్లెల కోటిలింగం గారివల్ల వింటూ, శ్రీవారివలన, తామకూడా భ్రాంతిరహితం చేసుకొనవెంచి వీరిరువురు, శ్రీ నర్సారెడ్డిగారి ననుసరించిరి. అప్పుడు మా కోర్టుకుకూడా వేసవి శెలవులు అగుటచే మా దంపతుల ముభయులము శ్రీవారి సన్నిధి కేతెంచియుంటిమి. అప్పట్కి మేము పాఠక్రమమంతయు, అనగా సాంఖ్య తారక అమనస్క మహావాక్య విచారణలున్ను, వార్త్తిక పద్ధతియున్నూ, యింకా ఎన్నో విషయములున్నూ శ్రీవారివలన క్రమపద్ధతిగావిని, పూర్తిచేసుకొనియుంటిమి. శ్రీవారివద్ద ఆ శెలవులలో కంఠార్థ విచారణ, శ్రవణము చేయగోరి, సన్నిధిని వేచియుంటిమి.

కడివేటి నర్సారెడ్డిగారు ఆదిలో కాంగ్రెసువాదియై, శ్రీ వెంపటి సూర్యనారాయణగారియొక్కయు, గొల్లపూడి శీతారామశాస్త్రిగారియొక్కయు సాహచర్య విశేషముచే జీవితమంతయు నొక క్రమశిక్షణలో నడపుట కలవాటుపడియుండెను. వినయాశ్రమము చేరి హఠయోగసాధన గావించియుండెను. శ్రీ నాగలింగం వెంకటేశ్వరశాస్త్రిగారివద్ద కృషిచేసి సంస్కృతాంధ్రముల పాండిత్యము గడించి, వేదాంతశాస్త్రమునందు కూడ తగుపాటి పరిచయము సంపాదించియుండిరి. కడపజిల్లా ప్రొద్దుటూరు బాలికోన్నత పాఠశాలయందు అప్పట్కి తెలుగు పరడితులుగా ఉద్యోగము చేయుచుండిరి.

యోగ వేదాంత శాస్త్రములయందు తమకుగల పరిచయముమ పురస్కరించుకొని, శ్రీవారిని ప్రతినిత్యము వారం రోజులపాటు అనేక ప్రశ్నలడిగి సదుత్తరములు పొందిరి. తమకు అదివరలో తీరని సందేహపరంపర యంతయూ, శ్రీవారితో

ఆయన సల్పిన గోష్ఠిలో విచ్ఛిన్నమైపోయెను. అద్వైతపద్ధతి కంటె గూడ, పరిపూర్ణబోధ సిద్ధాంత మెట్లు అతీతమైయున్నదో, వీరు తెలుసుకొని, శ్రీవారికి శరణాగతులై, ధర్మోపదేశము పొందిరి. నర్సారెడ్డిగారితోపాటు కొండమడుగుల వెంకటరెడ్డి, షేక్ మొహిద్దీన్, పేష్‌మాం‌గార్లుగూడ శ్రీవారి వద్ద ధర్మము తెలసికొనిరి. 15, 20 రోజులపాటు ధర్మోపదేశానంతరం, శ్రీవారివద్దనే వుండి, పరిపూర్ణబోధ మూలరహస్యములను, వస్తునిశ్చయపూర్వకంగా గుర్తెరిగిరి. ముఖ్యములగు కొన్ని కందార్ధములయొక్క వ్యాఖ్యానముగూడ, శ్రీవారినడిగి తెలిసికొని, పరమసంతృప్తితో స్వస్థానములకు వారు ముగ్గురును వెడలిపోయిరి. శ్రీవారిలో, నర్సారెడ్డిగారు జరిపిన గోష్ఠివిశేషములను మేము దగ్గరవుండి శ్రవణంచేసి, ఆ లబ్ధికూడా పొందియుంటిమి.

మేము కందార్ధములను వరుసగా మొదటినుంచి, చివరవరకు సాంగోపాంగముగ వినగోరియుండుటచే, నర్సారెడ్డి వగైరా గార్లు వెళ్ళిపోయినపిదప గాని, శ్రీవారు పతద్విచారణ ప్రారంభింపరైరి. కోర్టులు తెరచేరోజులు సమీపించుచుండెను. అలోగా కందార్ధములు పూర్తిగావేమోనని భయపడుచుంటిమి. కాని, పూర్తిచేసి పంపెదనని, శ్రీవారు, మా కభయమిచ్చి విచారణ ప్రారంభించి, ప్రతిదినమూ ఉదయ సాయంత్రముల యందు మాత్రమేగాక, రాత్రికాలమందుకూడా కూర్చొని దినమునకు అధమం ఆరుగంటలకాలము మాకై వెచ్చించుచుండిరి, దినమునకు 30 కందార్ధములు పూర్తియగుచుండెను. 2, 3 రోజులైనపిదప యిన్ని కందార్ధములు బోధిస్తే వీరు

హృదయమున నిల్పుకొనగలరా యను సందేహముతో పరీక్షింప నెంచి, అచల లక్షణములోని ప్రథమ కందార్ధమునకు వ్యాఖ్యానము చెప్పుమని నాకాజ్ఞాపించిరి. శ్రీవారు బోధించిన పద్ధతిగానే, నేను వ్యాఖ్యానించుట విని, సంతుష్టులై, కాలము కలసి వచ్చినంతవరకు విడువక శ్రీవారు ప్రబోధ గావించుచుండిరి.

ఈ కాలములో, మా వలెనే పాఠములు పూర్తిచేసుకొన్న, డాక్టరు పట్టం రాజగోపాలరావునాయుడుగారి సతీమణి రూపావతమ్మగారు, రెండుమైళ్ళ దూరంనుంచి ప్రత్యేకంగా, జట్కాలో ప్రతిదినమూవచ్చి, శ్రీవారికడ రోజుకు, ఒక్క కందార్థం మాత్రం చెప్పున వినిపోవుచుండెను. ఒకదిన మామె వచ్చుసరిక్క సరిగా, ఆమె వినవలసిన కందార్థము వరకే మేము వినుటయున్నూ, పూర్తిఆయెను. శ్రీవారు ఆమెకున్నూ, మాకున్ను ఆ కందార్థమును వివరించి బోధించిరి. ఆపిదప తరువాత కందార్థమెత్తుకొని, బోధింపదొడగిరి. "ఆయ్యా యిక ఆపుచేయండి, యికతమరు చెప్పినా నిల్వరు" అని, రూపావతమ్మగారనిరి. అందుపైన నేను "అమ్మా ఆపుచేయించవద్దు, మీరైతే సమీపంలోనున్నారు, కనుక రోజూ ఒక కందార్థము చెప్పున వినుటకు మీకు సాధ్యమగును. మాకట్లు కాదుగదా! మాకు కుంభకర్ణునికున్న ఆకలి, కుంభకర్ణునికున్న నిద్ర వలననగా దూ ర ము లో వున్నాము, ఎప్పుడో వస్తాము, ఉన్నంతవరకు బోధతో కడుపు నింపుకొనుటయే పని, తిర్గి బోధలేకుండా యెన్నిదినాలు వుపవాసంచేస్తూ నిద్రపోవాలో మాకే తెలియదు" అని అంటిని. అందుక్క శ్రీవారు మందహాసంచేసి, అట్లేనని మాకు వాగ్దా

నము చేసిన ప్రకారం మేము యింటికి వెళ్ళకపూర్వమే, కందార్థవిచారణ పూర్తిగావించి అనుగ్రహించిరి.

దర్మిలాను ఒక నెలరోజులకు తిర్గి, శ్రీ కడివేటి నర్సారెడ్డిగారు శ్రీవారి సన్నిధికేతెంచిరి. అప్పట్కి మేముగూడ నక్కడ నుండుట తటస్థించెను. నర్సారెడ్డిగార్కి వేమనయోగి యన అభిమానం మెండు అంతకు పూర్వమే ఆయన వేమన యోగి విలాసమను, పద్యకావ్యము కూడ రచించిరి. శ్రీవారి కదిచదివి వినిపించి, వారి మన్ననల పొందిరి. పరిపూర్ణబోధ యింత గొప్పదైనా ఎక్కువమంది దానిని యెందుకు పూనుట లేదు, అని నర్సారెడ్డిగారు శ్రీవారిని పృచ్ఛించిరి. శ్రీవారు నవ్వుచూ అవును, ప్రపంచంలోనున్న రాళ్ళసంఖ్యతో పోల్చి చూస్తే రత్నాలెన్ని వుంటాయి? అని, శ్రీవారు యెదురు ప్రశ్న వేసిరి. నిజమే, గాని తగిన ప్రచారమే లేదుగదా! అని నర్సారెడ్డిగారనిరి. అందుపైన పత్రిక ప్రారంభించి నడపితే మంచిదికాదా? అని నేనంటిని. ముగ్గురము చర్చించి "అచల ఋషి వేమన" అను పేరుతో ఒక మాసపత్రిక ప్రొద్దుటూరు గ్రామమునుండి వెలువడవలెననిన్ని, దానికి నర్సారెడ్డిగారి సోదర్డు హనుమారెడ్డి సంపాదకుడుగా వుండుటకున్నూ, నిర్ణయించితిమి. "సారాసార విచారము" అను శీర్షికతో నేనొక వ్యాసమును, తత్వపారాయణమను పేరుతో నర్సారెడ్డిగారున్ను, వ్యాస పరంపరలు వ్రాసి "అచలఋషివేమన" యందు ప్రచురించుచుంటిమి. నేను వ్రాసి ప్రచురించిన వ్యాసములో, ఆదినుండి అద్వైత సిద్ధాంత మావిర్భవించు వరకుగల మత చారిత్రము, ఆ యా మతముల నిరూపణ, తన్నిరసనలు మాత్రము పూర్తి అయ్యెను.

కాని యింతలో పత్రికా ప్రచురణ యాగిపోవుటతో నా వ్యాస రచనయున్నూ ఆగిపోయెను. పత్రికయెట్లో 2 సం॥లు నడచెను. కాగితము కరువై సరిగా దొరకక పోవుటచేతను, ఆర్థికంగా అప్పటికే చాలానష్టము కల్గియుండుటచేతను, మరికొన్ని కారణములచేతను, శ్రీవారి ఆజ్ఞచే పత్రిక నిలుపుచేయబడెను.

శ్రీవారు ప్రతి సంవత్సరము వైశాఖ పూర్ణిమకు జరుపుచూ వచ్చిన గురుపరంపరా జయంతి యుత్సవములు తాడేపల్లి గూడెంలో శ్రీవారున్న 1948 సం॥లో కూడా జరుపవలెనని శ్రీవారు నిర్ణయించిరి. గురుపరంపరా పూజాదికములు మహావైభవముగా జరిగెను. సాయంకాలములయందు రెండు రోజులూ సభా, సమావేశములు జరుపబడెను. వేదాంత విషయములనుగూర్చి యుపన్యాసములు జరిగెను.

ఈకాలంలో కోటమర్తి రమణయ్యగారొకసారి శ్రీవారి కడకేతెంచి తనకు నిజప్రబోధ విధానము, ధర్మోపదేశ పూర్వకముగ అనుగ్రహించమనిన్ని, తాడేపల్లిగూడెంలోనేయుండి మధూకరవృత్తిపూని జీవయాత్ర సాగిస్తూ ప్రబోధను పూర్తి చేసుకుంటాననిన్ని, శ్రీవారిని ప్రాథేయ పూర్వకముగాగోరెను. గురువులైనవారు ధర్మోపదేశముగాని, వారిశిష్యులకు చెప్పుకోవలెనుగాని, ప్రతీవారికీ తాము ధర్మోపదేశము చేయజాలమని శ్రీవారు ఆదిలో చెప్పినమాటనే తిరిగిచెప్పి వెంకటరమణయ్యగారిని శిష్యునిగా స్వీకరించుటకు శ్రీవారు నిరాకరించి పంపివేసిరి. పలనవగా శ్రీ పాలూరి రామమూర్తిగారొక్కరు తెలుసుకొంటే, వారివల్ల వారిశిష్యులైన కందర్ప పరికాశంగారు,ఆయన

వల్ల ఆయన శిష్యులగు వెంకటరమణయ్య వగైరాగార్లు, బోధ తెలియవచ్చునుగదాయని శ్రీవారియూహ. సాముదాయకంగా అంతకుపూర్వం అందరి తరపున అర్ధించెనేగాని, యింతవరకు వ్యక్తిగతంగా తానువక్కడే రమణయ్యగారు శ్రీవారిని బోధ చెప్పుడని అర్ధించి యుండలేదు. అదికూడ నిరర్ధకమై పోయెను. ఆయన యాశలన్నియు అడియాసలయ్యెను. అంతవరకూ అక్కడక్కడ పరోక్షంగా, శ్రీవారిని దూషించుచుండిన వెంకటరమణయ్యగారు బహిరంగముగా శ్రీవారిని విమర్శింప సాగెను.

ఇంతలో తాడేపల్లిగూడెంలోనే శ్రీ బండి రామస్వామి గారి ప్రధమ సాంవత్సరిక అరాధనోత్సవము జరుగుట తటస్థించెను. ఉభయగోదావరి కృష్ణామండలములలోనున్న శ్రీవారి ప్రతిపక్షులందరూ ఈ సమావేశమునకు రప్పింపబడిరి. గ్రామంలోనేయుండిన శ్రీవార్కిగాని, శ్రీవారికూటములో చేరిన అస్మదాదులకుగాని, ఆహ్వానములు పంపబడలేదు. ఏలూరునుండి భేతా లక్ష్మయ్య వచ్చెను. ఇతడు శ్రీవారియెడల విశేష గౌరవ ప్రపత్తులు ప్రదర్శిస్తూ వుండేవాడు. బహులౌక్యుడు. రామస్వామిగారి ఆరాధనోత్సవములలో పాల్గొంటూ, అక్కడి విశేషములు ఎప్పటి కప్పుడు శ్రీవార్కి నివేదిస్తూ వుండేవాడు. భీమవరంనుండి వచ్చిన కోటమర్తి వెంకటరమణయ్య వగైరా గార్లున్నూ, మాస్టేరు పాలింతమునుండి సజ్జా రామదాసు గారున్నూ వారి భక్తమండలియున్నూ, సభలలో బహిరంగముగా శ్రీవారిని విశేషముగా విమర్శించుటయేగాక వ్యక్తిగతముగా తూలనాడుచుండిరి. భేతా లక్ష్మయ్యగారులేచి, ఒక వ్యక్తిపై పరోక్షంగా నేరారోపణలు గావించుట న్యాయ్యము గాదనిన్నీ

శ్రీవారు గ్రామంలోనే వుండిరి కనుక వారిని పిలిపించి వారి సమక్షంలో విమర్శసాగించుట ధర్మమనిన్ని. ఎంతహితము చెప్పినా వినక, శ్రీవారిని నోటికి వచ్చినట్లు దుర్భాషలాడుతూ ప్రసంగములు గావించిరి. అందు రామస్వామిగారి శిష్యుడు దగ్గుపల్లి వెంకన్నగారొకరు, శ్రీవారి ముఖ్య శిష్యులు పరివేష్టించియుండగా, లక్ష్మయ్యగారికి వార్తలు వినిపించు చుండెను. తగుచర్య తీసుకోవలెనని కొందరూ, సభలకువెళ్లి వారిని యెదిరించి బుద్ధిచెప్పవలెనని కొందరూ, శ్రీవారి శిష్యులు వేగిరపడు చుండిరి. కాని, శ్రీవారు మాత్రము నిశ్చలముగా నుండిరి. వారి ముఖకళవళిక లిసుమంతయూ మారనైనలేదు. వారిశాంతము, తము జూచి అద్భుతపడిపోతిమి. అశరీరులుకదా! యీ మాత్రము నకే అంతఃకరణ స్తిమితముచెడునా! అని మరల సమాధానము పొందుచుంటిమి. అందరూ అన్నివిధములా, ఏమిచేయవలెను? అని, ఆలోచనలు చెపుతూంటే తమ అభిప్రాయమేమని లక్ష్మయ్యగారు శ్రీవారిని నొక్కినొక్కి అడగగా "పోనీలే, వాళ్లపాపాన్న వాళ్లేపోతారు; మనకేమియని శ్రీవారూర కుండిరి" కాని మనసులో ఏలేశమైనా కష్టము కలుగకుండ నుండునాయని అనుకొంటిని, కలిగియేయుంటే,

ఆ. వె. ఉసురులేనితిత్తి యిసుమంత యూదిన
పంచలోహములును భస్మమగును.
పెద్ద లుసురుమంటె పెనుమంట లెగయవా
విశ్వధాభిరామ! వినురవేమ!!

అను వేమన పద్యము నాహృదయమున తళుక్కుమనెను. చివరి కట్లే జరిగెను. కోటమర్తి వెంకటరమణయ్యగార్కి కుష్ఠురోగ

మంకురించెను. ఆయన సహాధ్యాయుడగు ముదిగంటి బ్రహ్మానందమునకు పక్షవాతమువచ్చి నోరుపడిపోయెను. వీరియుభయుల గురువులగు కందర్ప పరికాశంగార్కి నెలకు రమారమీ 150/లు రాబడిగల యుద్యోగమూడిపోయెను. దగ్గుపల్లి వెంకన్నగారి కోట్లు పరశురామప్రీతి అయెను. నాకుతెలిసినవి యివి, మరెవరెవర్కి యెట్టి యిక్కట్లు కలిగెనో నాకు తెలియదు. తప్పకుండా కలిగియుండునని యే నానమ్మకము. కాని, శ్రీవారిని దూషించిన పాపఫలమని వారనుకోకపోవచ్చును.

"అచలఋషి వేమన" పత్రిక ప్రచురణ ప్రారంభమైన కొలది దినములకే శ్రీవారి జ్యేష్ఠకుమారుడు "సాందీప్"నకు (అప్పట్కి అతడొక్కడే కుమార్డు వయస్సు 8 సంవత్సరములు) జబ్బుచేయుటచే శ్రీవారు కుటుంబ సహితంగా మదరాసు వైద్యము నిమిత్తం వెళ్లిరి. అక్కడ శ్రీవారి ప్రథమ శిష్యులు ముత్తుసామిశెట్టి సోదరులు, శ్రీవారిని యింటబెట్టుకొని యెట్టిలోపము రాకుండ చూచుకొనుచూ శ్రీవారిని సేవించుకొను చుండిరి. రెండుమాసములు అక్కడుండి సాందీప్‌నకు, స్వస్థతచేకూరగనే శ్రీవారు తిర్గి తాడేపల్లిగూడెం వచ్చివేసిరి.

అప్పట్కి రజాకార్ల యుద్యమము, యిండియా ప్రభుత్వమువారి పోలీసు యాక్షనుతో అణచివేయబడెను. శాంతి భద్రతలు పూర్తిగా నెలకొల్పబడెను. శ్రీవారు సికింద్రాబాద్ పోవ సమకట్టిరి. ఇక నాలుగు రోజులకు ప్రయాణమనగా శ్రీవార్కి వీడ్కోలు యిచ్చుటకు, భక్తాదులు చాలామంది సమావేశమైరి. సమావేశమైన వారిలో ఎవరెవర్కి యెట్టి సందేహములున్నా అడిగి తెలిసికొనుడని శ్రీవారు హెచ్చరించిరి.

పరిపూర్ణ సూచనగాని వారినందరినీ ముందుకు పిలచి వార్కి పరి పూర్ణవస్తు నిశ్చయ జ్ఞానము కల్గించిరి.

నాడు ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమీ ఆదివారం 17-10-46 వ తేదీ, శ్రీవారు మాదంపతులకు బోధాధికార మనుగ్రహించ దలచి, అధికార పత్రిక వ్రాయుమని, శ్రీ భైరరాజు సత్తిరాజు గారి నాజ్ఞాపించిరి. "అయ్యా మాకు బోధాధికారమువలదు, అంతటి భారమును వహించలేము, మా జన్మ కర్మలనుండి మేము విముక్తులమైన చాలును" అని శ్రీవారిని పలువిధముల బ్రతిమాలితిమి. కన్నీరు బొట బొటగార్చుచూ అధికారము మాకువలదు అని నాభార్య ఎంతో మొరపెట్టుకొనెను. శ్రీవా రేమాత్రము మెత్తబడలేదు. ఒక్కమాటతో మమ్ము నిరుత్తరుల గావించిరి. "గురుఋణం తీర్చవలదా? ఏమిచ్చి గురుఋణం తీర్చ గలరు? ఏగురుబోధవలన తాను భ్రాంతి రహితుడు కాగల్గెనో ఆ దివ్యపరిబోధమును లోకకళ్యాణము కొరకు నిస్వార్థముగ లక్షణయుతులగు వారికి ప్రసాదించి వారిని భ్రాంతి రహితుల నొనర్చిననేతప్ప గురుఋణము తీరదు. బోధ తనకే సరిగా తెలి యనివాడు యితరులకు బోధింప బూనుట ఎంతదోషమో తెలిసి బోధించకుండా యుండుటకూడా నంతే దోషము" యిది శ్రీవారి వాదన. ఇక మేము నోరెత్తలేదు. ఆవిధముగా మాకధి కార పత్రికయిచ్చి దీవించి మమ్ము పంపివేసిరి. మరునాడే శ్రీవారు సికింద్రాబాద్ పయనమైరి. శ్రీవారుండిన ఆ సంవత్సర కాలము తాడేపల్లిగూడెం అస్మదాదులకు కాశీక్షేత్రమయ్యిం డెను. దేవుడులేని దేవళమువలె, గురువియోగ కారణమున మా హృదయములతోపాటు, తాడేపల్లిగూడెమే వెలవెల బోయి నట్లుండెను.

శ్రీ సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

రెండవ భాగము.

సప్తమ ప్రకరణము.

1949 సం॥రం॥లో వైశాఖ పూర్ణిమకు శ్రీవారు సికింద్రాబాద్‌లో యథాప్రకారం గురుపరంపరా జయంతి సభలు, యుత్సవములు, జరిపించిరి. ఈ సంవత్సరమే మేము తొలిసాఁగా సికింద్రాబాద్‌పోయి పీఠమను మందిరమును సందర్శించితిమి. అప్పటికి రజాకార్ల అల్లర్లు పూర్తిగా సమసిపోయెను. శాంత వాతావరణ వీచికలెల్లెడల నలముకొని దేశము చల్లగానుండెను. తొల్లిటికన్న మహావైభవముతో సభాకార్యకలాపములు జరగిపోయెను. దేశం నలుమూలలనుండి శ్రీవారి భక్తులు సభలకేతెంచిరి. ఎక్కడెక్కడివారు, ఒక్కచో సమావేశమై రజాకార్ల యుపద్రవములనుండి ఎవరెవరెట్లు క్షేమంగా, తప్పించుకొనగలిగినది ఒండొరులతో చెప్పుకొనుచూ, సంతోషముతో ప్రొద్దుపుచ్చిరి. యీ సంవత్సర జయంతియుత్సవ సందర్భములో, బీదలకుగూడ విరివిగా అన్నప్రదానం గావింపబడెను.

యీ సంవత్సరపు టాహ్వాన పత్రికలలో "షోడశి నాల్గు మార్గములు" "ద్వాదశి నాల్గు మార్గములు" అని వ్రాయబడిన రెండు పద్యములను, శ్రీవారు ఆహ్వాన పత్రికా ముఖపత్రంపైన ముద్రింపించిరి. అదిచూచి, శ్రీ పిల్ఖానా లక్ష్మణరావుగారి శిష్యులు కొందరు శ్రీవారికడ కేతెంచి, "ఏమయ్యా! లేనిపోని వన్నీ కల్పిస్తున్నావే? నాలుగు ద్వాదశులు, నాలుగు షోడశు

లంటూ కల్పించావేమిటి? ఎక్కడా సాంప్రదాయకంలో లేని విట్లా కల్పించవచ్చునా?" అని శ్రీవారిని యెదుర్కొనిరి. అంతట శ్రీవారు, మీ గురువుగారి దస్తూరీ పోల్చగలరా, అంటూ, లక్ష్మణరావుగారి స్వదస్తూరీని వ్రాసుకొన్న నోట్సు పుస్తకం యొకదానిని తెచ్చి చూసగా, అవును యీ దస్తూరీ అంతా మా గురువుగారిదే, అని వారొప్పుకొనిరి. అపుడు శ్రీవారు కొన్ని పత్రములు దిరుగవేసి, ఆ పద్యములు లక్ష్మణరావుగారి దస్తూరీలోనే యుండుట వారికి చూపిరి. "యీ పద్యములు మీ గురువుగారు స్వదస్తూరీని తమ వ్రాతగ్రంథములో వ్రాసి పెట్టుకొన్నారుగదా! మీకు మీ గురువుగారు చెప్పనంత మాత్రాన అవి సాంప్రదాయక విరుద్ధము లౌతాయా? ఏ కారణం కే మీకు చెప్పలేదో? ఆ భాగము వినుటకు అప్పటికి మీకర్హత, అధికారము లేదేమో! అవి విను అవకాశము, అదృష్టము మీకు లేకపోయెనే, అని మీరు కించపడాలి. మీకు తెలియక పోతే తెలిసినవారి నడిగి తెలుసుకోవాలి, అంతేకాని సాంప్రదాయక విరుద్ధమని కొట్టివేయతగునా?" అని శ్రీవారు వారిని మందలించిరి.

ఏక సాంప్రదాయకులైనా, చివరకొకే గురువుయొక్క శిష్యులైనా, ఒకరికి తెలియని విషయములు, మరొకరికి తెలిసి యుండవచ్చును. "యిది మా గురువుగారు మాకు చెప్పలేదు. మాకు చెప్పని విషయాలు మీకు చెప్పినారంటే మేం నమ్మము. యిది సాంప్రదాయకం కానేకాదు." అని మొండిగా వాదించడం చాలా అసమంజసం. మరియు మేధాసంపత్తిగలవాడు విన్న రెండుముక్కలతో మాత్రమే తృప్తిచెందక, విశేష విమర్శచేసి

బోధకెన్నియో మెరుగులు దిద్దగలడు. శిష్యుడు ఒక్కొక్క యెడల గురువనుమించిన శిష్యుడు కాగలడు. "సర్వత్ర జయ మన్విచ్ఛేత్ పుత్రాదిచ్ఛేత్ పరాజయం" అని, అందుకు ఆతని గురువుకూడ ఎంతో సంతసించును. అట్టివాని బోధ అసాంప్ర దాయకమగునా? అని శ్రీవారు వారిని మందలించి పంపివేసిరి.

విజయవాడలో పేరుపొందిన కవీశ్వరులలో వేదాంత కవిగారొకరు. వీరు వికటకవులు, ఎటువంటి కవి పండితులు వచ్చినా, సభావేదికనుండి వారిని వికటముగ విమర్శించి, నిర్భ యంగా నిలబడి యెదిరించగల సమర్థులు. ప్రతి సంవత్సరం మార్గశిర శుద్ధ ఏకాదశి ప్రభృతి, అవధూతస్వాముల ఆరాధనా వ్యాజంతో జరుగు, సభా సమావేశముల సంగతి యీయనకు తెలిసి, ఒక సంవత్సరం (అది 1950 అని జ్ఞాపకం) వీరు రెండు దినములకు సభా సమావేశములు ప్రారంభమగునన్న, వచ్చి గురవమ్మగారి సత్రంపైన మందిరంలో సమావేశమైయున్న శర్మా రెడ్డి వగైరాగార్లతో ఏదో వికటముగ చర్చించి, విమర్శించి పోయెను. ఆ మరునాడు శ్రీవారు సికింద్రాబాద్ నుండి విచ్చేసిరి. అది తెలిసి, వేందాంతకవిగారు మందిరమున కేతెంచి, శ్రీవారితో లెఖ్ఖ పదిమాటలు మాట్లాడెనో లేదోగాని, అంతలో శ్రీవారి యెడల భక్తిభావము పెంపై, ఆశువుగా శ్రీవారిపై కొన్ని పద్యములు చదివి, శ్రీవారివలన యథోచిత సత్కారముపొంది వెడలిపోయెను.

సాయంత్రం తిరిగివచ్చి అస్మదాదులతో ఛలోక్తిగా కొన్ని సాధారణ విషయములపై చర్చపెంచి, తన వాదనైపుణి ప్రదర్శించెను. ఆ మరునాడు శ్రీవారి శిష్యుడైన బాయి కన

కయ్య పాత్రుడుగారి మేడపైన జరిగిన సమావేశమునకు హాజరై కార్యక్రమమునందు పాల్గొని, తామకూడ నొక ప్రసంగం కావించెను. నాటి సభలో ప్రథమ వక్తగా నా భార్య శీతా మహాలక్ష్మి 'త్రికరణశుద్ధి' అనే విషయంపై మాట్లాడుచూ ప్రసంగవశాత్తూ ఛాందోగ్యోప నిషత్ప్రదిపాదిత త్రివృత్కరణ పద్ధతిని వివరించి మాటలాడియుండెను. పిమ్మట నేనున్ను, ఆ పిమ్మట శ్రీ చౌదరిగారున్ను ప్రసంగించితిమి. ఆ పిదప చివర వుపన్యాసకుడుగా వేదాంతకవిగారు లేచి శ్రీవారిని, వారి శుశ్రూషాఫలితముగ నింతవారైన శ్రీవారి శిష్యమండలిని చాల నభినందించెను. శ్రీవారు పులినీ, మేకనీ ఒకచోట నీరు త్రాగించుచున్నారట. ఏమనగా వర్ణాశ్రమ కులాచార విభేతలు గాని, స్త్రీ, పుంభేదముగాని, బ్రహ్మవిద్యా సముపార్జనా విషయంలో పాటించక, సర్వులకు ఒక స్థాయికి గొనివచ్చు శ్రీవారి కృషి ననేకవిధముల కవిగారు ప్రశంసించిరి. ఇంత అతీత వేదాంత సిద్ధాంతమేల అడుగునపడిపోవలెనా? యని చింతించిరి. దేనికైననూ ప్రభుత్వపోషణ అవసరమనియు, మీ సభా నమావేశములకు అధ్యక్షులుగా ఏ మంత్రినత్తమునో, లేక అధమం యే జిల్లాకలెక్టరు హోదాలోనున్న వ్యక్తినో, ఆహ్వానించి, కొద్ది స్తుతిపాఠములొనర్చి, వారిని వుపన్యాసములచే మెప్పించి, వారివలన అర్థికముగ తగు సహాయ సంపత్తులు బొందవలెనని సూచించిరి. శ్రీవారు తమ అధ్యక్ష సమీక్షా ప్రసంగంలో మాట్లాడుచూ, శ్రీ వేదాంత కవిగారు సహృదయముతో గావించిన సూచనలు, నిజముగా ఏ సంస్థ దరిద్రమునైనా పోద్రోలుటకు ఉత్తమోపాయములనుట నిస్సందేహమనిన్ని, కాని శ్రీ శివరామదీక్షితీయ సాంప్రదాయకధర్మ మట్టి యాచనా

రూప వ్యవహారములను తీవ్రముగా గర్హించుచుననియు, కేవలం ఘన కీర్తులకై ధర్మప్రవర్తన విడువరాదనిన్ని, దీక్షిత పీఠమును పాలించిన పూర్వగురువులు ధన సముపార్జనకై ఏ కించిత్ప్రయత్నం చేసినా, యితర పీఠములకువలెనే దీక్షితీయ పీఠమునకున్ను పెద్ద భవనములు, యెస్టేట్లు యేర్పడియుండెడివనిన్ని, శ్రీవారు సమాధానమిడిరి. యీ మాటలువిని మరింత హర్షము చెంది వేదాంతకవిగారు శ్రీవారికడ సెలవుగైకొని వెడలిపోయిరి.

ఇంతవరకు శ్రీవారు రోజు 1 కి, మూడు నాల్గు పెట్టెలకు తక్కువగాకుండా క్యాప్టెన్‌మార్కు సిగరెట్లు గాల్చుచుండిరి. యీ అభ్యాసము వారికి చిన్నతనముననే పట్టుబడెను. వినయాశ్రమం వగైరా సాధనాకేంద్రములలోనుండి క్రమశిక్షణలో మెలగుచువచ్చిన శ్రీ నర్సారెడ్డిగారు, శ్రీవారిని తాడేపల్లిగూడెంలో ప్రథమపర్యాయం 1948 లో చూచినప్పుడాయనకిది చాల యెబ్బెట్టుగా దోచెను. సర్వ వేదాంత సిద్ధాంతములకు నతీతమగు పరిపూర్ణబోధ సిద్ధాంతమునం దారూఢులగు మహాత్ములకు గూడ నిట్టి దురభ్యాసము లుండతగునా? అని నర్సారెడ్డిగారి అభిప్రాయము. మొదట చాటు చాటుగా అంటూవుంటే అస్మదాదులు "ఏ నిర్ణయమూలేని మహాత్ములు వారు" అనిన్ని, "శంకరులులు సురాపానం చేసినా, మానినా బాధ ఏమనిన్ని", ఏదేదో చెప్పినాము, కాని ఆయనకు నచ్చలేదు. చివరకు చూచాయగా శ్రీవారికడనే యీ విషయం నర్సారెడ్డిగారు ప్రసంగించగా "దానికేమి? సిగరెట్టు కాల్చినా, మానినా ఏమీ బాధలేదు" అనిమాత్రం శ్రీవారు ప్రత్యుత్తరమిడిరి. బాధలేకపోవడం దేనికి? లేక ఎవరికి? అని ప్రశ్నించు

కొంచే (1) స్థితిలక్షణమునకూ బాధలేదు - అంతమాత్రంచేత అది చెడదు. (2) నాకూ బాధలేదు - ఏలననగా మరుక్షణమున మానివేయగలను, అని శ్రీవారి వాక్యము రెండు విధములా అర్థమిచ్చుచుండెను. కాని నర్సారెడ్డిగారి సమాధానంతో తృప్తి పడలేదు. ఐననూ, అప్పట్లో, అంతకంటె ఏమి మాట్లాడుట కునూ ధైర్యము చాలక మిన్నకుండెను.

తదుపరి, 1949 సంవత్సరంలో శ్రీవారు ప్రప్రథమముగా నర్సారెడ్డిగారి కోరికను మన్నించి ప్రొద్దుటూరు పోయిరి. శ్రీ శివరామ దీక్షితాచల గురుపీఠాధిపతులు, తన గురుదేవులు, వేంచేయనున్నారని శ్రీ నర్సారెడ్డిగారు తన కవి, పండిత మిత్రు లందరికీ సంతోషంగా తెలియచేసియుండిరి. తెల్లవారితే శ్రీవారి సందర్శనముకొరకై, ఒకరొకరుగా వారంతావచ్చి ప్రసంగిస్తారు. కొంచమించుమించుగా శ్రీవారికి సిగరెట్టుచేతిలోనుండని సమయ మంటూ యుండనే యుండదు. సిగరెట్టుకూడ మానలేనివారా మీ గురువులు? పైగా పీఠాధిపతులుకూడానా? అని ఎవరైనా తన గురుమూర్తినిగూర్చి తనతో నందురేమో అని, నర్సారెడ్డి గారి భయం. ఎవరేనా చూడవచ్చినపుడైననూ దయయుంచి సిగరెట్టు కాల్చుట మానివేయుడని నర్సారెడ్డిగారెట్లో శ్రీవారిని కోరగల్గిరి. ఎవరో వచ్చినపుడు మానడమేమి? కాలిస్తే నిర్భ యంగా కాల్చాలి. లేదా పూర్తిగా మానెయ్యాలి. పూర్తిగానే మానేస్తానులే అంటూ, శ్రీవారు చెంతనున్న సిగరెట్టుపెట్టెని అవల పారవేసిరి. అంతే, తిర్గి ఆపిదప యిక ఎన్నడూ శ్రీవారు సిగరెట్టు ముట్టనేలేదు.

ఎవరైన నేమైన అనుకొందురేమోననే భయంతో బాహాటంగా పదిమందిలో కాల్చటం మానేసి, చాటుచాటుగా చుట్టలు వగైరాలు కాల్చేవారు లేకపోలేదు. అట్టి అలవాటే లేనివారుగా చెలామణీ అవుచూవుంటారుగూడా. ఏ పనియైనా బహిరంగంగా చేయక చాటుగా చేయడంలో మరింత దోష ముందనక తప్పదు. తనంతటివాడు యిట్టిపని చేస్తున్నాడని ఎవరైనా గమనించి, పదిమందికి చాటితే తనకెంత సిగ్గుచేటు? అంటే తన కహంకార, అభిమానములు, లోకవాసన ఘట్టిగా పాదుకొని యున్నవన్నమాట. ఆపని దోషమని తెలిసి, ఆదోషపు పని యితరుల కళ్ళబడకూడదనే వుద్దేశంతో గదా, ఏ పాడు పనైనా చాటుగాచేయడం? అట్టివాడు త్రికరణశుద్ధిలేని ఆత్మ వంచకుడనుటలో సందేహమేమైన నుండునా?

ఆ॥ వె॥ అంతరంగమందు అపరాధములుచేసి మంచివానివలెనె
మనుజుడుండు । యితరులెరుగకుంటె । ఈశ్వరు డెరు
గడా విశ్వదాభిరామ । వినురవేమ.

అని వ్రాసినాడు వేమన. మనోవాక్శరీరాలలో దేనిచేత కర్మ చేసినా ఆ ఫలమనుభవించకతప్పదు. మానసికకర్మకూడా దేవుని కళ్లు కప్పి చేయలేవు, అంటూంటే, యిక చాటు చాటుగా చేసే కాయక కర్మమాట వేరే చెప్పాలా?

ఏ అభ్యాసమైనా మానాలంటే, అది ఎంతకష్టమో ప్రయత్నించినవారికే తెలియాలి. నాకుమాత్రం పూర్తిగా ఆ విషయం అనుభవమే. నా భార్యపోరు పడలేక, ౩౫ సంవత్సరాలుగా నాకభ్యాసమైయున్న సిగరెట్టు ఎట్లో మానివేస్తిని. అట్లా చేయుటలో ఉషారుకోసం అప్పుడపుడు పీల్చిన ముక్కు

పొడుం, ఒక అభ్యాసమై పట్టుకుంది. ముక్కుపొడుం ముఖ్యంగా మానివేయాలని. ఆమె తిరిగి పట్టుపట్టింది. అయితే, మరల సిగరెట్టు అభ్యాసంలో పడేటట్టు తోచెను. సరే, యిది పనిగాదని, యిక యీ రెండూకూడా ముట్టనని ప్రమాణాలు చేస్తే నేగాని, యీ అభ్యాసములు నన్ను వదలలేదు సామాన్యులకెంత కష్టమో కావచ్చును. కాని మహాత్ములకో, వారిది వజ్రసంకల్పం కనుక ఒక్క సంకల్పంమాత్రం చాలును.

మహాపవిత్రమై, సర్వవేదాంత సిద్ధాంతములకు అతీతమై, యొప్పెడి శ్రీ శివరామ దీక్షితీయ సిద్ధాంతమునందు ప్రవేశించిన కొందరువ్యక్తులు బోధాధికారులయ్యు తమతమదుష్టప్రవృత్తులను విడువలేక దురాచారములను, దుష్టసాంప్రదాయములను యీ పవిత్ర సిద్ధాంతమునందు ప్రవేశపెట్టుటయేగాక, తదనుగుణ్యముగా పరిపూర్ణ గ్రంథములకు వ్యాఖ్యానమొనర్చి స్వార్థబుద్ధిబూని, కుక్షింభరులై, యీ పవిత్ర సిద్ధాంతమును కలుషితమొనర్చిరి. యిట్టి వ్యక్తులను, వారి అనుయాయులను, చూచి, వారి ఆచార విచారములే, యీ పీఠ ధర్మములు కాబోలునను కొని, లోకము యీ సిద్ధాంతముపేరు విన్నమాత్రమున నే ఏహ్యాభావమును ప్రకటించుచూ, యిదియొక శూన్యవాదమనీ, శుద్ధ నాస్తికమనీ, నీతిబాహ్యమనీ, అనేకతెరగుల నిందించు చుండిరి. ఈ సిద్ధాంతమనుసరించు శిష్టాచార సంపన్నులు చేయునది లేక, లోలోన కుమిలి చింతించుచుండిరి. శ్రీవారిది అంతయూ గమనించుచునేయుండిరి. కొంతకాలముగా యీ సిద్ధాంతమును నిష్కల్మషము గావించి పునః ప్రతిష్ఠ గావించవలెనని, శ్రీవారు అందుకు మార్గము లాలోచించుచునేయుండిరి.

ఈ పీఠ సిద్ధాంతములను, ధర్మాచరణకై నియమావళిని, ఏత న్నియమముల నుల్లంఘించినవారిపై తీసుకొనవలసిన క్రమ శిక్షణచర్యలను, ప్రాయశ్చిత విధులను పర్వరచి, వానినన్నిటిని గ్రంథ స్తముచేసి ప్రకటించి, తాము తీసుకొనదలచిన తొలి చర్యగా యీ పీఠము నొక రిజిస్టర్డు సంఘంగా, హైదరాబాద్ సొసైటీస్ యాక్టుక్రింద 1950 సంవత్సరములో రిజిస్టరు చేయించి చట్టబద్ధము గావించిరి. అట్లు చట్టబద్ధము గావింపబడినట్లు పత్రికా ముఖమునకూడా ప్రకటింపబడెను.

శ్రీవారి యీ చర్య, పెదదారులనులట్టి పోవుచు, నిరంకుశముగ స్వేచ్ఛాప్రవర్తకులై, తమతమ శిష్యులపై ఆధిపత్యమును చెలాయించు బోధాధికారులకు అశనిపాతమాయెను. వారి హృదయములు కల్లోలితములై, శ్రీవారియెడల ద్వేషాగ్ని కీలలు రేగి, చివరకు పెనుతుఫానుగా పరిణమించెను. శికింద్రాబాద్ లోని యిట్టి ప్రముఖులందరూ కుట్రచేసి, శ్రీవారి ఆధిపత్యమునే త్రోసిరాజనుటకు ప్రయత్నములు చేయసాగిరి. సన్నసన్నగా, శ్రీవారు పీఠాధిపతులే గారనీ, 1937 లోనే సంఘము నుండి బహిష్కృతులైనారనీ, కరపత్రములద్వారానూ, పత్రికల ద్వారానూ, శ్రీవారికి విరుద్ధముగా దుష్ప్రచారము సాగించిరి. అది కేవలం దుష్ప్రచారము మాత్రమేనని శ్రీవారు జవాబు చెప్పుచూ, శ్రీ శివరామ దీక్షితాచల గురుపీఠ సాంప్రదాయకులు అయివుండి, ఆ ధర్మమును అవగతము చేసుకొన్నవారెట్టి అవర్ద ప్రవర్తనలకు పాల్పడజాలరనిన్ని, విపరీతార్థములు బోధయందు చొప్పింపరనీ, నిజంగా సాంప్రదాయక రహస్యములు తెలిసియేయుంటే, భక్తి, జ్ఞాన, వైరాగ్యతత్వ, ముముక్షుత్వము

లకు దీక్షితీయ నిర్వచనమేమో పత్రికాముఖమున ప్రకటించ వలసిందని, శ్రీవారు ప్రకటించిరి. ఆ యా శబ్దార్థములు, నిర్వచనములు సాంప్రదాయకపద్ధతిగా యెన్నడూ విచారించినవారు కాకపోవుటదే వారి అసమర్థత, శ్రీవారియెడల మరింత అసూయాద్వేషములను రేకెత్తించెను.

1950 సంవత్సరం వైశాఖ పూర్ణిమకు శ్రీవారు యథా ప్రకారం జయంతిసభలను జరిగించుచుండిరి. తెలంగాణ, ఆంధ్ర దేశముల నలుమూలలనుండి భక్తానులరుదెంచిరి. సభాస్థలి కేతెంచు మార్గముల మొగలలో నిలచి, ప్రతిపక్ష సంఘములవారి అనుయాయులు, శ్రీవారిని దూషిస్తూ ప్రకటించిన కరపత్రములు, వేలకొలదిగా పంచిపెట్టిరి. శ్రీవారి అధికార ధిక్కారమేగాక, శ్రీవారి కీర్తి ప్రతిష్ఠలను నాశనముచేయు దుష్ప్రచారము విరివిగా జరుపబడెను. వీరి దౌష్ట్యము మితి మీరుచున్నదనీ, న్యాయశాస్త్రరీత్యా వీరిపై తగు చర్య తీసుకొనకతప్పదని, భక్తులు శ్రీవారిని చాల పట్టుపట్టిరి.

చాటుగా వెనుకనుండి యీ దుష్ప్రచారం సాగించుటకు మూలకారకులుగానున్న అరిగె రామస్వామి, అబ్బుగారి వీరయ్య, కొండోజు శీతయ్యగార్లపైనయున్నూ, వారి అనుయాయులపైనయున్నూ, శ్రీవారు మాననష్టమునకు క్రిమినలు కేసు పెట్టి పోరాడిరి. విశేష ధనవ్యయముచేసి తమకున్న పలుకుబడిని వినియోగించుకొని కొందరుబైటపడిరి. కాని ఒకరిద్దర్కి మాత్రం శిక్ష తప్పలేదు. అయితే అదియును వారు చేసుకొన్న అప్పీలులో జుల్మానాతో సరిపెట్టబడెను. ఈ కేసును సాకుగాగొని, శ్రీవారి ప్రతిపక్షులందరును ఏకప్రతిపక్ష సంఘు

ముగా ఏర్పడి, శ్రీవారి కెదురునిలచిరి. సక్రమంగా సాంప్రదాయక రహస్యములు శ్రీవారివలన తెలిసికొని తాము తరించి, తమ్మాశ్రయించినవారిని తరింపజేయ పూనుకొనుటకు బదులుగా వీరు తమ యిష్టము వచ్చినరీతిని ప్రబోధ ప్రచారములు సాగించుకొనుచున్నారు. వీరి నరికట్టు మార్గము లేకుండెను. నిజప్రబోధ సిద్ధాంతమును విరివిగా ప్రచారము సాగించినచో అరుణోదయమున చుక్కల ప్రకాశ మడుగంటిపోవునట్లు అల్పబోధలు అడివిత్రోవలు పట్టగలవని ఆశతో, శ్రీవారు దేశము నలుమూలల ఉపపీఠములను ప్రతిష్ఠించి తగువారిని అందు ప్రచారకులుగా నియమించుటకు పూనుకొనిరి. తెలంగాణమున గజవెల్లి తాలూకా రామసాగరములో 1940 సం॥రములోనూ, నిజామాబాద్ జిల్లా తుజాల్ పురములో 1942 లోనూ విజయవాడ (కొత్తపేట)లో 1943 సం॥రములోనూ శ్రీవారంతకు పూర్వమే యుపపీఠములను ఏర్పరచియుండిరి.

శ్రీవారి శిష్యులగు కడివేటి నర్సారెడ్డిగారిచే 1948 లో ప్రొద్దుటూరు పురమున నొక యుపపీఠ స్థాపనము గావింపబడెను. అట్లే దాసరి బ్రాహ్మణయ్య చౌదరిగారిచే 1952 సం॥రములో తణుకుగ్రామములో మరొక యుపపీఠము స్థాపించబడెను. 1954 సం॥లో నల్లగొండజిల్లా పొనుగోడు గ్రామంలో వాసిరెడ్డి వెంకటప్పయ్యగారి వల్లనూ 1955 లో వరంగల్లుజిల్లా జనగామతాలూకా ముస్త్యాలగ్రామంలో ఆగోలు సంగయ్యగారిచేతను 1956 సం॥రములో మహబూబ్ నగరుజిల్లా గద్వాలలో వకీలు శ్రీ టి. నాగప్పగారిచేతను, 1956 లోనే ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లి గ్రామంలో మొరిశెట్టి రామలింగంగారి

చేతనూ, 1957 లో కర్నూలుజిల్లా గిద్దలూరుగ్రామంలో శ్రీ బిజవేముల సుబ్బారెడ్డిగారిచేతనూ, 1959 సం॥రములో హనుమకొండలో శ్రీయుతులు జక్కోజు వెంకటనర్సయ్యగారి చేతనూ, 1960 సం॥రములో పశ్చిమగోదావరిజిల్లా, నర్సాపురం తాలూకా, కోమటితిప్ప గ్రామంలో శ్రీ పెన్మెత్స సూరపరాజు, ముదునూరి సత్యనారాయణరాజుగార్ల చేతను, యువ పీఠములు స్థాపించబడినవి. ఇందు ప్రొద్దుటూరు, పొనుగోడు, ముస్త్యాల, గద్వాల, గిద్దలూరు, హనుమకొండ, కోమటితిప్ప గ్రామాల్లో ప్రత్యేకంగా, శాశ్వతమైన చక్కటి మందిరములు, ఆశ్రమములు నిర్మింపబడియున్నవి. మిగతాచోట్ల తాత్కాలిక ఆశ్రమములు మాత్రమే ఏర్పడియున్ననూ, మొత్తం అన్నిచోట్ల నిత్య ధూప దీప నైవేద్యాదికములతో గురుపూజలు, ప్రతి పూర్ణిమాస్యకు ప్రత్యేకపూజలు, భజనకాలక్షేపములు, వేదాంతవిచారణ జరుగుచుండును. ప్రతిసంవత్సరం వార్షికోత్సవములు జరుగుచుండును. రెండు, మూడురోజులు కార్యక్రమముతో శ్రీవారి అధ్యక్షతను మహాసభలు, స్త్రీల నిమిత్తమై ప్రత్యేక మహిళాసభలు జరుపబడును. పరిసర ప్రాంతములయందలి భక్తాదులకివి పర్వదినములు. సాంప్రదాయక వేదాంత ప్రబోధకు సంబంధించిన వుపన్యాసము లీయబడును. అంతేగాక మరియొక విశేషమేమనగా, శిష్య ప్రశిష్యులుగాని, లేక సాంప్రదాయకేతరులుగాని విషయ నిర్ధారణ గావించుకొనుటకై చేయుప్రశ్నలకు శ్రీవారు సమాధానము లిత్తురు. అందుకుగాను ప్రత్యేకంగా 3 గంటలకాలము కార్యక్రమములో విధాయకంగా ప్రత్యేకింపబడును. శ్రీవారి వాగమృతమును గ్రోలి కృతార్థులు కావలెనని భక్తాదు లందరూ యీ కాలమునకై చాతకపక్షులవలె నిరీక్షించి యుందురు.

పైన వుదహరించిన యుపపీఠములుగాక, కొత్తగూడెం, అకివీడు, రావర్ల మొదలగు గ్రామాలలో ఉపపీఠము లేర్పడకున్ననూ, ప్రతిసంవత్సరం సభాసమావేశములు, గురుపూజోత్సవములు జరుగుచున్నవి. కొలదికాలములో యిట వుపపీఠములు ఏర్పడ వచ్చును. రాయచూరు, నర్సాపురం మొదలగు గ్రామాదులలో శ్రీవారి భక్తమండలియున్నది. సంవత్సరానికొక మారైనా శ్రీవారు యీగ్రామాలకు వేంచేయుదురు. పరిసర గ్రామ భక్తులువచ్చి శ్రీవారి బోధామృతమును గ్రోలి కృతార్థులగు చుందురు. కాని యీగ్రామాదులలో యింకనూ బహిరంగ సభా కార్యకలాపములు జరుగుటలేదు.

శ్రీవారి అధిపత్యమున పైనపేర్కొన్న ప్రదేశములందు మాత్రమేగాక అనేకచోట్ల బహిరంగసభలు జరుపబడినవి. అందు శ్రీవారి శిష్యులలో సమర్థులగువారు శ్రీ శివరామదీక్షితీయాచల పరిపూర్ణబోధ సాంప్రదాయక విశిష్ఠతను లోకమునకు చాటి మహోపన్యాసములిస్తూవచ్చిరి. ఇందు కర్నూలు, ఖమ్మంమెట్టు, రాయచూరు, అన్నారుగూడెం, రాయికల్ (కరీం నగరం), అనపర్తి, సరిపల్లె, ఆత్మకూరుతాలూకా కలువాల, కర్నూలుజిల్లా సర్వగ్రామములు, పశ్చిమ గోదావరిజిల్లా కల్వలపల్లి ముఖ్యములు. శ్రీవారి అనుజ్ఞతో పైప్రదేశములందు మాత్రమే గాక, ఉండి, లూటుకురు, నరేంద్రపురం, గొల్లప్రోలు గ్రామాలకు ప్రత్యేకంగా ఆయాగ్రామస్థుల ఆహ్వానముపై పోయి నేను, శ్రీ శివరామదీక్షిత దివ్యసందేశమును గూర్చి యుపన్యాసము లిచ్చితిని. పలుచోట్ల యితరసాంప్రదాయక పండిత ప్రకాశ్రీదులతో వాగ్వాదములు, గోష్ఠులు జరుగుచుండెను. కాని ఏ ప్రదేశ

ములో గూడ దీక్షితీయ దివ్యపతాకము అంగుళమైన కంగలేదు. శ్రీ దాసరి బ్రాహ్మణయ్యగారు భగవద్గీతోపన్యాసకులుగా లెక్కలేనన్ని తావులకు ఆహూతులైపోయి యుపన్యాసము లిత్తురు. వారీ సందర్భంలో పరిపూర్ణబోధనే ప్రధానంగా ప్రచారం చేయుచున్నారు. ఇటీవల శ్రీ కమలీబాబా గారి ప్రార్ధనపై, వారితో శ్రీ చౌదరిగారున్ను, కొండమడుగుల వెంకటరెడ్డిగారున్ను, కృష్ణాజిల్లా గ్రామాదులలో పర్యటించి పరిపూర్ణబోధను ప్రచారం చేసియున్నారు. 1960 సంవత్సరంలో శ్రీ కమలీబాబాగారు కొండవీడుగ్రామంలో జరిపించిన మత మతాంతర మహాసభలో పరిపూర్ణబోధ ప్రాశస్త్యమునుగూర్చి శ్రీ చౌదరిగారు, శ్రీ వెంకటరెడ్డిగారు మహోపన్యాసములు గావించిరి. యీ విధంగా శ్రీవారివల్లనూ, బోధాధికారులగు శ్రీవారి శిష్యులవల్లనూ, గత 10 సంవత్సరములుగా పరిపూర్ణ బోధ, ఆంధ్రదేశము నల్గడల ప్రచారము చేయబడుచున్నది. సాధారణంగా "అది అచల బోధలే! మనకెందుకు పో!" అని నిర్లక్ష్యముచేసి, నీచపరచి ప్రజలు తొలగిపోవు దుర్దినములు గతించినవి. "అబ్బా! యీ బోధ, యెంత వేదసమ్మతమై యున్నది? ఎందువలన యిది యింత మరుగుగా నుండిపోయిన దింతకాలమూ?" అని పూర్వం తమకు యీ బోధయందు ఏర్పడిన ఏహ్యాభావమును మార్చుకొని సంపూర్ణ గౌరవాదర భావములను, చదువుకొన్న పెద్దలు సహితం ప్రకటించుట చాలా ముదావహము. దీనికంతకు శ్రీవారు నిర్విరామంగా చేయుచున్న ప్రచారకృషియే ముఖ్యకారణమనుటలో ఏమీ సందేహంలేదు.

(శ్రీ) మేడవరం సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కర్నూలుజిల్లా అళ్లగడ్డ గ్రామకాపురస్థులు, అద్వైత వేదాంత గురువులట. వీరు 1951 సం॥లో యదార్ధ విచారము అను ఒక గ్రంథమును వ్రాసి అందు "అచలమత పరామర్శ" అను ప్రకరణ మొకటి చేర్చిరి. ఈ గ్రంథప్రతి నొకటి (శ్రీ) నర్సారెడ్డిగారు చూచి (శ్రీ)వార్కి పంపిరి. ఆ గ్రంథంలో యీ సాంప్రదాయక సిద్ధాంతమును, దుర్విమర్శ గావించుటయేగాక ఏతత్ప్రతిష్ఠాపనాచార్యులగు (శ్రీ) శివరామ దీక్షితులవారిని సహితం, గ్రంథ కర్త తూలనాడియుంౘెను. దీని నుపేక్షించి యూరుకొన్న లాభంలేదనీ, దానికొక ఖండన గ్రంథం వ్రాసి ముద్రించుటయే అవసరమనీ, (శ్రీ)వారు నిర్ణయించి, ఆ కార్యక్రమమునకు నన్ను నియోగించి, ఆ యదార్ధ విచార గ్రంథప్రతిని నాకు పంపిరి. "దుర్విమర్శాంధకార భాస్కరం" అను పేరుతో నేనొక ఖండన గ్రంథమును వ్రాసి, అచ్చొత్తించి, ఆ గ్రంథమును యీ దిగువ రచించిన పద్యరీత్యా (శ్రీ)వారికే అంకితమిచ్చితిని.

కృ తి స మ ర్ప ణ ము

సీ॥ (శ్రీ) మించు రామడ్గు శివరామదీక్షిత
శిష్యపరంపరా శ్రేణిచేరి
పీఠాధికారంబు పెద్దలచే బొంది
ధీమంతులనుగూడ దిద్దితీర్చి
చేరెడు శిష్యుల శీలంబు పరికించి
అధికారులగువారి కాశ్రయమిడి
పరిపూర్ణబోధచే భ్రాంతుల పోద్రోలి
దీవించి పంపెడు దివ్యపురుషు

తే॥ గీ॥ డచలఋషి దయానంద పాన్నాల రాజ
యార్య రాజయోగీంద్రు పాదాబ్జములకు
హారతిచ్చెద దుర్విమర్శాంధకార
భాస్కర ప్రభాళీ పరంపరలతోడ,

ఉలపకుర్తి వీరవెంకట రామచంద్రరావు,
గ్రంథకర్త.

శ్రీ మేడవరం సుబ్రహ్మణ్యశాస్త్రిగారికిన్ని, వారి శిష్యులకు కొందరికిన్ని, గ్రంథప్రతులను పంపించితిని. కావలసినవారందరికి యీ ఖండన గ్రంధము నుచితముగా పంపించితిమి. పరిపూర్ణ బోధ సిద్ధాంతమేమో యీషన్మాత్రమును యెఱుగకనే దానిని దూషించి, దుర్విమర్శ గావించిన శాస్త్రిగారు, ఖండన గ్రంథమును చదువుకొని, తమ తప్పిదమును గుర్తించి, నా కుత్తర మొకటి వ్రాసిరి. అందు నాతో వివాదం పెంచుకొనుట కిష్టం లేదనిన్ని, అచలమత పరామర్శ అను ప్రకరణమును తమ గ్రంధమునుండి సంపూర్ణముగా తొలగించితిమనిన్ని, అట్లు తొలగింపబడిన ప్రతులనుమాత్రమే యికముందితరులకు పంపిస్తా మనిన్ని, శాస్త్రిగారు వ్రాసిరి.

కాని వారి అనుయాయులు వారిని వూరుకోనివ్వలేదని అనుకోవాలి. ఏమనగా, తర్వాత సుమారు ఒక సంవత్సర మూరుకొన్నవారూరుకొనక "అద్వైత సిద్ధాంతం, సామాన్యోపదేశ పద్ధతి, అసామాన్యోపదేశపద్ధతి అని ద్వివిధంగానున్నది. అందులో మా పద్ధతి అసామాన్యోపదేశపద్ధతికి చెందిన నిర్వాసనా మౌనముద్రా నిష్ఠాస్థితి" అని ఆ యుపదేశపద్ధతి, బోధక్రమము,

వగైరా వివరించుచూ నలభై పేజీల గ్రంథం వ్రాసి, నాకు పంపిస్తూ "యిది మా స్థితి, చేతనైతే దీన్ని శ్రుతిప్రమాణము చేతను, యుక్తులచేతను ఖండించి, మీస్వమతం సిద్ధాంతంచేసుకో" వలసిందిగా సవాలుచేస్తూ, నాకు ఒక ఉత్తరం వ్రాసిరి. అందులో ఉభయుల వ్రాతలు అచ్చువేయిస్తే లోకోపకారంగా వుంటుందని సూచించిరి. ఇక నేమి చేయవలెను? నిజంగా పరిపూర్ణభావం వాదభేదములేనిది. అన్ని వాదములను ఆకళింపుచేసుకొని, దేని స్థానము దానికిడి, ఆ సర్వవాదములకు అతీతముగనున్న పరిపూర్ణ పరబ్రహ్మమును ప్రతిపాదించునది ఐనను స్వయం రక్షణార్థం వాదమునకు నేను పూనుకొనవలసివచ్చెను. శాస్త్రిగారు కోరిన ప్రకారం శ్రుతిప్రమాణయుక్తంగానే, శ్రీ శాస్త్రిగారి అసామాన్యోపదేశ పద్ధతికంటెనూ, శ్రీ శివరామదీక్షిత పూర్ణబోధ సిద్ధాంతం ఎట్లు అతీతమైయున్నదో నిరూపిస్తూ 60 పేజీల వ్రాతగ్రంథము వ్రాసి శాస్త్రిగార్కి పంపితిని. ఆయన దానిని చదువుకొని సంతోషించి, "లౌక్యవృత్తియందుంటూనే, వేదాంతము నందంత కృషిచేసినందుక్కు, నన్నొకప్రక్క నభినందిస్తూ, నేను వ్రాసిన ప్రతివిషయము, తాము ఖండింపగలమని మరొకప్రక్క బీరములు పలికిరి. కాని వేదాంతులు కొట్లాడుకొంటున్నారని, లోకులు అపహాస్యము పాలుచేతురుగనుక యీ ఖండన మండనముల కంతటితో స్వస్తిచెప్తున్నామనీ, జవాబు మాత్రం వ్రాసి, చల్లచల్లగా తప్పుకొన్నారు.

కం॥ పలికెడిది భాగవతమట
పలికించెడువాడు రామభద్రుండట నే

పల్కిన భవహరమగునట
పలికెద వేరొండుగాథ బలుకగనేలా

అని బమ్మెర పోతన్నగారు వ్రాసిన విధంగా, మేడవరం సుబ్రహ్మణ్య శాస్త్రిగారితో వ్రాతమూలంగా చేసిన వాదోప వాదములు, ఖండన మండనములు, శ్రీవారు నాద్వారా జరిపించినట్లే గాని, అన్యంకాదు. అందుకు శ్రీవారి పరిపూర్ణ కటాక్షమే నాకు సత్తా యిచ్చినది. నేను సాధించిన యీ విజయము శ్రీవారు పరోక్షంగా సాధించిన విజయములలో నొకటి. కాని గురు కృపాసంసిద్ధి నాకు ప్రాప్తించిందనుటకుమాత్రం అది యొక తార్కాణ. అందుకు మాత్రం నేను విజయగర్వంతో ఆనందిస్తున్నాను.

శ్రీ సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

రెండవ భాగము.

అష్టమ ప్రకరణము.

ఇంచుమించు యీకాలమందే శ్రీవారికిన్ని, ప్రొద్దుటూరు ప్రాంత వాస్తవ్యుడగు వేదాంతం లక్ష్మయ్యగార్కిన్ని వాదోపవాదములు జరుగుట తటస్థపడెను. శ్రీ కడివేటి నర్సారెడ్డిగారు, రాజయోగీయ, పరిపూర్ణ రాజయోగీయ గ్రంథములు రచించి, శ్రీ గడియారం వెంకటశేషశాస్త్రిగారి యధ్యక్షతను ఏతద్గ్రంథావిష్కరణ మహోత్సవ సభాసమావేశమును ఏర్పాటు గావించి, శ్రీవారి నాహ్వానించి ప్రొద్దుటూరు రప్పించి యుండెను. శ్రీవారితో వారి శిష్యులగు దాసరి బ్రాహ్మణయ్య చౌదరిగారును, షేక్ మొహియుద్దీన్ సాహేబుగార్లున్ను పోయి యుండిరి. వేదాంతం లక్ష్మయ్యగారంటే ఆ ప్రాంతానికి వేదాంతంలో పెద్దపులివంటివాడు అని, ఆయన అభిమానులందురు. విచారసాగరాది వుత్తము ఆంధ్ర వేదాంత గ్రంథములు కొన్ని యీయనకు కంఠస్తములట. యీ పరిజ్ఞానముతోను, తనకు దైవమిచ్చిన ధైర్య సాహసములతోనూ, ఆయన ఎటువంటివారినైనా తబ్బిబ్బుచేస్తూ, వేదాంతం లక్ష్మయ్య అను కితాబు ఆ ప్రాంతంలో సంపాదించియుండెను.

రాయలసీమ ప్రాంతమందు వడమాలపేట పీఠమను పేరుతో, ఒక వేదాంత సాంప్రదాయము వ్యాప్తిలోనుండెను.

యీ సంస్థకు మూలపురుషులు మహమ్మదీయులు. (మౌలాలీ సాంప్రదాయమనికూడా దానినందురు.) ఈ సంస్థగాక, బ్రహ్మంగారి పీఠంపేరిట యొక సాంప్రదాయక మొకటి అందందు వ్యాపించియుండెను. యీ రెండు సంస్థలకు, శ్రీ శివరామ దీక్షితులవారి సాంప్రదాయముతో ఎన్నడున్ను ఎట్టి సంబంధము లేదు. ఐనను పైన పేర్కొన్నవారు, తాముగూడ దీక్షితీయ సాంప్రదాయకులమే అని చెప్పుకొనుట కద్దు. పాపము! శాస్త్రీయజ్ఞానముగాని, అనుభవముగాని, తుదకు శిష్టాచారముగాని, యెరుగని యీ వడమాల పీఠ సాంప్రదాయకులపై శ్రీ వేదాంతం లక్ష్మయ్యగారు నల్లేరుపై బండినడక సాగించుచుండిరి. శ్రీవారు పీఠాధిపతులనీ, వారివద్ద ధర్మము తెలసికొని శ్రీ నర్సారెడ్డిగారు కృషిచేయుచున్నారని, లక్ష్మయ్యగారు తెలసికొని, యీ సాంప్రదాయకముగూడ పైసాంప్రదాయకముల వంటిదే అనుకొని, నర్సారెడ్డిగారిపై దండయాత్ర సాగించిరి. పీఠాధిపతులే వస్తున్నారుగదా! మీ సామర్థ్యం వారియెదుటే పరిదర్శించుకోవచ్చునని శ్రీ నర్సారెడ్డిగారు వాయిదావేసి యుండిరి.

నియమిత దినమున శ్రీ నర్సారెడ్డిగారి గ్రంథావిష్కరణ సభాసమావేశము జరుగుచుండెను. అధ్యక్షులతోపాటు శ్రీవారును, వేదికపై మరొక కుర్చీయందుపవిష్టులై యుండిరి. లక్ష్మయ్యగారు కొందరు శిష్యులతో సభలో ప్రవేశించెను. తోడనే సభలో కలకలము ప్రారంభమయ్యెను. గ్రంథప్రాశస్త్యమునుగూర్చి యితర వక్తలెవరైన నుంచే మాట్లాడవలసిన తరుణమేతెంచెను. వెంటనే లక్ష్మయ్యగారు సభావేదికపైకురికి

"శివరామ దీక్షితీయ పీఠమట! దానికి పీఠాధిపతులట! మన గ్రామం వచ్చి, వారి ప్రబోధముతో మనల నుద్ధరిస్తారట" అంటూ ప్రారంభించి, అకాండతాండవ మారంభించెను. సభాధ్యక్షులు కలుగచేసుకొని, అది వేదాంతసభ గాదని, సారస్వత సభాసమావేశము మాత్రమేనని, ఆవిష్కరణ కాబడిన గ్రంథమును గూర్చిగాని, అందుకు సంబంధించిన యితర సారస్వత విషయములపైనగాని, మాట్లాడవలెనుగాని, వేదాంత వాగ్యుద్ధముల కది తావుగాదని మందలించి లక్ష్మయ్యగారిని వారించిరి. ఆ మరునాడే అగస్త్యేశ్వర స్వామివారి ఆలయంలో వేదాంతసభ జరుగగలదనీ, ఆ సభలో మాట్లాడవచ్చుననీ, శ్రీవారు అధ్యక్షుల ద్వారా ప్రకటింపచేసిరి.

కాని లక్ష్మయ్యగారి తీంద్ర మాగలేదు. శ్రీవారును, వారి శిష్యులును, శ్రీ నర్సారెడ్డిగారింటనే విడిదిచేసియుండిరి. లక్ష్మయ్యగారా రాత్రే యిద్దరు శిష్యులను వెంటబెట్టుకొని, నర్సారెడ్డిగారింటికేతెంచెను. బడబాగ్ని నారాయణరాజుగారున్నూ, నటరాజాచారి అనువారున్ను, శ్రీవారితో మాట్లాడుటకై వచ్చి, ఆ సమయమున కచ్చటనే యుండిరి. తొలుతనే లక్ష్మయ్యగారు, తానొకవైపు, శ్రీవారొకవైపు, యిద్దరే మాట్లాడవలెనుగాని, చర్చలో యితరులు జోక్యం కలిగించుకో రాదని నియమమేర్పరచిరి. నారాయణరాజు, నటరాజాచారి గార్లు మధ్యవర్తులుగా, శ్రీవారితో లక్ష్మయ్యగారు చర్చ ప్రారంభించిరి. శ్రీవారు సమాధానం చెపుతూ ప్రసంగవశాత్తూ (1) మహావాక్యార్థతోదూరో, బ్రహ్మాస్మి త్యతిదూరతః। తచ్ఛబ్ద వర్జ్యస్త్వం శబ్దహీనో వాక్యార్థ వర్జితః॥ అనియును, (2) ప్రజ్ఞాన

వాచ్యహీనాత్మా అహం బ్రహ్మాస్మి వర్జితః, తత్వమస్యాదిహీనాత్మా అయమాత్మా వివర్జితః। అనియును, (శి) ఆత్మేతి శబ్దహీనో అయం, ఆత్మ శబ్దార్థ వర్జితః, సచ్చిదానంద హీనోయ ఏషైవాత్మ సనాతనః। అనియును, శ్రీవారు చదువుట తటస్థించెను. యీ శ్లోకము లెక్కడా లేవు, మీ పరిపూర్ణ భావజ్ఞలు కల్పించి యుండాలికాని, అని లక్ష్మయ్యగారు, (తేజోబిందూపనిషత్తు లోనివని శ్రీవారు చేప్పేమాటలు త్రోసివేస్తూ) పిడివాద మారంభించిరి. శ్రీవారిని ఉపనిషత్తులో చూపమని లక్ష్మయ్య గారు సవాలు చేసిరి. శ్రీవారు తేజోబిందూపనిషత్తు తెప్పించి ఆ శ్లోకములకై పుటలు తిరుగవేయజొచ్చిరి. శ్రీవారు ఆలస్యము చేసినకొద్దీ, లక్ష్మయ్యగారు బలం పుంజుకుంటూ, తానెరుగని యుపనిషత్తులేమీ లేనేలేవనీ, 108 ఉపనిషత్తులూ తాను చూచి నాననీ, యీ శ్లోకాలు ఏ యుపనిషత్తునందూ లేవనీ, ఆ శ్లోకాలు తప్పక పరిపూర్ణ భావజ్ఞలే కల్పించారనీ, ఆ శ్లోకాలు ఉపనిషత్తు లలో చూపగల్గితే, తాను శ్రీవారికి శిష్యుడై, అచలజెండా పుచ్చుకొని, శ్రీవారిముందు నడుస్తూయుంటానని లక్ష్మయ్య గారు ప్రతిజ్ఞ చేసిరి. తొందరపడవద్దని శ్రీవారుచేసే హెచ్చరికను నిర్లక్ష్యంచేసి, ఆ ప్రతిజ్ఞను ముమ్మారు రెట్టించి రెట్టించి పల్కిరి. శ్రీవారు, ఆ శ్లోకములు తీసి చూపగా, పాపం! లక్ష్మయ్యగారు నివ్వెరపోయి, యెట్లో నిలద్రొక్కుకొని, 108 ఉపనిషత్తుల గ్రంథం అచ్చు అయివున్నదానిలో చూపితే, వప్పుకొంటాననిరి. అట్లే 108 ఉపనిషత్తుల గ్రంథంలోకూడ శ్రీవారు చూపిరి. దశోపనిషత్తులే ప్రమాణం, ఆ దశోపనిషత్తులలో యుంటేనేగాని నేనంగీకరించనని లక్ష్మయ్యగారు బుకాయింపజొచ్చెను. కాని మధ్యవర్తులైన నటరాజాచారి, నారాయణరాజుగార్లు కలుగచేసు

కొని "చాలు చాలు, యిక ప్రగల్భాలు మాను, ఏ యుపనిషత్తు లోనూ లేవన్నావు. ఏ యుపనిషత్తునందున్నా శ్రీవారికి శిష్యరికం చేస్తానని ప్రతిజ్ఞలు పల్కావు. కనుక అచల జండాకు నమస్కరించి, అది పట్టుకొని రేపటినుంచి శ్రీవారిముందు నడుస్తూయుండుము" అని తీర్పుచెప్పిరి. నూరుగొడ్లను తిన్న రాంబందుకు ఒక్క గాలివానపెట్టన్నట్టుల లక్ష్మయ్యగారికి శృంగభంగమాయెను. సిగ్గుపడి, తలవంచుకొని ఆయన చల్ల చల్లగా నిష్క్రమించెను.

కాని మరునాడు శ్రీవారి అధ్యక్షతను జరిగిన వేదాంత సభకు లక్ష్మయ్యగారు శిష్యసహితుడై వచ్చెను. సభాప్రారంభము నకు పూర్వమే శ్రీవారికిన్నీ, వారి శిష్యులకున్ను చల్లని పర్బతు పానీయములు స్వహస్తములతో యిచ్చి, సత్కరించుటయేగాక, సభా కార్యక్రమములో తొలుదొల్త, తావే వక్తగా నిలబడి, శ్రీవారు సామాన్యులు కారనిన్ని, తన ప్రచార విషయము లున్ను, శ్రీవారి ప్రచారమున్ను ఏకరూపంగానే యున్నవనిన్ని, ఉభయులు కలసి ప్రచారంచేసినచో లోకమునకు శ్రేయో దాయకమనిన్ని హెచ్చరించెను. ఏమిటిది? వేదాంతం లక్ష్మయ్య గారెన్నడైనా, మరొక వ్యక్తిని మెచ్చేడా? యేమి యీ విడ్డూరం, అని సభలో కలకలం బైలుదేరెను. శ్రీవారి శిష్యు డైన షేక్ మొహిద్దీన్ తన యుపన్యాసంలో ఆత్మస్వరూప నిరూపణగావించెను. పిమ్మట దాసరి బ్రాహ్మణయ్యచౌదరిగారు మాత్ర మట్లూరుకోలేదు. శ్రీ శివరామ దీక్షితాచల గురుపీఠాధి పతులు వచ్చారు. అతీత ప్రబోధ విషయములను ప్రసాదించారు. లక్ష్మయ్యగారివంటివారే స్వీకరించారు, అంటూ ప్రారంభించి

గతరాత్రి శ్రీ లక్ష్మయ్యగారు శ్రీవారివద్ద కేతెంచుటాదిగా విషయములన్నీ బైటపెట్టి, శ్రీవారితో లక్ష్మయ్యగారెట్లు వాదించినదియు, చివరకెట్లు పరాభవంపొంది వెడలిపోయి నదియూ వివరించిరి. అంతేకాక, దీక్షితీయ ప్రబోధమును, లక్ష్మయ్యగారి ప్రబోధము ఎంతమాత్రం ఒకటి గాదనిన్ని దీక్షితీయ ప్రబోధము లక్ష్మయ్యగారికేమీ తెలియదనిన్ని సభలో సింహగర్జనచేసి పల్కిరి. లక్ష్మయ్యగార్కి పాపం! శిరచ్ఛేదమైపోయి నట్లు భావించి, ఆ మరునాడే మూడు సంవత్సరాలు మౌనవ్రతం వహించినట్లు శిష్యులకుచెప్పి, లక్ష్మయ్యగారు దేశాంతరగతులైరి. శ్రీవారు సాధించిన యీ విజయం ప్రొద్దుటూరు ప్రజలలో శ్రీవారియెడల గౌరవాదరములను యినుమడింప చేసెను. అందుకే దిగువ ప్రశంసాపద్యములే తార్కాణ.

అపిష్నమస్తు. శ్రీ గురువర్యాభినందనము.

పంచరత్నములు

పంచపాది

గీ॥ శ్రీ మదచలర్తి రామద్దు గ్రామసీమ
స్వామి శివరామ దీక్షిత సాంప్రదాయ
మునను వెలసిన నిజగురుమూర్తులైన
శ్రీ దయానందరాజయోగీ; దయార్ద్రి
హృదయ నీనామ మిపుడు నామది దలంతు.

ఉ॥ నీపద పంకజంబులను నెమ్మదిఁగొల్చిన శిష్యకోట్లనున్
దాపునఁజేర్చి సర్వవిధ ధర్మములన్ దెలియంగఁజేసి దీ
క్షాపథమందుఁ ద్రిమ్మరిలు సంగతులన్నియు నిర్ణయించి వే
చూపుచు పూర్ణమౌ బయలుశోభిలఁజేయవె; యోగిచంద్రమా!

క॥ పొడిచిన కొట్టినఁ దిట్టిన
బడుచుండుమటంచు శిష్యవరులకు ననిశం
బెడసేయక చెప్పెడు నీ
నుడువు లమృతతుల్యమయ్య; నుతగుణభరితా!

క॥ గీతార్థమెల్ల నిరతము
చేతోముదమొదవునట్లు శిష్యులకు తగన్
బ్రీతిగఁ జెప్పెడు నీ ప్రి
ఖ్యాతి జగమునందు వెలసె కరుణావార్ధీ!

గీ॥ రాజయోగీంద్ర నిన్ను నే; రమణమీర
ప్రార్థనము సేతు నీదగు భక్తవరుల
యందు నేనొక్కఁడను గాఁగ నహరహంబు
జూచి దయతోడఁ బ్రోవుమో శుభగచరిత!

హోమ్సు పేట
గాంధీరోడ్డు
21-4-1952

ఇట్లు
శ్రీ సద్గురు ఆశాస్వాభిలాషి
బడబాగ్ని నారాయణరాజు

నాడు మార్గశిర శుద్ధ దశమి, (1953 సం॥రం). మరునాడే శ్రీ సచ్చిదానంద వేంకటేశ్వరావధూత స్వాములవారి ద్వాదశాబ్ద ఆరాధనోత్సవం. ఏతత్సందర్భమున మహాసభలు జరుగవలసి యుండెను. నేను సతీసమేతంగా మధ్యాహ్నం 2½ గంటలకు విజయవాడలో రైలుదిగితిని. కొత్తపేట, తమ్మిన గురువమ్మ గారి సత్రం మేడపైనయున్న గురుపీఠ మందిరమునకు పోతిని. శ్రీవారొక యున్నత పర్యంకమునం దుపవిష్టులైయుండిరి. వారి ప్రముఖ శిష్యులందరూ వారి కభిముఖులై నేలపై గూర్చుండి

యుండిరి. శ్రీవారి కభిముఖులై, వారి పాదపద్మముల కనతి దూరంలో పడకకుర్చీలో నొకవ్యక్తి కూర్చొని, శ్రీవారితో ప్రసంగించుచుండెను. ఆ నూతనవ్యక్తి వడమాలపేట పీఠాధిపతి నాగూరయ్యగారని, సోదర గురుపుత్రులు నాకు చెప్పిరి. ఓహో! యిర్వురి పీఠాధిపతుల ప్రసంగము వినునదృష్టము పట్టినది. యిక జన్మ తరించినదనుకొంటిని. శ్రీ శివరామదీక్షితుల వారు రచించిన, బృహద్వాశిష్ఠమును అచ్చొత్తింపదలచి తనవద్ద నున్న తాళపత్రి గ్రంథ ప్రతియందలి దోషములను సంస్కరించుచుండెనట. అబ్బా! ఎంతటి మహాపండితుడోగదా! క్రమశః ప్రసంగము కందార్థములపైకి పోయెను. కందార్థముల రచించిన శ్రీ భాగవతుల కృష్ణదేశికస్వామి, దీక్షితులవారి సిద్ధాంత భావములను తన కందార్థములలో విపులీకరించుటలో ఏమైన పెడదారులు బట్టెనా? అని పరిశీలించువానివలె, ఒక కందార్థం చదివి, యిది యిట్లా వ్రాసేడేమి? అని శ్రీవారి నడిగెను. శ్రీవారా కందార్థమునకు చక్కగా వ్యాఖ్యానముచేసి, వివరించుట పూర్తిఅయీ అవుటతోనే "అదిసరే, అది అట్లావుంచండి, యీ కందార్థమున కేమంటారు?" అని ఆ రెండు కందార్థములలోనూ, ఏదో పరస్పర విరుద్ధార్థములు వ్యక్తీకరింపబడినట్లుగా దాని వివరణ కోరెను. శ్రీవారా కందార్థమునుగూడ చక్కగా వివరించి, ఆ రెండు కందార్థములకు వైరుధ్యమేమీలేదని నిరూపించిరి. యిట్లా నాగూరయ్యగారు కందార్థము చదువుట, శ్రీవారు వ్యాఖ్యానించుట జరుగుచుండెను. తెలియనిచోట గడుసుదనంగా ఏవో ప్రశ్నలు నాగూరయ్యగా రడుగుట. శ్రీవారు సమాధానములు చెప్పుటగూడ జరుగుచుండెను. ఇచ్చిన సమాధానం ఔననడు, కాదనడు. ఒక్క విషయంపైనా

నిలబడడు. ఒకటి రెండు గంటలు గడచిపోయెను. శ్రీవారి కనవసరంగా శ్రమకలుగుచుండెను. యీ నిరర్థక ప్రశ్నలతో కాలము గడచిపోవుచున్నదే! దీనికేమైన ముగింపువున్నదా అని మాకందర్కి విసుగుదల హెచ్చుచుండెను. గురుస్వామినడిగి తెలుసుకోవలసిన విషయములు, అడిగి తెలుసుకొనుటకై ఎక్కడెక్కడనుండో వచ్చి వేచియున్నారు భక్తాదులు. ఈయనెవడో వచ్చి, అనవసరంగా కాలమంతయు గ్రసించుచున్నాడను భావము భక్తాదులయందు ప్రత్యక్షముగ గానవచ్చుచుండెను. శ్రీవారేమందురోయని యెల్లరూ మిన్నకుండిరి. ఇంతలో నాగూరయ్యగారు "అపరోక్షమౌనె మనుజులకు పరోక్షంబైన బయలు గురుకృపలేకన్" అనే కంధార్థమెత్తుకొని చదువుటలో 'రామునితోకపి' అన్నట్లు చదువుచు "అపరోక్షమౌనె మనుజుల" అని అక్కడాపి అపైన "కుపరోక్షంబైన బయలు గురుకృప లేకన్" అని చదివెను. "ఆగండి, ఆగండి, ఏదీ మళ్ళీ చదవండి" అని నేనడ్డగిలితిని. పాపమాయన తెల్లబోయెను. కాని తప్పుగా చదివితినేమో అనే సందేహమైనా ఆయనకు కలుగలేదు. తాను చదివినది సక్రమమే అనే యుద్దేశ్యంతో ఆయన "కుపరోక్షంబైన బయలు" అనియే తిర్గిచదివెను. "కుపరోక్ష మేమిటండోయ్" అని నేను చాలా ఎగతాళిగా నవ్వితిని. దానితో ఆయనకు కోపంవచ్చి, 'అవును, కుపరోక్షమైన బయలే' ఏమి అట్లా అడుగుతారు, అని నన్ను ఎదురుప్రశ్న వేసెను. "కుపరోక్షం" అంటే అర్థమేమి? ఆ శబ్దం ఏ నిఘంటువునందైనా చూపగలరా? అని నేను డీకొంటిని. నిఘంటువులో నున్నదీ లేనిదీ నాకు తెలియదు, కాని మా ప్రాంతంలో దీనికర్థముంది. అంటూ ఏదో అర్థం కల్పింపబూనుకొనెను. "కంధార్థంలోనున్న

శబ్దమేమో, ఆ శబ్దార్ధమేమో, మీకు తెలియదు. కందార్థం చదవటమే చేతకాదే! మీరు దీక్షితీయ పీఠ సాంప్రదాయకులా? పైగా పీఠాధిపతులా? అంతేకాకుండా, బృహద్వాశిష్ఠం సంస్కరించి, ప్రచురించడానికే పూనుకొన్నారే!!! చాలు చాలు. వడమాలపేట పీఠం అనేదానికంటె, ఓనమాల పీఠం అని పేరెట్టుకొంటే బాగుంటుంది" అని పదిమంది పది విధములుగా ఆయనను దూయబట్టుకొనిరి. నాగూరయ్యగారు మర్నాటినుండి జరుగబోవు కార్యక్రమములో పాల్గొనవలెనని శిష్యసహితుడై వచ్చినవాడు, తన శిష్యులయెదుట తనకు జరిగిన యీ పరాభవమును భరించలేక వెడలిపోవుట కుద్యుక్తుడయ్యెను. శ్రీవారు జరిగినదానికి చాల నొచ్చుకొని, మమ్మందరినీ మందలించి, నాగూరయ్యగారిని కార్యక్రమము పూర్తియగువరకు ఆగుడని ఎంతచెప్పినా వినక, నాగూరయ్యగారు శిష్యసహితుడై వెడలి పోయెను.

శ్రీవారి శిష్యుడును, మాకు సోదరుడును అగు శ్రీ బిజవేముల సుబ్బారెడ్డిగారిని పరిచయపరచుట అవసరం. ఏల ననగా, శ్రీవారీయన సహాయముతో సాధించిన విజయములను తెలియపరచవలసియున్నది. శ్రీరాముని కాంజనేయునివలె, శ్రీవారి కీయన వార్తాహరుడై, సంధానకర్తయై, కార్యసాధనకు తోడ్పడినాడు. ఈయనను, ఆ ప్రాంతంవారు కొండమీది సుబ్బారెడ్డి అని పిలతురు. కారణమేమనగా యీయన కౌపీన మాత్రధారియై, ఏకాంతంగా ఆ ప్రాంతలో నొక కొండ (పర్వతం) పైన యుండేవాడు. సాధువులతోనూ, యోగుల తోనూ, సహవాసంచేసి ఈయన పెక్కు మూలికారహస్యముల

నేరింగెను. కొన్ని మంత్రముల నేర్చి, ఆ యా మంత్రసిద్ధులను బొందెను. యోగసాధనలలో తదేకకృషి గావించి, అదృశ్యకరణి మొదలగు మహత్తులు సంపాదించెను. నల్లని శరీరచ్ఛాయ, దృఢకాయము, చూచుటకెంత భయంకరుడో అంత సౌమ్యుడు. కొండమీదనే యుండుకాలములో యీయనను చూచినవారు యోగి వేమన యిట్లే యుండెడివాడని అనుకొనుచుండిరి. పరిసర ప్రాంతములవారీయన యొక మహాత్ముడని, యీయనకు సేవాశుశ్రూషలు చేయుటయు, వారిని యీయన వారించి పంపివేయుటయు కద్దు. కొన్ని మైళ్ళుకూడా ప్రయాణంచేసి కొందరు భక్తులు, ఈయన కాహారముతెచ్చి పెట్టుచుండిరి. ఆ విధంగా ఈయన భుక్తి కొరకు ప్రయత్నం చేయవలసిన అవసరమే లేకుండెను. స్త్రీ పురుషులందరూ, యీయనను నాయనా (తండ్రీ) అని సంబోధించుచుండిరి. కొందరు కొంటెవారీయనను యొక పిచ్చివానిగా భావించి యీయనతో వేళాకోళములు చేయుచూ ఎగతాళిచేయుట కద్దు. ఈ దినములలోనే యీయనకు పూర్వపుణ్య విశేషమున, శ్రీవారి శిష్యులగు నర్సా రెడ్డి గారి దర్శనభాగ్యము కల్గుట తటస్థించెను. జన్మ తరుణోపాయమునకు, యోగాది సాధన లెంత నిరర్థకమైనదియు, అందుకు శ్రీ దీక్షితీయ పరిపూర్ణ రాజయోగమార్గము తప్ప, అన్యపంథా లేదనియు, శ్రీ నర్సారెడ్డిగారివలన తెలుసుకొని, ఆయనను ఆశ్రయించి, ఆయనవల్ల శ్రీ సుబ్బారెడ్డిగారు ధర్మోపదేశము పొందిరి. ఆ పిమ్మట శ్రీ నర్సారెడ్డిగారి అనుజ్ఞ గైకొని శ్రీవారి కడ నామూలాగ్రముగ పరిపూర్ణబోధను శ్రవణముచేయుటకై ఏతెంచి, నాటినుండియు శ్రీవారికి సేవాశుశ్రూషలు గావించుచూ, శ్రీ సుబ్బారెడ్డిగారు బోధయొక్క మర్మ ధర్మములు

సాంగోపాంగముగ తెలుసుకొనుచూ, కృషిచేయుచున్నారు. శ్రీ సుబ్బారెడ్డిగారిది రాయలసీమయందలి కర్నూలుమండలము, గిద్దలూరు పరిసరములయం దెక్కువగా తిరుగుచుండెడివారు. వడమాలపేట పీఠమునకు చెందిన భక్తాదులా పరిసరములలో సుమారు వేయిమందైనా యుండిరి. వారందరిపైన నాగూరయ్యగారు తమ ఆధిపత్యమును చలాయించుచుండిరి. మాది గూడ అచల పరిపూర్ణబోధ సాంప్రదాయకమే అని నాగూరయ్యగారు, వారి భక్తులూ గూడ చెప్పుకొనుచుండిరి. శ్రీ సుబ్బారెడ్డిగారు, తాము ధర్మము తెలుసుకొన్న క్రొత్తలో వారి ప్రబోధమునకున్ను, తాము తెలసిన పద్ధతికిన్ని గల తారతమ్య మెరుంగగోరి, వడమాలపేట పీఠ సాంప్రదాయకులతో అందందు ముచ్చటిస్తూయుండుటలో, తాము తెలసిన దీక్షితీయ ప్రబోధ విధానమునకున్నూ, నాగూరయ్యగారి సాంప్రదాయక ప్రబోధమునకున్ను హాస్తిమశకాంతరము గలదని తెలుసుకొనెను. శ్రీ శివరామ దీక్షితులవారి బోధపేరిట, ఆంధ్రదేశమున జరుగుచున్న దుష్టసాంప్రదాయకములను రూపుమాపి, నిజ ప్రబోధమును సుప్రతిష్ఠిత మొనర్చుటకై శ్రీవారు బద్ధకంకణులై కృషిచేయుచున్న విషయమెరింగినవాడగుటచే, వడమాలపేట పీఠమువారికి దీక్షితీయప్రబోధ మేమియు తెలియనే తెలియదనిన్ని, వారి ప్రబోధ జన్మరాహిత్యమున కెంతమాత్రము మార్గము కాజాలదనిన్ని, వారి నెదుర్కొనుచుండెను. తమ బోధయందలి లోపముల నెత్తిచూపినపుడు వారిలో కొందరు వెంటనే గుర్తించి, శ్రీవారిని శరణుజొచ్చుచుండిరి. కాని, మరి కొందరు, ఉభయపీఠాధిపతులు నొకచో సమావేశమై చర్చించిన పిదపగాని, అందెవరిబోధ సార్థకమో తెలియరాదనిన్ని, ఆ

పిదప ఎవరి బోధ యుత్కృష్టమో దానిని చేపట్టుదుమనిన్ని చెప్పుచుండిరి. నాగూరయ్యగారిని రప్పించవలసిందనిన్ని, శ్రీవారిని ఎప్పుడు రప్పించమంటే, అపుడే రప్పిస్తాననిన్ని శ్రీ సుబ్బారెడ్డి గారు వారికి చెప్పుచుండిరి. నాగూరయ్యగారితో సంప్రదించి, వారి భక్తులు తేదీ నిర్ణయము గావించి సుబ్బారెడ్డిగారికి తెల్పుటయు, సుబ్బారెడ్డిగారదె నమ్మి రెండుమూడుసార్లు శ్రీవారిని రప్పించుటయు జరిగెను. కాని ప్రతి పర్యాయమూ నాగూరయ్యగారు మాత్రం మొఖంచాటువేసి, నిర్ణీత గ్రామమునకే రాక మోసపుచ్చిరి. సుబ్బారెడ్డిగారు మాత్రం వూరుకొనలేదు. ఆయా విషయములను వెల్లడిచేస్తూ, బహిరంగంగా ఆయా గ్రామాలన్నిటిలోనూ కరపత్రములు అచ్చొత్తించి ప్రకటించిరి. ఆ కరపత్రములు నాగూరయ్యగారికిన్ని పంపబడెను. ఐననూ వారు రారైరి. చివరకు నాగూరయ్యగారు తమ శిష్య సంచార కార్యక్రమములో ఒక గ్రామమునకు వేంచేసి, విడిదిచేసి యుండిరి. ఇదే అదనని శ్రీవారిని టెలిగ్రాంయిచ్చి రప్పించి వారిని తోడ్కొని, సుబ్బారెడ్డిగారా గ్రామము వెళ్ళిరి. గ్రామాధికార్లనూ, గ్రామ పెద్దలనూ పోగుచేసి, సుబ్బారెడ్డిగారొక సమావేశమేర్పాటు గావించిరి. నాగూరయ్యగారికిక తప్పించుకొని పోవుటకు దారిలేకపోయెను. ఆ పెద్దలందరి యెదుట "నాగూరయ్యగారూ! మీరు శ్రీ శివరామ దీక్షితులవారి ప్రబోధ గాని, ఆ పేరుతో ప్రచారము చేయుచున్నారా?" అని శ్రీవారడిగిరి, అందుకు నాగూరయ్యగారు "మా సాంప్రదాయము మౌలాలీ అను మూలపురుషుడుగల సాంప్రదాయము. శివరామ దీక్షితీయ సాంప్రదాయం కాదు. మా సాంప్రదాయానుసారం మేము ప్రచారం చేస్కుంటున్నాము. వారి

సాంప్రదాయానుసారం వారు ప్రచారంచేసుకొంటారు. మాకూ వారికీ తగూ వాంశములు లేవు" అని చల్లగా దిగజారిరి. "మీది దీక్షితీయ సాంప్రదాయం కాదన్నారు కనుక, ఆ సాంప్రదాయక సిద్ధాంతం, మీకు తెలుసుననిగాని, మీరు ప్రబోధ చేయ గలమని గాని, మీరు ఎవరినీ యిక మోసగించరాదు. శ్రీ శివరామ దీక్షితీయ ప్రబోధ పేరిట, మీరెట్టి ప్రచారమూ సేయరాదు. పతత్పీఠ గ్రంథములను ముద్రించరాదు. ఏ పీఠ గ్రంథము లనూ వ్యాఖ్యానించరాదు. ఆ విధంగా మీరు వాగ్దానంచేస్తే మీతో మాకేమీ పనిలేదు" అని శ్రీవారనిరి. అందుకు నాగూరయ్యగారు అంగీకరించిన పిదప, యిక యే వాగ్వాదములు లేకుండా సమావేశము ముగింపుకాబడెను. వడమాలపేట పీఠ సాంప్రదాయక ప్రబోధ మెట్లున్ననూ, పతత్సాంప్రదాయక నిర్మిత ఆచార పద్ధతులు చాలా విపరీతముగా నుండెడివి. అనేక దుష్ట సాంప్రదాయకములు లోకములో యుంటూవచ్చినవి. వానినన్నిటిని సంస్కరించవలసిన బాధ్యతలేదు. కాని పవిత్ర మగు దీక్షితీయ ప్రబోధ పేరిట, ఎక్కడ ఏ అత్యాచార, దురా చారములు జరుగుచున్నను, వాని నరికట్టు బాధ్యత పీఠాధి పతులదే గదా!

ఆ సమావేశపు ముచ్చట్లు స్వయంగా ఆ సమయంలో వుండి విన్నవారునూ, లేదా అట్టివారివలన విన్నవారునూ, శ్రీవారి సాంప్రదాయకమే పరంపరా ప్రాప్తమగు పరిశుద్ధపు పరిపూర్ణబోధ సాంప్రదాయకమని గుర్తించి, లక్షణయుతులగు వందలాది భక్తులు, శ్రీవారి పాదపద్మములాశ్రయించి, తదాది కృషిచేయుచున్నారు. వేదాంతం లక్ష్మయ్య, వడమాల పీఠాధి

పతి నాగూరయ్య గార్లుభయులూ రాయలసీమవారే. వీరిరువురిపై శ్రీవారు సాధించిన విజయముల కారణంగా రాయలసీమయందు శ్రీవారి ప్రచార ప్రబోధములు విరివిగా సాగుచున్నవి. ఒకప్పుడు రాళ్ళసీమగా నుండిన రాయలసీమ నేడు అధ్యాత్మిక దృష్ట్యా రత్నాలసీమగా పరిణమిస్తున్నది.

శ్రీ సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

రెండవ భాగము.

న వ మ ప్ర క ర ణ ము.

1951 సంవత్సరములోనే శ్రీ నర్సారెడ్డిగారు తాము రచించిన రాజయోగియి, పరిపూర్ణ రాజయోగములు శ్రీవారికి కృతిసమర్పణము గావించిరి. 1954 సం॥లో, అభినవ దీక్షితీయ మను పేరున గురూపాసనా పద్ధతులన్నియు నిమిడ్చి, ఉపాసనా కాండగా గ్రంథము రచించి, శ్రీవారికే కృతియొసంగిరి. కృతి సమర్పణాసందర్భంలో జరిగిన సభా సమావేశములో "వేదాంత సరస్వతి" అని శ్రీ నర్సారెడ్డిగార్కి, శ్రీవారు అనుగ్రహ రూపంగా బిరుదును ప్రసాదించిరి. ఏతత్సందర్భమున శ్రీ నర్సా రెడ్డిగారిని దీవిస్తూ, ప్రశంసాపూర్వకముగ నేను ప్రశంసా పద్య నవరత్న హారముచే శ్రీ నర్సారెడ్డిగారిని సత్కరించితిని. కాని ఆ పద్యములు అప్రస్తుతములు, శ్రీ నర్సారెడ్డిగారింకనూ, అభినవ దీక్షితీయం జ్ఞానకాండ వగైరా గ్రంథములు రచించి శ్రీవారికే అంకితమిడిరి. కాని అవి యింకను అముద్రితములుగానే వుండి పోయినవి. నేను శ్రీవారి పాదములకు ప్రథమ పూజా కుసు మంగా సమర్పించినది "దుర్విమర్శ్యాంధకార భాస్కరం". ఆ పిమ్మట అచల పరిపూర్ణ దర్శనము, పరిపూర్ణబోధ సిద్ధాంత శిరోమణి (గురుశిష్య సంవాదరూపము), శ్రీ శివరామ దీక్షితా చల పరిపూర్ణబోధ సిద్ధాంతము అను మూడు గ్రంథములు

(శ్రీ)వారికే అంకితమైపోయినవి కాని, అవికూడ అముద్రితములుగానే వుండిపోయినవి. ఇట్లే (శ్రీ)వారి శిష్యులు శ్రీ కొండమడుగుల వెంకటరెడ్డిగారు వేదాంతరహస్యము లెన్నియో నిమిడ్చి చివరపాదము (శ్రీ)వారి కంకితముగా సుమారు 400 పద్యములు (తేటగీతులు, ఆటవెలదులు) రచించిరి. కాని అవియును అముద్రితములుగానే యుండిపోయినవి.

(శ్రీ)వారు శిష్య ప్రబోధార్థము రాజయోగీయము (నిజ గురు ప్రబోధ విధానము) న్నూ, తారకామృత పరమహంస ప్రబోధినియున్ను రచించిరి. అందు రాజయోగీయమును (శ్రీ)వారు ప్రకటించదలచినపుడు "అయ్యా! యీగ్రంధ మచ్చు వేయించి, బజారునపెట్టుట న్యాయముకాదు. గురుగోప్య విషయములెన్నియో యిందు రచింపబడినవికదా!" అని అస్మదాదులు అడ్డుతగిలితిమి. కాని (శ్రీ)వారు నాయనా! గురుగోప్య విషయములు, గురుపుత్రులు కానివారు ఎంతవిన్నా, ఎంత చదివినా గ్రహించలేరు. మనోనిశ్చయము మాత్రం పొందగలరేమో ఏ కొద్దిమంది అయినా. అంతేకాని, ఆత్మనిశ్చయ రూపంగా అందేవిషయమును వారి కనుభవమునకు మాత్రం రాదు. కాని యీ గ్రంధ మచ్చువేయించుట వలన మరొక ప్రయోజనమున్నది. ఏమంటే, "మేమున్నూ సాంప్రదాయకులమే, గురు పరంపరా ప్రాప్తముగా బోధపొందినవారమే. మాకు తెలియని బోధ రహస్యములేమియు నుండజాలవు, అని అనుకొనేవారికి యీ గ్రంధము కనువిప్పుగా నుండగలదు" అని (శ్రీ)వారు సెలవిచ్చి, ఆ గ్రంధము 1955 లో అచ్చొత్తించిరి. 1960 సంవత్సరంలో తారకామృత పరమహంస ప్రబోధిని

ప్రకటించిరి. యింకనూ భగవద్గీతకు శ్రీధర వ్యాఖ్య ననుస రించియు, దీక్షితీయ సిద్ధాంతము ననుసరించియు వ్యాఖ్యానము వ్రాయుచున్నారు. మరియు ఉపనిషత్ప్రతిపాదితమగు 32 బ్రహ్మవిద్యలను విపులపరచి గ్రంథము రచించుచున్నారు. ఈ విధంగా శ్రీవారు కృతిభర్తయు, కృతికర్తయుగూడనై కీర్తి పొందియున్నారు.

శ్రీవారివలన ధర్మోపదేశముపొంది, రమరమి 20 సం॥లు పాటు శ్రీవారిని అమిత భక్తిశ్రద్ధలతో నారాధించు బొడ్డు భావయ్య, 45 సం॥లు అయిననూ నిండకమునుపే 1952 సం॥ రం॥లో బ్రహ్మైక్యము చెందెను, రమారమి శ్రీవారి యింటికి అరుమైళ్ళ దూరంలో హైదాబాద్‌లో నివసించుచున్నప్పటికి ప్రతి నిత్యమూ శ్రీవారిని దర్శించి పోయెడివాడు. శ్రీవారి పర్యటనలో సహితం సాధారణముగా శ్రీవారితోనేయుంటూ సమస్తోపచారములు శ్రీవారికి గావించెడివాడు ఈయన భక్తి విశేషములు చూచినపుడు యీయన, శ్రీరామచంద్రుని సేవించి కీర్తిగాంచిన హనుమంతుని యపరావతారమాయని అనిపించెడిది. యెంత సౌమ్యుడో, అంతటి సాహసికుడు. రజాకార్ల అల్లరులలో సహితం హైదాబాద్ వదలలేదు. రెండు మూడుసార్లు రజా కార్లతో సంఘర్షణలు జరుగుటయు, కఱ్ఱచేతయందు తనకు గల ప్రజ్ఞావిశేషమును పురస్కరించుకొని ఈయన వారిని పారద్రోలు టయు కూడ జరిగెను. ఈయన బహు మితభాషి. ఈయనకు భావయ్య అను పేరుపెట్టిన ఈయన తలిదండ్రులు, యీయన మితభాషిత్వము ముందుగానే యూహించి ఈ పేరు పెట్టిరా యని తోచుచుండెడిది. వీరి అంత్యఘడియలు చాల పవిత్రముగా

గడచిపోయెను. తన్ను చూచుటకు వచ్చిన శ్రీవారి చేతులలో తలనుంచి, శ్రీవారి సుఖకమలమునే చూచుచూ పరమ సంతృప్తితో బ్రహ్మైక్యము నొందిన కృతకృత్యుడు. చిరస్మరణీయుడు.

శ్రీవారియొక్క శిష్యులు గాకున్నను, శ్రీవారియెడల అమిత భక్తిప్రపత్తులుచూపి, సమయమునస్తే ప్రాణములైన నర్పించగల భక్తశిఖామణి బొలుసాని శేషయ్యగారు. వీరు శ్రీ సచ్చిదానంద వేంకటేశ్వరావధూత స్వాములవారి శిష్యులు. అయినను వారి నిర్యాణానంతరంనుంచి, శ్రీవారినే గురువర్యులుగా భావిస్తూ, శ్రీవారివలన సాంప్రదాయక ప్రబోధరహస్యములను తెలసికొనుచూ, నిత్యమూ శ్రీవారిని సందర్శించి పోయెడివారు. శ్రీవారి దర్శనము లేనిరోజు వీరికి నిజంగా దుర్దినముగా నుండెడిది. వీరిభక్తి వైభవమును తిలకించినచో శ్రీరామచంద్రుని ప్రేమించి, సేవించిన జాంబవంతుడు స్ఫురించెడివాడు. ఈయన పండబారిన 80 సం॥ల వృద్ధాప్యములో 1955 సం॥లో బ్రహ్మైక్యము చెందెను.

భావయ్యగారు, శేషయ్యగారు, యీ పేర్లు ప్రతి భక్తుని నోట తరుచుగా, శ్రీవారి పేరుతోపాటు శికింద్రాబాద్ సభా సమావేశములలో మారుమ్రోగుచుండెడివి. వీరిద్దరు రెండు మూడు సంవత్సరముల వ్యవధిలో శ్రీవారి సన్నిధానమునుండి అదృశ్యులైరి. హనుమజ్జాంబవంతు లిద్దరూ శ్రీవారి సన్నిధానమున కనపడని కొరత యిప్పటికినీ దోచుచునేయున్నది.

1954 సంవత్సరం మేనెలలో జయంతి సభలు అయిన పిదప, శ్రీవారి జ్యేష్ఠ కుమార్తె హనుమాభాయికి మహా వైభవముగా వివాహము గావించిరి. వరుడు M. Sc. పరీక్షయందు కృతార్థుడైన కైలాస ఈశ్వరయ్య. కైలాస లక్ష్మయ్యగారి కుమారుడు. వీరి కాపుర స్థలము శికింద్రాబాద్ పట్టణమే. ది 22-11-1956 సం॥ తేదిని శ్రీవారి ద్వితీయకుమార్తె సక్కూబాయిని, బీరం నర్సయ్యగారి జ్యేష్ఠకుమారుడు పాండు రంగారావునకిచ్చి వివాహము ఎంతో వైభవోపేతముగ గావించిరి. అహా! శ్రీవారి అల్లుళ్లు ఎంతో పూర్వపుణ్య విశేషము గలవారై యుండవలె!! లేకున్న శ్రీవారిని మామగారిగా బడయు భాగ్యము చేకూరగలదా? శ్రీ నర్సారెడ్డిగారు రచించిన శ్లోక పద్ధతిగా "రాజాధి రాజమకుటాంచిత రత్నం సేవ్యం" అనగా రాజాధిరాజుల కిరీటముల యందలి రత్నద్యుతులు శ్రీవారి పాదములకు హారతులిచ్చునే! గురువుల కెందరికో గురువై, గురుచక్రవర్తి, గురుసామ్రాట్, గురుసార్వభౌముడు అను సార్థక బిరుదులు ధరించి నిత్యము ఎందరో మహామభావులచే సహితం పాదపూజలు పొందుచూ నుండెనే? "సర్వశ్రుతి శిరో రత్న నీరాజిత పదాంబుజం" అనియు, "తీర్థాని దక్షిణేపాదే వేదాస్తన్ముఖ మాశ్రితాః పూజయే దర్చితం తంతు తదభి ధ్యానపూర్వకం" అనియు, "సప్తసాగర పర్యంత తీర్థస్నాన ఫలంచయత్, గురోఃపాదోద బిందోశ్చ సహస్రాంశేన తత్ఫలం" అనియు, కీర్తింపబడి ఎవరి పాదతీర్థము, భక్తులచే గంగాపుణ్య తోయములవలె గ్రహింపబడునో, అట్టి మహనీయునిచే, తమ పాదములు కడిగించుకొన్న ఈ అల్లుళ్లెంత అదృష్టవంతులోగదా!

గద్వాల (మహబూబ్‌నగర్ జిల్లా) లో పీఠ ప్రతిష్ఠా మహోత్సవసందర్భమున ది 31-12-57, 1-1-58 తేదీలలో సభా సమావేశములు జరిగెను. పీఠ ప్రతిష్ఠాపనానంతరం జరిగిన ధ్వజ ప్రతిష్ఠా సందర్భంలో నాచే రచింపబడిన జెండాపాట సమావేశమైన భక్తులందరు ఐక్య కంఠముగ గానముచేసిరి. అందు "కామ్యేచ్ఛ తీసేటి కర్మమార్గము కాదు, రోగముల గొని తెచ్చు యోగమార్గము కాదు, సంఘమునకు బరువైన సన్యాసమా కాదు, ఘనమైన రాజమార్గము మాదియని చాటి, ఎత్తండి సద్గురుని జెండా, మినుముట్ట నెత్తండి సద్గురుని జెండా" యను చరణముండెను. కార్యక్రమము తిలకించుటకై అరుదెంచిన వారిలో (శ్రీ) అరవిందయోగియం దభిమానముగల్గి, వారివలెనే గడ్డము, జుట్టు, లాల్చీపై బొట్టిజుబ్బా మొదలైనవి ధరించి, చూచినంతనే 45 ఏండ్ల వయస్సులో అరవిందులిట్లే యుండి యుందురు అని తోపించు నొక వ్యక్తిగూడ నరుదెంచెను. వారా గ్రామంలో హైస్కూలు పిల్లలకు ఆసనములు నేర్పు చున్న యొక ఉపాధ్యాయుడని మాకు తెలిసెను. ఈయన యోగమార్గము రోగములు గొనితెచ్చునా? ఎట్లు? అని తర్వాత జరిగిన సభాసందర్భములో శంక లేవదీసెను. అవును, హఠయోగ మభ్యసించుపట్ల అనేక ప్రమాదములు సంభవించుననియు, పరి ణామశూలలు, కండ్లకు గ్రుడ్డితనము, కుష్ఠురోగము మొదలైనవి సంభవించుట అందరికి తెలిసినదే అనియు, కొంతకాలము ప్రతి నిత్యమూ అభ్యాసము చేయుచూవచ్చిన యోగసాధన నిలుపు చేస్తే, అందువల్ల శరీరము స్వస్థతచెడి రోగములపాలగుననియు, మరియు "భోగే రోగభయం" అనివున్న పాఠమునకు, ఆ శ్లోక మునకు ఉత్తరార్ధని పఠింపబడు పాఠాంతరం "యోగే రోగ

భయం" అని స్పష్టముగా వున్నదనిన్ని, అస్మదాదులు వివరించి నప్పట్కి ఆయన తృప్తిపడలేదు. ఆయన వాదమేమనగా (1) యోగమునందుత్తీర్ణుడైన గురుసన్నిధానములో హఠ యోగ మభ్యసిస్తే, ప్రమాదములు రానేరావుగదా! (2) ప్రాణా యామాదులు చిరకాల మభ్యసించి వదలివేస్తేగదా శరీరము స్వస్థత తప్పి రోగముల పాల్పడును. కనుక గురుసన్నిధానంలో యోగమునేర్చి ఆజన్మాంతం యోగం చేసుకొంటూయుంటే ఏ రోగములున్నా నివారణైపోతాయి గాని, లేని రోగములు యెట్లు వచ్చును, అని ఆయన వాదన. "మీరు వివరించిన అసా ధారణ పరిస్థితులు (extreme cases) లో రోగములు రాక పోవచ్చునేమో గాని, లేనిచో భౌతికశరీరమునకు ఎప్పుడో ఒకప్పుడు రోగము తెచ్చిపెట్టును. ఏలననగా, పరమాత్మ సృష్టి నిర్మితపద్ధతిగా ఉచ్ఛ్వాస నిశ్వాసములు జరిగించుచూ, సుఖాసనము పైననే గూర్చొంటూవుండుట సహజపద్ధతి. అందుకు విరుద్ధంగా ఏదో ఆసనము అభ్యాసంగావించి, బలాత్కారంగా శరీరమును ఆ ఆసనముపై గంటలతరబడి అట్లేయుండునట్లు నియమించుటయు, ఒక క్రమము ననుసరించి మన యిచ్ఛతో సంబంధంలేకుండా అహోరాత్రములనే నిర్ణయమెరుగక, అవస్థాత్రయమునందునూ అనువృత్తమై యింద్రియాదులన్నీ నిదురించినా తాను నిదురిం చక, తల్లిగర్భమును వీడినదాది స్థూలదేహమును శాశ్వతంగా వదలిపోవువరకు, ఆరోగ్యవంతుని శరీరంలో రోజు 1కి 21600 శ్వాసలు జరుపుచూ సహజగతిగల్గి వర్తించు ప్రాణమును కృతక పద్ధతులచే విభిన్నరీతుల సంచరించునట్లు చేయుట అసహజ పద్ధతి. కృత్రిమ పద్ధతి. పరమాత్మ సృష్టినిర్మిత విధాన పద్ధతికి వ్యతిరేకమున్నూ. కనుక దేహము విపరీత పరిణామములకు

పరుగులిడుచుండును. మరల, అట్టి విపరీతపరిణామములకు దారి తీయకుండా, అందుకు తిర్గి కొన్ని కృత్రిమసాధనలు చేయు చుండవలెను. ఎందుకీ బెడద? అడుసు త్రొక్కనేల కాలు కడుగ నేల? ఎందుకీ కృత్రిమ సాధనాపరంపర?" అని నా వాదన. కాని ఆయన ఎన్ని చెప్పినా తృప్తిపడలేదు. పైగా "మీరు వ్రాసిన వ్రాత తప్పు. అది ప్రచార సాహిత్యం మాత్రమే అని మీరు వప్పుకోవాలి. లేకుంటే నేను వప్పుకోనను" అని ఆయన పట్టు.

శ్రీవారాయనను పిలచి కూర్చోపెట్టి యోగపద్ధతి, జన్మ రాహిత్యమునకు దారిగాదనియు, నిరర్థకమైనదనియు పెక్కు విధముల బోధించిరి. మరియు "యోగే రోగభయం" అంటే శరీరరోగములు మాత్రమేగాదు. యింకా మనస్సునకు ఆత్మకు కూడ రోగములు తెచ్చిపెట్టును. మనస్సునకున్న రోగములు శోక మోహములు, సుఖ దుఃఖములు, సంకల్ప వికల్పములు. యోగముచేయుపట్ల మొండిపట్టుదల వహించినగాని వాడు యోగము చేయజాలడు. యింకనూ నాకు యోగం సిద్ధించుటలేదే అని శోకము రేకెత్తించును. ఏదైన మహత్తు సిద్ధించినచో, అది అందరకు జూపి, తన గొప్పతనమును ప్రద ర్శించి, ధన కీర్తులను సంపాదించవలెనని ఆశ. అది కార్యరూప మున నుంచినచో యిక అతడు యోగమార్గమున పురోగమించు టుకక్క. అట్టి ఆకాంక్షలేమియు లేక సవ్యముగా సమాధి స్థితి వరకు పయనించినవానికి సహితం సమాధి భంగమునకు వెఱపు. నిరంతర సమాధి నిష్ఠ కావలెనని కోర్కె. అది సాధించలేకపోతినే అను చింత. 1400 సంవత్సరములు సమాధి నిష్ఠలోనున్న చాంగదేవుడు, సమాధినుండి లేచిన మరుక్షణముననే అయ్యో!

పరుగులిడుచుండును. మరల, అట్టి విపరీతపరిణామములకు దారి తీయకుండా, అందుకు తిర్గి కొన్ని కృత్రిమసాధనలు చేయు చుండవలెను. ఎందుకీ బెడద? అడుసు త్రొక్క నేల కాలు కడుగ నేల? ఎందుకీ కృత్రిమ సాధనాపరంపర?" అని నా వాదన. కాని ఆయన ఎన్ని చెప్పినా తృప్తిపడలేదు. పైగా "మీరు వ్రాసిన వ్రాత తప్పు. అది ప్రచార సాహిత్యం మాత్రమే అని మీరు వప్పుకోవాలి. లేకుంటే నేను వప్పుకోనను" అని ఆయన పట్టు.

శ్రీవారాయనను పిలచి కూర్చోబెట్టి యోగపద్ధతి, జన్మ రాహిత్యమునకు దారిగాదనియు, నిరర్థకమైనదనియు పెక్కు విధముల బోధించిరి. మరియు "యోగే రోగభయం" అంటే శరీరరోగములు మాత్రమేగాదు. యింకా మనస్సునకు ఆత్మకు కూడ రోగములు తెచ్చిపెట్టును. మనస్సునకున్న రోగములు శోక మోహములు, సుఖ దుఃఖములు, సంకల్ప వికల్పములు. యోగముచేయుపట్ల మొండిపట్టుదల వహించినగాని వాడు యోగము చేయజాలడు. యింకనూ నాకు యోగం సిద్ధించుటలేదే అని శోకము రేకెత్తించును. ఏదైన మహత్తు సిద్ధించినచో, అది అందరకు జూపి, తన గొప్పతనము ప్రద ర్శించి, ధన కీర్తులను సంపాదించవలెనని ఆశ. అది కార్యరూప మున నుంచినచో యిక అతడు యోగమార్గమున పురోగమించు టుళక్కి. అట్టి ఆకాంక్షలేమియు లేక సవ్యముగా సమాధి స్థితి వరకు పయనించినవానికి సహితం సమాధి భంగమునకు వెఅపు. నిరంతర సమాధి నిష్ఠ కావలెనని కోర్కె. అది సాధించలేకపోతినే అను చింత. 1400 సంవత్సరములు సమాధి నిష్ఠలోనున్న చాంగదేవుడు, సమాధినుండి లేచిన మరుక్షణముననే అయ్యో!

కూర్చొనియుంటిమి. 11 గంటలైనది. తనవద్ద యోగాసనముల నేర్చుకొనుచున్న బాలురు 14, 18 సం॥ వయస్సుగల హైస్కూలు విద్యార్థులు, ఒక యిరవైమందిని తీసుకొనివచ్చి, టి. నాగప్ప గారి నుద్దేశించి "ఏమండీ నాగప్పగారూ! మీరు మా యోగ వ్యాయామ పాఠశాల కధ్యక్షులు. ఈ పాఠశాల ప్రారంభోత్సవం నాడు, మీరు యోగమును ప్రశంసిస్తూ, మహోపన్యాసం చేసినారు. నేడు మీ గురువులువచ్చి యోగము రోగములకు దారితీస్తుంది, అని చెపుతున్నారు. ఈ పాఠశాల వుంచుతారా? తీసేస్తారా? అని విద్యార్థులు అడుగుచున్నారు. వారికేమి సమాధానం చెప్పాలో తెలపీయండి" అంటూ విద్యార్థులను ముందుకు గెంటెను. టి. నాగప్పగారు ఏదో సమాధానం చెప్పబోతే విద్యార్థులు గగ్గోలు ప్రారంభించిరి. అప్పుడు నేను కలుగజేసుకొని "నాయనలారా! మీ యోగ వ్యాయామ పాఠశాలలో మీరేమి నేర్చుకొంటున్నారు?" అనగా వారు "మే మాసనములు వేయుట నేర్చుకొనుచున్నాము" అని జవాబు చెప్పిరి. "ప్రాణాయామం ఏమైనా నేర్చుకొన్నారా?" అని నేనడుగగా, వారు "లేదు" అనిరి. "ఐతే మీరు వేసే ఆసనములు, వ్యాయామం కోసం వేసేవిమాత్రమే. అది యోగాభ్యాసం కానేకాదు. కనుక రోగాలప్రసక్తి లేనేలేదు. మీరు యథేచ్ఛగా వ్యాయామంకోసం ఆసనములు వేసుకోవచ్చు. మీ పాఠశాల మూసివేయ నక్కరలేదు" అని సమాధానం చెప్పగా, విద్యార్థులందరూ సంతోషంగా వెడలిపోయిరి.

గద్వాల సంస్థానాధీశులు, సంగీత సాహిత్యాది లలితకళా పోషణకు పేరు ప్రఖ్యాతులు గన్నవారు. గ్రామంలో చాల

మంది కవి, పండిత, గాయకులు గలరు. వారందరూ శ్రీవారి యుపన్యాస ప్రసంగములను విని ఎంతో ఆనందించిరి. మహిళా సభకూడ జరిగెను. అందు కొందరు సోదరీలు యుపన్యాసము లిచ్చిరి. నా భార్య శీతామహాలక్ష్మి అధ్యక్షురాలుగా చేసిన యుపన్యాసము విని, గ్రామంలోగల మహిళా సంఘంవారు, శ్రీవారి ప్రచారము మహిళాభ్యుదయమునకుకూడ చాల తోడ్పాటు చూపించునదిగా గుర్తించి, శ్రీవారివలన అనేక విషయములు ప్రత్యేకంగా వినవలెనని కోరిరి. కాని ఆ దినం ఆ గ్రామమునకు ప్రభుత్వ మంత్రులు వగైరాలు వచ్చి, వారి సమాజములను తనిఖీ చేస్తారనిన్ని, మహిళా సమాజంవారు కూడా మంత్రిసత్తములకు సన్మాన పత్రికలు సమర్పించవలసి యున్నదనిన్ని, కనుక తాము మిగతా కార్యక్రమంలో పాల్గొననందుక్కు శ్రీవారు తమ్ము క్షమించవలెననిన్ని, శ్రీవారు గ్రామంలో మరికొన్ని రోజులుండుటకు సావకాశములేనిచో తిరిగి కొద్దిరోజులలో తీరిక చేసుకొని రావలసిందనిన్ని, శ్రీవారిని మహిళాసంఘంవారు కోరిరి. అట్లే శ్రీవారు కొలది మాసము లకు తిగ్గి గద్వాలవెళ్ళి, అనేకమంది స్త్రీ పురుషాదులకు ధర్మోప దేశము చేసి కృతార్థులను గావించిరి.

శ్రీవారి శిష్యులు, రామసాగరం కాపురస్థులు పోలోజు వీరయ్యాచారిగారు, అనేక చక్కని గీతములు, తత్వములు, గురు సంకీర్తనా పద్యములు మాత్రిమేగాక, శుద్ధ నిర్గుణ పర తత్వ బోధామృత కందార్థ దరువులు, ద్వయదోషరహిత అచల తత్వ కందములు, పరిపూర్ణబోధ బుర్రకథ, రచించియున్నారు. గురుపూజా విధానమునకు అంతరార్థ సహితముగ గీతార్థ

దరువులు వ్రాసియున్నారు. శ్లోకములతోపాటు యీ గీతార్థ దరువులు కూడా పూజాకాలమున పఠింపబడుచున్నవి. సికింద్రాబాద్‌లో శ్రీవారిని మిక్కిలి భక్తి శ్రద్ధలతో సేవించుచున్న శిష్యులనేకులు గలరు. వారందరిలో యీ దిగువ నుదహరించిన వారు ముఖ్యులు. వేణుగోపాలరావునాయుడు, గుముడెల్లి వీరేశలింగం, కొంపల్లి నర్సింహ్వాం, శ్రీరాములు, మల్లయ్యగార్లు. యిప్పట్లో శ్రీవారిని వదలక, నిరంతర సేవాతత్పరులైన శ్రీ మల్లయ్యగారు, గద్వాల కాపురస్తుడు బాలాజీసింగ్‌గార్లు ధన్య జీవితముల గడపుచున్నారు.

శ్రీ సద్గురు భ్యోన్నమః

రాజయోగి విజయంబను సద్గురు చారిత్రము

రెండవ భాగము.

దశమ ప్రకరణము.

1950 సం॥లో శ్రీవారికి వ్యతిరేక సంఘంగా ఏర్పడిన వారిలో కొందరి అనుయాయులకు శిక్షలు పడుటతో బహిరంగముగ శ్రీవారిపైన అసత్య ప్రచారములు సాగించుటకు మిగతావారు జంకి, ఆ యుద్యమం విరమించుకొన్నారు. కాని శ్రీ శివరామ దీక్షితాచల గురుపీఠమను పేరుతో, గురుపూజలు, అపుడపుడు, అందందు కొందరు సభలు, జరిపించుటమాత్రం మానలేదు. మరియు పీఠగ్రంథములు కొన్ని అచ్చువేయించి ప్రకటించుచుండిరి. వారొనంగు బహిరంగోపన్యాసములలోనూ, పీఠగ్రంథములు వ్యాఖ్యానించి బోధించుటలోనూ, సాంప్రదాయక ప్రబోధము వున్నదున్నట్లుగా నెరుంగనివారగుటచే, యిచ్చవచ్చినట్లు వ్యాఖ్యానములు చేయుచూ వుండుటచేత, సిసలైన పరిపూర్ణభావము మఱుగై, అయ్యావార్లంగారిని చేయబోతే, కోతి అయెనన్న సామెతగా సంకర సాంప్రదాయములు పొడసూపు అవకాశములేర్పడెను. అట్లైనచో వారు చెడినదే గాక వారిని ఆశ్రయించినవారు, వారిని నమ్ముకొన్నవారు, గూడ చెడిపోవుట నిశ్చయము. ఆ విధంగా లోకమునకు అట్టి వారివలన మేలుకన్న కీడే సంభవించుట నిక్కువము. గురువులకు గురువై, పీఠాధ్యక్షుడై యున్న శ్రీవారు చూచుచు

నూరకుండవలెనా? లేక చర్య తీసుకొనవలెనా? ఫలితమెట్లున్ననూ తమ కర్తవ్యము విస్మరించరాదు. ఎవరెట్లు పోయిన మనకేమి యని పీఠాధిపతులైయుండిగూడ ఉపేక్షింపతగునా? యని శ్రీవారాలోచించి, తుదకు చర్యతీసుకొనుటకే నిశ్చయించిరి. కనుక ఆ వ్యతిరేక సంఘములలో ప్రముఖుడగు అరిగె రామస్వామి గారిపైన "శ్రీ శివరామ దీక్షితాచల గురుపీఠం" అను పేరు ప్రతివాది వుపయోగించరాదనియు, తాము పీఠాధిపతులు గనుక పీఠగ్రంథములు తమ యాజమాన్యముననే ప్రకటింపబడవలెను గాన, యితరులు ఎవరూ ప్రకటింపకూడదనియు, స్థిరపరచి, ప్రతివాదిపైన యింజెక్షను (నిషేధపుటాజ్ఞ) యిప్పించమనిన్ని, కోర్టులో శ్రీవారు దావాచేసిరి. మొదటి కోర్టులో దావా శ్రీవారికి పూర్తిగా వ్యతిరేకమై దావా కొట్టివేయబడెను. అందుపై శ్రీవారు పైకోర్టులో అప్పీలుచేయగా కొన్ని సారాంశములపైన శ్రీవారి కనుకూలంగా తీర్పు యివ్వబడినది గాని, పర్యవసానంలో మాత్రం క్రింది కోర్టు తీర్పు ఖాయపరచబడెను. ఆ తీర్పుపై శ్రీవారు హైకోర్టులో చేసిన అప్పీలు యింకనూ పరిష్కారం కాలేదు. చివరి పర్యవసానమెట్లున్ననూ, పీఠసాంప్రదాయమును నిష్కళంకముగనుంచి రక్షించి కాపాడు బాధ్యత పీఠాధిపతులగు శ్రీవారియందె తేని కలదు. కనుక శ్రీవారు అధిక వ్యయ ప్రయాసలకోర్చియైననూ అవిరళకృషి సాగించుచునేయున్నారు.

శ్రీవారికి ప్రథమ కళత్రమువలన జన్మించిన శ్రీమతులు హనుమాబాయి, సక్కూబాయి అను యిర్వురు కుమార్తెలు అత్తవారిండ్లలో సుఖముగా కాపురములు చేసుకొనుచున్నారు.

చి॥ సౌభాగ్యవతి హానుమాబాయికి పుత్రుడుదయించి మూడేండ్ల ప్రాయమువాడై నాడు. చి॥ సౌ॥ సక్కూబాయిన్ని సంతానవతి యియినది. ద్వితీయ కళత్రమగు శ్రీమతి అనసూయాంబాతల్లి యందు శ్రీవార్కి సాందీపు, సుమతీభాయి, శ్రీకృష్ణుడు, పరమేశ్వరి, వెంకటేశ్వర్లు, జగదీశ్వరి, జ్ఞానేశ్వర్లు, సూర్యనారాయణ గార్లు జన్మించిరి. కాని కుమార్తెలలో సుమతీభాయి, కుమారులలో జ్ఞానేశ్వర్లు అక్కరకురాలేదు. కుమాళ్ళలో పెద్ద వాడగు సాందీపు, శ్రీవారి పోలికలను పుణికిపుచ్చుకున్నాడు. అంతటి మేధావంతుడును అగుటలో ఏమియు సందేహములేదు.

విళంబినామ సంవత్సర మాఘ బహుళ త్రయోదశినాటికి (అనగా ది 7 మార్చి 1959) శ్రీవార్కి షష్ట్యబ్ద సంపూర్తి అయినది. ఐననూ చూచినవారాయనకు 50 ఏండ్లు మాత్రముండునని అనుకొందురు. ఈ గ్రంథ మింతవరకు చదివినవారు శ్రీవారి విగ్రహమును తమ మనోఫలకమునందు ఊహాప్రాయముగ చిత్రించుకొనగలరేమో. ఆనందజనకమయ్యును అట్టి శ్రమ చదువరుల కీయవలసిన అవసరము లేకుండ శ్రీవారి ఛాయా చిత్రమీ గ్రంథమునందే అచ్చొత్తించడమైనది. ఐననూ శ్రీవారి మంగళ విగ్రహము నొకించుక వర్ణించవలయునన్న కోర్కె బలీయముగా నున్నందున అందుకు పూనుకొనుట అయినది. 6½ అడుగుల యెత్తుగల చామనచాయ శరీరము. సాముగరిడీల వల్లనూ, యోగాభ్యాసము వలనను యినుపకడ్డీవలె చేవదేరిన శలాకవంటి సన్నని మైదీవ. ఆజానుబాహువులు. విశాలమగు నెన్నుదురు. ప్రసన్న గంభీరమగు వదనము, కరుణామృత వృష్టి గురియు కన్నులు. దీర్ఘములై విశాలములగు చెవులు, యిప్పటి

కిని చెక్కుచెదరని దృఢమగు తెల్లని దంతపంక్తి, తీర్చిదిద్దినట్లుండి సూక్ష్మప్రజ్ఞను సూచించు నాసికము, కార్యదీక్షను సూచించు చిరుగడ్డము. ఎన్నడును నడకయందు విడవని సంపూర్ణములగు పాదరక్షల (ఫుల్ బూట్సు) అచ్ఛాదనవలన కాబోలు శిరీష కుసుమములవలె బహు మృదులములగు పాదపద్మములు. శ్రీవారు నడచునపుడు శరీరమెట్టి కదలికను బొందక నిస్తరంగ సముద్రోపరిభాగమున శీఘ్రగామియగు నౌక నడచినట్లుండును. పాదములు భూమి నంటుచున్నవా? లేదా? యనునట్లుండి భూమిపై నడయాడు దేవతావర్యులలో నెవరైన కాదుగదా! యని సందేహించవలసి వుండును. ఆయన వాహ్యాళికై నడచునపుడు, కూడనున్నవారు ఆయనకెడముగా వెనుకపడకుండ నుండవలయునన్న పరుగెత్తినట్లు నడువవలసినదే. యింతమాత్ర మభివర్ణించుటవలన, శ్రీవారి సందర్శనము స్వయంగా చేసుకొనని వారికాలోటు దీర్ఘగల్గితినేమోనని ఆశించుచున్నాను.

విళంబినామ సంవత్సరమునకు శ్రీవార్కి షష్ట్యబ్దముల వయస్సు నిండినదన్నాను. శ్రీవారా విషయమును గుప్తముగనే యుంచిరి. షష్టిపూర్తి యుత్సవముల ప్రసక్తియే ఎవరి నోట వెలువడలేదు. లోకులు షష్టిపూర్తి యను పేరుతో చేయించుకొను తతంగమంతయు కర్మకాండకు సంబంధించినది. జీవితములో 60 ఏండ్లు గడచినవ్యక్తికి కొన్ని అరిష్టములు, గండములు నుండునట. వానిని పారద్రోలుటకై, దుష్టగ్రహోదులను శాంతిపరచుటకై, శుభగ్రహముల పరిపూర్ణానుగ్రహము కొరకై, జప, హోమ, తర్పణ, సమారాధనలతో చేయబడు కర్మకాండకు అనువగు కాలము. ఈ కర్మకాండతోబాటు

ఉత్సవములు, విందులు, ఊరేగింపులు, తులాభారములు యిత్యాదులు, కల్గినవారు వైభవముగ గావించుకొందురు. శ్రీవారికి షష్ట్యబ్ద సంపూర్తి అయెను, గనుక యిట్టి వుత్సవములను గావించెదమని యే భక్తులైన తలపెట్టినను శ్రీవారెంతమాత్రము అంగీకరించియుండెడివారు కారనేది నిశ్చయము.

1959 సం॥రం వైశాఖపూర్ణిమకు యధాప్రకారం పరంపరా జయంత్యుత్సవములు జరుగవలసియుండెను. ప్రస్తుతం శికింద్రాబాద్ వాస్తవ్యురాలగు శ్రీమతి సీతంరాజు మాణిక్యాంబగారను నామె శ్రీవారి భక్తురాలు. యీామె, "ఆ పరంపరా యుత్సవములలో ఆదిగురువగు శ్రీ దక్షిణామూర్తి మొదలు, శ్రీవారి స్వగురువగు శ్రీ హనుమంతరాయ రాజయోగీంద్రుల వారి వరకును, గురువులందరికీ పూజ జరుగునుగదా! అయ్యా ఆ సందర్భంలో నేను తమ పాదములకు పైడిపూలతో పూజ గావించుకొనుటకు అనుజ్ఞ యిప్పించవలసినది" అని శ్రీవారిని కోరగా, శ్రీవారందుకు అనుమతించిరి. ఆహ్వాన సంఘమునకు వారితో చెప్పి, కార్యక్రమమునందు "శ్రీ దయానంద రాజయోగీంద్రులవారికి, శ్రీమతి సీతంరాజు మాణిక్యాంబగారిచే కనకాభిషేక మహోత్సవము" అని, ఆమె చేర్పించెను. కనకాభిషేకమంటే, బంగారునాణెములో, రూపులో, లేక పుష్పాకృతి గల సువర్ణపుష్పములో శిరోభాగమునందు భ్రమ్మరింతురా యని పరికైన సందేహ మంకురింపవచ్చును. గాని యీా కనకాభిషేక మట్టిదిగాదు. యిది పాదములకే అభిషేకము. పాదములకే పూజ. "ధ్యానమూలం గురోర్మూర్తిః పూజామూలం గురోఃపదం" అని గురుగీత చెప్పుచున్నది. పూజావిధానములో పాదముల

మొదలు శిరఃపర్యంతము "అథ అంగపూజ" అని సంకల్పించి చేయునపుడు గూడ, ఆయా అంగములు వరుసగా పూజలో పేర్కొనబడి, పూజింపవలసినపుడుగూడ, పూజ యేప్రకారం గురుపాదములకే తప్ప, యితర స్థానములయందు చేయబడదో, అదేప్రకారం అభిషేకమన్ననూ పాదములకే అభిషేకముగాని శిరోభాగమునకు మాత్రం కాదు.

ఈ మాణిక్యాంబగారెవరో తెలుసుకొనుటకు పాఠకు లుత్సహించుచుండుట సహజము. ఏతత్ కనకాభిషేక శుభ సమయమున ఆమె నభినందించుచూ నేను వ్రాసిన పద్యములలో మొదటిపద్యము యిట నుదహరించిన చాలును.

సీ॥ శ్రీ కాశ్యపసగోత్ర సీతమరాజు న
ర్సింగరాడ్విబుధుని చెట్టబట్టి
పతిభక్తి నెసలారి, యతినేర్పుతో గృహ
స్థాశ్రమ ధర్మంబు లాచరించె
అత్తింట పుట్టింట నాదర్శగృహిణి తా
నడచుటెట్టులో యట్లు నడచి జూపె
విగత భర్తృకయౌచు వివిధ కష్టాలెన్నొ
ధీశాలియై సైచి తేరుకొనియె

ఆ॥ వె॥ రాజయోగి గురుని పూజించి సేవించి
పూర్ణభావమందు పొలుపుగాంచె
మగువలందు మిన్న, మాణిక్యమనియన్న
కీర్తిపండె, గురుని కృపయునిండె.

నాడు 28-5-59. తన సంతతివాడగు (అనగా గురు పరంపరలోనివాడగు) శ్రీవారి కనకాభిషేక మహోత్సవము

తిలకించు వేడ్కతో కాబోలు లోకబాంధవుడగు సూర్యభగవానుడు 5-30 గంటలగుసరికే తూర్పుమలపై కెక్కి తొంగిచూడ దొడంగెను. అప్పటికే కాలకృత్యములు దీర్చుకొని అస్మదాదులు పందిరిలో జేరి కార్యక్రమము సకాలమునకు జరిపించుటకై తొందరపడుచుంటిమి. 6-30 గంటలగుసరికి భక్తాదులందరూ సమావేశమైరి. మాణిక్యాంబగారి వసతిగృహ మచ్చటికి సుమారు 3 ఫర్లాంగుల దూరముండెను. స్త్రీ పురుషులగు భక్తాదు లందరమూ మొదట మాణిక్యాంబగారింటి కేగితిమి. అట పూజా ద్రవ్యములన్నియు మాణిక్యాంబగారు సిద్ధపరచియుంచెను. బ్యాండుమేళము, యితర మంగళతూర్యారావములతో మాణిక్యాంబ గారున్ను, మేమున్ను పూజాద్రవ్యములు పట్టించుకొని గురుసంకీర్తన గావించుచూ శ్రీవారి యింటి ప్రాంగణమువరకు యూరేగింపుటుత్సవముతో నరుదెంచితిమి. ప్రాంగణమందు చక్కని చాందినీతో షేమినా అమర్చబడెను. పచ్చని మామిడాకులతో, రంగు రంగుల పూలమాలికలతో, పందిరంతయు తోరణములు గూర్చబడి ముచ్చటగొలుపుచుండెను. గురుదంపతులకు పూజా సింహాసనము లమర్చబడెను. దూరశ్రవణయంత్రముల ద్వారా భక్తాదులుచేయు సద్గురు సంకీర్తనము మారుమ్రోగుచుండెను. మాణిక్యాంబగారును, భక్తాదులున్ను యుచిత స్థానములలో యుపవిష్టులైయుండిరి. యిరువైపుల పూజా కార్యక్రమము జరిపించుటకు సమర్థులగువారు కూర్చొని, తమ ప్రాముఖ్యతను చాటుచుండిరి. శ్రీవారు వేంచేయు సవ్వడి విని మంగళతూర్యారావములు మార్మ్రోగి మిన్నంటుచుండెను. శ్రీవారు, శ్రీ యనసూయాంబా సహితముగ వచ్చి పూజా సింహాసనము లలంకరించుచుండగా యీ పుణ్యదంపతుల దివ్య

నామ పురస్సరముగ భక్తాదు లైక్యకంఠముతో జయ జయ ధ్వానములు గావించిరి.

పూజాకార్యక్రమము ప్రారంభమై షోడశోపచారములతో, అష్టోత్తర శతనామములతో ఆంధ్ర గీర్వాణభాషలలో పూజాదికము మహా వైభవముగ పూర్తిగావింపబడెను. అష్టోత్తర శతనామములతో పూజగావించు నవసరమున కాంచన కుసుమము లుండును గనుక

తే॥ సద్గురూత్తము మృదుపద సరసిజములు
కఠిన కాంచనసుమ స్పర్శ గందునేమొ!
విసరబోకమ్మ మెలమెల్ల వేయుమమ్మ

అని మాణిక్యమ్మగారిని హెచ్చరించుచుంటిమి.

ఈ కనకాభిషేక మహోత్సవానంతర శుభసమయమున శ్రీవార్కి నేను రచించి సమర్పించుకొన్న పద్య కుసుమాంజలి యీ క్రింద పొందుపర్చడమైనది.

ఓం

శ్రీ సద్గురు భ్యోన్నమః. శ్రీ మదచల ఋషి
శ్రీ దయానంద రాజయోగీంద్రులవారి కనకాభిషేక
మహోత్సవ శుభసమయమున శ్రీవార్కి సమర్పించబడిన

ప ద్య కు సు మాం జ లి

కం॥ గురువే హరిహర బ్రహ్మలు
గురువే పరతత్వమనిన, గురువునుమించే
గురుతర తత్వములేదని
గురువగు మా రాజయోగి గురుని దలంతున్॥

సీ॥ ఆంధ్రిప్రిదేశరాష్ట్రంబు దశదిశల
నుపపీఠములనిల్పి యుంచినావు,
పరిపూర్ణభావంబు ప్రబలజేయగ, తగు
గురువుల నందు నేర్పరచినావు,
వార్షికోత్సవములు ప్రతియేట నటజేసి
బహిరంగసభల నేర్పరచినావు,
పండితులందందు ప్రశ్నించి యెదిరింప
ఢీకొని వారి నోడించినావు,

ఆ॥ వె॥ పెద్దలందు బెద్ద, పీఠాధిపతివౌచు
శిష్యపాలనంబు జేసినావు,
రాజయోగశీవి రాణింపజేసావు,
భళిర! నిన్ను పొగడవశమె? స్వామి!

సీ॥ ఆస్తికమో లేక నాస్తికమో? బోధ
నూతనంబో మరి సనాతనంబో?
శ్రుతి సమ్మతంబౌనో? శ్రుతి విరుద్ధంబౌనో?
అద్వైతశాఖయే యగునొ యేమొ?
పరిపూర్ణ బ్రహ్మంబు మరిసచ్చిదానంద
బ్రహ్మంబెయగునొ వేరగునొ? యేమొ?
మంత్రంబులవియెన్ని? మాయయా? సత్యమా?
సాధనకాదొ తజ్జపముసేయ?

ఆ॥ వె॥ యెరుక బ్రిహ్మలకును యేమి వ్యత్యాసమో?
తెలియలేక, దారి, దిక్కులేక,
తల్లడిల్లు వారి దరిజేర్చి బోధించి,
తెలవు జూపినట్టి దొరవు నీవు.

సీ॥ అజ్ఞానతిమిర విధ్వస్తంబు గావించు
జ్ఞానప్రబోధ మెవ్వానిసొమ్ము,
ఘోరమౌ సంసార వారాశి దరియింప
పెనుయోడ యెవ్వాని విమలపదము,
సంస్కారములచించు, జన్మ కర్మలుద్రుంచు
శక్తియుక్తులెవని భక్తిగలుగు,
జ్ఞానవైరాగ్యమైశ్వర్య యశశ్రీలు
భగవానుబిరుదు యెవ్వనికి శెల్లు,

తే॥ గీ॥ నట్టి రాజయోగి కననూయ సతితోడ
శ్రీకరంబుగ కనకాభిషేకమయ్యె,
మానపానందకరముగా మంగళముగ,
చూపు ధన్యతగాంచె తత్సుభము జూడ.

తే॥ గీ॥ "కామినీకాంచనములు దుఃఖంబు" లన్న
పరమహంసకు కనకాన మండె నొడలు
"దోషమన్న నీయందె, వస్తువునలేదు"
అనిన యోగికి యభిషేకమయ్యె దాన.

ఉ॥ ఎంత తపంబుచేసి జనియించెనొ, యీ కనకంపుపూవు ల
త్యంత పవిత్రతేజు, పరతత్వవిశారదు, పాదపద్మముల్
వింతగ నాశ్రయించినవి। వీనికిగూడ తొలంగె బంధ, మిం
తింతలొ నబ్బె బంగరుకు దివ్యపరీమళ భాగ్యసంపదల్.

మ॥ కవియో, గాయకుడో, మహాప్రతిభ లోకంబందుఁచూపంగ, మె
చ్చి వదాన్యుల్ జటపింతు రాతనికి సుశ్రీలన్ కటాక్షింప నై
భవమొప్పన్ కనకాభిషేకములు; తద్భావంబు లేదియ్యెడన్
భవ వారాశి దరింపగోరి సలుపున్ భక్తుండు యీ యజ్ఞమున్.

సీ॥ అజ్ఞానతిమిర విధ్వస్తంబు గావించు
జ్ఞానప్రబోధ మెవ్వానిసొమ్ము,
ఘోరమౌ సంసారవారాశి దరియింప
పెనుయోడ యెవ్వాని విమలపదము,
సంస్కారములచించు, జన్మ కర్మలుద్రుంచు
శక్తియుక్తులెవని భక్తిగలుగు,
జ్ఞానవైరాగ్యమైశ్వర్య యశశ్రీలు
భగవానుబిరుదు యెవ్వనికి శెల్లు,

తే॥ గీ॥ నట్టి రాజయోగి కననూయ సతితోడ
శ్రీకరంబుగ కనకాభిషేకమయ్యె,
మానసానందకరముగా మంగళముగ,
చూపు ధన్యతగాంచె తత్శుభము జూడ.

తే॥ గీ॥ "కామినీకాంచనములు దుఃఖంబు" లన్న
పరమహంసకు కనకాన మండె నొడలు
"దోషమన్న నీయందె, వస్తువునలేదు"
అనిన యోగికి యభిషేకమయ్యె దాన.

ఉ॥ ఎంత తపంబుచేసి జనియించెనొ, యీ కనకంపుపూవు ల
త్యంత పవిత్రతేజు, పరతత్వవిశారదు, పాదపద్మముల్
వింతగ నాశ్రయించినవి। వీనికిగూడ తొలంగె బంధ, మిం
తింతలొ నబ్బె బంగరుకు దివ్యపరీమళ భాగ్యసంపదల్.

మ॥ కవియో, గాయకుడో, మహాప్రతిభ లోకంబందుఛూపంగ, మె
చ్చి వదాన్యుల్ జకపింతు రాతనికి సుశ్రీలన్ కటాక్షింప వై
భవమొప్పన్ కనకాభిషేకములు; తద్భావంబు లేదియ్యెడన్
భవ వారాశి దరింపగోరి సలుపున్ భక్తుండు యీ యజ్ఞమున్.

శ్రీవారి లోకసేవా పరాయణమగు దివ్యజీవితంలో యిప్పటికి 62 వసంతములు జరిగిపోయినవి. శ్రీవారి దివ్య ప్రబోధ ప్రచారములవలన ముముక్షు జనలోకమున కెంతయో మేలుచేకూరినది. శ్రీవారి శేషజీవితమంతయు, తుదిఘడియవరకు లోకసేవకే కైంకర్యము చేయబడుననుటలో ఎట్టి సందియము నుండజాలదు. లోకమునకు శ్రీవారు ఋణపడి, సేవారూపముగ తద్రుణవిముక్తి గావించుకొనుచున్నారు. శ్రీ శివరామ దీక్షితాచల దివ్యప్రబోధమును దేశము నలుమూలలా చాటి, గురు ఋణము దీర్చుకొనుచున్నారు. లోకమునూ శ్రీవారి కెంతో ఋణపడియున్నది. వారి దీర్ఘాయువునకై సద్గురు పరమాత్మను నిత్యము ప్రార్థించుట ముముక్షు జనలోకము యొక్క కనీస ధర్మమైయున్నది.

> శ్రీ అనసూయా చేడియగూడి సికింద్రాపురి నున్నాడే,
> అందరు దయానందుండవగా ఎరుక వీడి తానున్నాడే,
> ఈ జగన్నాధుడై, శ్రీజగన్నాధుడై, పజగద్భ్రాంతిలేకున్నాడే,
> సీతారామచంద్రులు తన్ను చేరికొల్వ సుఖమున్నాడే॥

శ్లో॥ మంగళం దేశికేంద్రాయ మహనీయ గుణాత్మనే
మంగళం రాజయోగీంద్ర గురుదేవాయ మంగళం.

సర్వం శ్రీ సద్గురు చరణారవిందార్పణమస్తు.